ఈనాడు

విజయవాడ 24-5-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 284
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సామాజిక మాధ్యమాల్లో రెచ్చిపోతే..

బెయిల్ కూడా రాదనే భయం ఉండాలి

- లేదంటే వారు ఎవరినీ వదిలిపెట్టరు..
- సమాజంలో ఎవరికీ భద్రత ఉండదు
- ఆ ధోరణి భరించలేని స్థాయికి చేరుతోంది
- సజ్జల భార్గవ్‌రెడ్డి కేసు విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు
- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



ఈనాడు - దిల్లీ

సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యల ధోరణి పెరిగిపోతుండడంపై సుప్రీం కోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో త్వరగా బెయిల్ రాదనే భయం ఉండాలని, లేదంటే వారు ఎవరినీ వదిలిపెట్టరని, ఎవరికీ రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుత ధోరణి చాలా ప్రమాదకరంగా ఉందని పేర్కొంది. 2023లో అప్పటి ప్రతిపక్ష నేతలు వంగలపూడి అనిత, తదితరులపై వైకాపా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టుల విషయంలో ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ వైకాపా సామాజిక మాధ్యమ వ్యవహారాల ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసుల్లో బెయిల్ కోసం కింది కోర్టుకే వెళ్లాలని ఆదేశిస్తూ ఏపీ హైకోర్టు ఈ నెల 7న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది.



సజ్జల భార్గవ్‌రెడ్డి

బెయిల్ కోసం తొలుత ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలి తప్పితే నేరుగా తమ వద్దకు రావడానికి వీల్లేదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.

మొదట భార్గవ్‌రెడ్డి న్యాయవాది సిద్ధార్థ దవే ముందస్తు బెయిల్ కోరారు. ఒకవేళ మీ వ్యాఖ్యల్లో అవమానకరమైన అంశాలు లేవని భావిస్తే వాటిని కోర్టు ముందుంచండి అని జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ఆయనకు సూచించారు. 'హైకోర్టు ఉత్తర్వుల వల్ల మీకు వచ్చిన నష్టమేంటి? స్పెషల్ జడ్జి ముందు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోడానికి మీకు స్వేచ్ఛనిచ్చి రెండు వారాల పాటు మధ్యంతర ఉపశమనం కూడా కల్పించింది. అప్పటి వరకూ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని చెప్పింది కదా' అని జస్టిస్ మిత్తల్ గుర్తుచేశారు.

న్యాయవాది దవే.. ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీస్ చట్టం గురించి చెప్పడానికి ప్రయత్నించారు. 'చట్టం గురించి చెప్పేముందు పిటిషనర్ ఏం మాట్లాడారన్న దానిపైనా మీకు స్పష్టత ఉండాలి' అని జస్టిస్ భట్టి అన్నారు. 'సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యల ధోరణి భరించలేని స్థాయికి చేరిపోతోంది. సమాజంలో ఎవరినీ వదిలి పెట్టడంలేదు. ఇది చాలా ప్రమాదకరం. అది ఎవరు చేసినా సరే! అందుకే ఇందులో కంటెంట్ చూడాలని చెబుతున్నా. ఇలాంటి కేసుల్లో త్వరగా బెయిల్ రాదన్న భయం ఉండాలి. లేదంటే వాళ్లు ఎవరినీ వదిలిపెట్టరు. సమాజంలో ఎవరికీ రక్షణ ఉండదు' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తర్వాత భార్గవ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ జస్టిస్ పంకజ్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. కింది కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోడానికి 2 వారాల పాటు అరెస్టు నుంచి మధ్యంతర ఉపశమనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం హైకోర్టుకు వేసవి సెలవులు ఉన్నందున ఉపశమనాన్ని మూడు వారాలకు పెంచాలని న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఆ వినతిని న్యాయమూర్తులు తోసిపుచ్చారు. 'నా అనుభవంతో చెబుతున్నా. ఈ విషయాల్లో కోర్టులు కఠినంగా ఉండాల్సిందే. ఇలాంటివి ఎవరు చేసినా ఒక్కటే. అందరినీ ఒకేలా చూడాలి' అని అన్నారు. (మిగతా 6లో)

రాజ్ కెసిరెడ్డి అరెస్ట్ సక్రమమే

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఆయన తండ్రి పిటిషన్ కొట్టివేత
- విహాన్‌కుమార్ కేసులోని అంశాలను సీఐడీ అమలు చేసిందని వ్యాఖ్య

6లో



అమరావతిని రాజధానిగా

నోటిపై చేయండి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం చంద్రబాబు వినతి
- వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే చేయాలని కోరినట్లు వెల్లడి
- విశాఖకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రకటన
- అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి?
- రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ?
- వైకాపా అధినేత వైఖరిపై చంద్రబాబు అసహనం



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిపై చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ మేరకు విభజన చట్టాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి హోంమంత్రిత్వశాఖ కార్యాలయంలో అమిత్‌షా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని శాంతిభద్రతలు, కొత్త నేర న్యాయ చట్టాల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులేమీ సమకూర్చడంలేదని, కానీ కొందరు మూర్ఖులు మాత్రం రాష్ట్రంలో ఏ చిన్న పని జరగకపోయినా అంతా అమరావతిలో ఖర్చు పెడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'కొందరు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి? రాజధాని కోసం రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ? హైదరాబాద్ వంటి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కు అవసరం లేదా? తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే (మిగతా 6లో)



నేడు కేరళకు రుతుపవనాలు

నైరుతికి అనుకూల పరిస్థితులు

అరేబియా సముద్రంలో వాయుగుండం

ఈనాడు, విశాఖపట్నం: దేశంలో వ్యవసాయానికి ఊతమిచ్చే నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. అదే సమయంలో లక్షద్వీప్, కర్ణాటక, తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాల్లోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. అక్కడి నుంచి రెండు, మూడు రోజుల్లోనే ఏపీలోకి విస్తరించే అవకాశముంది. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

పశ్చిమ తీరంలో అత్యంత భారీ వర్షాలు: అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్-గోవా తీరానికి (మిగతా 10లో)

కుట్రకు కర్త, కర్మ, క్రియ మిథున్‌రెడ్డే



- మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్రధారి ఆయనే
- ఎంత ముడుపులు వసూలు చేయాలో నిర్ణయించారు
- ఆ సొమ్ము 'అంతిమ లబ్ధిదారు'కు చేర్చారు
- ముడుపుల మొత్తంలో ముందే రూ.5 కోట్లు తీసుకున్నారు
- సిట్ దర్యాప్తులో మిథున్‌రెడ్డి పాత్ర వెలుగులోకి ● నాలుగో నిందితుడిగా పేరు

ఈనాడు - అమరావతి

జగన్ ప్రభుత్వ హయాంలో నూతన మద్యం విధానం ముసుగులో 'వైకాపా ముఠా' సాగించిన దోపిడీ కుట్రకు రూపకల్పన, అమలుకు ఏర్పాట్లు, ముఠా సభ్యులకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయటంలో మాస్టర్ మైండ్.. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డే. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్ల కోసం రాజ్ కెసిరెడ్డితో కలిసి హవాలా నెట్‌వర్క్ రూపొందించటంలో, వారు వసూలు చేసిన మొత్తాల్ని 'బిగ్ బాస్'కు చేర్చటంలోనూ మిథున్‌రెడ్డిదే కీలక పాత్రని సిట్ తేల్చింది. 'ఘరానా దోపిడీకి వీలుగా తొలుత కీలక స్థానాల్లో అనుకూల అధికారులను నియమించుకున్నారు. ముడుపులు ఎలా వసూలు చేయొచ్చో మిగతా నిందితులతో కలిసి పన్నాగం పన్నారు. అంతకు ముందున్న పారదర్శక వ్యవస్థలన్నింటినీ తొలగించేసి.. కుంభకోణానికి అనువైన సాఫ్ట్‌వేర్‌లు ప్రవేశపెట్టారు. ముడుపులిచ్చిన కంపెనీలకే అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇస్తూ, అందుకు అంగీకరించని సంస్థలను తరిమేశారు. వాటి స్థానంలో సొంత బ్రాండ్లు తెచ్చారు. వాటి బేసిక్ ప్రైస్ (మూల ధర) భారీగా పెంచుకుని ఖజానాను కొల్లగొట్టారు. ఈ వ్యవహారాలన్నింటిలోనూ మిథున్‌రెడ్డే ప్రధాన పాత్ర పోషించారు' అని దర్యాప్తులో వెల్లడైంది. ముడుపుల వసూళ్లు, సొంత బ్రాండ్ల మద్యానికి ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చుకోవటం ద్వారా మిథున్‌రెడ్డి రెండు విధాలా భారీగా అనుచిత లబ్ధి పొందినట్లు సిట్ గుర్తించింది. ఈ కుంభకోణంలో ఆయన ప్రమేయంపై కీలక ఆధారాలు లభించటంతో నాలుగో (మిగతా 6లో)

జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాలు

దివ్యాంగులు, వృద్ధులకు డీలర్ల ద్వారా ఇళ్ల వద్దే..

ఉత్తర్వులు జారీ 3లో

లేపాక్షి - ఓర్వకల్లు మధ్య యాపిల్ ఎలక్ట్రానిక్ సిటీ

- మూడు నెలల్లో పనులు ప్రారంభం
- హైటెక్ పరికరాల తయారీ కేంద్రంగా రాయలసీమ
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

6లో

2027 మార్చికల్లా పోలవరం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టీకరణ

లోపలి పేజీల్లో



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. వేదికపై మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీనివాస్, బడేటి చంటి, ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు

కోకో పంట కోసం కొత్త చట్టం తెస్తాం

మంత్రి అచ్చెన్నాయుడు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ చట్టం తరహాలో కోకో పంటకూ మద్దతు ధర కల్పించేలా కొత్త చట్టం తీసుకొస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లో కోకో రైతుల సమస్యలపై అధికారులు, ట్రేడర్లు, వివిధ సంస్థల ప్రతినిధులతో శుక్రవారం మంత్రి సమీక్షించారు. 'గతేడాది వరకూ రైతులకు లాభదాయక ధర అందించిన ట్రేడర్లు ఈసారి తగ్గించడం సరికాదు. కోకోకు అంతర్జాతీయ మార్కెట్ ధరల కనుగుణంగా కనీస మద్దతు ధర దక్కేలా కొత్త చట్టం తీసుకొస్తాం. రైతుల వద్దనున్న 1,500 టన్నుల కోకో పంటను కిలో రూ.500 చొప్పున కొనుగోలు చేయాలి. ఇందులో కిలోకు రూ.50 చొప్పున ప్రభుత్వం ఇస్తుంది' అని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. దళారీ వ్యవస్థ లేకుండా కోకో పంటను ఆయా సంస్థలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, ఉద్యాన శాఖ సంచాలకుడు శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ఎస్టేట్‌కు ప్రవేశ మార్గం
• వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ఎస్టేట్

జగన్ సోదరుడు మదన్‌మోహన్‌రెడ్డి భూకబ్జా

వందెకరాలకు పైగా ఆక్రమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు

ఈనాడు, కడప: మాజీ సీఎం జగన్ పెదనాన్న కుమారుడైన మదన్‌మోహన్‌రెడ్డి వందెకరాలకు పైగా ప్రభుత్వ భూములు కబ్జా చేశారని ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. వైఎస్సార్ కడప జిల్లా తొండూరు మండలం మల్లేలలో పశువుల మేతకు వదిలిన భూముల్ని ఆక్రమించి కంచె వేశారు. 2 కిలోమీటర్ల దూరంలోని చెరువులో బోర్లు వేసి అక్కడి నుంచి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఆక్రమించిన భూమిలో చీనీ తోట సాగు చేస్తూ, భవనాలూ నిర్మించారు. ఆక్రమించిన భూమిలో మదన్‌మోహన్‌రెడ్డి పేరుతో 14.10 ఎకరాలు, ఆయన భార్య మాధవీలత పేరుతో 9.90 ఎకరాలకు రిజిస్ట్రేషన్లూ జరిగాయి. దీనిపై రెవెన్యూ అధికారుల్ని అడిగితే.. కలెక్టర్‌కు నివేదిక పంపామని చెబుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్ రవి జిల్లా కలెక్టర్‌కు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి సాగు చేస్తున్న వారితో పాటు రిజిస్ట్రేషన్ చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

యోగా చేస్తుంటారా? విశాఖ వెళుతున్నారా?

యోగా దినోత్సవంపై ఇంటింటి సర్వే

ఈనాడు, అమరావతి: మీరు యోగా చేస్తుంటారా? వచ్చేనెల 21న విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్నారా? సమీపంలోని సచివాలయంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారా? సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని అడుగుతున్న ప్రశ్నలివి. వారిచ్చే సమాధానం ఆధారంగా ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రధాని మోదీ హాజరవుతున్న యోగా దినోత్సవంలో రెండు కోట్ల మంది పాల్గొనేలా విశాఖలో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆ రోజున విశాఖకు వచ్చేందుకు ఎంతమంది సుముఖంగా ఉన్నారో తెలుసుకునేందుకు సచివాలయాల ఉద్యోగులతో సర్వే చేయిస్తోంది. ఈ సంఖ్య ఆధారంగా విశాఖలో ఏర్పాట్లు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. సర్వేలో భాగంగా ప్రజల ఇళ్లకు వెళుతున్న ఉద్యోగులు అడుగుతున్న ప్రశ్నలు రెండు. మీరు యోగా చేస్తుంటారా? లేదా? లేదంటే అక్కడితో ముగించేస్తున్నారు. యోగా చేస్తున్నట్లు చెబితే విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి వెళుతున్నారా? వెళితే ఎలాంటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు? వెళ్లలేకపోతే సమీపంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసే కార్యక్రమానికి హాజరవుతారా? ఈ రెండు చోట్లా కాకపోతే ఇతరత్రా ఏర్పాట్లు చేసుకుంటున్నారా అనే కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. సర్వేను వచ్చేనెల 10 వరకు నిర్వహించే అవకాశాలున్నాయి. ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి.

227 మంది ప్రాణాలతో పాక్ చెలగాటం

- ప్రమాదపుటంచుల్లో ఉన్న భారత విమానంపై నిర్దయ
- గగనతలంలోకి ప్రవేశించేందుకు అనుమతించని వైనం

దిల్లీ: ముందుగా ఉరుములు, మెరుపులతో కూడిన కారుమబ్బులు. విమానం అలాగే ముందుకు చొచ్చుకువెళితే అందులోని ప్రయాణికులందరికీ ప్రాణగండం! కాస్తంత దారి మార్చి పక్కకు వెళదామంటే దాయాదిదేశం పాకిస్థాన్ గగనతలంలోకి వెళ్లక తప్పని పరిస్థితి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో- సునాయసంగా పక్కదేశ గగనతలంలోకి వెళ్లలేని పరిస్థితి. ..అయినా ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలనే సంకల్పంతో- విమానాన్ని పాకిస్థాన్ గగనతలంలోకి తీసుకెళ్లడానికి పైలట్లు అభ్యర్థించారు. అయితే పాకిస్థాన్ అధికారుల పాషాణ హృదయం కరగలేదు. విమానాన్ని అనుమతించడానికి ససేమిరా అన్నారు. విధిలేని పరిస్థితుల్లో పైలట్లు ఆ లోహవిహంగాన్ని ఉరుములు, మెరుపులు, వడగళ్ల వానతో కూడిన కారుమబ్బుల్లోకి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో అది తీవ్ర కుదుపులకు లోనైంది. ప్రమాదపుటంచులకు చేరువైంది. సరిగ్గా ఇదే సమయంలో పైలట్లు ఎంతో ధైర్యసాహసాలతో విమానాన్ని ముందుకు నడిపించారు. చాకచక్యంతో కిందికి దించారు. 227 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడారు. బుధవారం దిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో 6ఇ 2142 విమాన ప్రయాణికుల భీతావహ అనుభవం ఇది. ఈ ఘటనపై భారత పౌరవిమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) శుక్రవారం ఒక సవివర ప్రకటన విడుదల చేసింది.

ఏం జరిగింది?

శ్రీనగర్‌కు చేరే క్రమంలో పఠాన్‌కోట్ వద్ద ఈ విమానానికి ప్రతికూల వాతావరణం ఎదురైంది. దీంతో నిర్దేశిత ప్రయాణ మార్గానికి ఎడమవైపునకు (అంతర్జాతీయ సరిహద్దు దిశగా) మళ్లడానికి అనుమతించాలని వైమానిక దళానికి చెందిన నార్తర్న్ కంట్రోల్‌కు పైలట్లు విజ్ఞప్తి చేశారు. ఇలా వెళ్తే విమానం కొద్దిసేపు పాక్ గగనతలంలో ప్రయాణించాల్సి వస్తుంది. అయితే ఇండిగో పైలట్ల విజ్ఞప్తిని నార్తర్న్ కంట్రోల్ తిరస్కరించింది.

◆ భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసేస్తూ పాక్ పౌరవిమానయాన అధికారులు ఇచ్చిన 'నోటమ్'ను గుర్తుచేస్తూ ఇండిగో సిబ్బందికి ఆ సూచన చేశామని వైమానిక దళ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆ విమాన ప్రయాణ మళ్లింపు ప్రణాళికపై సమన్వయం చేసుకోవడంలో తాము సాయం అందించినట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో దిల్లీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో మాట్లాడామని, లాహోర్ ఏటీసీని సంప్రదించడానికి అవసరమైన ఫ్రీక్వెన్సీలను ఇండిగో సిబ్బందికి అందజేశామని తెలిపాయి. విమాన మళ్లింపునకు అనుమతించాలని అక్కడి అధికారులకు విజ్ఞప్తి చేయాలని సూచించినట్లు వివరించాయి.

◆ దీనిప్రకారం ఇండిగో విమాన పైలట్లు.. లాహోర్ ఏటీసీని నేరుగా సంప్రదించారు. ప్రతికూల వాతావరణం కారణంగా పాక్ గగనతలంలో కొద్దిసేపు ప్రయాణించేందుకు అనుమతి కోరారు. అటువైపు నుంచి తిరస్కరణ ఎదురైంది.

◆ ఒకవైపు ఉరుములు, మెరుపులతో కూడిన కారుమేఘం (థండర్‌స్టార్మ్ క్లౌడ్) కమ్ముకొస్తోంది. ఈ పరిస్థితుల్లో విమానాన్ని తిరిగి దిల్లీకి మళ్లించాలని పైలట్లు తొలుత భావించారు. అయితే అప్పటికే ఆ లోహవిహంగం.. కారుమేఘానికి బాగా చేరువగా వచ్చేయడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో అందులోకి ప్రవేశించాలని నిర్ణయించారు. తక్కువ వ్యవధిలో దీని నుంచి బయటపడి, శ్రీనగర్ వైపు వెళ్లేలా ప్రణాళిక రచించుకున్నారు.

కారుమేఘంలో..

కారుమేఘంలోకి రాగానే విమానం తీవ్ర వడగళ్ల వానను ఎదుర్కొంది. భీకరంగా కుదుపులకు లోనైంది. అనేక వ్యవస్థల లోపాలకు సంబంధించిన హెచ్చరిక సంకేతాలతో కాక్‌పిట్ మారుమోగింది. విమాన యాంగిల్ ఆఫ్ ఎటాక్ (ఏవోఏ)లో లోపాన్ని సూచించే హెచ్చరికలు ఇందులో ఉన్నాయి. విమాన రెక్కకు గాలి ప్రవాహానికి మధ్య ఉన్న కోణాన్ని ఏవోఏగా పిలుస్తారు. లోహవిహంగం గాల్లోకి లేవడానికి ఇది దోహదపడుతుంది.



వడగళ్ల కారణంగా ధ్వంసమైన విమానం ముందుభాగం

ఇది నిర్దిష్ట పరిమితిని దాటిపోతే విమానం గాల్లో విహరించే శక్తిని కోల్పోతుంది. ఇలాంటి పరిస్థితిని 'స్టాల్' అంటారు. వేగానికి సంబంధించిన సూచికలూ విశ్వసించలేని విధంగా మారాయి.

◆ తీవ్ర గాలి తాకిడికి ఆటోపైలట్ వ్యవస్థ మొరాయించింది. విమాన వేగంలో తీవ్ర హెచ్చుతగ్గులు తలెత్తాయి. గరిష్ఠ వేగాన్ని తాకుతున్నట్లు, స్టాల్ పరిస్థితి ఉత్పన్నమైనట్లు హెచ్చరికలు వెలువడ్డాయి. ◆ ఈ సమయంలో విమానం నిమిషానికి 8,500 అడుగుల వేగంతో కిందకి దిగడం మొదలైంది. సాధారణంగా ఆ వేగం 1,500 నుంచి 3వేల అడుగుల మధ్య ఉంటుంది.

◆ ఈ పరిస్థితుల్లో తలెత్తిన కల్లోలం వల్ల ప్రయాణికులు భయంతో కంపించిపోయారు. అరుపులు, కేకలు వేస్తూ గట్టిగా సీట్లను పట్టుకున్నారు. ◆ ఈ దశలో పైలట్లు విమానాన్ని తమ ప్రత్యక్ష నియంత్రణలోకి తీసుకున్నారు. జెట్‌ను స్థిరంగా ఉంచారు. కారుమేఘం నుంచి విమానాన్ని బయటకు తీసుకొచ్చారు.

ల్యాండింగ్..

శ్రీనగర్‌కు చేరువయ్యాక రన్‌వే దిశగా కిందకి దిగే క్రమంలో అక్కడి ఏటీసీ ఈ విమానానికి మార్గనిర్దేశం చేసింది. జెట్‌లోని అనేక వ్యవస్థల్లో లోపాలు తలెత్తినప్పటికీ విమానం శ్రీనగర్‌లో సురక్షితంగా దిగింది.

◆ కల్లోలం తీవ్రతకు విమానం ముందు భాగంలో ఉండే రాడోమ్ దెబ్బతింది. దీనిలోపల వాతావరణ రాడార్ ఉంటుంది. ◆ ఈ ఉదంతంలో ప్రయాణికులు, సిబ్బందిలో ఎవరికీ గాయాలు కాలేదు.

◆ లాహోర్ ఏటీసీ నిరాకరించినప్పటి నుంచి ఈ విమానం శ్రీనగర్‌లో సురక్షితంగా దిగేవరకూ తాము తోడ్పాటు అందించినట్లు వైమానిక దళ వర్గాలు తెలిపాయి. నేల వద్ద గాలి వేగం, ఇతర వివరాలను ఎప్పటికప్పుడు అందజేసినట్లు వివరించాయి. ఈ ఉదంతంపై డీజీసీఏ విచారణకు ఆదేశించింది.

సమీక్షలా.. విధులా?

- జీఎస్టీ వసూళ్ల పెంపు ఒత్తిడితో అధికారులు, ఉద్యోగుల హైరానా
- వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థన
- వాణిజ్య పన్నుల శాఖలో అస్తవ్యస్తం

ఈనాడు, అమరావతి: జీఎస్టీ వసూళ్ల హడావుడిలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో కీలక ఉన్నతాధికారి సమీక్షల పేరుతో జరుగుతున్న కాలయాపన వల్ల పని చేయడానికి సమయం చాలట్లేదని అధికారులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రోజూ సమీక్షలు జరుగుతున్నాయి. బకాయిల కింద వివిధ కేటగిరీల్లో రూ.15 వేల కోట్ల వరకు రావాల్సి ఉంది. కోర్టుల్లో 2వేల కేసులు ఉన్నాయి. బకాయిల వసూళ్లకు తగ్గట్లు ఉన్న మానవ వనరులు, అందుబాటులో ఉన్న సమయం ఆధారంగా పకడ్బందీ కార్యాచరణ ఉండాలి. కానీ రోజూ సాయంత్రం కీలక ఉన్నతాధికారి, ఇతర ఉన్నతాధికారులు కేంద్ర కార్యాలయం నుంచి డివిజన్ జాయింట్ కమిషనర్లు, సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్లతో కనీసం 2 గంటలు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ రోజువారీ లక్ష్యాలు విధిస్తున్నారు. ఆ మర్నాడే లక్ష్యాలు పూర్తికాకపోతే ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ సమీక్ష నిర్వహించడానికి ముందు ఆయా డివిజన్ జాయింట్ కమిషనర్లు కిందిస్థాయి అధికారులతో 2 గంటలపాటు విడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇలా.. రోజు మొత్తంలో కనీసం నాలుగైదు గంటలపాటు సమీక్షలు, సన్నద్ధతకు సరిపోతుంది.

జీఎస్టీ వసూళ్లు తక్కువగా ఉన్నాయని..

ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు తక్కువగా ఉండడంపై ప్రభుత్వం నుంచి వాణిజ్య పన్నుల శాఖకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వసూళ్ల పెంపునకు సమీక్షిస్తే తప్పు లేదు. 'ఆచరణ సాధ్యంకాని లక్ష్యాలు విధిస్తూ పురోగతి ఏదీ అని అడుగుతున్నారు. వ్యక్తిగత మందలింపుల వల్ల చిన్న ఉద్యోగుల ముందు తలదించుకోవాల్సి వస్తోంది' అని సీనియర్ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

రిటర్నుల దాఖలుకు గడువు ఉండగానే..

డీలర్లు ప్రతినెలా 20 నాటికి గడిచిన నెలకు జీఎస్టీ రిటర్నులు దాఖలు చేస్తారు. 20వ తేదీ దాటితే ఆన్‌లైన్ ద్వారా ఆటోమేటిగ్గా జరిమానా పడిపోతుంది. దీనికి అనుగుణంగా డీలర్లు రిటర్నులు దాఖలు చేస్తారు. వీరిలో ఓ స్థాయివారికి ప్రతినెలా పదో తేదీ నుంచే రిటర్నులు దాఖలు చేయించాలని జిల్లాలకు ఆదేశాలు వెళ్తున్నాయి. డీలర్లకు ఫోన్లు చేసి, వారితో రిటర్నులు చేయించాలని చెప్పి, మర్నాడు 'స్టేటస్' అడుగుతున్నారు. సమయం, జరిమానాల వసూలు దృష్ట్యా డీలర్లను త్వరగా రిటర్నులు దాఖలు చేయాలని అడగలేకపోతున్నామని, వారు ఫోన్లు ఆపేస్తున్నారని, లేదంటే వాదనలకు దిగుతున్నారని ఓ అధికారి విచారం వ్యక్తం చేశారు. రిటర్నుల దాఖలు ప్రభావం జాయింట్ కమిషనర్ దగ్గర నుంచి.. జీఎస్టీఓ స్థాయి వరకు కనిపిస్తోంది.

ఇంటిని చక్కదిద్దాలి

విశాఖపట్నం-2, విజయవాడ-2 డివిజన్లకు జాయింట్ కమిషనర్లు లేరు. 140కి గాను 40 సర్కిల్ కార్యాలయాలు అసిస్టెంట్ కమిషనర్లు లేకుండా నడుస్తున్నాయి. జీఎస్టీఓ (ఏసీటీఓ)గా 15 ఏళ్లుగా పనిచేసినా ఇప్పటికీ పదోన్నతి రానివారు చాలామంది ఉన్నారు. కొందరు డీసీటీఓల పరిస్థితీ ఇలాగే ఉంది. జీఎస్టీలో మార్పులకు తగ్గట్లు కిందిస్థాయి సిబ్బందికి కనీస శిక్షణ లేదు. 2017 నాటికి ఉన్న జీఎస్టీ రిజిస్ట్రేషన్లతో పోలిస్తే డీలర్ల సంఖ్య భారీగా పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో 1,400 పోస్టులను రద్దుచేయడం వాణిజ్య పన్నుల శాఖను ఇబ్బందుల్లోకి నెట్టింది.

◆ సర్కిల్ కార్యాలయాల్లో డీలర్ల వ్యాపారాల రిజిస్ట్రేషన్ మంజూరు అధికారాన్ని తొలగించారు. సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ) పేరుతో కేంద్ర కార్యాలయంలో రిజిస్ట్రేషన్ మంజూరుకు ఓ విభాగాన్ని ఏర్పాటుచేశారు. డివిజన్ స్థాయిలో ఏర్పాటుచేసినా పర్యవేక్షణ మెరుగ్గా ఉంటుంది. మరోవంక.. వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ (ఎస్టీ) నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్ వరకు సెలవు పెట్టాలంటే చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఇటీవల వెలువడిన ఉత్తర్వులు చర్చనీయాంశమయ్యాయి.





గామన్ వంతెన సమీపంలో డ్రెడ్జర్‌తో ఇసుక తోడుతున్నారిలా.. ◆ ధవళేశ్వరం పరిధిలో డ్రెడ్జర్‌లో ఇసుక తరలింపు
◆ రాజమహేంద్రవరం గ్రామీణంలోని గాయత్రీ రేవులో డ్రెడ్జర్ తెచ్చిన ఇసుకను యంత్రంతో బయటకు తీస్తూ..

గోదావరి.. ఇసుక అక్రమ దారి

- డ్రెడ్జర్లతో యథేచ్ఛగా తవ్వకాలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న జలవనరులశాఖ, మైన్స్, టాస్క్‌ఫోర్స్

ఈనాడు, రాజమహేంద్రవరం: నదీ పరివాహక చట్టమంటే లెక్కలేదు.. ఇసుక రీచ్‌ల నుంచి ఎన్ని లారీలు బయటకు వెళ్తున్నాయి? ఎంత పరిమాణమో నమోదు చేసే వ్యవస్థ లేదు. పర్యవేక్షణ కనిపించదు. పైగా నిబంధనలకు విరుద్ధంగా భారీ డ్రెడ్జర్లతో గోదావరిని తొలిచేస్తున్నా పట్టదు. బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో రాజమహేంద్రవరం నగరం, రాజమహేంద్రవరం గ్రామీణం, కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 80 డ్రెడ్జర్లతో నిత్యం ఇసుక తవ్వేస్తున్నారు. కొందరు ద్వితీయ శ్రేణి నాయకుల కనుసన్నల్లో ఈ దందా సాగుతోంది.

అతిక్రమణ ఇలా..

రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో ధవళేశ్వరంలోని గాయత్రి ర్యాంపు వద్ద పదుల సంఖ్యలో డ్రెడ్జర్లు గోదావరిలో తిరుగుతున్నాయి. ఒడ్డు నుంచి సుమారు రెండు కి.మీ. దూరం డ్రెడ్జర్లు వెళ్లి గొట్టాలతో ఇసుక తోడి తీసుకువస్తాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న ఎక్స్‌కవేటర్లు అందులోని ఇసుకను బయటకు తోడుతుండగా, మిగిలిన యంత్రాలు లారీల్లో లోడ్ చేస్తున్నాయి.

◆ గోదావరి నాలుగో వంతెన సమీపంలో కాతేరులో ఏర్పాటుచేసిన రీచ్‌లలో పరిస్థితి మరింత దారుణం. ఇక్కడా పదుల సంఖ్యలో డ్రెడ్జర్లు ఇసుక తోడుతున్నాయి. నదీ పరివాహక చట్టం ప్రకారం నిర్మాణాలకు 500 మీటర్లకు సమీపంలో తవ్వకూడదన్న నిబంధన ఉన్నా గామన్ వంతెన వద్దే యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.

◆ కోటిలింగాలరేవుతో పాటు కొవ్వూరు నియోజకవర్గం పరిధిలోనూ డ్రెడ్జర్లతో ఇసుక తవ్వకాలు, తరలింపు కొనసాగుతున్నాయి.

సేకరణ లక్ష్యానికి మూడు రెట్లు ఊడ్చేసి..

తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం నగరం, గ్రామీణం, కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో డీసిల్టింగ్ విధానంలో 18 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు జిల్లా అధికారులు అనుమతులిచ్చారు. నిబంధనల మేరకు బోట్స్‌మన్ సొసైటీ సభ్యులు పడవల్లో నదిలోకి వెళ్లి ఇసుక స్వయంగా తవ్వుకోవాలి. కొన్ని సొసైటీలే ఈ విధానం అమలు చేస్తున్నాయి. రీచ్‌ల నుంచి నిత్యం సగటున 15వేల మెట్రిక్ టన్నుల ఇసుక సేకరించాలి. దీనికి మూడు రెట్లు అనధికారికంగా తరలుతోంది. సమీపంలో ఉన్న జలవనరుల శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. డ్రెడ్జింగ్ బోట్లను అడ్డుకోవాల్సిన బాధ్యత ఈ శాఖదేనని మైన్స్ అధికారులు అంటున్నారు. అక్రమ దందా అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ మొదట్లో కొంత హడావుడి చేసి మిన్నకుంది. పరిమితికి మించి లారీల్లో ఇసుక తరలించేందుకు పలు విభాగాల్లోని కొందరు కీలక అధికారులకు నెలవారీ చెల్లింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మరికొందరు అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి ఉందనే ప్రచారముంది.

మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టుల మృతి

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని గడ్చిరోలి అదనపు ఎస్పీ రమేష్ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మావోయిస్టులు కవండే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది ఒడ్డున ఉన్న అడవుల్లో సమావేశమయ్యారని సమాచారం అందడంతో భద్రతా బలగాలు గురువారం మధ్యాహ్నం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బలగాలపై మావోయిస్టులు కాల్పులకు దిగారు. ప్రతిగా భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులు జరిపాయి. రెండు గంటల ఎదురుకాల్పుల తర్వాత మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయారు. ఘటనా స్థలంలో నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీరిని సన్నుమాస పుంగటి (35), అశోక్ అలియాస్ సురేష్ వడ్డే (38), విజ్యా హోయామి (25), కరుణ అలియాస్ మమిత వరసే (21)గా గుర్తించామని, వీరందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారని అదనపు ఎస్పీ వివరించారు. సంఘటన స్థలం నుంచి మావోయిస్టుల మృతదేహాలతోపాటు పలు ఆయుధాలు, ఇతర సామగ్రిని స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు.



సంఘటన స్థలం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సామగ్రి

సజ్జల ఎస్టేట్‌లో అధికారుల డ్రోన్ సర్వే

సీకేదిన్నె, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా సీకేదిన్నె మండలంలో వైకాపా నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డికి చెందిన ఎస్టేట్‌లో అధికారులు శుక్రవారం డ్రోన్‌తో సర్వే చేశారు. 'ఎస్టేట్‌కు ఎలా వెళతారో చూస్తాం' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. సీకేదిన్నె తహసీల్దారు నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి ఎస్టేట్‌కు వెళ్లి సమగ్రంగా భూములను చిత్రీకరించారు. సర్వేలో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు. లోపలికి ఎవరూ ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన గేట్‌నూ చిత్రీకరించారు. ప్రభుత్వ, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై డ్రోన్ సర్వే ఉపయోగపడుతుందన్నారు.



రామ్‌గోపాల్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో రామ్‌గోపాల్‌నాయుడి కుటుంబసభ్యులు

కీర్తిచక్ర రామ్‌గోపాల్‌నాయుడిని అభినందించిన కేంద్ర మంత్రి

ఈనాడు, దిల్లీ: జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఓ ఇంట్లో నక్కిన ముగ్గురు ఉగ్రవాదులను కాల్చి చంపి సాహసాన్ని ప్రదర్శించి, తాజాగా రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తిచక్ర పురస్కారాన్ని అందుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ మల్లా రామ్‌గోపాల్‌నాయుడిని కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు అభినందించారు. గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా జరిగిన పతక ప్రదానోత్సవానికి కుటుంబసభ్యులతో హాజరైన రామ్‌గోపాల్‌నాయుడిని కేంద్ర మంత్రి శుక్రవారం తన ఇంటికి ఆహ్వానించి సత్కరించారు.




ధ్రువమూర్తుల చిత్రం ◆ అలంకరణతో ధ్రువమూర్తులు

భద్రాచలం రాములవారి చిత్రాలకు కాపీ రైట్స్

ముద్రణ, విక్రయాలకు ఆలయ అనుమతి తప్పనిసరి

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి దేవస్థానంలోని ధ్రువ మూర్తుల చిత్రాలపై రామాలయానికి కాపీ రైట్స్ లభించాయి. ప్రధాన కోవెలలో సీతారామ లక్ష్మణుల వారి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఇందులో అలంకరణతో ఓ ఛాయాచిత్రం, అలంకరణ లేకుండా మరో చిత్రం కనిపిస్తుంటాయి. కాపీ రైట్స్ నిబంధనల ప్రకారం.. ఇక నుంచి రామాలయ అధికారుల అనుమతి తీసుకున్న తరవాతే ఈ ధ్రువమూర్తుల ఫొటోలను ముద్రించాల్సి ఉంటుంది. వాటి విక్రయాలకూ అధికారుల అనుమతి తప్పనిసరి. ఈ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని ఆలయ ఈఓ రమాదేవి శుక్రవారం తెలిపారు. జూన్ 20 తర్వాతి నుంచి అమలులోకి వచ్చే ఈ కాపీ రైట్స్ పదేళ్ల వరకు వర్తిస్తాయి. ఆర్థిక, వ్యాపార పరమైన లావాదేవీల్లో ఈ చిత్రాలను ఉపయోగించకూడదన్న ఉద్దేశంతో ఈ హక్కులు తీసుకున్నట్లు ఈవో స్పష్టం చేశారు.

బీఎస్పీకి పూర్ణచంద్రరావు రాజీనామా

ఈనాడు, అమరావతి: బహుజన్ సమాజ్ పార్టీకి విశ్రాంత ఐపీఎస్ అధికారి జె.పూర్ణచంద్రరావు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పార్టీ అధినేత్రి మాయావతికి లేఖ రాశారు. పార్టీ అంతర్గత సమస్యలతోపాటు.. రాజారావును తిరిగి పార్టీలోకి తీసుకోవాలని కోరినా అధినేత్రి స్పందించకపోవడం తదితర కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

24-5-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళపక్షం
ద్వాదశి: సా. 4-14 తదుపరి త్రయోదశి
రేవతి: ఉ.10-58 తదుపరి అశ్విని
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: ఉ. 8-43 నుంచి 10-13 వరకు
తిరిగి రా. 2-38 నుంచి 4-07 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-30 నుంచి 7-13 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.30; సూర్యాస్తమయం: సా.6.23

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	39.9	27.9
తిరుపతి	38.2	27.2
కడప	37.0	27.0
తాడేపల్లిగూడెం	36.9	26.4
విజయవాడ	36.2	28.0
ఒంగోలు	36.0	28.5
గుంటూరు	36.0	27.0
రాజమహేంద్రవరం	36.0	24.0
కర్నూలు	35.5	25.7
అనంతపురం	35.2	25.2
విజయనగరం	34.0	26.0
నరసాపురం	33.8	26.0
విశాఖపట్నం	33.6	26.6
శ్రీకాకుళం	33.0	28.0

ఇదీ సంగతి!



జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాలు

- దివ్యాంగులు, వృద్ధులకు డీలర్ల ద్వారా ఇళ్ల వద్దే..
- గత ప్రభుత్వంలో 9,260 మొబైల్ వాహనాలు.. రూ.1,801 కోట్ల ఖర్చు
- విఫలమైన మొబైల్ పంపిణీ విధానం
- ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మొబైల్ రేషన్ వాహనాల భారం ఎంతో తెలుసా? రూ.1,801 కోట్లు! అయినా గడప వద్దకే తీసుకెళ్లి రేషన్ ఇవ్వాలనే లక్ష్యం నెరవేరలేదు. పేదలకు నిత్యావసరాలు అందకపోగా నల్లబజారుకు తరలిపోయాయి. మొబైల్ వాహన పంపిణీ విధానం విఫలమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొబైల్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లో డీలర్ల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్లు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 15.50 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇళ్లవద్దనే నిత్యావసరాలు తీసుకెళ్లి అందించనున్నట్లు వివరించింది.

ఎండీయూల ద్వారా నల్లబజారుకు నిత్యావసరాలు

- వైకాపా ప్రభుత్వ హయాంలో గడప వద్దకే రేషన్ పేరుతో 9,260 వాహనాలు(ఎండీయూలు) ఏర్పాటు చేసినా.. రూ.1,801 కోట్లు ఖర్చు చేసినా లక్ష్యం మేరకు నిత్యావసరాలు కార్డుదారులకు ఇంటి వద్ద ఇవ్వలేకపోయారు.
- గతంలో 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు ఇచ్చేవారు. మొబైల్ వాహనం ద్వారా సగటున మూడు రేషన్ దుకాణాల పరిధిలో నిత్యావసరాలు అందించే విధానం తెచ్చారు.
- వాహనం ఎప్పుడు వస్తుందో తెలియదు. రేషన్ అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.
- మొబైల్ వాహనాల్లో నల్లబజారుకు నిత్యావసరాల తరలింపునకు సంబంధించి 288 కేసులు నమోదయ్యాయి
- వివిధ కారణాలతో 570 మంది ఆపరేటర్లు ఖాళీగా ఉన్నారు. 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేశాక నెలలో మిగిలిన రోజులు ఖాళీగా ఉంచాల్సి వస్తోంది.
- ఎండీయూ వాహన విధానంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. రేషన్ దుకాణాల వ్యవస్థను ఆధునికీకరించి.. సేవలు మెరుగుపరచాలనే ప్రతిపాదనను పరిశీలిస్తోంది.
- వీటన్నింటి నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా సరఫరా విధానానికి మళ్లడం తప్ప ప్రత్యామ్నాయం లేదని పౌరసరఫరాల శాఖ ప్రభుత్వానికి నివేదించింది.
- రేషన్ దుకాణాల్లో మౌలిక సౌకర్యాల పెంపు, డీలర్ల మార్జిన్లు పెంచడం ద్వారా మెరుగైన సేవలు అందించవచ్చని సిఫార్సు చేసింది.

ఆపరేటర్ల జీవనోపాధి దెబ్బతినకుండా ఉచితంగా వాహనాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా ఎంపికైన లబ్ధిదారులు నిత్యావసరాలు తీసుకువెళ్లే వాహనాలకు 10% తమ వాటాగా చెల్లించారు. 90% రాయితీగా ప్రభుత్వం అందించింది. ఈ మొత్తాన్ని ఆరేళ్లపాటు (2021 ఫిబ్రవరి నుంచి 2027 జనవరి వరకు) బ్యాంకులకు వాయిదాల పద్ధతిలో కార్పొరేషన్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు బకాయి మొత్తాన్ని ముందే చెల్లించి ఆపరేటర్ల పేరుతో వాహనాన్ని ఉచితంగా బదిలీ చేయాలని ప్రభుత్వం కార్పొరేషన్లను ఆదేశించింది.

గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో పెచ్చులూడిపడి బాలుడి మృతి



బాలుడిపై పడిన సిమెంటు పెచ్చులు



మృతి చెందిన మణికంఠ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: పిల్లలకు సెలవులు వచ్చాయని రామేశ్వరం వెళ్లొద్దామని బయలుదేరిన కుటుంబంలో గుంతకల్లు రైల్వేస్టేషన్ విషాదం నింపింది. స్టేషన్ విశ్రాంత మందిరంలో ఉండగా సిమెంటు పెచ్చులూడిపడి బాలుడి ప్రాణం తీశాయి. కర్నూలుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి కె.వెంకటేశ్వర్లు కుటుంబంతో రామేశ్వరం వెళ్లేందుకు 22న రాత్రి 2.30 గంటలకు రైలులో అనంతపురం జిల్లా గుంతకల్లుకు చేరుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున మరో రైలు కోసం రైల్వేస్టేషన్‌లోని ఏడో ప్లాట్‌ఫాంలో ఉన్న ఓపెన్ వెయిటింగ్ హాలులో కూర్చున్నారు. వీరి కుమారుడు మణికంఠ(10) హాల్‌లో గోడ పక్కనే ఉన్న బల్లపై నిద్రపోయాడు. తెల్లవారుజామున 4.30 గంటలకు బాలుడు నిద్రించిన చోట గోడ పైభాగంలోని సిమెంటు పెచ్చులూడి బాలుడి తలపై పడ్డాయి. బరువైన ఆ పెచ్చులు పిల్లాడి తల మీది నుంచి ఎడమ కనుబొమ్మల మీదుగా కిందపడటంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని కుటుంబసభ్యులు గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెయిటింగ్ హాలు నిర్మించి వందేళ్లు దాటింది. అధికారులు ఫాల్స్ సీలింగ్ వేసి నడిపిస్తున్నారు. తరచూ పెచ్చులూడుతున్నట్లు ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు

ఈనాడు, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో వైద్యులు, ఇతర సిబ్బంది ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకుంటే తప్పనిసరిగా బదిలీ చేయాలని ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రెండేళ్ల సర్వీసు ఉంటే అభ్యర్థన బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. డీఎంహెచ్‌ఓ, ఇతర కార్యాలయాల్లో పనిచేసే జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, ఇతర పరిపాలన సిబ్బంది ఒకేచోట మూడేళ్లుగా పని చేస్తుంటే తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. బదిలీలకు సంబంధించిన నిబంధనలను అధికారికంగా విడుదల చేయాల్సి ఉంది.

ఈనాడు

ఆధునికీకరణ పరిపూర్ణం కావాలంటే...

నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉండటం, నిపుణ శ్రామికశక్తి దండిగా లభించడం వంటి కారణాలతో దేశీయంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ ఆర్థిక కార్యకలాపాలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. వాటికి మరింత ఊతమివ్వడంతో పాటు పర్యాటకాన్ని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్రం సిద్ధమైంది. అందులో భాగంగా ఆయా పట్టణాల్లో 1,337 రైల్వే స్టేషన్లను స్థానిక సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు 'అమృత్ భారత్ స్టేషన్' పథకాన్ని పట్టాలకెక్కించింది. తొలి దశలో 508 స్టేషన్ల పునర్నిర్మాణానికి ఆమోద ముద్ర వేసింది. ఆ క్రమంలో రూ.1,100 కోట్లతో 86 జిల్లాల్లో పూర్తిగా నవీకరించిన 103 స్టేషన్లను ప్రధాని మోదీ మొన్న వర్చువల్‌గా ప్రారంభించారు. భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా వాటిలో ఎస్కలేటర్లు, లిఫ్టులు, విశ్రాంతి గదులు, కొత్త ప్లాట్‌ఫాంలను ఏర్పరచడం- మౌలిక వసతుల కల్పనలో ఎన్నదగిన ముందడుగు. దీంతో పాటు దాదాపు 99శాతం బ్రాడ్‌గేజీ వ్యవస్థను విద్యుదీకరించడం- కర్బన ఉద్గారాల తగ్గింపునకు తోడ్పడుతుంది. పట్టాల బాగుసేత, భద్రతలకు ప్రాధాన్యమిస్తూ, సామాన్య ప్రయాణికుల ప్రయోజనాలను పరిరక్షించడమూ రైల్వేల ఆధునికీకరణలో భాగం కావాలి!

విశాల భారతాన్ని అనుసంధానించడంలో కీలక భూమిక రైల్వేదే. గత ఆర్థిక సంవత్సరం 715 కోట్ల మంది రైళ్లలో ప్రయాణించారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య అయిదు శాతం అధికమైంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మన రైల్వేలో భద్రత పెరగడం లేదన్నది చేదునిజం. దశాబ్దాల కిందట వేసిన పట్టాలను మార్చేందుకు కావాల్సిన కేటాయింపులు కరవవుతున్నాయి. దాంతో రైళ్లు పట్టాలు తప్పడం పరిపాటిగా మారింది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలూ ఘోర ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో దేశవ్యాప్తంగా సంభవించిన 678 రైలు ప్రమాదాల్లో ఎంతోమంది కడతేరిపోయారు. రెండు రైళ్లు ఒకేసారి ఎదురెదురుగా రాకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన 'కవచ్' వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాల్సి ఉంది. సిగ్నళ్లను ట్యాంపర్ చేసి రైళ్లలో దోపిడీలకు పాల్పడే స్థాయికి దొంగల ముఠాలు బరితెగించడం కలవరపరుస్తోంది. రైలు ప్రయాణాల్లో వేగం, భద్రత, సమయపాలన, ఆధునిక సేవలకు జపాన్, చైనా వంటి దేశాలు పేరెన్నికగన్నాయి. భారతీయ రైల్వే సైతం ఆ దిశగా పురోగమిస్తే- ప్రజావసరాలను తీరుస్తూ, దేశాభివృద్ధికి అది విశేషంగా దోహదపడుతుంది!

మన దేశంలో వలస కార్మికులు, పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలకు నేటికీ రైలే ప్రధాన ప్రయాణ సాధనం. అందువల్ల సేవా దృక్పథమే రైల్వేల పరమావధి కావాలి. దానికి విరుద్ధంగా వ్యాపార ధోరణులు పెరుగుతుండటం జనభారతానికి శ్రేయోదాయకం కాదు. జనరల్ బోగీలను కుదించడం, ప్యాసింజర్ రైళ్లను తొలగించడం, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తగ్గించి ఏసీవి పెంచడం, తత్కాల్ బాదుడు, రాయితీల కోత తదితరాలతో సగటు జీవికి రైలు ప్రయాణం కష్టతరమవుతోంది. బోగీల్లో అపరిశుభ్రత, నాసిరకం ఆహారం పంపిణీ రైల్వే ప్రతిష్ఠను దిగలాగుతున్నాయి. అధునాతన సదుపాయాలతో వందేభారత్ రైళ్లు పరుగులు తీస్తుండటం హర్షణీయమే కానీ, వ్యయరీత్యా జనవర్గాలు అన్నింటికీ అవి చేరువ కాలేవు. కాబట్టి సామాన్యులకోసం సాధారణ రైళ్లలో జనరల్, స్లీపర్ బోగీలను పెంచాలి. సిబ్బంది ఖాళీలను భర్తీచేసి భద్రతకు భరోసా కల్పించాలి. సరకు రవాణాకు ఉన్న విస్తృత అవకాశాలను ఉపయోగించుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా ప్రయాణికులపై అదనపు భారాన్ని తగ్గించాలి. ఆ మేరకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటేనే జాతి జీవవాహికగా రైల్వే వ్యవస్థ పరిఢవిల్లుతుంది!




ఏదైనా పెద్ద సవాలు ఎదురవగానే 'నేను మహిళను, అది చేయలేను' అన్న ఆలోచన రాకూడదు. జీవితంలోనైనా, పర్వతారోహణలోనైనా... సవాళ్లను ఎదుర్కొనక తప్పదు. జీవితంలో ఏదీ అసాధ్యం కాదన్న విషయం మహిళలందరూ తెలుసుకోవాలి.

– బచేంద్రిపాల్, పర్వతారోహకురాలు

ప్రశాంత జీవనం

ప్రతి వ్యక్తీ ప్రశాంతమైన జీవితాన్నే కోరుకుంటాడు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవనయానం కొనసాగాలని ఆకాంక్షిస్తాడు. ఒత్తిళ్లకు దూరంగా చింతలేని జీవితాన్ని ఆస్వాదించాలని ఆశిస్తాడు. కానీ ఆచరణలో అది సాధ్యమేనా? జీవితం సుఖదుఃఖాల సంగమం. కష్టాలూ సమస్యలు లేని వారంటూ ఎవరూ ఉండరు. అయితే వాటిని ఎంత నిబ్బరంగా ఎదుర్కొంటామన్న దానిపైనే మన జీవన నాణ్యత ఆధారపడి ఉంటుంది.

నిజానికి జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణించడమే. అయితే ఆ సమస్యల వల్ల ఏర్పడే విపరిణామాలలో చిక్కుకోకుండా వాటిని చాకచక్యంగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగడం మన వివేచన మీద ఆధారపడి ఉంటుంది. ప్రశాంతత కోసం మనం ఎక్కడెక్కడో అన్వేషిస్తూ ఉంటాం. కానీ, ప్రశాంతత అనేది మనలోనే, మనతోనే, మన ఆలోచనల్లోనే నిండి ఉంటుంది. సర్వకాల సర్వావస్థల్లోనూ మనసును నిర్మలంగా స్ఫటికమంత స్వచ్ఛంగా ఉంచుకోగలిగితే ప్రశాంత అనుభూతిని ఆస్వాదించవచ్చు. సమస్యలనేవి సముద్రపు అలల్లా వచ్చి పోతూనే ఉంటాయి. వాటి ఒత్తిడికి అతీతంగా మసలుకుంటే మనల్ని మనం నియంత్రించుకోవచ్చు.



అంతర్యామి

సుఖదుఃఖాలు అనేవి రెండు తలుపులు లాంటివి. వాటిలో ఒకటి తెరుచుకుంటే ఇంకొకటి మూసుకుంటుంది. సమస్యలతో సంఘటనలతో నిమిత్తం లేకుండా భావనలను ఆలోచనలను నిర్మలంగా ఉంచుకోగలిగినంత కాలం ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చు. ఈ లోకంలో నాకెలాంటి సమస్య లేదు అని ఎవరైనా చెబితే అది వారిని వారు మోసం చేసుకుంటున్నట్టుగా భావించాలి. కాలు తడవకుండా నదినీ, కళ్లు తడవకుండా జీవితాన్నీ దాటలేమని పెద్దలు ఎప్పుడో చెప్పారు. కష్టసుఖాలు జీవనపర్యంతం మనతో కొనసాగుతూనే ఉంటాయి. తామరాకు మీద నీటిబొట్టులా వాటి తాలూకు ప్రభావం అంటకుండా మనదైన ప్రశాంతతను ఆస్వాదిస్తూ జీవన సమరంలో నిలిచి గెలవాలి. చాలామంది సమస్యలకు పరిష్కారం వెతకడంలోనే జీవితంలో విలువైన సమయాన్ని వృథా చేస్తుంటారు. దీనివల్ల మన శ్శాంతి కరవవుతుంది. 'జీవితం రంగుల నది లాంటిది. ప్రతి రంగుకూ ఒక భావం ఉంటుంది. ఆ భావజాలంతో ముందుకు ప్రవహించాలి. జీవితం అలుపెరగని ప్రయాణం. ప్రతి మజిలీలోనూ ఆనందంగా సాటి ప్రయాణికులతో మమేకం కావాలి. ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఎదురు నిలిచి పోరాడి గెలుపును సాధించడమే జీవితానికి లక్ష్యం కావాలి' అని రామకృష్ణ పరమహంస ఉపదేశించారు.

వాస్తవ దృష్టితో ఆలోచించినట్లయితే సమస్యలు చాలావరకు మనకి మనం తెచ్చుకునేవే! మనం సృష్టించుకున్న సమస్యల నుంచి మనమే బయటపడాలి. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి- అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన సందేశం అనుసరణీయం. ఒత్తిళ్లకు దూరంగా, సమస్యలు లేకుండా జీవన గమనమనేది అసాధ్యం. కాబట్టి ముళ్ల మధ్య వికసించిన గులాబీ పువ్వులా, బురద నుంచి ఉద్భవించిన తామర పువ్వులా ఎవరిని వారు వికసింప చేసుకోవాలి. జీవనపథాన అలుపెరగని బాటసారిగా పురోగమించాలి. జీవన మాధుర్యాన్ని నిరంతరం ఆస్వాదించాలి.

– కనకదండి వేణుగోపాలరావు

యువ శక్తుల నవ సృజనలే... ప్రగతికి సాధనాలు!

ఉన్నత విద్యాసంస్థలు(హెచ్‌ఈఐలు) జాతి నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. సామాజిక-ఆర్థిక సాధికారతను సమకూర్చడంతో పాటు ప్రతిభావంతులను ఆర్థిక వ్యవస్థకు అందించి అంతర్జాతీయ మార్కెట్లో పోటీపడగల నాణ్యమైన వస్తుసేవల ఉత్పత్తికి అవి తోడ్పడతాయి. కేవలం విద్యాబోధనకు పరిమితం కాకుండా పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు, నవీకరణ సాధనకు మూల కేంద్రాలుగా భాసిస్తాయి. యువతలో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, రాజ్యాంగం పట్ల కట్టుబాటు, మేధాపరంగా జిజ్ఞాస, సేవా భావం, సృజనాత్మకతలకు పాదు గొల్పడం వంటి బాధ్యతలను హెచ్‌ఈఐలు నెరవేరుస్తాయి. 21వ శతాబ్దిలో రాణించడానికి కావాల్సిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలను, భాషా నైపుణ్యాలను, కళలు, సామాజిక, మానవ శాస్త్రాలనూ విద్యార్థులకు బోధిస్తాయి. వృత్తి, ఉపాధి నైపుణ్యాలను అలవరుస్తాయి. ఈ బాధ్యతల నిర్వహణలో అధ్యాపకులదే కీలక పాత్ర. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో పైచేయి సాధించే నిపుణ మానవ వనరులను తయారు చేయడం అధ్యాపకుల విధి. దీన్ని సమర్థంగా నిర్వహించడానికి వారు ప్రపంచంలో శాస్త్రసాంకేతిక, పరిశోధన రంగాల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలి. తమ ఆలోచనా విధానాన్ని, మనస్తత్వాన్ని ఆధునిక యుగానికి అనుగుణంగా మలచుకోవాలి. కాలంతో పాటు మారకపోతే సాధించేది ఏదీ ఉండదని తెలుసుకోవాలి. ఉన్నత విద్యాసంస్థలు, అధ్యాపకులు నిత్యనవోన్మేషంగా ఉండకపోతే జాతి సాధించేది ఏమీ ఉండదు.



దేశ సర్వతోముఖాభివృద్ధికి ఉన్నత విద్యాసంస్థలు వెన్నెముకగా నిలుస్తాయి. వాటిని బలోపేతం చేయడంపై పాలకులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. అధ్యాపకులు సైతం ఆధునిక పరిణామాలను అవగతం చేసుకుని భారత దేశ దశాదిశలను మార్చగలిగే యువ పరిశోధకులు, వ్యవస్థాపకులను తయారుచేయాలి.

ఆమడ దూరంలో...

నవతరాన్ని నాలుగో పారిశ్రామిక విప్లవానికి సిద్ధం చేయాల్సిన గురుతర బాధ్యత ఉన్నత విద్యాసంస్థలపై ఉంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), కృత్రిమ మేధ, రోబోటిక్స్, బిగ్ డేటా తదితర సాంకేతికతలతో పారిశ్రామికోత్పత్తి డిజిటలీకరణ అవుతోంది. త్వరలో క్వాంటమ్ సాంకేతికత ఊపందుకోనుంది. కంప్యూటర్ సైన్స్, భౌతిక, గణిత శాస్త్రాలపై పట్టు సాధించినవారే క్వాంటమ్ యుగంలో రాణిస్తారు. అలాంటి విద్యార్థులను తయారు చేయడంలో హెచ్‌ఈఐల పాత్ర అంతా ఇంతా కాదు. క్వాంటమ్ కంప్యూటర్లకు హార్డ్‌వేర్, అప్లికేషన్లను సిద్ధం చేయగల సత్తాను మన యువతరానికి అందించాలి. గడిచిన యాభై ఏళ్లలో వచ్చిన మార్పులను, రాబోయే పరిణామాలను అధ్యాపకులు అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం మన యువ వ్యవస్థాపకులు ఈ-కామర్స్ వేదికలను నిర్మిస్తున్నారు. కొత్త కొత్త యాప్‌లను రూపొందిస్తున్నారు. నాలుగో పారిశ్రామిక యుగంలో రాణించాలంటే ఇంతటితో ఆగిపోకూడదు. నవ కల్పనల్లో ప్రపంచంలో అగ్రగాములతో పోటీపడాలి. తరవాత వారిని మించిపోవాలి.

అంతర్జాతీయ నవీకరణ సూచీలో 2015లో 81వ స్థానంతో సరిపెట్టుకున్న భారత్ 2024కల్లా 39వ స్థానానికి ఎగబాకడం అభినందించాల్సిన విషయమే. కానీ, నవీకరణ సూచీలో 11వ స్థానంలో ఉన్న చైనా రేపోమాపో పదో స్థానాన్ని అందుకోబోతున్నదని గ్రహిస్తే నవీకరణ శిఖరానికి మనం ఇంకా ఆమడ దూరంలోనే ఉన్నామని అర్థమవుతుంది. అధికార గణాంకాల ప్రకారం భారత్‌లో 1.6 లక్షల స్టార్టప్‌లు ఉంటే, చైనాలో వాటి సంఖ్య మూడు లక్షలు. భారత్‌లో 120 యూనికార్న్‌లు ఉంటే, చైనాలో ఏకంగా 300 పనిచేస్తున్నాయి. ప్రస్తుతం సేవా రంగం కోసం సొల్యూషన్స్ అందించే స్థాయిలో ఉన్న భారతీయ వ్యవస్థాపకులు యూనికార్న్‌లను విరివిగా ఏర్పాటు చేయగల స్థాయికి ఎదగాలి. అందుకు వెంచర్ పెట్టుబడులు దండిగా కావాలి. డీప్ టెక్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అంతర్జాతీయ నవీకరణ సూచీలోని టాప్-10 దేశాల జాబితాలో చోటు సంపాదించి అసలు సిసలు విజ్ఞానాధారిత సమాజంగా భారతావని రూపాంతరం చెందాలి. ఈ కలను నిజం చేయడానికి అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు, ఉన్నత విద్యాసంస్థల నిర్వాహకులు సమగ్ర కార్యాచరణ చేపట్టాలి. నాయకులు కఠిన నిర్ణయాలు తీసుకుని ఆశించిన రూపాంతరీకరణను సాధించాలి. నాలుగో పారిశ్రామిక విప్లవ సాధనకు కావాల్సిన పాఠ్య ప్రణాళికలను రూపొందించి, బోధనా వసతులను ఏర్పరచడానికి కొవిడ్‌కు ముందే కేంద్ర విద్యాశాఖ ఒక మార్గదర్శ ప్రణాళికను రూపొందించింది. అది అత్యధిక హెచ్‌ఈఐలకు చేరకపోవడం విచారకరం!

సొంతంగా పరిశోధనలు...

అన్ని హెచ్‌ఈఐలు ఒకేలా ఉండవు. వాటి మధ్య తేడాలను గౌరవిస్తూనే నవ యుగానికి అవసరమైన పాఠ్య ప్రణాళికలను, బోధనా రీతులను, వసతులను ఏర్పాటు చేయాలి. అనవసర తర్జన భర్జనలతో కాలయాపన చేసే బదులు కార్యాచరణకు దిగడం అత్యావశ్యకం. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో భారతీయ ఉన్నత విద్యాసంస్థలు తామే స్వయంగా నవ సృజనలు చేయాలి. వాటిని దేశాభివృద్ధికి వినియోగించి ఇండియాను నాలుగో పారిశ్రామిక విప్లవంలో ముందుకు ఉరికించాలి. విద్యార్థులతో పాటు అధ్యాపకులూ నిరంతర జిజ్ఞాసువులుగా మసలాలి. అందుకు సంస్థాగతంగా అండదండలు ఇవ్వాలి. ఉన్నత విద్యాసంస్థలకు విడివిడిగా పరిశోధనా బాధ్యతలు అప్పగించి, తగు నిధులు, సౌకర్యాలు సమకూర్చాలి. మెరికల్లాంటి పరిశోధకులను ఆకర్షించాలి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో మన హెచ్‌ఈఐలు సహకార, భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. కొత్త విజ్ఞానాన్ని సృష్టించడంతో పాటు ఆవిష్కర్తలకు, సంస్థలకు మేధా హక్కులు సాధించాలి. పరిశోధన ఫలితాలను ఆదాయ మార్గంగా మలచుకోవడం, మేధా హక్కుల పరిరక్షణపైనా పరిశోధకులకు తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. మనవాళ్లు కనుగొన్న అంశాలను ఇతరులు లైసెన్సుపై వినియోగించుకునే ఏర్పాటు ఉండాలి. అలానే ఇతర దేశాల నుంచి లైసెన్సుపై కొత్త పరిజ్ఞానాలను స్వీకరించాలి. సాంకేతికతల బదిలీ కూడా జరగాలి. మొత్తం మీద మన ఉన్నత విద్యాసంస్థల్లో సృజనాత్మకత వెల్లివిరిసే వాతావరణాన్ని సృష్టించాలి.



ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి



పాటల్లో పదనిసలు

పాట ఏం చేస్తుంది..? ఒకటి కాదు, ఎన్నో చేస్తుంది. 'పోవుచున్నావా యమ ధర్మరాజా..' అంటూ యముణ్ని అడ్డగించి మృత్యువు మీద విజయం ప్రకటిస్తుంది. 'కల కానిది విలువైనది..' జీవితమని చెబుతూ ఆత్మహత్య నిర్ణయాన్ని ఆఖరి క్షణాల్లో వెనక్కి తీసుకునేలా చేస్తుంది. పాట శక్తిమంతమైంది.. మోడువారిన జీవితాలను చిగురింపజేస్తుంది. 'ధనలక్ష్మిని అదుపులోన పెట్టినవాడే గుణవంతుడు.. బలవంతుడు.. భగవంతుడురా..' అనే లక్ష్మీనివాసం పాట వింటే ఈ రోజుల్లో స్టాక్‌మార్కెట్ కూడా పులకిస్తుంది.

పాటలే కాదు, పాటల సంగతులూ బాగుంటాయి. హాస్య రచయిత భరాగో పాటలు పాడేవారు. ఆయన ఒక సభలో మాట్లాడుతూ 'ఈ రోజు నన్ను పాట పాడమని అడగకండి.. వెళ్లే దార్లో చీటీ పాట పాడుకోవాలి' అని చమత్కరించారు. రేడియోలో లైలా మజ్ను సినిమా పాట 'ప్రేమే నేరమౌనా..' అని మొదలవగానే 'మాపై ఈ పగేలా' అని పేరడీ పాడేవారమని ఆయన చెప్పేవారు. 'మీ పాట మీద మీ అభిప్రాయం ఏంటి?' అని గీత రచయిత వేటూరిని అడిగితే.. 'నా పాటే నా అభిప్రాయం' అని చెప్పారట. ఒక సినిమాలో ఆయన పార్కులో బెంచీ మీద కూర్చుని ఉంటారు. తన దగ్గరలోనే ఉన్న ఒక ప్రేమ జంటని చూసి 'మీవి పాట్లు... నావీ పాట్లే.. (పాటలు)' అన్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయన 'పాటే బతుకైన పసివాడు' కదా. 'ఎలనాగ నయనాల కమలాలలో దాగి ఎదలోన కదిలే తుమ్మెద పాట విన్నాను..' అంటూ అద్భుతంగా రాసిన పాటల 'ఏకవీరుడు' సినారె మంచి హాస్యప్రియులు. కొత్త దర్శకుడొకరు పాటల క్యాసెట్ ఇస్తోంటే.. 'ఇందులో పాట వినబడుతుందా' అని చలోక్తి వేశారట. సంగీతం సాహిత్యాన్ని డామినేట్ చేసే రోజులివి మరి. ఒకసారి ఒక కొత్త గాయకుడు పాడుతుండగా చూసిన ఆచార్య ఆత్రేయ 'బాలూ అయితే వీలవుతూ పాడతాడు.. ఇతనేంటి? పాడటానికి ఫీలవుతున్నాడు' అన్నారట!

రేడియో పాటల ప్రోగ్రాముల్లో శ్రోతల పాత్ర నామమాత్రమే. 'సార్ నేను స్టూడెంట్ నంబర్ వన్ పాట కోరుతూ రాస్తే మీరు ఒకటో నంబర్ కుర్రాడు మూవీలో పాట ప్రసారం చేశారు...' అని ఉత్తరం రాశాడో శ్రోత. 'అవునయ్యా నువ్వు ఇంగ్లీషులో అడిగితే నేను తెలుగులో సమాధానమిచ్చాను' అని నవ్వుతూ సమర్థించుకున్నాడు వ్యాఖ్యాత. ఒక పోస్ట్‌మ్యాన్ పాటల్ని సరదాగా తిరగేసి పాడుతుంటాడు. అతని భాషలో అవి 'టపా'లు.

'విని మెచ్చి మనసిచ్చే మనిషుంటే పాడాలనే ఉన్నదీ..' అని ఆచార్య ఆత్రేయ అంటారు. 'నీ పాటను వినడానికి గోపాలుడు ఏ మూలనో పొంచి ఉన్నాడని శ్రీశ్రీ 'ఇద్దరు మిత్రులు' సాక్షిగా చెప్పకనే చెప్పారు. ఇంకెందుకు ఆలస్యం? రాగం తానం తెలియకపోయినా గొంతు సవరించుకోండి. పాడండి.. పాడించండి! పాటల్లో మైమరిచిపోండి!

– బి.వి.రావు

ఇందులోనూ చైనాయే!

గ్రాఫైట్.. అధిక విద్యుత్, ఉష్ణ వాహకత దీని సొంతం. అత్యధిక వేడిమిని తట్టుకోగలుగుతుంది. కందెనలు, బ్యాటరీలు, అణురియాక్టర్లు తదితర పారిశ్రామిక అవసరాల్లో వినియోగిస్తారు. విద్యుత్ వాహనాల వినియోగం ఎక్కువ కావడంతో గ్రాఫైట్‌కు గిరాకీ పెరుగుతోంది. గ్రాఫైట్‌ను గనుల నుంచి తవ్వి తీయవచ్చు లేదా రసాయన చర్యల ద్వారానూ ఉత్పత్తి చేయవచ్చు. 2023లో గ్రాఫైట్ ఉత్పత్తిలో చైనా అగ్రస్థానంలో నిలిచింది. ఆ ఏడాది మొత్తం గ్రాఫైట్ ఉత్పత్తిలో ఆయా దేశాల వాటా... (శాతాల్లో)

చైనా	76.88
మడగాస్కర్	6.25
మొజాంబిక్	6
బ్రెజిల్	4.56
దక్షిణ కొరియా	1.69
రష్యా	1
ఇండియా	0.72
ఉత్తర కొరియా	0.51
నార్వే	0.45
టాంజానియా	0.38

(ఆధారం: యూఎస్‌జీఎస్-మినరల్ కమోడిటీ సమ్మరీస్-2024)

ప్రేమ కరవై... బంధం బరువై..!

మనువు... ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన మలుపు. కేవలం ఇద్దరు వ్యక్తులనే కాదు- రెండు జీవితాలనూ రెండు హృదయాలనూ రెండు కుటుంబాలనూ శాశ్వతంగా ఒక్కటి చేసే పవిత్ర బంధమిది. కానీ, నేడు వివాహ వ్యవస్థ హత్యలు, ఆత్మహత్యలు, విడాకులతో పెళుసుబారుతోంది. తప్పిదం ఎక్కడ జరుగుతోంది?

మన దేశంలో పెళ్లికి ఉన్నంత ప్రాధాన్యం జీవితంలో మరే సందర్భానికీ ఉండదు. అందుకే ఉన్నదంతా గుమ్మరించి ఎంతో వైభవంగా వివాహం చేసుకుంటారు. కలకాలం నిలిచే ఆ బంధంలో అడుగుపెట్టడం కోసం యువతీ యువకులు ఎన్నో కలలు కంటారు. కానీ, వివాహ బంధం మూణ్నాళ్లకే ముక్కలైపోతే? ఎవరి జీవితంలోనైనా అది మానని గాయమే అవుతుంది. పెద్దలు కలిపిన జంటలే కాదు- ఏళ్ల తరబడి ప్రేమించి పెళ్లి చేసుకున్నవారు సైతం విడిపోవడం ఇటీవల ఎక్కువవుతోంది. వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవడం, అనుమానంతో జీవిత భాగస్వామిని అంతమొందించడం వంటి ఘటనలూ పెరిగిపోతున్నాయి.



అనుమానమే పెనుభూతం...

ప్రేమ, విశ్వాసం, గౌరవం, సహనం అనే నాలుగు స్తంభాల మీద నిలబడే వైవాహిక బంధాన్ని కడదాకా నిలుపుకోవాల్సిన బాధ్యత దంపతులపై ఉంది. ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవిస్తూ, కష్టసుఖాల్లో తోడుంటూ ఆనందాలను పంచుకుంటేనే ఆ బంధం కలకాలం నిలుస్తుంది. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. 'ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య', 'భర్త చేతిలో భార్య హత్య' వంటి దారుణాలు కొంతకాలంగా మన సమాజంలో పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు కారణాలనేకం! అనుమానమో వివాహేతర సంబంధమో మాట వినడంలేదనో... కారణమేదైనా క్షణికావేశానికి ఎవరో ఒకరు బలవుతున్నారు. నెలల తరబడి ఆలోచించి మరీ భాగస్వామిని అంతం చేస్తున్నారు మరి కొందరు. మొన్న జనవరిలో రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో గురుమూర్తి అనే వ్యక్తి తన భార్యను అతి కిరాతకంగా చంపాడు. మృతదేహాన్ని ముక్కలు చేసి కుక్కర్‌లో ఉడికించాడు! అదే నెలలో హైదరాబాద్ కాచిగూడకు చెందిన అతిపాముల సచిన్ సత్యనారాయణ(21) అనే వ్యక్తి, నిండు గర్భిణి అయిన తన భార్య కడుపు మీద కూర్చొని హింసించడంతో గర్భస్థ శిశువుతో పాటు ఆమె కూడా చనిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్‌ను ప్రియుడితో కలిసి అతడి భార్య అతి కిరాతంగా చంపేసింది. శవాన్ని ముక్కలుగా చేసి, ప్లాస్టిక్ డ్రమ్‌లో వేసి సిమెంట్‌తో కప్పిపెట్టింది. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో కట్టుకున్న భర్తను కరెంట్ షాక్‌తో చంపేసి పూడ్చిపెట్టిందో ఇల్లాలు! కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్(68)ను ఆయన భార్యే హతమార్చిన ఘటనతో దేశం ఉలిక్కిపడింది. చెబుతూపోతే ఇలాంటి హేయ నేరాలెన్నో!

ఇక చిన్న విషయాలకే విడాకులు తీసేసుకుని పెళ్లిని పెటాకుల వరకు తెచ్చుకుంటున్నారు మరికొందరు. కొత్తగా పెళ్లైన జంటలే కాదు, ఏళ్లతరబడి కలిసి జీవించిన వారూ విడిపోతున్నారు! భార్య నచ్చిన కూర వండటం లేదనో, కుక్కపిల్లను సరిగ్గా చూసుకోవడం లేదనో, భర్త నచ్చిన డ్రెస్ కొనివ్వలేదనో, బట్టతల వచ్చేసిందనో, పొట్ట పెరిగిపోయిందనో విడాకులు కావాలంటున్నారంటే ఏమనుకోవాలి!? జీవిత భాగస్వామి తాము చెప్పినట్లే వినాలనే ధోరణి చాలామంది భార్యాభర్తల్లో కనిపిస్తోంది. భాగస్వామిపై అనుమానాలు, వివాహేతర సంబంధాల వల్ల గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్థిక సమస్యలు, భారీ అంచనాలను అందుకోలేకపోవడం వంటివీ విడాకులకు దారితీస్తున్నాయి. వరకట్న వేధింపులు, గృహహింస వంటివి ఇంకా తగ్గకపోవడం చేదువాస్తవం.

గతంలో వివాహ బంధాన్ని కాపాడుకోవాలని, చిన్నచిన్న విషయాలకు గొడవ పడొద్దని తల్లిదండ్రులు తమ పిల్లలకు హితవు చెప్పేవారు. ఇప్పుడు గొడవలకు సైఅంటేసై అనే పెద్దలూ ఉన్నారు. వ్యక్తిగత జీవితాలపై పాశ్చాత్య సంస్కృతి, సోషల్ మీడియా, వెబ్ సిరీస్‌ల ప్రభావం ఎక్కువగానే ఉంటోంది. భార్యాభర్తల మధ్య నమ్మకాన్ని అవి పలుచన చేస్తున్నాయి. మీర్‌పేటకు చెందిన గురుమూర్తి ఓ మలయాళ సినిమాలోని హత్యను ప్రేరణగా తీసుకుని, తన భార్యను కడతేర్చినట్లు పోలీసుల ఎదుట అంగీకరించడం విస్తుగొలిపేదే!

పరస్పర నమ్మకమే పునాది


భాగస్వామి అకారణంగా వేధిస్తుండటం, వ్యసనాలకు బానిసై చిత్రహింసలు పెడుతుండటం వంటి పరిస్థితులు ఉన్నప్పుడు తెగతెంపులు చేసుకోవడం సమంజసమే. కానీ ప్రాణాలు తీయడమో, ప్రాణాలు తీసుకోవడమో దీనికి పరిష్కారం కాదని గుర్తించాలి. భార్యాభర్తల మధ్య సమస్యలు రావడం అత్యంత సహజం. సహనంతో మనసు విప్పి మాట్లాడుకుంటే చాలావరకు పొరపొచ్చాలనేవి దూదిపింజల మాదిరిగా ఎగిరిపోతాయి. నచ్చని పని చేసినప్పుడు ఎవరికైనా కోపం వస్తుంది. దాన్ని నియంత్రించుకుని ఎదుటివారిని క్షమించగలిగినప్పుడే ఆ బంధం దృఢమవుతుంది. ఎదుటివారు తప్పు తెలుసుకుని క్షమాపణ కోరినప్పుడు బెట్టు చేయకుండా దాన్ని స్వాగతించాలి. పరస్పర నమ్మకంతో ప్రేమనూ గౌరవాన్నీ ఇచ్చిపుచ్చుకున్నప్పుడే ఏ బంధమైనా ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలబడుతుంది. కుటుంబాన్ని నిలబెడుతుంది.

– సందరగిరి రమ్య

హేయ్! బుజ్జీ!!

అదే నాయకత్వం..!

ఒక అడవిలో కోతి ఉండేది. ఎప్పటికైనా ఆ అడవికి రాజు అవ్వాలని కలలు కనేది. ఒకరోజు చెట్ల మీద అటూఇటూ గెంతులు వేస్తూ ఉండగా.. వేటగాళ్ల గుంపు అడవిలోకి రావడం గమనించింది. వెంటనే మృగరాజుతో సహా మిగతా అన్ని జీవులకు విషయం చెప్పి.. గుహల్లోకి వెళ్లమని హెచ్చరించింది. అది చెప్పినట్లుగా జంతువులన్నీ గుహల్లోకి వెళ్లి దాక్కున్నాయి. కొన్ని గంటలు వెతికిన తరవాత.. నిరాశగా వెనుతిరిగారు వేటగాళ్లు. అప్పుడు జంతువులన్నీ బయటికి వచ్చి.. కోతికి కృతజ్ఞతలు తెలిపాయి. సింహం మెచ్చుకుని ఏం కావాలో కోరుకోమంది. కోతి ధైర్యం చేసి.. 'అడవికి రాజు అవ్వాలనుంది, ఒక పది రోజులైనా సరే!' అంది. కాసేపు ఆలోచించిన మృగరాజు.. 'రేపటి నుంచి మన అడవికి నువ్వే రాజు' అంది. దాంతో కోతి చాలా ఆనందించింది. ఇంటికి వెళ్లి పడుకుని.. 'రేపటి నుంచి జంతువులన్నీ నేను చెప్పినట్లే వింటాయి' అని బోలెడు కలలు కంది. మరుసటి రోజు ఉదయం ఎప్పటిలాగే ఆలస్యంగా నిద్ర లేచింది. ఒక్కసారిగా పక్క అడవి జీవులన్నీ ఇక్కడికి రాసాగాయి. అప్పుడు కోతికి ఏం చేయాలో తోచలేదు. 'ఇది మా అడవి మీరెందుకు వచ్చారు. వెళ్లిపొండి. లేదంటే.. కొట్టేస్తాను' అంటూ ఏవేవో మాట్లాడింది. అంతలోనే అక్కడికి వచ్చిన మృగరాజు.. 'అసలు మీరు ఇక్కడికి రావడానికి కారణమేంటి?' అని అడిగింది. 'మా అడవిలో మంటలు వ్యాపించాయి. అక్కడ ఉండలేక ప్రాణాలు కాపాడుకోవడానికి ఇక్కడికి వచ్చాం' అన్నాయా జంతువులు. 'ఎలాంటి భయం లేకుండా మీరు ఇక్కడే ఉండొచ్చు' అని వాటికి ధైర్యం చెప్పింది మృగరాజు. అది విన్న కోతి.. 'రాజంటే ముందున్న పరిస్థితినే కాదు.. దాని వెనక కారణాన్ని కూడా అంచనా వేయగలగాలి. ఎలాంటి కంగారు లేకుండా నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే అందరికీ సరైన న్యాయం జరుగుతుంది. నేను ఒక్క రోజు కూడా రాజుగా ఉండటానికి పనికిరాను' అనుకుంది కోతి.



– గుడిపూడి రాధికారాణి

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'జాడ'లో ఉంటాను కానీ 'జడ'లో లేను. 'మనం'లో ఉంటాను కానీ 'వనం'లో లేను. 'చెల్లి'లో ఉంటాను కానీ 'తల్లి'లో లేను. 'గట్టు'లో ఉంటాను కానీ 'గచ్చు'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'గాలి'లో ఉంటాను కానీ 'వాలి'లో లేను. 'రాజు'లో ఉంటాను కానీ 'రాయి'లో లేను. 'వేలు'లో ఉంటాను కానీ 'వేళ'లో లేను. నేనెవర్ని?


Reliance
Growth is Life
Jio Mart
రెండిటినీ పొదుపు చేస్తుంది
సమయం మరియు డబ్బు
Quick ఫ్రీ హోమ్ డెలివరీ
ప్రైస్ గ్యారంటీ
జీరో ఎక్స్‌ట్రా ఛార్జెస్
Quick
Scheduled
Biscuits, Drink & Packaged Foods
Ice Cream & Frozen
Chips & Namkeens
Biscuits & Cookies
Indian Sweets
Drinks & Juices
Breakfast Cereals
Noodles, Pasta &...
ఫ్లాట్ ₹ 100 తగ్గింపు*
మీ మొదటి Quick కిరాణా సరుకుల ఆర్డర్ పై
* ₹399 కనీస షాపింగ్ పై.
కూపన్ కోడ్ వాడండి
JMNEW100
డౌన్‌లోడ్ చేయడానికి స్కాన్ చేయండి
*T&C Apply
ఉల్లిపాయలు 5 kg ప్యాక్
మార్కెట్ ధర ₹ 27 /kg
జియోమార్ట్ ధర ₹ 22/kg
బంగినపల్లి మామిడి 1 kg
మార్కెట్ ధర ₹ 89
జియోమార్ట్ ధర ₹ 69
మ్యాంగో మల్లికా 1 kg
మార్కెట్ ధర ₹ 149
జియోమార్ట్ ధర ₹ 99
క్వాలిటీ వాల్స్ పార్టీ ప్యాక్స్ / టబ్స్ 700 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 140 మొదలుకుని
జియోమార్ట్ ధర ₹ 70 మొదలుకుని
ఫ్లాట్ 50% తగ్గింపు
బింగో! / ప్రింగల్స్ చిప్స్ 75 g (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 20 మొదలుకుని
ఫ్లాట్ 40% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 12 మొదలుకుని
కోల్డ్ డ్రింక్స్ 750 ml / జ్యూసులు 600 ml (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 40 మొదలుకుని
ఫ్లాట్ 25% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 30 మొదలుకుని
ఫ్రీడమ్ / గోల్డ్ విన్నర్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 L
ఎమ్ఆర్‌పి ₹ 164
జియోమార్ట్ ధర ₹ 145/ ₹ 148
ఆదా చేసుకోండి ₹ 19 / ₹ 16
మెక్కేన్ ఫ్రెంచ్ ఫ్రైస్ 420 g
ఎమ్ఆర్‌పి ₹ 125
జియోమార్ట్ ధర ₹ 49
ఆదా చేసుకోండి ₹ 76
ట్రెసెమె / హిమాలయ / డవ్ షాంపు 340 ml (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 310 మొదలుకుని
ఫ్లాట్ 33% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 207 మొదలుకుని
టైడ్ 6 kg + 2 kg / సర్ఫ్ ఎక్సెల్ డిటర్జెంట్ పౌడర్ 7 kg / ఏరియల్ / సర్ఫ్ ఎక్సెల్ మ్యాటిక్ లిక్విడ్ 4 L / కంఫర్ట్ ఫ్యాబ్రిక్ కండిషనర్ 2 L (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹ 550 మొదలుకుని
ఫ్లాట్ 40% తగ్గింపు
జియోమార్ట్ ధర ₹ 330 మొదలుకుని
నియమ నిబంధనలు వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. అఫర్లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫ్‌లు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. ఉత్పాదనలన్నిటి యొక్కఎమ్ఆర్‌పి అన్నీ పన్నులతో కూడి ఉంటుంది. డిస్కౌంట్ పర్సెంటేజ్‌ను అఫర్ ధర యొక్కసమీప పర్సెంటేజ్‌కు రౌండ్ ఆఫ్ చేయబడింది. ఇతర ఆఫర్లన్నీ 25 మే 2025 వరకు చెల్లుతాయి, ఎంపిక పిన్ కోడ్ లో. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టులో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం చంద్రబాబు.. చిత్రంలో ఎంపీ కలిశెట్టి



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు.. చిత్రంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్

లేపాక్షి-ఓర్వకల్లు మధ్య యాపిల్ ఎలక్ట్రానిక్ సిటీ

మూడు నెలల్లో పనులు ప్రారంభం: సీఎం చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక నడవాలో ఉన్న లేపాక్షి-ఓర్వకల్లు మధ్యలో ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ యాపిల్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ సిటీ రానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. రాష్ట్ర అంశాలపై శుక్రవారం దిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో పాటు, యాపిల్ సంస్థ ఎండీ, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థల యజమానులతో చర్చించిన తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ ఆయన ఈ విషయం వెల్లడించారు. "ఈ రోజు యాపిల్ ఎండీతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తి సంస్థల యజమానులతో సమావేశం అయ్యాను. బెంగళూరు-హైదరాబాద్ కారిడార్‌లో లేపాక్షి-ఓర్వకల్లు మధ్యలో ఎలక్ట్రానిక్ సిటీ నిర్మించడానికి వాళ్లు సిద్ధంగా ఉన్నారు. దీనిపై ఎంఓయూ చేసుకుంటాం. మూడు నెలల్లో ఈ సిటీ నిర్మాణ పనులు ప్రారంభించాలని చెప్పాం. భూకేటాయింపులు ఖరారు చేసి ముందడుగు వేస్తాం. ఎలక్ట్రానిక్ సిటీ కన్సార్టియంలో యాపిల్‌తో పాటు ఉత్పత్తిదారులంతా ఉంటారు. ఈ సిటీకి మౌలిక వసతులు కల్పించే బాధ్యత ప్రభుత్వానిది. ఉద్యోగాల కల్పన, అభివృద్ధి బాధ్యత ఆ సంస్థలది. లేపాక్షి-ఓర్వకల్లు మధ్యలో విస్తృతస్థాయిలో పరిశ్రమలు వస్తాయి. సమీపంలో బెంగళూరు, పుట్టపర్తి, ఓర్వకల్లు, హైదరాబాద్ విమానాశ్రయాలు, మరోవైపు కృష్ణపట్నం పోర్టు ఉండటం దీనికి సానుకూలం. వీటి మధ్యలో మరో విమానాశ్రయం వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఇక్కడ రక్షణరంగ సంస్థలు చాలా వస్తాయి. ఓర్వకల్లులో సైన్యంతో పాటు వాణిజ్య అవసరాలకు తగ్గ డ్రోన్లు తయారు చేస్తాం. దీన్ని దేశానికి ఒక హబ్‌గా సిద్ధం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ మంత్రులతో జరిగిన సమావేశాల వివరాలను వెల్లడించారు. "రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రాష్ట్రానికి సంబంధించిన వివిధ డిమాండ్లు విన్నవించాను. అవి..

■ జగ్గయ్యపేట-దొనకొండ క్లస్టర్లలో అందుబాటులో ఉన్న 6వేల ఎకరాల్లో క్షిపణులు, ఆయుధ సామగ్రి ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుచేయాలి.

■ లేపాక్షి-మడకశిర మధ్య అందుబాటులో ఉన్న 10వేల ఎకరాల్లో సైనిక, పౌరవిమానాల తయారీ, రక్షణరంగ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, ఏరోస్పేస్ ఎకోసిస్టం ఏర్పాటుచేయాలి.

■ విశాఖపట్నం-అనకాపల్లి క్లస్టర్‌లో నౌకారంగానికి అవసరమైన పరికరాల ఉత్పత్తి, ఆయుధాల పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయాలి.

■ కర్నూలు-ఓర్వకల్లు మధ్య 4వేల ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నందున అక్కడ సైనిక డ్రోన్లు, రోబోటిక్స్, ఆధునిక రక్షణ పరికరాల తయారీ కేంద్రం ఏర్పాటుచేయాలి.

■ కేంద్ర ప్రభుత్వ రంగంలోని రక్షణ పరిశ్రమల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో వాటి క్లస్టర్లు ఏర్పాటుచేయాలి.

■ అనంతపురం జిల్లా పాలసముద్రంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌ను వేగంగా పూర్తిచేయాలి.

■ మిధాని-నాల్కో ఆధ్వర్యంలో నెల్లూరులో 60 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో అల్యూమినియం ఉత్పత్తి ప్లాంట్‌ను త్వరగా ప్రారంభించాలి.

■ ఏపీలో ఆర్మీ కంటోన్మెంట్ ఏర్పాటుచేయాలి. దక్షిణాదిలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో ఉన్నా ఏపీలో లేదు. అందువల్ల కంటోన్మెంట్ ఏర్పాటుచేయాలి.

■ కొత్తగా సైనిక్ స్కూళ్లు ఇవ్వాలి.

■ తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీఓ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుచేయాలి.

రాజీ పడకుండా పోలవరం పనులు

జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు పోలవరం పనుల పురోగతి గురించి చెప్పాను. 2027 మార్చి నాటికి పనులు పూర్తిచేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపాను. నిర్మాణ వేగంలో గానీ, నాణ్యతలో గానీ రాజీపడకుండా పనులు చేపడుతున్నట్లు చెప్పాను. అంతర్జాతీయ నిపుణుల ఆధ్వర్యంలో పనులు సాగిస్తున్నట్లు వెల్లడించాను. తెలుగుజాతికి వరమైన ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం ధ్వంసం చేసింది. రూ.400 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్ గత ప్రభుత్వ చేతకానితనం వల్ల కుంగిపోవడంతో ఇప్పుడు రూ.900 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మించాల్సి వస్తోంది. మేం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కొనసాగించి 2027 మార్చికల్లా జాతికి అంకితం చేస్తాం. షెడ్యూల్ కంటే ముందుగానే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలన్నది మా లక్ష్యం. విభజన చట్టం ప్రకారం పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేస్తాం. అందుకు అవసరమైన సహాయ, పునరావాస పనులకు కేంద్రం నిధులు ఇస్తుంది.

■ ఆంధ్రప్రదేశ్‌ను కరవురహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం-బనకచర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో హామ్ విధానంలో చేపడదామని కేంద్ర జలశక్తి, ఆర్థిక మంత్రులకు చెప్పాను. రూ.80 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి బనకచర్లకు 200 టీఎంసీల నీళ్లు మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనివల్ల రాయలసీమ, దక్షిణాంధ్రకు నీరు ఇవ్వడానికి వీలవుతుంది. ఇది ఎవ్వరికీ వ్యతిరేకం కాదు. మిగులు నీటిని మాత్రమే వాడుకుంటాం. ఇందులో జలవివాదాలు లేవు కాబట్టి వేరే రాష్ట్రానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. సముద్రంలో పోయే నీటిని వాడుకోబోతున్నాం. దీనికి కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. గోదావరిలో గత వందేళ్లలో సగటున ఏటా 2వేల టీఎంసీలు సముద్రంలోకి పోతోంది. అందులో 200 టీఎంసీలు తీసుకుంటాం. అందరితో మాట్లాడి ఈ నీటిని వాడుకుంటాం. దీనిపై అందరితో మాట్లాడతానని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారు.

■ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల గురించి చెప్పాను. దీన్నుంచి బయటపడటానికి కొంత సమయం పడుతుంది కాబట్టి ఆదుకోవాలని కోరాను. పూర్వోదయ పథకం కింద నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాను. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరాను. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఆర్థిక స్వరూపం గురించి వివరించి కేంద్రం నుంచి సాయం అందించాలని విజ్ఞప్తి చేశాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు.



కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌కు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహుకరిస్తున్న సీఎం చంద్రబాబు

72 గిగావాట్ల హరిత ఇంధనం..

పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి.. రాష్ట్రంలో 72 గిగావాట్ల హరిత ఇంధనం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయాన్ని చెప్పాను. ఈ విద్యుత్తు సరఫరా కోసం రూ.28,346 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటుచేయాలని కోరగా ఆయన అంగీకరించారు. సోలార్ రూఫ్‌టాప్ పథకం కింద 35 లక్షల కుటుంబాలకు సౌర విద్యుత్తు యూనిట్లు ఇవ్వాలనుకుంటున్నాం. దీనికి అనుమతులు రాగానే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10వేల సూర్యఘర్ యూనిట్లు ఇస్తాం. ఇందులో ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచిత సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటుచేస్తాం. బీసీలకు కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రూ.20వేలు సమకూరుస్తాం. మరోవైపు పీఎం కుసుమ్ కింద ఫీడర్ స్థాయిలో 2వేల మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి అనుమతి ఇచ్చారు. దీంతో ఏపీ గ్రీన్‌ఎనర్జీ హబ్‌గా తయారవుతుంది.

స్పేస్ సిటీకి చేయూతనివ్వండి

కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్‌ను కలిసి శ్రీహరికోట వద్ద స్పేస్‌సిటీ ఏర్పాటుకు చేయూతనివ్వాలని కోరాను. శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం సమీపంలోనే 2వేల ఎకరాల్లో క్లస్టర్ ఏర్పాటు చేసి ప్రైవేటు ఉపగ్రహాల తయారీ, ప్రయోగ కేంద్రాన్ని నిర్మిస్తాం. తిరుపతి ఐఐటీ, ఐఐఎస్ఈఆర్‌లో విజ్ఞానధార పథకం కింద సాఫిస్టికేటెడ్ ఎనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్ ఫెసిలిటీ, నేషనల్ సూపర్ కంప్యూటర్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరాను. విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో బయోరిడ్జ్ స్కీం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో సీఎస్ఐఆర్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని కోరాను. ఈ ల్యాబ్‌లు లేని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పినపుడు ఆయన వెంటనే మంజూరుచేస్తామని చెప్పారు.

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు చంద్రబాబు అభినందనలు



ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసినప్పుడు ఆపరేషన్ సిందూర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి ఆయనకు అభినందనలు తెలిపారు. "ఆపరేషన్ సిందూర్ అద్భుతంగా నిర్వహించారు. అందుకే రాష్ట్రప్రజల తరఫున ఆయనకు అభినందనలు తెలిపాను. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మార్గదర్శకత్వంలో రక్షణశాఖ కీలక భూమిక పోషించింది. అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని ఎవ్వరూ సమర్థించడానికి వీల్లేదు. హింస ఏ రూపంలో ఉన్నా దేశం దాన్ని సహించకూడదు. ఈ దేశంలో ఉన్నవారికెవరికైనా దేశమే ముఖ్యం. ఇక్కడ కూర్చొని ఇతర దేశాలను పొగడకూడదు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఉంటుందన్నది నిజమే. అలాగని ఇక్కడ కూర్చొని పాకిస్థాన్ కోసం పనిచేస్తారా? దేశానికి నష్టం చేకూర్చడానికి ప్రజాస్వామ్యం ఎవ్వరికీ స్వేచ్ఛనివ్వదు. ప్రతి ఒక్కరికీ పరిమితులు ఉంటాయి. కళ్ల ముందే కుటుంబసభ్యులను చంపేసిన ఉగ్రవాదులకు మద్దతు పలికే అధికారం ఎవ్వరికీ ఉండదు. దేశాన్ని రక్షించడానికే మనం రక్షణ రంగం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నాం" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం గురించి విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ఆయన నిరాకరించారు. దర్యాప్తు జరుగుతున్న సమయంలో దానిపై తాను మాట్లాడనన్నారు. అన్నీ దర్యాప్తులో తేలుతాయన్నారు.

ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ స్కీంను ప్రారంభించండి

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను శుక్రవారం రాత్రి ఇక్కడి తన అధికార నివాసంలో కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు... రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ స్కీంను ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ అమలుచేయడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచ ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా మార్చడంలో కేంద్రంతో కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి వివరించారు.

తిరుమలలోని పరిస్థితులపై కేంద్రమంత్రి ఆనందం



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలను మెరుగుపరచడం పట్ల కేంద్ర పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన్ను కలిసి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించినప్పుడు ఆయన తిరుమలలోని పరిస్థితులను గుర్తుచేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. గతంలో కూడా తాను వెళ్లానని, ఇప్పుడు పరిస్థితులు బాగా మెరుగుపడ్డాయని, అన్నప్రసాదం కూడా బాగుందని ప్రశంసించారు. అక్కడ ప్రస్తుతం వ్యవస్థలు బాగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

కుట్రకు కర్త, కర్మ, క్రియ మిథున్‌రెడ్డే

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడిగా (ఏ4) చేర్చింది. ఇప్పటి వరకూ అరెస్టైన నిందితుల రిమాండు రిపోర్టుల్లోనూ, మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలంటూ సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్‌లోనూ ఈ విషయాలన్నీ సిట్ స్పష్టంగా వెల్లడించింది.

మిథున్‌రెడ్డి పాత్రపై సిట్ తేల్చిందిదీ

అంచె: 1 దోపిడీకి వీలుగా విధాన రూపకల్పన..

దోపిడీకి వీలుగా నూతన మద్యం విధానానికి రూపకల్పనలో మిథున్‌రెడ్డిదే ప్రధాన పాత్ర. ఈ కుట్ర అమలు కోసం తమ ముఠాకు అనుకూలంగా ఉండే ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా, డిస్టిలరీస్, బ్రూవరీస్ కమిషనర్‌గా నియమింపజేయడంలో ఆయనే కీలకం.

■ ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసే డి.సత్యప్రసాద్‌ను.. మిథున్‌రెడ్డి తిరుపతిలోని తన నివాసానికి పిలిపించుకున్నారు. తాము చెప్పినట్లుగా చేస్తే కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి ఇప్పిస్తానని ప్రలోభపెట్టారు. ఆయన్ను పావుగా వాడుకుని దోపిడీ సాగించారు.

అంచె: 2 ముడుపుల వసూళ్ల ముందుగానే అంచనా

మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో అంతకు ముందు సంవత్సరాల్లో జరిగిన మద్యం విక్రయాల వివరాలతో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లు హైదరాబాద్‌లోని విజయసాయిరెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ మిథున్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, ఆయన తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలతో 2019 అక్టోబరు 13న భేటీ అయ్యారు. ముడుపులివ్వటానికి అంగీకరించని కంపెనీలతో ఎలా వ్యవహరించాలి? వాటి స్థానంలో ఏ కంపెనీలను ప్రోత్సహించాలనే దానిపై వారంతా చర్చించుకున్నారు. నెలకు రూ.50-60 కోట్ల మేర ముడుపులు తీసుకోవచ్చని మిథున్‌రెడ్డి, కెసిరెడ్డి నాయకత్వంలోనే నిర్ణయించారు.

■ 2019 డిసెంబరులో మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లు రాజ్ కెసిరెడ్డిని కలిశారు. తాము చెప్పిన కంపెనీలకు మాత్రమే సరఫరా ఆర్డర్లు ఇవ్వాలని, తమకు తెలియకుండా ఏ సరఫరాదారునూ ప్రోత్సహించొద్దని రాజ్ నిర్దేశించారు. బ్రాండ్ల మూల ధర ఆధారంగా కేసుకు రూ.150 నుంచి రూ.600 వరకు ముడుపులు వసూలు చేయొచ్చని అప్పుడే నిర్ణయించారు.

అంచె: 3 ముడుపులిచ్చే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చేలా..

మద్యం సరఫరా ఆర్డర్ల జారీలో పారదర్శకత కోసం ఆటోమేటెడ్ విధానం అమల్లో ఉండేది. మిథున్‌రెడ్డి ఆదేశాలతోనే దాన్ని రద్దు చేయించి, తమ దోపిడీకి వీలుగా మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చారు. అప్పటి నుంచి సత్యప్రసాద్ మద్యం డిపో మేనేజర్లతో ఎప్పటికప్పుడు వాట్సప్ కాల్స్‌లో మాట్లాడుతూ.. ముడుపులిచ్చే కంపెనీల బ్రాండ్లకే ఎక్కువగా ఆర్డర్లు దక్కేలా ఇండెంట్లు పెట్టించేవారు. రాజ్ కెసిరెడ్డి నుంచి వచ్చిన ఇండెంట్ ప్రణాళిక ఆధారంగా ఈ ఆర్డర్లిచ్చేవారు. ఆ ఆర్డర్లు దక్కించుకున్న డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రాజ్ కెసిరెడ్డి బృందం ఐదురోజులకోసారి ముడుపులు వసూలు చేసేది.

అంచె: 4 ముడుపుల సొమ్ము 'బిగ్‌బాస్'కు చేర్చడంలో

తమ ప్రణాళిక మేరకు ముడుపులు వసూలవుతున్నాయా? లేదా? తదనుగుణంగానే ఇండెంట్లు పెడుతున్నారా? లేదా? అనేది పర్యవేక్షించేందుకు మిథున్‌రెడ్డి తరచూ సమావేశాలు నిర్వహించేవారు. తన బృందం వసూలు చేసిన ముడుపులను రాజ్ కెసిరెడ్డి.. మిథున్‌రెడ్డితో పాటు నాటి ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితులైన మరికొందరికి చేర్చేవారు. దాన్ని మిథున్‌రెడ్డి బిగ్‌బాస్‌కు అందజేసేవారు. ఈ ముడుపుల్లో అత్యధిక శాతం బంగారం, నగదు రూపంలోనే తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ ముందస్తు బెయిల్‌కు నిరాకరణ

మద్యం కుంభకోణంలో తన ప్రమేయం, పేరు బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు. దీంతో కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన మిథున్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పటికీ ఆయన నిందితుల జాబితాలో లేరు. విచారణ కొనసాగుతున్నంత కాలం అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వటంతో అజ్ఞాతం వీడి బయటకొచ్చారు. తర్వాత సిట్ విచారణకు హాజరైనప్పటికీ దర్యాప్తు అధికారులకు సహకరించలేదు. వారి ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వలేదు. ఈ క్రమంలోనే సిట్ మిథున్‌రెడ్డిని నాలుగో నిందితుడు (ఏ4)గా చేర్చింది. వీటన్నింటిపై విచారించిన సుప్రీంకోర్టు.. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను పునఃపరిశీలన నిమిత్తం ఏపీ హైకోర్టుకు పంపించింది. హైకోర్టులో పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకూ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయబోమంటూ సిట్ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు.

అంచె: 5 ముడుపుల సొమ్ము తొలుత పీఎల్ఆర్ గ్రూపులోకి..

నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ (డిస్టిలరీ) వ్యాపార పునరుద్ధరణ, అభివృద్ధి కోసం అరబిందో గ్రూప్ ద్వారా నాటి ముఖ్యమంత్రి జగన్ రూ.45 కోట్లు రుణమిప్పించారు. ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు ఈ మద్యం ముఠాలో భాగస్వాములైన వారందరికీ నగదు రూపంలో ముడుపులు చెల్లించాలనేది దీని వెనుక ఉన్న ఒప్పందం.

■ అరబిందో గ్రూప్ ట్రైడెంట్ కెమ్‌ఫర్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ.35 కోట్లు, శ్రేయస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నుంచి రూ.10 కోట్లను సన్‌హాక్ ల్యాబ్స్ లిమిటెడ్ ఖాతాల్లోకి పంపింది. సన్‌హాక్ నుంచి ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ నేరుగా రూ.15 కోట్ల రుణమే అందింది. మరో రూ.22 కోట్లు డీకార్ట్ లాజిస్టిక్స్ కంపెనీ ద్వారా చెల్లించింది. మరో రూ.8 కోట్లు ఎస్పీవైకి అందాల్సి ఉండగా.. అందులో రూ.5 కోట్లను ఎంపీ మిథున్‌రెడ్డి ముడుపుల్లో తన వాటాగా తీసుకున్నారు.

■ డీకార్ట్ లాజిస్టిక్స్ నుంచి మిథున్‌రెడ్డి కుటుంబీకులు డైరెక్టర్లుగా ఉన్న పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాల్లో ఈ సొమ్ము జమ చేయించుకున్నారు. మద్యం ముడుపులపై అప్పట్లో రచ్చ జరగటంతో.. మనీ ట్రయల్‌కు ఆధారాలు, ఆనవాళ్లేవీ లేకుండా చేసేందుకు మిథున్‌రెడ్డి ఆ 5 కోట్లను తిరిగి హుడ్‌వింక్ అనే సంస్థ ఖాతాకు బదిలీ చేయించేశారు. తర్వాత ఆ మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నారు.

అంచె: 6 దోపిడీకి మార్గాలు

రాజ్ కెసిరెడ్డితో కలిసి ఎస్పీవై డిస్టిలరీస్ సహా మరికొన్నింటినీ మిథున్‌రెడ్డి తన గుప్పిట్లో పెట్టుకున్నారు. అక్కడ సొంత బ్రాండ్ల మద్యాన్ని తయారు చేసి వాటిని ఏపీఎస్‌బీసీఎల్‌తో కొనుగోలు చేయించారు. వాటికి మూల ధరలు విపరీతంగా పెంచుకుని భారీగా దోచుకున్నారు' అని సిట్ దర్యాప్తులో తేలింది.

అమరావతిని రాజధానిగా నోటిపై చేయండి

(మొదటి పేజీ తరువాయి)

వస్తోంది. ఇవన్నీ మరిచిపోయి మూర్ఖంగా మాట్లాడే వ్యక్తులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజధానికి భూములు త్యాగం చేసేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోరని భరోసా ఇచ్చాం. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి అని అలాగే ఉంచుకుంటే మీరు అక్కడే ఉంటారు, రాజధానికి ఇస్తే చరిత్ర తిరగరాస్తారు, మీ జీవితాలు కూడా మెరుగుపడతాయని చెప్పడంతో ఇచ్చారు. అమరావతి శక్తి చాలా బలమైంది' అని చంద్రబాబు అన్నారు.

బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు రావాలి: 'మేం బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు అమరావతికి రావాలని కోరుకుంటున్నాం. దానికి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు పెట్టదు. ఇన్వెస్టర్లే కడతారు. దాని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అమరావతికి అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. విశాఖను అత్యుత్తమ నగరంగా మార్చడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నాం. దాన్ని ఆర్థిక, విజ్ఞాన నగరంగా అభివృద్ధి చేస్తాం' అని సీఎం ప్రకటించారు.

సంపద సృష్టించేది ప్రభుత్వ విధానాలే: దేశంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కావాల్సింది మంచి ప్రభుత్వ విధానాలే తప్పితే డబ్బు కాదని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఆర్థిక సంస్కరణల తర్వాత గ్రోత్ రేట్ అసాధారణంగా పెరిగింది. ప్రభుత్వ విధానం కింద ఐటీని ప్రోత్సహించడం వల్ల మనకు విస్తృత ప్రయోజనం దక్కింది. సాధారణంగా అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ వచ్చినప్పుడు కేంద్రం ఎంత డబ్బులు ఇస్తుంది? అని అందరూ అడుగుతుంటారు. ఇక్కడ సంపద సృష్టించడానికి సరైన ప్రభుత్వ విధానాలు కావాలి. 20 ఏళ్ల క్రితం మన ఎయిర్‌పోర్టులు ఎలా ఉండేవో తెలుసుకదా.. వాటికి భిన్నంగా మేం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. దాని గురించి ప్రతిపాదించినప్పుడు డబ్బులు ఎక్కడున్నాయని నాటి ప్రధానమంత్రి వాజపేయీ కూడా అడిగారు. అప్పుడు మేం డబ్బు అవసరం లేదు.. అడిగిన పాలసీ ఇవ్వండి అని కోరాం. మీకు ఆసక్తి ఉంటే అందులో కేంద్ర ప్రభుత్వం తరఫున వాటా పెట్టుకోండి, లేకపోతే అదికూడా వద్దని చెప్పాం. ప్రభుత్వ వాటా ఉంటే అక్కడ జరిగే వాణిజ్యంలో మీకూ ఆదాయం వస్తుందని తెలిపాం. ఆ ఎయిర్‌పోర్టును సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో 32 సమావేశాలు నిర్వహించాం. అప్పట్లో పౌర విమానయాన శాఖ మంత్రి కూడా ఆ విధానానికి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడారు. అయినా పోరాడటంతో చివరగా ప్రధాని వాజపేయీ ఆమోదించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు తెలంగాణ వృద్ధి రేటులో 17% వాటా సమకూరుస్తోంది. ఆ తర్వాతే బెంగళూరు, దిల్లీకి కొత్త ఎయిర్‌పోర్టులు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు బెంగళూరు ఎయిర్‌పోర్టు టెర్మినల్-2 ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా మారింది. అందులో ప్రభుత్వమేమీ డబ్బులు పెట్టలేదు. కానీ దాని ద్వారా ప్రభుత్వానికే ఆదాయం వస్తోంది. ఆ ఎయిర్‌పోర్టు టెర్మినల్-2 ఇప్పుడు అనుభవ కేంద్రంగా మారింది. అందువల్ల సంపద సృష్టికి ప్రభుత్వ విధానాలే అత్యంత ముఖ్యం. అమరావతినీ ఇదే విధానంలో తీసుకొచ్చాం. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు చేయలేదు' అని పేర్కొన్నారు.

ఆర్‌డీటీకి విదేశీ నిధుల సమస్యపై చర్చించా: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో శాంతిభద్రతలు, నేర నివారణలో టెక్నాలజీ వినియోగం, కొత్త నేర న్యాయ చట్టాలపై సమీక్ష జరిగిందని చంద్రబాబు వివరించారు. ఇప్పటివరకు 24 రాష్ట్రాలపై ఆయన సమీక్షించారని, అందులో భాగంగానే ఏపీలోని పరిస్థితులపై చర్చించారని తెలిపారు. రాయలసీమలోని ప్రముఖ సేవా సంస్థ ఆర్‌డీటీకి విదేశీ నిధులు ఆగిపోయిన విషయం గురించి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పేదలకు విశేష సేవలందిస్తున్న ఆ సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ లేఖ అందించానని, దాన్ని పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

సామాజిక మాధ్యమాల్లో రెచ్చిపోతే.. బెయిల్ కూడా రాదనే భయం ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు న్యాయవాది దవే 2021 నాటి పోస్ట్‌పై 2024లో చర్యలు తీసుకోవడం రాజకీయం అని పేర్కొనగా న్యాయమూర్తులు ఆ అభిప్రాయంతో విభేదించారు. 'ఇక్కడ రాజకీయాలను పక్కన పెట్టండి' అని జస్టిస్ పంకజ్ మిత్తల్ పేర్కొన్నారు. జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి స్పందిస్తూ 'మేం ఇక్కడ రాజకీయాలను పక్కన పెడుతున్నాం. ఇలాంటివి ఎవరు చేసినా ఒక్కటే అని ఇదివరకు నేను చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసుకోండి. ఎవరు ఏం చేస్తే సిస్టం వారికి అదే ఇస్తుంది. మీకు రెండు వారాల సమయం సరిపోతుంది. అంతే' అని విచారణ ముగించారు.

రాజ్ కెసిరెడ్డి అరెస్ట్ సక్రమమే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి అరెస్ట్ విధానాన్ని సవాల్ చేస్తూ ఆయన తండ్రి ఉపేంద్రరెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతోపాటు హైదరాబాద్‌లో నివసిస్తున్న తనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద నోటీసులిచ్చే అధికారం ఏపీ సీఐడీకి లేదంటూ ఆ నోటీసులను సవాల్ చేస్తూ రాజ్ కెసిరెడ్డి వేసిన మరో పిటిషన్‌పైనా జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. దానిపై శుక్రవారం తీర్పు వెలువరించింది. ఉపేంద్రరెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసిన నేపథ్యంలో రాజ్ కెసిరెడ్డి పిటిషన్ కేవలం అకడమిక్ తప్పితే ఇంకేమీ లేదన్న ఉద్దేశంతో దానిపై విచారణ ముగిస్తున్నట్లు వెల్లడించింది.

'నా కుమారుణ్ని అరెస్ట్ చేసిన సమయంలో కారణాలను పూర్తిగా వివరించలేదు. హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినప్పుడు సెక్షన్ 409, 420 కింద మాత్రమే అరెస్ట్ చేసినట్లు చెప్పారు. విజయవాడ తీసుకెళ్లిన తర్వాత అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు చేర్చారు. ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చలేదు. నోటీసులు జారీ చేసి, విచారణకు రమ్మని పిలిచారు. విచారణ కోసం విజయవాడకు వెళ్తుండగా హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి, ఆ తర్వాతే నిందితుడిగా చేర్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 47 ప్రకారం వారంట్ లేకుండా అరెస్ట్ చేస్తే అందుకు సంబంధించిన వివరాలు పూర్తిగా ఇవ్వాలి. కానీ నా కుమారుడికి అవినీతి నిరోధక చట్టం కింద నమోదు చేసిన నేరాల గురించి చెప్పలేదు. సెక్షన్ 17-ఎ, సెక్షన్ 19 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు అధీకృత వ్యవస్థ నుంచి అనుమతులు తీసుకోలేదు. అందువల్ల ఈ అరెస్ట్‌ను కొట్టేయాలి' అని ఉపేంద్రరెడ్డి చేసిన వాదనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

వారంట్ చదివితే నిబంధనలు పాటించినట్లే..

'ఒక వ్యక్తిని వారంట్ మీద అరెస్ట్ చేస్తే అందుకు కారణాలను వారంటే చెబుతుంది. అరెస్ట్ చేసినప్పుడు ఆ వ్యక్తి ముందు వారంట్ చదివి చెబితే నిబంధనలను పాటించినట్లే. వారంట్ లేకుండా అరెస్ట్ చేస్తే ఎందుకు అరెస్ట్ చేశారన్న వివరాలు చెప్పాలి. ఈ కేసులో అరెస్టుకు దారితీసిన పరిస్థితులను బట్టి చూస్తే దర్యాప్తు అధికారులు విహాన్‌కుమార్ కేసు తీర్పులోని అంశాలను పాటించినట్లు కనిపిస్తోంది. విహాన్‌కుమార్ కేసులో నిందితుడికి కారణాలను వివరించి అరెస్ట్ చేసినట్లు కేస్ డైరీలో రాసినా.. కారణాలను వివరించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. అరెస్టయిన వ్యక్తికి అందుకు కారణాలను పోలీసులు వివరించారు. అయితే సరైన కారణాలు చెప్పలేదు, అవసరమైన ముఖ్యసమాచారం అందించలేదని పేర్కొంటున్నా.. వాటిని పరిగణనలోకి తీసుకోవడం కష్టం. ఆర్టికల్ 22(1) ప్రకారం నేరానికి సంబంధించిన పూర్తి వివరాలను అరెస్టయిన వ్యక్తికి చెప్పాల్సిన అవసరం పోలీసులకు లేదు. ఎందుకు అరెస్ట్ చేస్తున్నారన్నది అర్థం చేసుకోవడానికి అవసరమైనంత సమాచారం మాత్రం ఇవ్వాలి. ఈ నేపథ్యంలో ఈ అప్పీల్‌లో మాకు ఎలాంటి మెరిట్స్ కనిపించలేదు. అందువల్ల డిస్మిస్ చేస్తున్నాం. జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బెయిల్ కోసం తగిన కోర్టు ముందు సాధారణ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే బెయిల్ దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే దానిపై త్వరగా విచారించి, చట్టప్రకారం నిర్ణయం వెలువరించవచ్చు' అని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం మే 24, 2025

తెలిసే మూగి.. తీరుగ మేసి!

ఈనాడు, అమరావతి



- అగ్రిగోల్డ్ భూములు 2,293 గజాలు కబ్జా
- సర్వే నంబర్లు మార్చేసి దర్జాగా అమ్మేసిన జోగి

"అంబాపురంలో ప్రభుత్వం జప్తు చేసిన అగ్రిగోల్డ్ భూములను కాజేసి విక్రయించిన కేసులో జోగి రమేష్ బాబాయి వెంకటేశ్వరరావు, కుమారుడు రాజీవ్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా ఏసీబీ, సీఐడీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు.. సర్వే చేపట్టగా వాస్తవాలు తేలాయి. అగ్రిగోల్డ్‌కు చెందిన సర్వే నంబరు 87లో భూమి అని తెలిసే.. పక్కనున్న సర్వే నంబరు 88గా చూపిస్తూ జోగి బాబాయి, కుమారుడి పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్టర్ చేయించుకున్నారు."

"సర్వే నంబరు 87లోని అగ్రిగోల్డ్‌కు చెందిన తొమ్మిది ప్లాట్లు, రహదారిని కలిపి ఆక్రమించి ప్రహరీ కట్టినట్టు తేల్చారు. ఈ స్థలం... 2,293 గజాలుగా తేలింది. దీనిని ఒక్కొక్కరికీ 208.05 గజాల మేర ఏడు ప్లాట్లుగా మార్చి.. అమ్మేశారని తేలింది. వైకాపా జమానాలో అధికారుల అండతో విచ్చలవిడిగా జోగి సాగించిన అక్రమాలకు ప్రత్యక్ష నిదర్శనమిది."

అంబాపురంలో అవ్వా వెంకటశేషు నారాయణరావు భూములను ప్రభుత్వం 2019లోనే జప్తు చేసింది. ఆర్ఎస్ఆర్ నెంబర్ 87లో నిషేధిత జాబితాలోని భూములను తొలుత 88లో ఉన్నట్లు చూపిస్తూ.., వాటిని వేరొకరి నుంచి జోగి రాజీవ్, వెంకటేశ్వరరావు కొన్నట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాము డాక్యుమెంట్లలో నకిలీ ఆర్ఎస్ నంబరు వేసినా.. అవి నిషేధిత అగ్రిగోల్డ్ భూములని జోగి కుటుంబానికి తెలుసు. అందుకే.. వాటిని తిరిగి అమ్మేటప్పుడు 87గానే చూపిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చుకున్నారు. అన్ని లింకు డాక్యుమెంట్లలో సర్వేనంబరు 88 ఉండగా, దానిని 87గా మార్చేశారు. దీనికి. . అప్పటి తహసీల్దారు, అధికారులు కొమ్ముకాసి.. రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో ఆ స్థలంలో దర్జాగా ప్రహరీ కట్టి మరీ.. ఏడు ప్లాట్లుగా చేసి అమ్మేసి రూ. 10 కోట్లుపైగా సొమ్ము చేసుకున్నారు.

కొనుగోలు చేసింది వీరే..

అగ్రిగోల్డ్ భూమిని ఒక్కోటి 208.5 గజాల చొప్పున విభజించి.. 2023 మే 31న ఏడు ప్లాట్లుగా విక్రయించేశారు. పడిగపాటి దుర్గాప్రసాద్‌రెడ్డికి రెండు ప్లాట్లు (దస్తావేజు నంబరు. 3700, 3701), పడిగపాటి బాలమ్మకి రెండు ప్లాట్లు (3698, 3999), సోముల దుర్గా భవానీ (3701), సోముల వెంకటేశ్వరరెడ్డి (3703), పడిగపాటి సుబ్బారెడ్డి(3696)కి ఒక్కోటి చొప్పున 208.5 గజాల ప్లాట్లను విక్రయించారు. తాజా సర్వేలో.. అందరికీ కలిపి 2,293 గజాలుగా గుర్తించారు. ఈ స్థలాలన్నీ అగ్రిగోల్డ్ నిషేధిత జాబితాలోని అవ్వా వెంకటశేషు నారాయణరావు, అతని కుటుంబ సభ్యుల తొమ్మిది ప్లాట్లుగా గుర్తించారు.

★ వీరి నుంచి స్థలాలను కొన్న వారంతా వైకాపా కార్పొరేటర్ చైతన్యరెడ్డి బంధువులే. తాజాగా స్థలాల కొలతలు తీస్తుండగా.. కొన్నోళ్లు డాక్యుమెంట్లను తెచ్చి అధికారులకు చూపారు.



అంబాపురంలో తాజాగా స్థలాలను సర్వే చేస్తున్న అధికార యంత్రాంగం

అంతా పక్కా ప్రణాళికతో..

★ ఈ భూముల్లో జోగి వెంకటేశ్వరరావు 1086 గజాలను 2022 సెప్టెంబరు 09న ఆర్ఎస్ నం.88లో కొన్నట్లు దస్తావేజు నంబరు 7592లో చూపారు. తర్వాత దానిని 2023 ఏప్రిల్ 29న స్వీయ సవరణ దస్తావేజు నం.2676 ద్వారా సర్వే నం.87లోకి మార్చేశారు.

★ జోగి రాజీవ్ పేరుతో 1074 గజాలను 2022 డిసెంబరు 09న ఆర్ఎస్ నం.88లో కొన్నట్లు దస్తావేజు 7589లో చూపారు. దీనిని మళ్లీ స్వీయ సవరణతో దస్తావేజు నెం. 2674, 2675, 2673లో 2023 ఏప్రిల్ 29న సర్వే నంబరు 87లోకి మార్చారని నిగ్గు తేల్చారు.

జీజీహెచ్‌లో కొవిడ్ ప్రత్యేక వార్డు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: కొవిడ్ కేసులు పెరిగితే తక్షణ చికిత్స అందించేందుకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో కొవిడ్ ఐసోలేషన్ వార్డును సిద్ధం చేస్తున్నారు. మొత్తం పది పడకలు, ఒక ప్రత్యేక నోడల్ అధికారి, అధునాతన వైద్య పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేశారు.

అమ్మ భక్తులకు కొండంత అండ



శాశ్వత క్యూ కాంప్లెక్సు పనులు వేగవంతం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



కనకదుర్గానగర్‌లో నిర్మిస్తున్న పిల్లర్లు

దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో రూ. 13 కోట్ల వ్యయంతో శాశ్వత క్యూలైను కాంప్లెక్సు నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. గత ఏడాది శాశ్వత క్యూలైన్ల నిర్మాణం నిమిత్తం ఈ ప్రాంతంలో ఉన్న దుకాణాలను గోశాల వైపునకు తరలించారు. ఈ క్రమంలో కనకదుర్గానగర్ నుంచి క్యూ లైను మల్లికార్జున మహా మండపం ఎన్నో అంతస్తుకు కలపాలి అన్న విషయంపై ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఇంజినీరింగ్ నిపుణులతో పలు దఫాలుగా చర్చించారు.

✦✦ గతంలో రూ.6 కోట్లతో నిర్మించిన రాతి మండపాన్ని వైకాపా ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముందస్తు ఆలోచన లేకుండా తొలగించి క్యూలైను కాంప్లెక్సు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మల్లికార్జున మహామండపం నాల్గో అంతస్తుకు క్యూలైన్లు కలపాలి అన్న ఆలోచనను ఇంజినీరింగ్ నిపుణులు వ్యతిరేకించడంతో గ్రౌండ్ ఫ్లోరుకు కలిపేందుకు నిర్ణయించారు.

✦✦ దసరా, భవానీ దీక్షల విరమణ సమయంలో భక్తులను ఈ క్యూలైన్లలో పైకి పంపేందుకు పోలీసు ఉన్నతాధికారులు అంగీకరించకపోవడంతో రూ. 13 కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం ఉండదన్న భావన దేవస్థానం అధికారుల్లో ఉంది. ఈ విషయంపై ఇంజినీరింగ్ నిపుణుల సహకారంతో శాశ్వత క్యూలైన్లు ఉత్సవాల సమయంలో వినియోగించేందుకు వీలుగా చేయాల్సిన మార్పులపై దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి కసరత్తు చేస్తున్నారు. దుర్గగుడి మాస్టరు ప్లాన్ కూడా ఆ దిశలో రూపొందిస్తున్నట్లు సమాచారం.

✦✦ దుర్గగుడి శాశ్వత క్యూలైన్ల కాంప్లెక్సు నిర్మాణంపై ఈఈ కోటేశ్వరరావును సంప్రదించగా గత ప్రభుత్వం చేపట్టిన క్యూలైన్ కాంప్లెక్సు నిర్మాణంపై దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో శీనానాయక్ పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నారన్నారు. దసరా, భవానీ దీక్షల విరమణ సమయంలో సైతం భక్తులను ఇటువైపు నుంచి అమ్మవారి దర్శనానికి పంపే విధంగా మాస్టరు ప్లానులో చర్చిస్తున్నారని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైను నిర్మాణం చేపట్టడంతోపాటు కనకదుర్గానగర్‌లో రూ.50 లక్షలతో తారురోడ్డు వేసేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు.

నిలకడగా కృష్ణా నది వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్: అకాల వర్షాల నేపథ్యంలో కృష్ణా నదిలో స్థానిక వరద కొనసాగుతోంది. శుక్రవారం నీటిమట్టం నిలకడగా ఉంది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద మూడు గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 2,175 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఎంబీబీఎస్ పార్ట్-1 ఫలితాల వెల్లడి

బీడీఎస్ 1, 2, 3 సంవత్సరాల ఫలితాలు విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎంబీబీఎస్ పార్ట్-1 తృతీయ సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ కరిక్యులమ్ మార్గ నిర్దేశకాల ఆధారంగా ఉత్తీర్ణత ఇచ్చామని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. బీడీఎస్ మొదటి, రెండు, తృతీయ సంవత్సరాల ఫలితాలను కూడా వెల్లడించారు. రీటోటలింగ్ కోరే అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.2000 ఈ నెల 31లోగా చెల్లిస్తే సంబంధిత కమిటీ పర్యవేక్షణలో జవాబు పత్రాల పరిశీలన చేయనున్నారు. ఫలితాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

యోగాంధ్రలో జిల్లాను మొదటి స్థానంలో నిలుపుదాం



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, డా.ఎం.సుహాసిని తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: యోగాంధ్రలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. యోగాంధ్ర మాసోత్సవాలను ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 21వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. జిల్లాలో దాదాపు పది లక్షల నుంచి 15 లక్షల మందికి యోగా నేర్పేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. దాదాపు 2500 మంది శిక్షకులు యోగా నేర్పిస్తారని చెప్పారు.

గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఏడుగురు అందుబాటులో ఉంటారని, ఒక్కో సెషన్‌కు 50 మందితో యోగాభ్యాసం చేయిస్తారని తెలిపారు.

థీమ్ ఆధారిత కార్యక్రమాలు.. నెల పాటు థీమ్ ఆధారిత యోగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మే 24న జర్నలిస్టులు, 25న జేఏసీ నేతలు, ప్రభుత్వ ఉద్యోగులు, 26న హోంగార్డులు, 27న వాకర్స్, 28న ఆటో, లారీడ్రైవర్లు, 29న క్రీడాకారులు, 30న కళాకారులు, 31న రైతులు, జూన్ 1న విద్యార్థులు, 2న పారిశుద్ధ్య కార్మికులు, 3న కార్మికులు, 4న మాజీ సైనికులు, 5న విభిన్న ప్రతిభావంతులు, 6న న్యాయవాదులు, 7న స్వయం సహాయక సంఘాల సభ్యులు, 8న నర్సింగ్ సిబ్బంది, 9న ఉపాధ్యాయులు, 10న ఉపాధి హామీ శ్రామికులు, 11న అంగన్‌వాడీ, హెల్త్ వర్కర్లు, 12న వైద్యులు, 13న మహిళా పారిశ్రామికవేత్తలు, 20న సెలబ్రిటీలతో యోగాభ్యాసం ఉంటుందని తెలిపారు.

★ గ్రామ, వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్, మండల స్థాయిలో యూనిటీ త్రో యోగా, జిల్లా స్థాయిలో యోగా అండ్ యూత్ ఇతివృత్తాలతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారులు డా.ఎం.సుహాసిని, జె.సుమన్, జిల్లా ఆయుష్ అధికారి డా.రామత్లేహి, ఆయుష్ వైద్యాధికారులు డా.వి.రాణి, వై.రత్న, ప్రియదర్శిని, డీపీఆర్ఓ సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్ బాధ్యతల స్వీకరణ



మాధవీ దేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్యాధికారులు

విజయవాడ వన్‌టౌన్, వైద్యం, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సేవల సమన్వయాధికారి(డీసీహెచ్ఎస్)గా డా.ఓటేటి మాధవీదేవి బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేటలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో శుక్రవారం కేవీఎస్ సత్యనారాయణ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సూపరింటెండెంట్‌లు, సామాజిక కేంద్రాలకు చెందిన మెడికల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. చేపట్టాల్సిన చర్యలపై వైద్యులకు దిశానిర్దేశం చేశారు.

విస్సన్నపేటలో 17.4 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం. . జిల్లాలో మొత్తం 54.4 మిల్లీ మీటర్ల వర్షం పడింది. సగటు వర్షపాతం 2.72 మి.మీ. విస్సన్నపేట 17.4, ఎ.కొండూరు 11.2, తిరువూరు 7.2, వీరులపాడు 4.2, ఇబ్రహీంపట్నం 2.4, రెడ్డిగూడెం 2, విజయవాడ గ్రామీణ, విజయవాడ తూర్పు 1.6, నందిగామ 1.4, విజయవాడ ఉత్తరం 1.2, విజయవాడ సెంట్రల్, పశ్చిమ 0.8, పెనుగంచిప్రోలులో 0.4 మి.మీ. మేర వర్షం పడింది.

వెలుగింట అవినీతి చీకట్లు!

"మనం ఏవైనా వస్తువులు కావాలంటే ఎక్కడ తక్కువకు వస్తాయో ఆరా తీసి కొంటాం. కానీ.. నాణ్యమైన వాటి కంటే తక్కువ సామర్థ్యం ఉన్న వాటిని రెట్టింపు ధరలకు కొంటామా? విజ్ఞత ఉన్న వారెవరైనా ఇలా చేస్తారా? ట్రాన్స్‌కోలో ఇదే జరుగుతోంది. అధికారులు.. అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తున్నారు."

"ట్రాన్స్‌కోలో రెండు విభాగాల్లో సమన్వయం కొరవడి నియంత్రికల (ట్రాన్స్‌ఫార్మర్లు) ధరల్లో భారీ వ్యత్యాసాలు ఉండటమే ఇందుకు తార్కాణం. ఈ తేడాను అధికారులు వాటాలేసి పంచుకుంటున్నారు. ఏకంగా రూ.11 కోట్ల మేర అదనంగా చెల్లించారు. 132 కేవీ విద్యుత్తు నియంత్రికల విషయంలో అవినీతి కోణమిది."

- అడ్డగోలుగా నియంత్రికల ధరలు
- 110 శాతం అదనంతో నిర్ణయం



మాయాజాలం ఇలా (ఒక్కొక్కటి రూ.లక్షల్లో)..

అధిక సామర్థ్యం ఉన్నది:	1.75
అంతకు తక్కువ సామర్థ్యానిది:	3.60

ఈనాడు – అమరావతి

ఒక్కో విద్యుత్తు ఉపకేంద్రంలో దాని సామర్థ్యం మేరకు 20 వరకు 132 కేవీ నియంత్రికలను వినియోగిస్తారు. అప్పటికే ఉన్న ఉపకేంద్రాల నిర్వహణను ఏపీ ట్రాన్స్‌కోలోని ట్రాన్స్‌మిషన్ విభాగం పర్యవేక్షిస్తుంది. వాటి మరమ్మతులతోపాటు అవసరమైతే కొత్తవి బిగిస్తుంది. ఇందుకు ప్రొక్యూర్‌మెంట్ విభాగం నియంత్రికలను కొని.. రాష్ట్రంలో అవసరమైనచోటకు పంపిస్తుంది. ఈ విభాగం.. డ్యుయల్ క్లాస్ కోర్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కోటి జీఎస్టీతో కలిపి రూ.1.75 లక్షలు వెచ్చించి కొన్నది.

ఇవిగో తార్కాణాలు..

⚡ **నిరుడు మార్చిలో ట్రాన్స్‌మిషన్ సీఈ..** నాసిక్‌లో సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నారు. 132 కేవీ డ్యుయల్ క్లాస్ కోర్ కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లను కొన్నారు. ఒక్కోటి రూ.1.75 లక్షలుగా.. 150 తీసుకుని.. రూ.2.63 కోట్లు వెచ్చించారు. తిరిగి ఇదే సంస్థ నుంచి అక్టోబరులో 150 నియంత్రికలను అదే ధరకు కొన్నారు.

⚡ **విజయనగరంలో** 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ అంచనాలు చూస్తే.. రెట్టింపు దోపిడీ తెలుస్తోంది. 21 నియంత్రికలు అవసరమని.. ఒక్కోటి రూ.3.05 లక్షలుగా రూ.64.16 లక్షలకు అంచనా వేశారు. 18 శాతం జీఎస్టీ అదనం.

⚡ **ప్రకాశం జిల్లా పుల్లలచెరువులోని** చంపలమడుగులో 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో 132 కేవీ పీటీఆర్, ఫీడర్ కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లను 18 వినియోగించారు. ఒక్కోటి రూ.3.05 లక్షలు చొప్పున రూ.55 లక్షలు వెచ్చించారు.

⚡ **నెల్లూరు జిల్లా రాజేంద్రనగర్‌లో** 132 కేవీ ఉపకేంద్రం ఏర్పాటుకు 12 పీటీఆర్, ఫీడర్ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని.. రూ.36 లక్షలుగా లెక్కగట్టారు.

రెట్టింపు ధరలా...?

కానీ.. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని చేపట్టే ప్రాజెక్టు విభాగం ధర మాత్రం వేరు. అంచనాల్లో వీటి కంటే తక్కువ సామర్థ్యం ఉన్న 132 కేవీ పీటీఆర్, ఫీడర్ కరెంటు నియంత్రిక ధర ఎంతో తెలుసా? రూ.3.05 లక్షలు. జీఎస్టీ కలిపితే.. రూ.3.60 లక్షలు. అంటే.. ఒక్కోదానిపై రూ.1.84 లక్షలు చొప్పున 110 శాతం అదనమన్న మాట. ట్రాన్స్‌కో కొత్తగా నిర్మించే సబ్‌స్టేషన్లకు ఏటా 600పైగా నియంత్రికలు అవసరం. ఈ లెక్కన రూ.11 కోట్లు అధికంగా ఖర్చు చేస్తున్నారు. గుత్తేదారులతో ఒప్పంద దశ నుంచే అధికారులకు వాటాలు అందుతున్నాయి. తుది బిల్లు చెల్లింపు వరకు బాదేస్తున్నారు.

ఎస్ఎస్ఆర్ మాయాజాలం..

ప్రతి ప్రభుత్వ శాఖలో ఎస్ఎస్ఆర్ ప్రకారమే ధర నిర్ణయిస్తారు. ట్రాన్స్‌కోలో ధరలను అమాంతం పెంచేస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగిన రెండేళ్లలో ఏపీ ట్రాన్స్‌కో, టీఎస్ ట్రాన్స్‌కోలో ఎస్ఎస్ఆర్‌లు ఒకేలా ఉన్నాయి. ఆ తర్వాత పెరిగాయి. ఈ తేడా 11 శాతానికి చేరింది. బేసిక్‌పై అలవెన్సులతో కలిపితే 15 శాతం అవుతోంది. ఇదే 132 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ తెలంగాణలో ధర జీఎస్టీతో కలిపి రూ.1.30 లక్షలు వెచ్చిస్తున్నారు. మన దగ్గర అడ్డగోలు ధరలు నిర్ణయించి దోచేస్తున్నారు.

కార్యాలయం ఇలా.. కార్యాచరణ డీలా!

రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన విజయవాడ ఆటోనగర్‌కు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా బస్సులు, లారీలు, జేసీబీలు ఇతర వాహనాలు తెచ్చి మరమ్మతులు చేయిస్తారు. బాడీలు కట్టిస్తారు. నిత్యం వేలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తారు. సుమారు 80 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలను ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) పర్యవేక్షిస్తుంది. దాదాపు ఏడాదిగా ఐలా ఇన్‌ఛార్జి కమిషనర్ పాలనలో సాగుతోంది. అసలు



తుప్పు పట్టిన వాహనాలు



అత్యంత అధ్వాన స్థితిలో భవనం

ఆ కార్యాలయాన్ని చూస్తే చాలు... ఆటోనగర్ నిర్వహణ ఎలా ఉంటుందో అర్థమైపోతుంది. కార్యాలయానికి కనీసం బోర్డు కూడా లేదు. కిటికీలు శిథిలమయ్యాయి. వాహనాలు తుప్పు పట్టాయి. అసలు కార్యాలయానికి వెళ్లే దారే అత్యంత అధ్వానంగా ఉంది. శాశ్వత కమిషనర్‌ను నియమించి.. ఆటోనగర్ ప్రాంత అభివృద్ధికి పాలకులు, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. - ఈనాడు, అమరావతి

కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీలకు కౌన్సెలింగ్ నేడు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బంది బదిలీకి రంగం సిద్ధమైంది. తొలిసారిగా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేయనున్నారు. ఒకే ప్రాంతంలో 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని తొలి విడత బదిలీ చేస్తారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 144 మంది కానిస్టేబుళ్లు, 77 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్నట్లు.. సంబంధిత వివరాలను అధికారులు సిద్ధం చేశారు. వారంతా శనివారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత వారిని వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తారు. ఆ తరువాత విడతల వారీగా మిగిలిన సిబ్బందిని కూడా బదిలీ చేస్తారని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

చెట్ల నరికివేత కేసు విచారణ ముమ్మరం

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, 136, 147 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.87/-.

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీద్వీపంలో చెట్లను కొట్టడంపై కేసు నమోదు చేసిన భవానీపురం స్టేషన్ పోలీసులు విచారణ ప్రారంభించారు. ద్వీపంలో పర్యాటక శాఖ అధికారులు పట్టుకున్న భిక్షాలుతో పాటు మరికొందరి హస్తం ఉన్నట్లు విచారణలో తేలింది. లంకల్లో తమకు సొసైటీ భూములు ఉన్నాయని, అక్కడ సుబాబుల్‌ను కొట్టేందుకు వచ్చినట్లుగా భిక్షాలు పోలీసులకు తెలిపారు. ఆ సుబాబుల్‌తో పాటు ద్వీపంలోని చెట్లను నరికినట్లు చెప్పాడు. దుంగలను కంచికచర్లలో విక్రయించినట్లు చెప్పారు. ఎంత మేర దుంగలను విక్రయించారనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. పర్యాటక శాఖ అధికారుల పాత్రపైనా విచారణ చేస్తున్నారు. సీఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నిందితుడైన భిక్షాలును అధికారులు తమకు అప్పగించారన్నారు. అందులో ప్రమేయం ఉన్న వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

ప్రయివేటు పాఠశాలలకు కంప్యూటర్ల అందజేత


సంఘ సభ్యులకు పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: బుడమేరు వరద ముంపునకు గురైన ప్రయివేటు పాఠశాలలకు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో కంప్యూటర్లు అందజేశారు. బుడమేరు వరదల్లో ఎన్టీఆర్ జిల్లాలోని సుమారు 67 పాఠశాలలు వరద ముంపునకు గురి కాగా.. ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు తమ ఇబ్బందులను అప్పట్లో యార్లగడ్డ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వారి ఇబ్బందులను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. లోకేశ్ స్పందించి తొలిసారి 12 వేల మంది ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ తన స్నేహితులతో మాట్లాడి సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.14 లక్షలు విలువచేసే కంప్యూటర్లు, పరికరాలను 27 ప్రయివేటు పాఠశాలలకు పటమటలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు, నాయకులు ఫణి ప్రసాద్, దేవినేని కిశోర్ కుమార్, గోన సాంబశివరావు, షేక్ ఇమామ్ పాల్గొన్నారు.

డిఫెన్స్ క్లస్టర్ హబ్‌తో యువతకు ఉద్యోగావకాశాలు

పటమట, న్యూస్‌టుడే: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు కోసం 2 వేల ఎకరాలు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ ఎంపీ కేశినేని శివనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. డిఫెన్స్ క్లస్టర్ హబ్ రావడం వల్ల ఎంతో మంది [illegible]

'చట్టప్రకారమే వంశీపై చర్యలు.. కక్ష సాధింపు లేదు'

కంకిపాడు, న్యూస్‌టుడే: [illegible] ... బెదిరించి, బలవంతపు సాక్ష్యం చెప్పించడం, ... క్రమణలు వంటి పలు క్రిమినల్, ఆర్థిక, సివి[illegible] 'మంచి బాలుడు..సహృదయుడు' అంటూ [illegible] న్నారు. మహిళల వ్యక్తిత్వ హననం, చంద్ర[illegible] వీల్లేని విధంగా దూషించడాన్ని ప్రజలు మ[illegible]


ఆటోపై ప్రమాదకరంగా తీసుకువెళ్తున్న ఫ్లెక్సీ


కాసేపటికి వచ్చి పక్కకు లాక్కెళుతున్న డ్రైవర్

నిర్లక్ష్యంతో సావాసం.. ప్రాణాలతో చెలగాటం

[illegible] -న్యూస్‌టుడే, గొల్లపూడి

బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేసేందుకు కృషి

మచిలీపట్నం రూరల్, న్యూస్‌టుడే: [illegible]

ఆటోనగర్ చెత్త సమస్యకు అడ్డుకట్ట

వ్యర్థాలు తరలించేందుకు జిందాల్ సంస్థతో ఒప్పందం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: [illegible]


ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో చర్చిస్తున్న పట్టాభి, ఎలా జోనల్ మేనేజర్ కంచ బాబ్జీ

ధర వరలు

వంకాయలు-20, టమాటా-15, బెండ-22, పచ్చిమిర్చి-23, కాకర-36, బీర-28/40, [illegible] - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ



డమ్మీ పిస్టోల్‌తో బెదిరించిన వ్యక్తి అరెస్టు


పిస్టోల్ చూపిస్తున్న పోలీస్, వెనుక నిందితుడు అశోక్‌కుమార్

తిరువూరు, న్యూస్‌టుడే: [illegible] ... సమాచారం అందుకుని అక్కడకు వెళ్లి అతడిని అదుపు ... అక్కడి పోలీసుల[illegible]

మద్యం దుకాణాల్లో నిబంధనల అమలుకు బృందాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలు, బార్లలో సమయపాలన, ఇతర నియమ నిబంధనలు అమలు చేసేందుకు మూడు అంచెల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ సీఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదా ఈఎస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఈ ప్రత్యేక బృందాల్లో ఉంటారని వివరించారు. విజయవాడ నగర పరిధిలో ఒక బృందం, రూరల్, జిల్లా పరిధిలో రెండు బృందాలు పనిచేస్తాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లో ఒకరు వాటిని పర్యవేక్షిస్తారని వివరించారు. విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 22న నిర్వహించిన సమావేశంలో వివిధ స్థాయి అధికారులకు దీనిపై సూచనలు ఇచ్చారని గుర్తు చేశారు. మద్యం వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలని కోరారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

దివ్యాంగుడి వినతికి కలెక్టర్ స్పందన

సాయం చేయాలని ఆదేశాలు


గోపాలకృష్ణతో ఎంపీడీవో నితిన్

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: రెండేళ్ల కిందట జరిగిన విద్యుత్తు ప్రమాదంలో రెండు చేతులు, కాలు కోల్పోయిన వత్సవాయి మండలం ఆళ్లూరుపాడుకు చెందిన దివ్యాంగుడు యాద గోపాలకృష్ణకు అవసరమైన సహాయాన్ని అందించాలని కలెక్టర్ లక్ష్మీశ వత్సవాయి ఎంపీడీవోకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 19న జగ్గయ్యపేటలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశకు గోపాలకృష్ణ కలిసి తనకు సాయం చేయాలని కోరారు. శుక్రవారం ఇన్‌ఛార్జి ఎంపీడీవో నితిన్ గోపాలకృష్ణను కలిసి వివరాలు సేకరించారు. ఈ నెల 24న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కృత్రిమ అవయవాలు అందజేస్తున్నామని అక్కడి రావాలని ఎంపీడీవో తెలిపారు.

వ్యర్థాలను సంపద వనరులుగా భావించాలి



మాట్లాడుతున్న పి.కృష్ణయ్య, వేదికపై శరవణన్ తదితరులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వివిధ రూపాల్లో వస్తున్న వ్యర్థాలను సంపద వనరులుగా ప్రతి ఒక్కరూ భావించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'వృత్తాకార ఆర్థిక వ్యవస్థ స్వీకరణ, అమలు' అనే అంశంపై రెండ్రోజులపాటు ఎంజీరోడ్డులోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యశాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను పునర్వినియోగంగా మార్చేలా అనుసరిస్తున్న విధానాలపై, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి శరవణన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ప్లాస్టిక్, బ్యాటరీ, మున్సిపల్ వ్యర్థాలు, సోలార్ ప్యానళ్లు, ఈ వ్యర్థాల నిర్వహణపై తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేశారు. జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మోహన్ రాజశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన, జోనల్, ప్రాంతీయ కార్యాలయం అధికారులు, ఏపీపీసీబీ అధికారులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొండపల్లి బ్యాంకు కాలనీ స్టూడియో వద్ద కాలువ నిండిపోయింది. దీంతో దానిలోని మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. పాదచారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించాలి. **-అలీ, స్థానికుడు**

✔ ఆ కాలువ తరువాత అనుసంధానంగా తూము ఉంది. అది పూడుకుపోవడం వల్ల సమస్య ఏర్పడుతుంది. సిబ్బందిని పంపి శనివారం సమస్య నిర్మూలిస్తాం. **-పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ. -న్యూస్‌టుడే, కొండపల్లి**



★ పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో 2వ వార్డులో మురుగు నీరు ప్రవహించే కాల్వ మట్టితో పూడుకుపోయిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ జి.లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి స్వయంగా పర్యవేక్షణలో పురపాలిక కార్మికులతో కాల్వలో పూడిక మట్టి లేకుండా బాగుచేయించారు.

★ పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో 18వ వార్డులో మురుగు కాల్వలో పూడిక పేరుకుపోయి ఉందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌కి తెలుపగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో మురుగు కాల్వలో పూడిక తొలగింపజేశారు.

★ పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో 12వ వార్డులో డిగ్రీ కళాశాల రోడ్డులో మురుగు కాల్వలో పూడిక ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారికి వివరించగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో డ్రెయినేజీలో పూడికను తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, తిరువూరు**

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొండపల్లి, న్యూస్‌టుడే: యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా గురువు జనార్ధన్ అన్నారు. 2025 యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపల్ బిల్డ్ కార్యాలయం వద్ద యోగా శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా సాధన వల్ల శారీరక, మానసిక రుగ్మతలకు తావు లేకుండా ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి యోగా సాధనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగానే పాఠశాలలు, కళాశాలల్లో యోగా విద్య ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఉత్తమమని చెప్పారు. దీని వల్ల విద్యార్థుల్లో కూడా మంచి ఏకాగ్రత కలుగుతుందన్నారు. ఇప్పటికే మన దేశంలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో వీటిపై ప్రత్యేక కోర్సులు ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులు, మహిళలు నిత్యం సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి విజయవంతంగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ జూన్ 21న పురపాలిక వ్యాప్తంగా 5 చోట్ల యోగా కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపాలంకరణ సేవ

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకుల గోపాలాచార్యుల ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు చేయగా భక్తులు పాల్గొన్నారు. మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు.



వచ్చేది వానాకాలం.. చేయొద్దు చేటుకాలం

నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

మైలవరం, న్యూస్‌టుడే

గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ దయనీయంగా మారింది. కొద్దిపాటి వర్షాలకే మురుగు నీరు రహదారులపైకి వచ్చేస్తోంది. మేజర్ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, పెద్ద పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గడిచిన దశాబ్దంన్నర కాలం సీసీ రహదారులతో కాంక్రీటు జంగిల్‌గా మార్చగా, ఆయా రహదారుల పక్కన పక్కా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రస్తుతం అకాలవర్షాలతో ఆయా లోపాలు కాస్తా బయటపడుతుండగా.. వర్షాకాలానికి కాలువలను సిద్ధంగా ఉంచాల్సిన అవసరం బయటపడుతుంది.



చంద్రగూడెంలో రోడ్డెక్కిన నీరు



చెవుటూరు ప్రధాన రహదారి పక్కన పూడుకుపోయిన కాలువ

చూపంతా సీసీ రహదారులపైనే

దీర్ఘకాలంగా గ్రామాల్లోని నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉంటే, తొలి ప్రాధాన్యం సీసీ రహదారుల నిర్మాణంపైనే ఉంటోంది. రహదారులతో పాటు ఒకేసారి పక్కా డ్రెయినేజీ నిర్మిస్తే అవస్థలు పూర్తిగా తొలగుతాయి. కానీ ఆ దిశలో దృష్టి సారించకపోవడానికి గ్రామాల్లో కాలువలను ఆక్రమించి, తదితర గోడల నిర్మాణాలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాటిని తొలగించడానికి సాహసించకపోవడంతో మురుగునీటి పారుదల వ్యవస్థ కుంటుపడుతోంది.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

మొత్తం పంచాయతీలు	61
జనాభా	3.60 లక్షలు
మండల కేంద్రాలు	4
మేజర్ పంచాయతీలు	2
పెద్ద పంచాయతీలు	6

చేతులెత్తేస్తున్నారు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రూరల్ మండల పరిధిలోని 5 గ్రామాలు కలిపి మొత్తం 3.50 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. వెయ్యి లోపు జనాభా ఉన్న పంచాయతీల నుంచి 25 వేల లోపు జనాభా ఉన్న మైలవరం పంచాయతీ వరకు మురుగు కాలువల పరిస్థితి ఒకే విధంగా ఉంటోంది. వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధుల్లేవంటూ పాలకవర్గాలు, అధికారులు చేతులెత్తేస్తుంటే, దీర్ఘకాలంగా కచ్చా డ్రెయిన్లే కన్పిస్తున్నాయి.

సాధారణ, ఆర్థిక సంఘం నిధులతోనే పనులు

పంచాయతీల్లో మురుగు కాలువల్లో పూడిక తీతలకు ఆయా పంచాయతీల్లోని సాధారణ నిధులు, ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులే ఆధారం. వాటిని వినియోగించుకుని పనులు చేస్తారు. ఆర్థిక సంఘం నిధులతో పక్కా మురుగు కాలువలకు ప్రతిపాదనలు పెట్టొచ్చు. **- పి.అనురాధ, ఎంపీడీవో**

డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ గ్రాండ్ టెస్టులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈవో, పీఆర్టీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో మోడల్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోపాల్, సతీష్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా రూపొందించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో బాలు, సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 26వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

తిరువూరు ఎస్సై-2గా వెంకటేశ్వరరావు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఎస్సై-2గా గార్లపాటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖర బాబు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ఎస్‌బీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను తాజాగా ఇక్కడకు బదిలీ చేశారు. శనివారం తిరువూరు ఠాణాలో బాధ్యతలు స్వీకరిస్తానని ఆయన న్యూస్‌టుడేకి తెలిపారు.



ఎక్సైజ్ సీఐగా బాధ్యతల స్వీకరణ

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ సీఐగా డా.ఎన్.నిక్సన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. మైలవరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ గత నాలుగు నెలల నుంచి తిరువూరుకు ఇన్‌ఛార్జిగా ఉన్నారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలాల్లో నవోదయం-2 కార్యక్రమం ద్వారా నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తిగా నియంత్రించేందుకు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేస్తానని నిక్సన్ తెలిపారు.



'ప్రజల తరఫున నిరంతర పోరాటం చేస్తాం'

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో ప్రజల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఘనత ఎర్రజెండాకు దక్కిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. తిరువూరులో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సీపీఐ రెండవ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు సమస్యలు ఉన్నంత కాలం వాటిని పరిష్కరించేందుకు సీపీఐ పోరాడుతూనే ఉంటుందన్నారు. దేశంపై దాడుల చేస్తున్న ఉగ్రవాద సంస్థలను, అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్న ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడంలో కేంద్ర విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని హామీ మేరకు అమలు చేయకుండా ప్రభుత్వం మాట మార్చిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణయ్య, నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్‌మీరా, వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు పి.వెంకయ్య, ఎం.ఉదయ్ తదితరులు మాట్లాడారు. తొలుత నాయకులంతా ప్రదర్శనగా పార్టీ కార్యాలయానికి చేరుకుని పతాకం ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే పేట రామారావు, సీనియర్ నేత సుంకర వీరభద్రరావు విగ్రహాలకు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పక్కన జిల్లా కార్యదర్శి శంకర్, నాయకులు

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక లాభం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పంటలు పండించి రైతులు అధిక ఆదాయం పొందాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం రంగాపురం పంచాయతీ పరిధిలోని తాడిగూడెం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు తమ భూమిని ఖాళీగా ఉంచకుండా పచ్చని పంటలు సాగు చేయాలని సూచించారు. వరి పొలాల్లో గట్ల వెంట ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి పంటలు వేసి అధిక ఆదాయం పొందాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను తింటే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. గృహిణులందరూ తమ ఖాళీ స్థలాలను ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించడానికి ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని జిల్లాలో మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం నవ ధాన్యాల కిట్లు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న శంకర్ నాయక్

కాలువల్లో పూడిక తొలగింపు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: 'ఆక్రమణలు పెరిగిపోయి..దారులు మూసుకుపోయి' అనే శీర్షికన మే 21వ తేదీన ప్రచురితమైన ఈనాడు కథనానికి పురపాలిక అధికారులు స్పందించారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయాల్లోకి, ఖాజీమాన్యంలోకి గత ఆదివారం కురిసిన వర్షానికి నీరు చేరాయి. కార్యాలయాలకు పడమర వైపున ఉన్న కాలువలు పూడుకుపోవడం, ఆక్రమణలు జరగడం వల్లే రహదారిపై పడిన నీరు నేరుగా కార్యాలయాల్లోకి చేరాయని అధికారులు గుర్తించి బూడిదతో పూడుకుపోయిన కాలువలను వెలికితీయించే పనులు గురు, శుక్రవారాల్లో చేపట్టారు. కొందరు లారీలను రహదారి పక్కన నిలుపుకోవడానికి పక్కా డ్రెయినేజీని బూడిదతో పూడ్చివేశారని గుర్తించారు. దాదాపు అరకిలోమీటర్ ఉన్న కాలువను వెలికితీసి వర్షపు నీరు పోవడానికి మార్గం సుగమం చేశారు.



ఈనాడు కథనానికి స్పందన

దారి దారుణం.. అడుగు వేయలేం..!

'**న**మస్కారమండీ.. నేను జాతీయ రహదారి 30ని. ఎవరైనా ఇబ్రహీంపట్నం, తిరువూరు మార్గంలో ప్రయాణించాలనుకుంటే ముందు మీ వాహనాన్ని..మీ శరీర స్థితిగతులను ఓ సారి పరీక్షించుకోండి. మరోలా అనుకోకండి.. మీ ప్రయాణం అనుకున్న గమ్యానికి క్షేమంగా చేరాలంటే, ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ పొడవునా నన్ను దాటాల్సిందే. నేనేమో గడిచిన ఏడేళ్లగా ఆ గ్రామ పరిధిలో అడుగడుగునా మోకాలి లోతు గోతులతో..వాటిల్లో నిండిపోయిన నీటితో మునిగిపోయి ఉంటున్నాను. పాపం నన్ను దాటలేక ఎంతోమంది కాళ్లు చేతులు విరగ్గొట్టుకొని ఆసుపత్రులపాలయ్యారు.' ఇదీ ఈ మార్గం పరిస్థితి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మైలవరం, ఎ.కొండూరు



గుంతల్లో ఇబ్బందులు పడుతున్న ఆటో



రామచంద్రాపురం వద్ద గోతుల్లో వర్షపు నీరు



ఎ.కొండూరు మండలం చీమలపాడు వద్ద ఇలా

నిలిచినా చూడరు.. పడినా పట్టించుకోరు

మండలంలోని చీమలపాడు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలో వర్షపు నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. చీమలపాడు నుంచి గంపలగూడెం వచ్చే మలుపు వద్ద తరచూ భారీగా గుంతలు ఏర్పడి ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోంది. అధికారులు తాత్కాలికంగా గుంతలు పూడ్చిస్తుండడంతో రోజుల్లోనే సమస్య పునరావృతమవుతోంది. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, చీమలపాడు (ఎ.కొండూరు)

అర్జీల పరిష్కారానికి కృషి చేయాలి

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీలోని 1, 2, 9 వార్డు సచివాలయాల్లో పురపాలిక కమిషనర్ జి.లోవరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ ప్రజలు వార్డు సచివాలయాల్లో అందించే అర్జీలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ఆస్తి పన్ను సర్వేలను వేగంగా చేయాలని వార్డు అడ్మిన్లకు సూచించారు. రేషన్‌కార్డుల కోసం అర్జీలు ఇచ్చేందుకు కార్యాలయానికి వచ్చే వారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు.

ఎండీయూ వ్యవస్థ కొనసాగించాలని వినతి

మైలవరం, న్యూస్‌టుడే: ప్రజలకు ఇళ్ల వద్దకే రేషన్ అందిస్తున్న ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని ఆ వాహనాల ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రదర్శన నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేశారు. మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు చెందిన ఆపరేటర్లు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టుతో ఆదాయాన్ని పెంచుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటింటి నుంచి చెత్తను సేకరించి వర్మీకంపోస్టు తయారుచేసి విక్రయాల ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి లావణ్య కుమారి సూచించారు. ఆమె ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఎంపీడీవో వి.మనోజ్‌తో కలిసి శుక్రవారం కేతనకొండ గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె క్లాప్ మిత్రలతో చెత్త సేకరణ, కంపోస్టు తయారీ పద్ధతులపై చర్చించి సంపద కేంద్రం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఇంటి వద్దనే గృహిణులు చెత్తను వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. వర్మీకంపోస్టుపై రైతులకు అవగాహన పెంచి రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించేలా ప్రోత్సహించాలని గ్రామ సర్పంచి నళిని సచివాలయం అధికారులకు తెలిపారు.



సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలతో మాట్లాడుతున్న డీపీవో లావణ్య కుమారి

బాటసారులకు మజ్జిగ పంపిణీ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీరామ భజన మందిరం వద్ద శుక్రవారం సీహెచ్.హనుమంతరావు, కె.బ్రహ్మాజీ తదితర దాతల సౌజన్యంతో వేసవిలో బాటసారులకు దాహం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. కె.నాగేశ్వరరావు సేవా ఫౌండేషన్ నిర్వాహకులు కె.దీప్తి, కృష్ణకుమారి పర్యవేక్షించారు.



మజ్జిగ అందజేస్తున్న నిర్వాహకులు

ఆడుదాం ఆంధ్రాపై విజిలెన్స్ ఆరా?

మైలవరం, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో రూ.వందల కోట్ల ఖర్చుతో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై విజిలెన్స్ విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అప్పట్లో ఆటల నిర్వహణ, ఖర్చుల నిమిత్తం ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.10 వేలు, మండలానికి రూ.25 వేల నిధులను ఖర్చు చేశారు. ఆయా నిధుల వినియోగం, నిర్వహించిన ఆటలకు సంబంధించిన వివరాలను వెంటనే ఇవ్వాల్సిందిగా మండల కార్యాలయాలను విజిలెన్స్ అధికారులు ఆదేశించినట్లు సమాచారం. అందులో భాగంగా అప్పట్లో విధులు నిర్వర్తించిన వారి నుంచి వివరాలు తీసుకుని, నివేదికలను ఇవ్వడంలో మండలస్థాయి అధికారులు కసరత్తులు చేస్తున్నట్లు వినికిడి. ఇప్పటికే ఆ కార్యక్రమంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం విచారణ చేపడుతుందని ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఎద్దులను తరలిస్తున్న లారీ అడ్డగింత

రెడ్డిగూడెం: హనుమాన్ జంక్షన్ నుంచి ఎద్దులను అక్రమంగా తెలంగాణ రాష్ట్రం కోదాడ సంతకు తరలిస్తున్న లారీని భాజపా, హైందవ శక్తి సంఘం నాయకులు శుక్రవారం అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం భాజపా మండల అధ్యక్షుడు బి.గోపి, హైందవశక్తి సంఘం నాయకుడు వీరహనుమాన్ తదితరులకు నూజివీడు -గంపలగూడెం రహదారిలో ఓ లారీలో పశువులను తరలిస్తున్నారనే సమాచారం రావడంతో.. రెడ్డిగూడెం మండలం రంగాపురం చెరువు సమీపంలో ఆ లారీని ఆపి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా అందులో 35 ఎద్దులు వరకు ఉన్నట్లు గుర్తించారు. ఎద్దులను గోశాలలో తీసుకొనే అవకాశం లేనందున లారీ డ్రైవర్ వద్ద రికార్డు కాగితాలు, వాటి యజమాని వివరాలు నమోదు చేసుకొని లారీ ఓనర్‌ను స్టేషన్‌కు రావాలని తెలియజేసి లారీని పంపించామని ఏఎస్సై గణేష్ తెలిపారు.



రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద లారీ

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అధిక లోడు, నిబంధనల ఉల్లంఘనలతోనే అత్యధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయని ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు అన్నారు. ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలో ట్రాక్టర్లతో వివిధ వస్తువులను రవాణా చేస్తున్న డ్రైవర్లకు, యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు అధిక వేగంగా వెళ్తున్నాయన్నారు. ట్రాక్టర్ బాడీకి ఇరువైపులా రేడియం స్టిక్కర్లు లేకపోవడం విచారకరమన్నారు. ముఖ్యంగా లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడుపుతున్న వారిని గుర్తించామని అటువంటి వారి విషయంలో యజమానులు పరిశీలన చేసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆయా ట్రాక్టర్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రెండు జాతీయ రహదార్ల వెంట వాహన రద్దీ ఎక్కువగా ఉన్నందున ట్రాక్టర్లు నిదానంగా వెళ్లాలని చెప్పారు. ప్రస్తుతం అవగాహన మాత్రమే కలిగిస్తున్నామని, త్వరలో పూర్తిస్థాయిలో జరిమానాలు, కేసులు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్పందనపై హర్షం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించడం హర్షణీయమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి పి.శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనకు ప్రభుత్వం సానుకూలంగా విడుదల చేసిన ప్రకటనపై నేషనల్ మజ్దూర్ యూనిటీ సభ్యులు స్పందించి డిపో ఆవరణలో శుక్రవారం మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో నిరసన కార్యక్రమాలు, దీక్షలు నిర్వహించారన్నారు. వీటిని గుర్తించిన ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగానే ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు గురువారం సమస్యల సాధనకు సర్క్యులర్ విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు ఆంజనేయులు, శేషగిరిరావు, శంకర్, వదూద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు తినిపించుకుంటున్న ఎన్ఎంయూఏ సభ్యులు

తిరువూరు పురపాలిక ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు నగర పంచాయతీ ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్‌గా 2వ వార్డు కౌన్సిలర్ వెలుగోటి విజయలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం ఈమె పురపాలిక ఒకటో వైస్ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. గత నెల 23వ తేదీన ఛైర్‌పర్సన్ గత్తం కస్తూర్బాయి తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మిని నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం తమకు అందినట్లు నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఛైర్మన్ ఎన్నికకు నిర్వహించిన సమావేశాలకు కోరం లేక నిరవధికంగా వాయిదా పడిన సంగతి విదితమే.

ఆధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ



పాల్గొన్న విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణలో భాగంగా స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్ఫోసిస్ ల్యాబ్ ఆన్‌వీల్స్ శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. సాంకేతిక అంశాలతో ప్రత్యేకంగా రూపొందించిన బస్సు కళాశాలకు రాగా, విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. అందులో భాగంగా రొబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ సంస్థ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి శిక్షణ ఇవ్వడం మేలు చేస్తుందని ప్రిన్సిపల్ ఇళ్లా రవి పేర్కొన్నారు.

పీఎస్ఆర్ చెబితేనే చేశా

- పోలీసుల విచారణలో ఏపీపీఎస్సీ సహాయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య
- గ్రూప్-1 అక్రమాల కేసు

ఈనాడు, అమరావతి: 'గ్రూప్-1 జవాబు పత్రాల మాన్యువల్ మూల్యాంకనం విషయంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పినట్లే నేను నడుచుకున్నా. నిబంధనలకు విరుద్ధంగా చేయకూడదని చెప్పినా.. ఆయన వినలేదు. అంతా నేను చూసుకుంటా నువ్వే అన్నారు. కార్యదర్శి ఆదేశించడంతో చేయాల్సి వచ్చింది. అంతకుమించి వేరేమీ లేదు' అని ఏపీపీఎస్సీ కాన్ఫిడెన్షియల్ విభాగం సహాయ కార్యదర్శి వెంకట సుబ్బయ్య పోలీసుల విచారణలో వెల్లడించారు. ఏప్రిల్ 22 నుంచి నెల రోజుల సెలవుపై అమెరికా వెళ్లిన ఆయన.. గురువారం తిరిగి వచ్చారు. హాయ్‌ల్యాండ్ వేదికగా మాన్యువల్ మూల్యాంకనం చేయించడానికి చేసినట్లు మొక్కుబడి తంతుగా నిర్వహించడంలో వెంకటసుబ్బయ్య కీలకంగా వ్యవహరించారని పోలీసులు గుర్తించారు. నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు నిబంధనలకు విరుద్ధంగా జారీచేసిన ఆదేశాలను వెంకటసుబ్బయ్యే అమలు చేశారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఏ2 మధుసూదన్ వాంగ్మూలంలోనూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వెంకటసుబ్బయ్యను శుక్రవారం 8 గంటలపాటు విచారించారు.

వెంకటసుబ్బయ్యపై ప్రశ్నల వర్షం: ఎంఓయూ లేకుండానే క్యామ్‌సైన్‌కు వర్క్ ఆర్డర్ ఎలా అప్పగించారు? వర్క్ ఆర్డర్ మార్చాలని క్యామ్‌సైన్ ప్రతినిధి కోరినా ఎందుకు మార్చలేదు? హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం ఎందుకు నిర్వహించాల్సి వచ్చింది? వర్క్ ఆర్డర్ ప్రకారం పని జరగకపోయినా క్యామ్‌సైన్ ఏజెన్సీకి డబ్బు చెల్లింపులు ఎలా చేశారు? అని పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. తన సొంత ఎజెండా ఏమీ లేదని, పీఎస్ఆర్ ఆదేశాల మేరకే చేశానని చెప్పినట్లు తెలిసింది.



మొయినాబాద్‌లోని పీఎస్ఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్

పీఎస్ఆర్ ఆంజనేయులు ఫామ్‌హౌస్‌లో సీఐడీ సోదాలు

ఈనాడు-అమరావతి, మొయినాబాద్-న్యూస్‌టుడే: ముంబయికి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో అరెస్టయిన నిఘా విభాగం మాజీ అధిపతి, సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలో సీఐడీ అధికారులు శుక్రవారం సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ శివారుల్లోని మొయినాబాద్ మండలం అమ్డాపూర్‌లోని పీఎస్ఆర్ ఫామ్‌హౌస్‌లో తనిఖీలు చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి వరకూ సోదాలు కొనసాగించారు. ఈ కేసులో కీలక ఆధారాలైన పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పీఎస్ఆర్ మాయం చేశారని అనుమానిస్తున్న సీఐడీ అధికారులు వాటి కోసం ఈ సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కొన్ని పత్రాలు లభ్యమైనట్లు సమాచారం. ఆంజనేయులును ఈ ఫామ్‌హౌస్‌లోనే గతనెల 22న సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. అప్పట్లో కొన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకోలేదు. విచారణలో భాగంగా వాటి గురించి ప్రశ్నించినా పీఎస్ఆర్ సరైన సమాధానాలు చెప్పలేదు. ఈ నేపథ్యంలోనే తనిఖీలు జరిగాయి.

గ్రూప్-1 అక్రమాల కేసులో కస్టడీపై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 అక్రమాల కేసులో నిందితులు సీతారామాంజనేయులు, మధుసూదన్‌ల కస్టడీపై వాదనలు ముగిశాయి. ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు రెండో ఏజేసీజే కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అక్రమాలకు సంబంధించి కుట్రను వెలికి తీయాల్సి ఉందని.. నిందితులను కస్టడీకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఏపీపీ సిద్ధిఖీ వాదించారు. కస్టడీ అవసరం లేదని నిందితుల తరఫు న్యాయవాది వాదించారు. వాదనలు పూర్తయ్యాయి. కస్టడీపై శనివారం తీర్పు ఇవ్వనున్నట్లు న్యాయాధికారి ప్రకటించారు.

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు.. జైల్లో సౌకర్యాలపై వెసులుబాటు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా కారాగారంలో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు సౌకర్యాల విషయంలో విజయవాడ ఏసీబీ కోర్టు కొంత వెసులుబాటు కల్పించింది. వారిద్దరు వారంలో మూడు రోజులపాటు (సోమ, బుధ, శుక్రవారాల్లో) బయట భోజనం పొందేందుకు అనుమతిస్తూ ఈ ప్రక్రియను జైలు సూపరింటెండెంట్ పర్యవేక్షించాలని పేర్కొంది. మరోవైపు వారంలో రెండుసార్లు ఇద్దరి నిందితులతో వేర్వేరుగా న్యాయవాదులు ములాఖత్ అయ్యేందుకు అనుమతి ఇచ్చింది. జైలు నిబంధనలకు లోబడి నిందితులిద్దర్ని ప్రత్యేక కేటగిరీగా చూడాలని స్పష్టం చేసింది. విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారం ఈ మేరకు వెల్లడించారు.

'పోలవరం-బనకచర్ల'పై తొలి అడుగు

- కేంద్ర జలసంఘానికి ప్రీఫీజిబిలిటీ నివేదిక సమర్పణ
- మరోవైపు కేంద్ర మద్దతు కోరిన ముఖ్యమంత్రి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో తొలి అడుగు పడింది. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు కేంద్ర జలసంఘానికి ప్రీఫీజిబిలిటీ నివేదిక(పీఎఫ్ఆర్) సమర్పించారు. ప్రాజెక్టు ప్రాథమిక స్వరూపం, హైడ్రాలజీ, ఎంత వ్యయం అవుతుంది? కొత్త ఆయకట్టు ఎంత? స్థిరీకరణ ఎంత? పెట్టుబడి, రాబడి నిష్పత్తి వంటి అంశాలను నివేదికలో పొందుపర్చారు. మరో వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో కేంద్ర ఆర్థిక, జల్‌శక్తి మంత్రులతో భేటీలోనూ ప్రాజెక్టుకు మద్దతు కోరారు. కేంద్ర జలసంఘం నివేదికను పరిశీలించాక రాష్ట్ర అధికారులతో చర్చించనుంది. ఆ తర్వాత కేంద్ర జలసంఘంలోని డైరెక్టర్ల సమావేశం పీఎఫ్ఆర్‌ను ఆమోదించనుంది. అనంతరం పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సమర్పించాల్సి ఉంటుంది. జలవనరుల శాఖ జూన్ నెలాఖరుకు లేదా జులై ప్రారంభానికి డీపీఆర్ సమర్పించాలనే లక్ష్యంతో ఆ ప్రక్రియనూ ప్రారంభించింది. పోలవరం నుంచి 23 వేల క్యూసెక్కుల నీటిని మళ్లించేలా ప్రాజెక్టును 3 సెగ్మెంట్లుగా పీఎఫ్ఆర్‌లో పేర్కొన్నారు. పోలవరం జలాశయం నుంచి ప్రకాశం బ్యారేజికి నీటిని తరలించడం, అక్కడి నుంచి బొల్లాపల్లి



జలాశయానికి చేర్చడం, ఆ తర్వాత బనకచర్ల కాంప్లెక్సుకు నీటిని మళ్లించడం ఇందులో ప్రధాన భాగాలు.

సెగ్మెంట్1: పోలవరం- ప్రకాశం బ్యారేజి

ప్రస్తుత అంచనా వ్యయం: రూ.13,800 కోట్లు
సేకరించాల్సిన భూమి: 1,401 ఎకరాలు

పోలవరం జలాశయం నుంచి 23 వేల క్యూసెక్కుల నీళ్లు తరలిస్తారు. కుడి కాలువ ద్వారా 5,000 క్యూసెక్కులు, వరద కాలువ నుంచి 18 వేల క్యూసెక్కులు తరలిస్తారు. ఈ దశలో లిఫ్టులు అవసరం లేదు. తాడిపూడి ఎత్తిపోతల కాలువను విస్తరించి వరద కాలువగా మారుస్తారు. మొత్తం 175.40 కి.మీ. మేర ఉండే కాలువలు ప్రస్తుత పవిత్ర సంగమ ప్రాంతానికి 4 కి.మీ. దిగువన ప్రకాశం బ్యారేజి వద్ద కలుస్తాయి.

సెగ్మెంట్2: ప్రకాశం బ్యారేజి-బొల్లాపల్లి జలాశయం

అంచనా వ్యయం: రూ.35,750 కోట్లు
భూమి: 13,700 ఎకరాల అటవీ, 29,500 ఎకరాల ఇతర భూమి అవసరం

ప్రకాశం బ్యారేజి వద్ద వైకుంఠపురం నుంచి నీటిని రెండో దశలో ఎత్తిపోస్తారు. 6 దశల్లో నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. మొత్తం 84.17కి.మీ. కాలువ ప్రవహిస్తుంది. 11.575 కి.మీ. పైపులైను ఉంటుంది. బొల్లాపల్లి వద్ద జలాశయం తవ్వి అక్కడ 173 టీఎంసీల నీటిని నిల్వ చేస్తారు. డెడ్ స్టోరేజి 21 టీఎంసీలుగా ఉంటుంది. ఈ భాగంలో 18 ఆవాసాలు ముంపులో చిక్కుకుంటాయి. 4,800 కుటుంబాలను తరలించాల్సి ఉంటుంది.

సెగ్మెంట్ 3: బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల కాంప్లెక్సు

అంచనా వ్యయం: రూ.32,350 కోట్లు

ఈ దశలో బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల కాంప్లెక్సుకు నీళ్లు తీసుకెళ్తారు. రోజుకు 1.5 టీఎంసీలు బనకచర్ల కాంప్లెక్సుకు, మరో 0.5 టీఎంసీలు నల్లమలసాగర్ జలాశయానికి తరలిస్తారు. 3 చోట్ల లిఫ్టులతో +171 మీటర్ల నుంచి +335 మీటర్ల స్థాయికి నీటిని ఎత్తిపోయాలి. 113.33 కి.మీ. కాలువ, మొత్తం 26.10 కి.మీ. పొడవున సొరంగాలు తవ్వాల్సి ఉంది. నల్లమలలో ఈ సొరంగాలు తవ్వుతున్నా ప్రధాన టన్నెల్ ప్రారంభం, చివరి ప్రాంతాలు అటవీ ప్రాంతంలోకి రావు. పులుల అభయారణ్యానికి బయటే ఉంటాయి.

భారాసలో కోవర్టులున్నారు

- వారిని తప్పించి.. ముందుకెళ్తే పార్టీదే భవిష్యత్
- కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయి
- గతంలో కూడా అనేకసార్లు లేఖలు రాశా
- శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



విమానాశ్రయం వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న కవిత

ఈనాడు, హైదరాబాద్, శంషాబాద్, న్యూస్‌టుడే: భారాసలో ఉన్న చిన్న చిన్న లోపాలపై చర్చించుకొని. . సవరించుకొని.. కోవర్టులను పక్కకు తప్పించి ముందుకెళ్తే భవిష్యత్ పార్టీదే అని.. పది కాలాలపాటు చల్లగా ఉంటుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. "కేసీఆర్ దేవుడు.. కానీ కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయి. వారి వల్ల నష్టం జరుగుతోంది" అని వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రజతోత్సవ సభ అనంతరం భారాస అధినేత కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ గురువారం వెలుగులోకి వచ్చి చర్చనీయాంశమైన నేపథ్యంలో.. కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "నా కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి వెళ్లిన తర్వాత లేఖ లీక్ అయి హంగామా జరిగినట్లు తెలిసింది. రెండు వారాల క్రితం నేను కేసీఆర్‌కు లేఖ రాశా. గతంలో కూడా లేఖల ద్వారా కేసీఆర్‌కు అనేకసార్లు అభిప్రాయాలు చెప్పా. నాపై కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని ఇటీవలే చెప్పా. ఇప్పుడు లేఖ బహిర్గతం అవ్వడంతో.. ఏం జరుగుతున్నదోనని పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పార్టీలో అన్ని స్థాయుల్లో ఉన్న వారు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో చెప్పా. ఇందులో నాకు వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. వ్యక్తిగతంగా నాకు ఎవరిపైనా ద్వేషం లేదు.

లేఖ బహిర్గతం వెనుక ఎవరున్నారో..

మా పార్టీ అధినేతకు రాసిన లేఖ బహిర్గతమైందంటే.. దాని వెనుక ఎవరున్నారో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖనే బయటికి వచ్చిందంటే.. పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏమిటి? దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. నేను కేసీఆర్‌కు లేఖ ద్వారా వ్యక్తపర్చిన అభిప్రాయాల్లో ప్రత్యేకత ఏమీ లేదు. అది బహిర్గతం కావడం బాధాకరం. లేఖ బయటకు రావడంతో భాజపా, కాంగ్రెస్ పార్టీలు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు సంబరపడుతున్నాయి. భారాస ఆగమైనట్లు ఆ పార్టీల నాయకులు మాట్లాడుతున్నారు. మా నాయకుడు కేసీఆరే. ఆయన నాయకత్వంలో తెలంగాణ బాగుపడుతుంది. పార్టీ కూడా ముందుకెళ్తుంది. కాంగ్రెస్, భాజపాలు విఫలమయ్యాయి. వాటికి కేసీఆర్ నాయకత్వమే ప్రత్యామ్నాయం" అని కవిత పేర్కొన్నారు. కవితకు స్వాగతం పలికేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చినా ఎవరూ గులాబీ కండువాలు వేసుకోలేదు. "కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి.. సీఎం.. సీఎం.." అని నినాదాలు చేశారు. అభిమానులకు అభివాదం చేసి కవిత వెళ్లిపోయారు.

నేడు కేరళకు రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ శనివారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. ఇది మరింత బలపడేందుకు గాలులు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, ఇతర పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. రాబోయే రోజుల్లో తుపానుగా బలపడే అవకాశం లేకపోలేదు. దీని ప్రభావంతో పశ్చిమ తీరంలో గుజరాత్, గోవా రాష్ట్రాల్లో ఆదివారం వరకు.. కర్ణాటకలో ఈనెల 27 వరకు, మహారాష్ట్రలో ఈనెల 25న, తమిళనాడులో 25, 26 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా.

బంగాళాఖాతంలో అల్పపీడనం

పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 27 నాటికి అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత రెండు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 30 నుంచి 32 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. దీంతో వాయుగుండంగా బలపడవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రిడిక్షన్‌కు చెందిన మోడల్ సూచిస్తోంది. ఈ ప్రభావంతో ఈ నెల 27న పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ పేర్కొంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో ఈనెల 27 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది. జూన్ 5 వరకు కోస్తాంధ్రతోపాటు రాయలసీమలోనూ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, అనకాపల్లి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యాన పంటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

సినిమా థియేటర్ల బంద్ పిలుపు వెనుక ఎవరున్నారో తేల్చండి

- హోంశాఖ కార్యదర్శికి మంత్రి కందుల దుర్గేశ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సినిమా థియేటర్లను జూన్ 1 నుంచి బంద్ చేయాలంటూ ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్నారనే అంశంపై విచారణ చేపట్టాలని, దీని వెనుక ఎవరున్నారో తెలుసుకోవాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలకు ముందు థియేటర్లను బంద్ చేయాలంటూ నిర్ణయించడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. థియేటర్లను మూసివేయాలంటూ 'ఆ నలుగురు' ఒత్తిడి చేస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో సమగ్రంగా విచారించాలని కోరారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు బృందంగా ఏర్పడి అవాంఛనీయ నిర్ణయాలు తీసుకోవడంపై విచారించాలని సూచించారు. సినిమా హాళ్లు మూసివేయడం వల్ల ఎన్ని సినిమాలు ప్రభావితమవుతాయి? ఎంత మేర పన్ను ఆదాయానికి గండి పడుతుంది? తదితర వివరాలు సేకరించాలని నిర్దేశించారు. ఈ మేరకు శుక్రవారం కుమార్ విశ్వజిత్‌తో ఆయన మాట్లాడారు.

అక్రమ మైనింగ్ కేసులో వంశీ అనుచరుడు రంగాకు రిమాండ్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమ మైనింగ్‌పై గన్నవరం పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి మోహన్‌రంగాకు రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఈ కేసులో ఏ1, ఏ2లుగా ఉన్న వంశీ, ఆయన అనుచరుడైన రంగాపై పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను కోర్టు అనుమతించింది. పీటీ వారెంట్ కోసం కింది కోర్టును కోరకుండా పోలీసులను నిలువరించాలని హైకోర్టులో వంశీ వేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై ఈ నెల 29వ తేదీ వరకు స్టే ఉంది. దీంతో ఏ2గా ఉన్న రంగాను పోలీసులు ఉదయం కోర్టులో హాజరుపర్చగా జూన్ 6 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వంశీ, ఆయన అనుచరులు మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టి రూ.కోట్ల ప్రభుత్వ సంపదను కొల్లగొట్టారని విజిలెన్స్ నివేదికలో తేలింది. దీని ఆధారంగా జిల్లా గనుల శాఖాధికారి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభ వాయిదా: హర్షకుమార్

సీతానగరం, టి.నగర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చెప్పారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు అనుమతి కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశామని, కోర్టు దాన్ని జూన్ 5కు వాయిదా వేసిందన్నారు. కోర్టు అనుమతి పొందిన తర్వాత సభ నిర్వహిస్తామన్నారు.

నాకు తెలీదు.. సంబంధం లేదు

- దాదాపు అన్ని ప్రశ్నలకు వంశీ సమాధానాలు ఇవే
- నకిలీ ఇళ్ల పట్టాల కేసులో ముగిసిన మొదటి రోజు కస్టడీ



కంకిపాడు స్టేషన్‌కు వల్లభనేని వంశీని తీసుకొస్తున్న పోలీసులు

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-హనుమాన్ జంక్షన్: 'నాకు తెలీదు.. సంబంధం లేదు' కస్టడీలో పోలీసులు ఏ ప్రశ్న అడిగినా వంశీ నుంచి వచ్చిన సమాధానాలు ఇవేనని తెలిసింది. ఇళ్ల పట్టాలు ఎక్కడ తయారుచేశారు? వాటిని ఎక్కడ ముద్రించారు? రెవెన్యూ అధికారి సంతకంతో కూడిన స్టాంపును ఎలా తయారు చేశారు? మీ పర్యవేక్షణలోనే ఇవన్నీ జరిగాయా? ఎవరెవరికి పట్టాలు ఇవ్వాలనేది మీరే సూచించారా? ఇలా పోలీసులు పలు రకాలుగా ప్రశ్నలు సంధించినా, ఇంతకుమించి పెద్దగా బదులు రాలేదని సమాచారం.

నాలుగున్నర గంటలు.. 20 ప్రశ్నలు

కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో 2019 ఎన్నికల సమయంలో వివిధ గ్రామాల్లో నకిలీ ఇళ్ల పట్టాలు పంచారని నమోదైన కేసులో పోలీసులు వంశీని రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం విజయవాడలోని జిల్లా జైలు నుంచి హనుమాన్ జంక్షన్ పోలీసులు తీసుకుని కంకిపాడు తీసుకొచ్చారు. వైద్యపరీక్షలు నిర్వహించి కంకిపాడు స్టేషన్‌కు తరలించారు. అక్కడ గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ పర్యవేక్షణలో హనుమాన్ జంక్షన్ సీఐ సత్యనారాయణలు విచారించారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు 20 ప్రశ్నలు వేశారు. న్యాయవాదులు దేవిసత్యశ్రీ, తానికొండ చిరంజీవి సమక్షంలో ప్రశ్నించారు. శనివారం కూడా విచారణ నిర్వహించాల్సి ఉండటంతో వంశీని కంకిపాడు స్టేషన్‌లోనే ఉంచారు. శ్వాససంబంధ సమస్య ఉండడంతో సీపాప్ పరికరాన్ని వినియోగించేందుకు వంశీకి నూజివీడు కోర్టు అనుమతినిచ్చింది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం పోలీసులు అడిగిన ముఖ్యమైన ప్రశ్నలు.. వాటికి వంశీ ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి..

ప్రశ్న: ఆ ఎన్నికల్లో నకిలీ ఇంటి పట్టాలు ఎందుకు పంచారు?
జవాబు: నాకు తెలీదు. నేను పంచలేదు.
వీటిని ఎక్కడ ముద్రించారు? మీ కార్యాలయంలోనే తయారుచేశారా?
నాకేం తెలీదు.
నకిలీ పట్టాలపై వేసిన రెవెన్యూ అధికారుల ఫ్యాక్స్‌మైల్ ఎక్కడిది?
నాకు సంబంధం లేదు
ఏం ప్రయోజనం ఆశించి నకిలీ ఇంటి పట్టాలు పంచారు?
అవి నకిలీ కావు. పొజిషన్ సర్టిఫికెట్లే. ఎప్పటినుంచో ఉంటున్నవారికే ఇచ్చాం.

కేశవరావు, నాగేశ్వరరావుల మృతదేహాలను అప్పగించేలా ఆదేశించండి

- హైకోర్టులో మృతుల కుటుంబ సభ్యుల వ్యాజ్యాలు
- నేడు విచారణ

ఈనాడు, అమరావతి: ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్, మావోయిస్టు పత్రిక 'అవామ్-ఇ-జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జ వెంకట నాగేశ్వరరావు ఎలియాస్ నవీన్‌ల మృతదేహాలను తమకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మృతుల కుటుంబ సభ్యులు శుక్రవారం హైకోర్టులో అత్యవసర వ్యాజ్యాలు దాఖలు చేశారు. స్వగ్రామాల్లో సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేశవరావు మృతదేహం కోసం ఆయన సోదరుడు ఢిల్లేశ్వరరావు, తల్లి వ్యాజ్యం వేశారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. సజ్జ వెంకటనాగేశ్వరరావు తరఫున ఆయన సోదరుడు శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, బంధువులు మరో ముగ్గురు వ్యాజ్యం వేశారు. బాపట్ల జిల్లా చీరాలలో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు ధర్మాసనం శనివారం విచారణ చేయనుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపుర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో ఈ నెల 21న చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో కేశవరావు, వెంకటనాగేశ్వరరావుతోపాటు మరికొందరు మరణించిన విషయం తెలిసిందే. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ డీజీ, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ, చీరాల ఒకటో పట్టణ రాణా పోలీసు ఇన్‌స్పెక్టర్‌లు తమ వారి మృతదేహాలను అప్పగించడానికి నిరాకరించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని పిటిషనర్లు కోరారు. వారి వైఖరిని చూస్తుంటే.. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అనే సందేహం కలుగుతోందని తెలిపారు. గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు పొందే హక్కు మృతదేహాలకు సైతం ఉందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని మృతదేహాలను అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు.


15 చ.కి.మీ... 15 వేల మంది బలగాలు

- దండకారణ్యంలో చివరి దశకు ఆపరేషన్ కగార్
- మావోయిస్టు అగ్రనేతల అష్టదిగ్బంధనం

ఈనాడు, హైదరాబాద్: పదిహేను చదరపు కిలోమీటర్ల పరిధిలో... పదిహేను వేల మంది భద్రతా బలగాలు... ఇదీ ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో నెలకొన్న పరిస్థితి. మావోయిస్టు అగ్రనేతలంతా ఈ కొద్ది ప్రాంతంలోనే దాగి ఉన్నారనే సమాచారంతో చుట్టుముట్టిన భద్రతా బలగాలు రోజురోజుకూ చొచ్చుకెళుతున్నాయి. లొంగిపోవడం మినహా మరో మార్గం లేకపోవడంతో కొందరు అగ్రనేతల తరఫున ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికల్లా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఉనికి లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. మొదట దాదాపు 45 వేల మంది భద్రతా బలగాలు దండకారణ్యం నలువైపుల నుంచి లోనికి చొచ్చుకుని వెళుతూ ఎక్కడికక్కడ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకున్నాయి. వీటి చుట్టుపక్కల ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో పదుల సంఖ్యలో మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందగా... అంతకు రెట్టింపు సంఖ్యలో లొంగిపోయారు. ఇటీవల పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల కారణంగా కొంతమేరకు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని వెనక్కి పంపారు. అయితే, తమ వ్యూహాన్ని మాత్రం కొనసాగించారు. దాని ఫలితంగా... పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్... ఎదురుకాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. ఇప్పుడిక కేవలం 15 చదరపు కిలోమీటర్లు తప్ప మిగతా ప్రాంతమంతా భద్రతా బలగాల చేతిలోకి వచ్చింది. నారాయణపుర్, బీజాపుర్, దంతెవాడల మధ్య విస్తరించిన ఈ దట్టమైన అడవిలోనే మావోయిస్టుల మిగిలిన అగ్రనేతలంతా దాగి ఉన్నారని అధికారులు బలంగా నమ్ముతున్నారు. తమ వ్యూహాన్ని కొనసాగిస్తున్న 15 వేల మంది భద్రతా బలగాలు నలువైపుల నుంచి కమ్ముకొస్తుండటంతో పార్టీ అగ్రనేతల పరిస్థితి ఏమవుతుందన్నది ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఈ 15 చదరపు కిలోమీటర్లను స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ఎక్కువ రోజులు పట్టకపోవచ్చని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణకు సివిల్ సప్లైస్ భవన్

- జూన్ ఒకటి నుంచి పూర్తిగా వినియోగం
- రెండు రాష్ట్రాల పౌర సరఫరాల మంత్రుల భేటీలో నిర్ణయం
- ధాన్యం సేకరణలో తెలంగాణ ముందుంది: నాదెండ్ల మనోహర్
- ఆస్తుల పంపకాలపై చర్చలతో ముందడుగేస్తాం: ఉత్తమ్



హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న తెలుగు రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు సౌరభ్‌గౌర్, డీఎస్ చౌహాన్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లైస్ భవన్‌ను తెలంగాణ పౌరసరఫరాల సంస్థ ఇకపై పూర్తిస్థాయిలో ఉపయోగించుకోనుంది. ఇప్పటివరకు ఇందులో సగభాగం తెలంగాణ, మిగతా సగం ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థల అధీనంలో ఉన్నాయి. తమకున్న 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఏరియాని తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ అప్పగించనుంది. జూన్ ఒకటి నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. ఏపీ భాగం ఖాళీగా ఉండగా, తమ భాగం ఆఫీసు అవసరాలకు సరిపోవడం లేదంటూ తెలంగాణ పౌరసరఫరాల విన్నవించగా ఈ నిర్ణయం జరిగింది. ఇదే విషయాన్ని శుక్రవారం తెలంగాణ, ఏపీ పౌర సరఫరాల శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్‌లు సంయుక్తంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన విధివిధానాలను ముమ్మందు రూపొందిస్తామని నాదెండ్ల తెలిపారు.

ఆస్తుల బదిలీపై చర్చలు

సివిల్ సప్లైస్ భవన్‌లో శుక్రవారం జరిగిన రెండు రాష్ట్రాల పౌర సరఫరాల శాఖల సమావేశానికి మంత్రులు ఉత్తమ్, నాదెండ్లతోపాటు కమిషనర్లు డీఎస్ చౌహాన్, సౌరభ్‌గౌర్ హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఏపీ మంత్రి, కమిషనర్‌లు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సమావేశంలో. .. ఆస్తులు, పౌర సరఫరాల శాఖలో ఉత్తమ టెక్నాలజీ, ఇరురాష్ట్రాల మధ్య ధాన్యం అక్రమ రవాణా అడ్డుకట్టపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "తెలంగాణ పౌర సరఫరాల శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను సివిల్ సప్లైస్ భవన్‌కు తీసుకురావాలని నిర్ణయించి నాదెండ్లతో సంప్రదించాం. ప్రాథమికంగా సివిల్ సప్లైస్ భవన్‌లో ఏపీకి ఉన్న సగభాగాన్ని తెలంగాణకు ఇవ్వబోతున్నారు. పౌరసరఫరాల సంస్థకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆస్తుల పంపకాలపై ఉన్న సమస్యలపై చర్చలతో ముందడుగేస్తాం. 10వ షెడ్యూల్‌లోని కొన్ని కార్పొరేషన్లకున్న ఆస్తులను మొత్తంగా తెలంగాణకు బదిలీ చేసే విషయంపై చర్చిస్తున్నాం. సివిల్‌సప్లైస్ భవన్ మొత్తాన్ని మేం టేకోవర్ చేస్తున్నాం. శాంతిశిఖర అపార్ట్‌మెంట్‌లో ఉద్యోగులుండే 16 ఫ్లాట్లను సైతం ఏపీ క్రమక్రమంగా తెలంగాణకే అప్పగించనుంది" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

తెలంగాణకు మనస్ఫూర్తిగా ఇస్తున్నాం: నాదెండ్ల

"తెలుగు రాష్ట్రాలు ఒకరికి ఒకరు సహాయంగా ఉండాలి. సివిల్‌సప్లైస్ భవన్‌లో ఏపీకి చెందిన 25 వేల చదరపు అడుగుల స్థలాన్ని తెలంగాణకు ఉపయోగపడేలా మనస్ఫూర్తిగా ఇస్తున్నాం. తెలంగాణ పౌరసరఫరాల సంస్థ కొన్ని అద్భుతమైన సంస్కరణలు అమలు చేస్తోంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ తొలిసారి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతిని ప్రారంభించింది. విదేశాలకు తెలంగాణ బియ్యం ఎగుమతులను పెంచడానికి ఏపీలోని కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి పోర్టుల్లో తెలంగాణ కోసం చేయగలిగే ఏర్పాట్లపై సమావేశంలో చర్చించాం" అని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ ముందుంది. ఇక్కడ అద్భుతంగా ధాన్యం దిగుబడులు వచ్చాయని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. "ఇరు రాష్ట్రాల్లోనూ రికార్డుస్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరిగింది. ధాన్యం అమ్మకాలపై రైతులు ప్రభుత్వాలపైనే అధికంగా ఆధారపడి ఉన్నారు. గతంలో ఇంతగా ఉండేది కాదు. కొనుగోళ్లలో సమస్య రాకుండా అన్నదాతలను కాపాడాలన్న ఆలోచనలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు" అని ఆయన వివరించారు.

అద్దె ఒప్పందం జరిగింది: సివిల్‌సప్లైస్ భవన్‌ను తెలంగాణ పౌరసరఫరాల సంస్థ అద్దెకు తీసుకునేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించినట్లు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ అద్దె ఒప్పందంపై శుక్రవారం ఇరుసంస్థలు సంతకాలు చేశాయని పేర్కొంది.



ఎంత త్వరగా ప్రారంభిస్తే.. అంత సులువు

మంచి శరీర సౌష్ఠవం కోసం కృషిని ప్రారంభించేందుకు మీరెంత ఎక్కువ కాలం వేచిచూస్తూ కూర్చుంటే.. దాన్ని పొందడం అంత కష్టంగా మారుతుంది. ఎంత త్వరగా ప్రయత్నాన్ని మొదలుపెడితే.. మంచి శరీరాకృతి అంత త్వరగా అది మీకు దక్కుతుంది. దాన్ని నిలబెట్టుకోవడమూ సులువవుతుంది. ఈ రోజే ప్రారంభించగల పనిని రేపటికి వాయిదా వేసి ఎదురుచూడకండి.

– మెకంజీ స్మిత్, ఫిట్‌నెస్ కోచ్




సెలవుల్లో ఎక్కడికెళదాం?ఏం నేర్చుకుందాం? అని ఆలోచించే వయసు. కానీ డిగ్రీ ఫీజుకైనా వస్తాయని భావించిందీ అమ్మాయి. దమ్మాయిగూడకు చెందిన ఈమె పేరు శ్రావణి. ఇంటర్ పూర్తిచేసింది. కూలి పనులకెళ్లే అమ్మానాన్నల కష్టాన్ని గుర్తించి 'నేను సైతం' అంటూ ఆసరాగా నిలిచిందిలా..!

– ఎన్. యాదగిరి, ఫొటోగ్రాఫర్, హైదరాబాద్

వసుంధర

vasundhara@eenadu.in

మీకు తెలుసా?



అప్పుడే పుట్టిన శిశువులు నవ్వుతుంటారు కదా! అయితే, ఇది నిజమైన నవ్వు కాదట. దీన్నే 'రిఫ్లెక్స్ స్మైల్' అంటారట. అంటే ఇదో ముఖ కవళిక అంతే. వాళ్ల బుగ్గనో, పొట్టనో తాకినప్పుడు ఇలా స్పందిస్తారు కానీ, నిజంగా నవ్వరట. అయితే, వాళ్లలో 'సోషల్ స్మైల్' డెవలప్ అవడానికి కనీసం 6–12వారాల సమయం పడుతుందట. ఇది బిడ్డ ఎదుగుదలలో కీలక దశ.



“ మహిళలు ఆర్థిక అంశాల్లో చాలా పక్కాగా ఉంటారు. రుణాలు సకాలంలో చెల్లిస్తారు. ఎగవేత ఆలోచనే ఉండదు వాళ్లకి. అందుకే మా సంస్థ మహిళలకే రుణాలు అందిస్తోంది. వ్యాపారంలో విజయం సాధించడానికి స్త్రీలు తాము ఉన్న రంగంలో మార్కెట్‌ను బాగా అర్థం చేసుకోవాలి. ఆపై మంచి బృందాన్ని తయారుచేసుకోవాలి.

- శ్వేత అప్రమేయ, వ్యవస్థాపకురాలు-సీఈఓ, 'అర్థ్'



మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభ వేడుకల్లో... తెలంగాణ సంప్రదాయ నృత్యం పేరిణి వీక్షకుల్ని ఆకట్టుకుంది. ఆ తరవాత కూడా ఎక్కడ చూసినా దీనికోసమే చర్చ. 250 మంది యువ కళాకారులు దీనిలో పాల్గొన్నారు. అయితే వీరి ఎంపిక, సమన్వయం, మేకప్ తదితర అంశాల వెనక ఓ యువతి ఉంది. ఆమే ముల్బుకార్ శర్వాణి శ్రియ.

పేరిణి వెనక కథ...

మాది మహబూబ్‌నగర్ జిల్లాలోని పెద్ద ఆదిరాల. అమ్మ శారద, ఉపాధ్యాయురాలు. నాన్న అశోక్ రాజ్ ప్రైవేట్ ఉద్యోగి. ఇద్దరికీ కళలంటే మక్కువే. అందుకే నాకూ, చెల్లి గుణ స్ఫూర్తికీ ఆరేళ్ల వయసు నుంచీ పేరిణి నృత్యం నేర్పించారు. చాలా నృత్య రీతులు ఉండగా ఇదే ఎందుకంటే... నాన్నకు ప్రాంతీయ అభిమానం ఎక్కువ. తెలంగాణ ఖ్యాతిని దేశవిదేశాల్లో మేం ప్రతిబింబించాలని కోరుకునేవారు. అలా పేరిణి నేర్చుకున్నాం. దేశవ్యాప్తంగా ప్రదర్శనలూ ఇచ్చాం. చెల్లీ నేనూ నాట్యగురువులుగా మలక్‌పేటలో ఇన్‌స్టిట్యూట్‌నూ నడుపుతున్నాం. అయితే ఇది ప్రవృత్తి మాత్రమే. యూపీఎస్సీ నా కల. దాన్ని సాధించి, కళలు చదువుకు అడ్డుకాదు అని నిరూపించడమే నా లక్ష్యం.

నెలరోజుల కష్టం...

గచ్చిబౌలిలో ప్రదర్శన అవకాశం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ద్వారా వచ్చింది. 250 మంది డ్యాన్సర్లు ఒకే వేదికపై ఉండాలన్నప్పుడు చాలా కంగారుగా అనిపించింది. ఇంతమందిని ఎంపిక చేసుకోవడం, వారందరినీ ఒక తాటిపైకి తేవడం సాధ్యమేనా అన్న ఆలోచనలో పడ్డాం మా బృందమంతా. ఈ కళమీద మాకున్న ఇష్టం... అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పేరిణి నృత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాలన్న ఆశే మమ్మల్ని నడిపించింది. రాష్ట్రవ్యాప్తంగా కళాకారుల్ని ఎంపిక చేసుకున్నాం. ముందు 13 నుంచి 18 ఏళ్ల వయసున్న వాళ్లే అనుకున్నాం. కానీ చిన్నపిల్లలు కూడా ఆసక్తి చూపించడం, ఇందుకు కావాల్సిన సామర్థ్యాలు వాళ్లలో ఉండటం చూసి వారినీ తీసుకున్నాం. ప్రదర్శన కోసం జుగల్‌బందీ థీమ్‌ను ఎంపిక చేసుకున్నాం.

ఒకరు చేసే స్టెప్స్ ఇంకొకరితో కలవకపోవడం ఈ నృత్యం ప్రత్యేకత. అలా అని ఆగిపోరు. ఎవరికి ఇచ్చిన స్టెప్స్ వాళ్లు ఏకకాలంలో చేస్తారు. నెలరోజులపాటు ఉదయం 9:30 నుంచీ సాయంత్రం 5:30 వరకూ ప్రాక్టీసు చేశాం. వీళ్లందరి మధ్య సమన్వయానికి 18 మందిమి టీమ్‌గా ఏర్పడి బాధ్యతలు పంచుకున్నాం. అంతా సజావుగా సాగుతున్నప్పటికీ... ప్రదర్శన ముందు రోజు కార్యక్రమంలో కళాకారులు నిల్చొనే ఉండాలని చెప్పారు. టీమ్‌లో చిన్నపిల్లలు ఉన్నారు. దాదాపు రెండున్నర గంటలు నిల్చొని ఉండటం సాధ్యమా అనిపించింది. కానీ కళ పట్ల వాళ్లకు ఉన్న మక్కువ ఈ కష్టాన్ని దాటేలా చేసింది. ఇంత మందికి మేకప్ చేయడమూ కష్టమైంది. బయటి నుంచీ 10 మంది మేకప్ ఆర్టిస్టులు వచ్చారు. ఉదయం 10:30కి మేకప్ వేయడం మొదలుపెడితే... సాయంత్రం ఐదైనా ఇంకా కళాకారులు మిగిలిపోయారు. అందుకే మేమూ మేకప్‌లో సాయం చేశాం. ప్రతి ఒక్కరూ సోలో ప్రదర్శన ఇస్తే ఎంత చక్కగా ముస్తాబవుతారో... అంత అందంగా తీర్చిదిద్దాం. ఇంతమంది కలిసి కట్టుగా పనిచేశాం కాబట్టే... కార్యక్రమం అంత విజయవంతంగా పూర్తిచేయగలిగాం. ఇది మా సమష్టి కృషి.

మెదడుకీ ఉపవాసం తప్పనిసరి!



నేటి తరం ఆరోగ్యానికీ ప్రాధాన్యత ఇస్తున్నారు.. ముఖ్యంగా అమ్మాయిలు ట్రెండుల్ని అనుసరిస్తూ రకరకాల ఫాస్టింగ్‌లు చేస్తున్నారు. శరీరం సరే.. మరి మెదడు సంగతేంటి? అందుకే ఈ 'ఎమోషనల్ ఫాస్టింగ్' తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అదేంటంటే..

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వారంలో ఒక రోజు ఉపవాసం ఉండి శరీరాన్ని ఎలా అయితే డీటాక్స్ చేస్తామో, మన మెదడుని కూడా అలానే ఉంచాలట. అడపాదడపా చేసే ఉపవాసం జీర్ణవ్యవస్థను మెరుగుపరిచినట్లే ఈ ఎమోషనల్ ఫాస్టింగ్ మెదడు పనితీరుని వేగవంతం చేసి, మానసిక ఉత్తేజాన్నిస్తుంది. జంక్, మసాలా ఫుడ్స్‌ని తిన్నప్పుడు శరీరం బరువైనట్లే... నిరంతర పనులూ, ఆలోచనలూ, ఆందోళనా, ఒత్తిడీ మన మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. దాంతో జ్ఞాపకశక్తి మందగిస్తుంది. మరి ఈ ఉపవాసం ఎలా చేయాలి అంటే? రోజులో కొన్ని నిమిషాలు మౌనంగా ఉండటం, వారంలో ఒకరోజు సోషల్ మీడియా చూడకుండా హద్దులు పెట్టుకోవడం, చిన్నచిన్న సంతోషాల్ని ఆస్వాదించడం, ప్రకృతిలో గడపడం... ఇవన్నీ మనలోని ప్రతికూల భావోద్వేగాల్ని నియంత్రించేవే. ఇవే చేయమని చెబుతుంది ఎమోషనల్ ఫాస్టింగ్ ట్రెండ్ కూడా. దీనివల్ల అనవసరమైన ఆందోళనలు దూరమవుతాయి. ప్రశాంతతా లభిస్తుంది.

ఇకనైనా మట్టిలో ఆడనివ్వండి!



పిల్లలు మట్టిలో ఆడుతుంటే... వద్దని చెప్పేస్తాం. చేతులు మురికి చేసుకుంటున్నారని కోప్పడతాం. కానీ, ఇది వారిలో వ్యాధినిరోధక శక్తిని పెంచడమే కాదు... మరెన్నో ఆరోగ్యకర ప్రయోజనాలనూ అందిస్తుందని తెలుసా? 2024లో ఓ అమెరికన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం... మట్టిలో ఉండే 'మైకోబ్యాక్టీరియం వాక్సీ' అనే సూక్ష్మజీవులు... చిన్నారుల శరీరంలోకి ప్రవేశించి రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయని వెల్లడిస్తోంది. అంతేకాదు, ఇవి సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక ఆనందాన్నీ పెంచుతాయట. అలర్జీలు, ఆస్తమా వంటి వ్యాధుల ప్రమాదాన్నీ తగ్గిస్తాయి. ఇక, మట్టి టెక్స్చర్, చల్లదనం, వాసన... వంటివి ఇంద్రియజ్ఞానాన్ని ఉత్తేజపరుస్తాయి. ఫలితంగా వారి నాడీ వ్యవస్థ బలోపేతం అవుతుంది. సులువుగా దేన్నైనా గ్రహించగల శక్తీ ఏర్పడుతుందట. అలానే, మట్టితో ఆటలాడుతూ తయారుచేసే ఇళ్లు, జంతువులు... వంటి బొమ్మ రూపాలు వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. దీంతో స్క్రీన్ టైమ్ కూడా తగ్గి శారీరకంగానూ చురుగ్గా ఉంటారట. మరి ఇప్పుడైనా వారిని మట్టిలో ఆడనిస్తారా?

ప్రయాణాల్లో... ప్రకృతి కోసం!

కారులోంచో, బస్సులోంచో వెళ్తున్నప్పుడు గుట్టల్లా చెత్త పోగేసి కనిపిస్తోంటే ఎలా ఉంటుంది? ఆ ప్రదేశాన్ని దాటే కొద్ది నిమిషాల్లో ఉక్కిరిబిక్కిరి అవుతాం. దుర్వాసన లేకపోయినా ఏళ్లపాటు భూమిలో కలవకుండా, వర్షాకాలంలో పెట్టే ఇబ్బందులు తక్కువా? అందుకే వేడుకలనీ, సెలవులనీ ప్రయాణాలు కడుతోంటే మీవంతుగా వాటికి అడ్డుకట్ట వేయండి. ఎలాగంటే...

- అనవసర బరువని బాటిల్ వెంట తీసుకెళ్లం. కావాల్సినపుడల్లా వాటర్ బాటిల్ కొనుక్కుని తాగేస్తాం. పూర్తవగానే బాటిల్‌ని పడేస్తాం. కానీ ఏటా కేవలం మనదేశంలోనే 1400 కోట్ల బాటిళ్లు అమ్ముడవుతాయని అంచనా. వాటిలో తిరిగి ఉపయోగించేవారు ఎంతమంది? అంటే అవన్నీ చెత్తరూపంలో భూమిపై మిగులుతున్నట్లేగా. దీనికి తేలికైన పరిష్కారమేంటో తెలుసా? వెంట స్టీల్ లేదా రీయూజబుల్ బాటిల్ తీసుకెళ్లండి. అయిపోయినప్పుడల్లా ఎక్కడైనా నింపుకోవచ్చు. ఒక్కదాన్ని వెంట తీసుకెళితే... ఎంతో ప్లాస్టిక్‌కి అడ్డుకట్ట వేస్తున్నట్లే.



- కార్లలో, ముఖ్యంగా చిన్నపిల్లలున్న అమ్మల బ్యాగుల్లో టిష్యూల ప్యాకెట్లు తప్పక ఉంటాయి కదూ! పిల్లలు స్నాక్స్‌తిన్నా, వాళ్ల ముఖం, చేతులు శుభ్రం చేయాలన్నా అవి కావాల్సిందే. ఒక్కటి ఎక్కడ సరిపోతుంది? ఒకదాని తరవాత ఒకటి వాడుతూ పోతాం. ఫలితం... చెత్త పోగేస్తున్నట్లే. చిన్న న్యాప్కిన్లు ఇప్పుడు బోలెడు దొరుకుతున్నాయి. వాటిని దగ్గర పెట్టుకుని వాటితో శుభ్రం చేయండి. ఇంటికొచ్చాకో, బస చేసే చోటో ఉతుక్కుంటే సరి. త్వరగా ఆరతాయి కూడా. శుభ్రతకి పట్టేది కొన్ని నిమిషాలే కానీ... చెత్త పోగవకుండా ఆపినవాళ్లం అవుతాం.
- ప్రయాణాల్లో ఆకలేస్తుందని చాలావరకూ ఆహారం ప్యాక్ చేసుకుని వెళతాం. లేదా పార్శిల్ తెప్పించుకుంటాం. ప్లాస్టిక్ డబ్బాలకు బదులుగా స్టీల్ వాటిని ఉపయోగించండి. కరిగి ఆహారం ద్వారా పొట్టలోకి వెళుతుందన్న భయం ఉండదు. తినడం సులభం. ప్లాస్టిక్కూ పోగవదు. ఇవేకాదు, స్పూన్లు, స్ట్రా వంటివి దగ్గరుంచుకున్నా మంచిదే.
- నాలుగు రోజుల ప్రయాణం. ఈ మాత్రానికి బ్రష్, పేస్ట్, క్రీములు వంటివన్నీ మోసుకెళ్లడం ఎందుకు అనిపిస్తుంది. కానీ ఒక్కసారి వాడి పడేసే బ్రష్‌లు, షాంపూ ప్యాకెట్లతో ఎంత నష్టమో తెలుసా? అలాగని చిన్నకిట్‌లను కొన్నా పోగయ్యే ప్లాస్టిక్ తక్కువా? అందుకే తిరిగి వాడుకునే ట్రావెల్ కిట్‌లు దొరుకుతున్నాయి. వాటిని కొనుక్కోండి. బాడీ వాష్, షాంపూ, కండిషనర్... ఇలా అన్నింటినీ వాటిలో పోసుకోవచ్చు. తిరిగి కావాల్సినప్పుడు శుభ్రం చేసుకుని వాడుకోవచ్చు. బరువు భయమూ ఉండదు. చెత్త చేర్చామన్న బెంగా ఉండదు.
- ఎక్కడికైనా వెళితే గుర్తుగా ఉంటుందని షాపింగ్ చేయడం మనకు అలవాటే. ఒక్కోటీ కొనే చోట ఒక్కో కవరు చేతికొస్తుంది. ఏదో అవసరమొచ్చి మనమైనా కొనాల్సిందే. ఈ తిప్పలన్నీ ఎందుకు? చక్కగా వెంట ఓ క్లాత్ బ్యాగును తీసుకెళ్లండి. బరువూ ఉండవు, ఎక్కువ కాలం వస్తాయి. ముఖ్యంగా సమయానికి అక్కరకొస్తాయి. తిరిగొచ్చేటప్పుడు కార్బన్ ఫుట్ ప్రింట్ వదల్లేదన్న సంతృప్తి.
- ప్రయాణాల కోసం ఈ-టికెట్లనే ఆశ్రయించండి. ఐడీ ప్రూఫ్‌లు వంటివీ డిజిటల్ రూపంలోనే దాచుకుంటే మేలు. చిన్న ప్రింటే కానీ కాగితం భూమిలో కలవడానికీ సమయం పడుతుంది. పైగా దానికోసం చనిపోయే చెట్ల గురించి ఆలోచించండి. ఒక్క జాగ్రత్త ఎంత సాయానికి కారణమవుతుందో. అంతేకాదు, తొందరలో ఎక్కడో పెట్టి మర్చిపోతామా... వాటిని వెతకడం అదో పెద్ద పని. అనవసర కంగారు కూడా. ఇవీ తప్పుతాయి. అందుకే... ఎక్కడికి వెళ్తున్నా... వీటి గురించి ఆలోచిస్తారుగా? కార్బన్ ఫుట్ ప్రింట్ వదలకుండా తిరిగి వస్తారుగా!

బంగారం - వెండి



23న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,040	89,800	1,00,230
విజయవాడ	96,500	89,400	1,00,600
ప్రొద్దుటూరు	96,200	88,500	99,200
రాజమహేంద్రవరం	98,500	89,640	99,500
విశాఖపట్నం	97,180	89,400	1,05,000
తమిళనాడు	-----	89,400	1,11,000



చంద్రభేదన ప్రాణాయామం

ముందుగా యోగా మ్యాట్‌పైన వజ్రాసనం, పద్మాసనం లేదా సుఖాసనంలో కూర్చోవాలి. ఆపై నెమ్మదిగా కళ్లు మూసి ప్రశాంతంగా ఉండండి. నడుమును నిటారుగా ఉంచండి. కుడిచేత్తో నాసిక ముద్ర పెట్టండి. చూపుడు, మధ్య వేళ్లను మడిచి మిగిలిన వేళ్లను చాచి ఉంచండి. ఇప్పుడు సున్నితంగా ఎడమచేతిని ఎడమ మోకాలిపై పెట్టండి. ఆపై కుడిచేతి బొటనవేలితో కుడి నాసికా రంధ్రాన్ని మూసి ఉంచి... ఎడమ నాసికారంధ్రం ద్వారా మెల్లగా గాలి తీసుకోండి. ఇప్పుడు కుడి చేతి ఉంగరం వేలు, చిటికెన వేలితో ఎడమ నాసికా రంధ్రాన్ని మూసి ఉంచి తీసుకున్న గాలిని కుడి నాసికా రంధ్రం ద్వారా వదిలిపెట్టండి. తీసుకున్న గాలి కంటే వదిలేగాలి మరింత నెమ్మదిగా ఉండేట్టు చూడండి. ఇలా పలుమార్లు చేయండి. గాలిని ఎడమ నాసికా రంధ్రం నుంచి తీసుకుంటూ... కుడి నాసికా రంధ్రం నుంచి వదలుతూ ఈ శ్వాస ప్రక్రియ జరగాలి.

ఉపయోగాలు: శరీరానికి చల్లదనాన్ని అందించి, ప్రశాంతతను ఇస్తుంది. ఒత్తిడి, ఆందోళన ఉండవు, శరీరాన్ని సమతుల్యం చేస్తుంది.

జాగ్రత్తలు: బిగింపులు లేకుండా ఎవరైనా ఈ ప్రాణాయామాన్ని చేయొచ్చు.

అర్ధ ఉష్ట్రాసనం

ఉష్ట్రం అంటే ఒంటె. యోగా మ్యాట్‌పైన వజ్రాసనం(మోకాళ్లను వంచి మడమలపైన కూర్చొనే భంగిమ)లో కూర్చోండి. ఆపై మోకాళ్లమీద ఒత్తిడి పడకుండా సున్నితంగా మోకాళ్లపైన నిల్చొని రెండు కాళ్ల మధ్య కొంత దూరం ఉంచండి. కాలి వేళ్ల వెనక్కు మడచి విశ్రాంతంగా నిల్చొని, ఇప్పుడు రెండు చేతులతో నడుముకు ఊతం ఇస్తూ మోచేతులను వెనక వైపు ఒత్తండి. ఇప్పుడు గాలి తీసుకుంటూ తలను, భుజాలను, ఛాతీ భాగాన్నీ, తర్వాత నడుమును ఫొటోలో చూపిన విధంగా వెనక్కి వంచుతూ వెళ్లండి. ఈ స్థితిలో 10-15 సెకన్లు ఉంచి పిమ్మట యథాస్థానానికి రండి. పైకి లేచేటప్పుడు వెళ్లిన మార్గంలోనే ప్రశాంతంగా వెనక్కు రావాలి. ఉష్ట్రాసనం పూర్తిస్థాయిలో చేయనివారు అర్ధ ఉష్ట్రాసనం చేసి ప్రయోజనాలకు పొందొచ్చు.



ఉపయోగాలు: 1.థైరాయిడ్ గ్రంథి బాగా పనిచేస్తుంది. 2. పొట్ట కండరాలను బలపరుస్తుంది. 3. జీర్ణశక్తిని పెంచుతుంది. గ్యాస్ సమస్యలు, మలబద్ధకం తగ్గిస్తుంది. ఆకలిని కలిగిస్తుంది.

జాగ్రత్తలు: మోకాళ్ల నొప్పులు ఉన్నవాళ్లు, వెన్ను, మోకాళ్లు, భుజాల సర్జరీలు అయిన వాళ్లు, తల తిరుగుడు సమస్య ఉన్నవాళ్లు ఈ ఆసనం చేయరాదు.

కన్నడ కస్తూరి... పంచాలని!



రచన, జర్నలిజం, అనువాదం... ఇవన్నీ సృజనతో కూడినవే. కానీ ఓ ప్రాంతానికి, అంశానికి పరిమితం చేసే రచనల్లో సృజనాత్మకతకు అవకాశం తక్కువ. ఈ కారణంగానే పాత్రికేయ వృత్తినీ, నగర జీవితాన్నీ వద్దనుకున్నారు దీపా భస్తి. ఆ నిర్ణయమే ఆమెకు బుకర్ పురస్కారాన్ని తెచ్చేలా చేసింది.

దీపా భస్తి పుట్టింది కర్ణాటకలోని మడికేరిలో. కొడగులో ఇంటర్ వరకూ చదువుకున్నారు. మంగళూరుకు వెళ్లి జర్నలిజంలో డిగ్రీ చేశాక బెంగళూరులో కొన్ని ఆంగ్ల పత్రికల్లో పనిచేశారు. ఈమె తాతకు సాహిత్యంపైన మక్కువ ఎక్కువ. ఆయన తెచ్చిన వివిధ భాషల పుస్తకాలతో ఇల్లు ఒక గ్రంథాలయాన్ని తలపించేది. అలా చిన్నప్పుడే దీపకు సాహిత్యంపైన ఆసక్తి కలిగింది. జర్నలిజంలో కొనసాగటం జీవనానికి భరోసా ఇచ్చినా తన సృజనకు అడ్డుకట్ట వేస్తున్నట్లనిపించేదామెకు. తనదైన రచనా శైలికి ప్రాధాన్యత దొరకలేదంటూ బాధపడేవారు. కరోనా తర్వాత తాను కోరుకున్న అంశానికి దగ్గరయ్యారు. బెంగళూరు విడిచి సొంతూరు మడికేరికి చేరుకున్నారు. అప్పుడే కన్నడ రచనల్ని లోతుగా చదివే అవకాశం దీపకు దక్కింది. ముఖ్యంగా కొడగు జిల్లాలో మహిళలు సంప్రదాయాల చక్రబంధంలో ఉండేవారు. ఈ ప్రాంతంలో పుట్టిన గౌరమ్మ తన రచనలతో వాటికి వ్యతిరేకంగా ఉద్యమించారు. వాణియ సమస్యె(మహిళల సమస్య), అపరాధి యారు(అపరాధి ఎవరు), ఆహుతి, మనువిన రాణి... వంటి గౌరమ్మ రచనలతో ఎంతో స్ఫూర్తి పొందారు దీప. గౌరమ్మ కథల సంకలనం మరెయలాగద కథెగళు(మరువలేని కథలు)... కేవలం ఓ ప్రాంతానికే పరిమితం కాకూడదని 'ఫేట్స్ గేమ్ అండ్ అదర్ స్టోరీస్' పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. అప్పటికే తానెంతో ఆరాధించే మలయాళ రచయిత ఓ.వి.విజయన్, కొడగు నవలా రచయిత కావేరి నంబిసన్‌ల రచనలు అనువదించిన అనుభవం ఉంది దీపకు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా.కె.శివరామ్ కారంత్ రచనను 'ద సేమ్ విలేజ్, ద సేమ్ ట్రీ' పేరుతో ఆంగ్లానువాదం చేశారు దీప.

బానూ ముష్తాక్ కన్నడ రచన హసీనా అండ్ అదర్ స్టోరీస్(హార్ట్ ల్యాంప్)ను మూడేళ్లపాటు శ్రమించి ఆంగ్లంలోకి అనువదించారు దీప. ఫలితంగా ప్రతిష్ఠాత్మక బుకర్ పురస్కారాన్ని బానూతో కలిసి దీన్ని అందుకున్నారు దీప. 'ఆధునిక యుగంలోనూ కట్టుబాట్ల మధ్య నలిగే మహిళలకు ఈ పుస్తకం దారి దీపం అవుతుందని కన్నడ మూలం చదివే సమయంలోనే భావించా' అంటారామె. అనువాదమూ రచనలో భాగమేనని చెప్పే దీప... బుకర్ వేదికమీద 'కన్నడ భాష అంటే పారే తేనె సెలయేరు, కురిసే పాలధార'గా అభివర్ణించి ప్రాంతీయ భాషల ప్రాధాన్యాన్ని చెప్పారు. కొవిడ్ తర్వాత భర్త సుజన్ నాణయ్యతో కలిసి మడికేరి సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో ప్రశాంత జీవితం గడుపుతున్నారు. సుజన్ నిర్వహించే కళాకారుల బృందానికి రచనా సహకారాన్నీ అందిస్తున్నారు. సొంత కథలు, నవలల రచనకు ప్రణాళికను సిద్ధం చేసుకున్న దీప... కదిలించే కన్నడ కథల్ని అనువాదం చేసేందుకు సదా సిద్ధమంటారు.

– కె.ముకుంద, బెంగళూరు

బ్యూటీ ట్రెండ్స్

సులువుగా... తగిలించేయండి!



కొద్దిరోజుల ప్రయాణమైనా ఎన్నెన్ని వెంట తీసుకెళ్లాలో! మధ్యలో ముఖం కడుక్కుందాం, ఫోన్ ఛార్జింగ్ పెడదాం అని బ్యాగులో చేయి పెడితే చాలు. అసలిది తప్ప మిగతావన్నీ బయటికి వస్తాయి. కావాల్సింది తీయడమూ, తీసినవాటిని తిరిగి సర్దడమూ రెండూ కష్టమే. అవన్నీ లేకుండా వీటిని తీసుకొచ్చేయండి.

ఛార్జర్‌కీ, ఇయర్‌పాడ్స్‌కీ...



చేతిలో ఫోన్, చెవుల్లో పాటలు మోగకుండా ప్రయాణం ఊహించగలమా? కొద్ది గంటల ప్రయాణమైతే సరే! దూరం వెళ్లాలంటే మాత్రం ఛార్జింగ్ చూసుకోవాల్సిందే. ఇయర్ ఫోన్స్, పాడ్స్ వంటివీ అందుబాటులో ఉండాల్సిందే. అందుకే ఈ పోర్టబుల్ కీ చెయిన్ కేస్‌లను తెచ్చుకోండి. ఇయర్‌పాడ్స్ ఛార్జర్, ఛార్జింగ్ కేబుల్, ఫోన్ ఛార్జర్, ఇయర్‌పాడ్స్ కేస్... వీటన్నింటినీ దీనిలో పెట్టేసుకోవచ్చు. చక్కగా బ్యాగుకి తగిలించుకుంటే తీసిపెట్టుకోవడం సులువవుతుంది.

లిప్‌బామ్ పోదు

శీతకాలంలోనే కాదు... కొందరికి ఏ కాలమైనా పెదాలు పొడిబారుతుంటాయి. అందుకని గుర్తుంచుకుని మరీ లిప్‌బామ్‌ని బ్యాగుల్లో వేసుకుని ఉంచుకుంటారు. ఎంత జాగ్రత్తగా పెట్టినీ... సమయానికి దొరకదే. ఏదో ఆటపట్టిస్తున్నట్లే నక్కి కూర్చుంటుంది. బ్యాగంతా ఖాళీ చేస్తే కానీ ఏ మూలో దొరకదు. ఈ తిప్పలు పోగొట్టడానికి వచ్చినవే ఈ లిప్‌బామ్ కీచెయిన్లు, చార్మర్లు, కేసెస్. వీటి సాయంతో బ్యాగుకు తగిలించుకుంటే సరి. సమయానికి అందుబాటులో ఉంటుంది. తీసే జంజాటాలూ ఉండవు.







ఒకేచోట... విడివిడిగా

కాస్త దూరంలో వేడుకలంటే ఫేస్‌వాష్ నుంచి లిప్‌బామ్ వరకూ అన్నీ తీసుకెళ్లాల్సిందే. అన్నీ ఒక బ్యాగులో వేసుకున్నా... సమయానికి ఏదీ దొరకదు. ఈ క్రమంలో కింద పడటం, పగలడం/ పాడవడం... ఎందుకొచ్చిన తంటా? ఈ 4 ఇన్ 1 పోర్టబుల్ టాయ్‌లెటరీ బ్యాగు తెచ్చుకోండి. క్లిప్పులు, మేకప్ సామగ్రి, క్రీములు... ఇలా అన్నింటినీ విడివిడిగా పెట్టుకోవచ్చు. ఏది అవసరమో దాన్ని తీసుకుని వాడుకుంటే సరిపోతుంది. అన్నీ అవసరం లేదు... ఒకటో రెండో చాలనుకున్నా తీసుకునే వీలుంటుంది. తగిలించుకోనూ వచ్చు.

మన పని సులువు చేస్తూ, బ్యాగులకు కొత్తందాన్ని తెస్తూ భలేగున్నాయి కదూ! మీకూ కావాలనిపిస్తే తెచ్చేసుకోండి మరి.

చాంపియన్స్

ఐపీఎల్‌లో ఈనాడు


పంజాబ్ × దిల్లీ

వేదిక: జైపుర్, రా॥ 7.30

ఐపీఎల్-18 లీగ్ దశలోనే నిష్క్రమించిన జట్లు.. ఇప్పుడు స్వేచ్ఛగా చెలరేగిపోతున్నాయి. ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకుని టాప్-2 మీద కన్నేసిన జట్లకు షాకులిస్తున్నాయి. గురువారం గుజరాత్ టైటాన్స్‌కు లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ చెక్ పెడితే.. శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ షాకిచ్చింది. గుజరాత్‌కు లఖ్‌నవూ నిర్దేశించినట్లే.. తమ ముందు సన్‌రైజర్స్ 230+ లక్ష్యాన్ని ఉంచడంతో బెంగళూరు ఎంత గట్టిగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

సన్‌రైజర్స్.. ఇంకో దెబ్బ

- ప్లేఆఫ్స్‌కు దూరమయ్యాక రెండో విజయం
- ఇషాన్ సూపర్ ఇన్నింగ్స్ ● ఆర్సీబీ ఓటమి



లఖ్‌నవూ

ప్లేఆఫ్స్‌కు దారులు మూసుకుపోయాక సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొడుతోంది. గత మ్యాచ్‌లో లఖ్‌నవూను మట్టికరిపించిన కమిన్స్ సేన.. ఇప్పుడు బెంగళూరుపై 42 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఇషాన్ కిషన్ (94; 48 బంతుల్లో 7×4, 5×6), అభిషేక్ శర్మ (34; 17 బంతుల్లో 3×4, 3×6) మెరుపులతో మొదట హైదరాబాద్ 6 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోరు సాధించింది. రొమారియో షెఫర్డ్ (2/14) మినహా ఆర్సీబీ బౌలర్లు తేలిపోయారు. అనంతరం బెంగళూరు 19.5 ఓవర్లలో ఓవర్లలో 189 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (62; 32 బంతుల్లో 4×4, 5×6), విరాట్ కోహ్లి (43; 25 బంతుల్లో 7×4, 1×6) జట్టుకు బలమైన పునాదే వేసినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. కమిన్స్ (3/28), ఇషాన్ మలింగ (2/37), నితీశ్ కుమార్‌రెడ్డి (1/13), హర్ష్ దూబె (1/20) బెంగళూరును కట్టడి చేశారు.



ఆరంభం అదిరినా..: 230 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించడానికి అవసరమైన ఆరంభమే దక్కింది ఆర్సీబీకి. మొదట కోహ్లి, ఆ తర్వాత సాల్ట్ చెలరేగి ఆడి ఛేదనలో జట్టుకు బలమైన పునాదే వేశారు. కానీ వీరి స్థాయిలో మిగతా బ్యాటర్లు ఆడకపోవడంతో ఆర్సీబీకి ఓటమి తప్పలేదు. కొన్ని మ్యాచ్‌ల విరామం తర్వాత జట్టులోకి వచ్చిన సాల్ట్.. ఆరంభంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. హర్షల్ బౌలింగ్‌లో బౌండరీ వద్ద క్యాచౌట్ అయినప్పటికీ అది నోబాల్ కావడంతో సాల్ట్ బతికిపోయాడు. అయితే మరో ఎండ్‌లో కోహ్లి మాత్రం ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో 5 ఓవర్లకే స్కోరు 55కు చేరుకుంది. కోహ్లి 41 పరుగులకు చేరుకున్నప్పటికి.. సాల్ట్ 10 పరుగులే చేయడం గమనార్హం. కానీ తర్వాత సాల్ట్ చెలరేగిపోయాడు. అంతలో కోహ్లి ఔటవడంతో ఆర్సీబీకి ఎదురు దెబ్బ తగిలింది. అయినా సాల్ట్ తగ్గలేదు. ఇంకా దూకుడు పెంచి సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. మయాంక్ (11) ఎక్కువసేపు నిలవకపోయినా 11 ఓవర్లకే స్కోరు 127కు చేరుకోవడం, సాల్ట్ క్రీజులోనే ఉండడంతో ఆర్సీబీకి మెరుగైన అవకాశాలే కనిపించాయి. కానీ తర్వాతి ఓవర్లో కమిన్స్.. సాల్ట్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ స్థితిలో జితేశ్ శర్మ, రజత్ పాటీదార్ కొన్ని ఓవర్ల పాటు నిలిచారు కానీ.. సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోయింది. ఈ ఇద్దరితో పాటు రొమారియో షెఫర్డ్ (0).. 5 బంతుల వ్యవధిలో ఔటైపోవడంతో ఆర్సీబీ ఓటమి ఖాయమైంది. ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ డేవిడ్ (1).. పరుగు తీయలేని స్థితిలో బ్యాటింగ్‌కు వచ్చి ఒక్క బౌండరీ కూడా కొట్టకుండానే వెనుదిరిగాడు. ఒక దశలో 173/3తో ఉన్న ఆర్సీబీ.. కేవలం 16 పరుగుల తేడాలో 7 వికెట్లు కోల్పోయి 189కే ఆలౌటైంది.



అభిషేక్ మొదలెడితే.. ఇషాన్ ముగించాడు: ప్లేఆఫ్స్ అవకాశాలు చేజారాక ఆడిన తొలి మ్యాచ్‌లో 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించేసిన హైదరాబాద్.. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసి 230+ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఆ తర్వాత ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ చివరి వరకు క్రీజులో నిలిచి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. గాయం నుంచి కోలుకుంటున్న రజత్ పాటీదార్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాలని నిర్ణయించుకోవడంతో ఈ మ్యాచ్‌కు తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన జితేశ్ శర్మ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. ఆ నిర్ణయంపై చింతించేలా మొదలైన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్. అభిషేక్ శర్మ తనదైన శైలిలో భారీ షాట్లు ఆడడంతో ఆరంభ ఓవర్లలో ఆర్సీబీ బౌలర్లకు దిక్కుతోచలేదు. 3.3 ఓవర్లకే స్కోరు 50కి చేరుకుంది. కానీ అదే ఓవర్లో (ఎంగిడి).. అభిషేక్ ఔటైపోవడంతో ఆర్సీబీ ఊపిరి పీల్చుకుంది. భువనేశ్వర్ వేసిన తర్వాతి ఓవర్లో హెడ్ (17) కూడా ఔటైపోయాడు. అయితే సీజన్ తొలి మ్యాచ్‌లో సెంచరీ తర్వాత పెద్ద ఇన్నింగ్స్ ఆడని ఇషాన్ కిషన్.. ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో అతను భారీ షాట్లు ఆడాడు. క్లాసెన్ (24; 13 బంతుల్లో 2×4, 2×6), అనికేత్ వర్మ (26; 9 బంతుల్లో 1×4, 3×6)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ఇషాన్.. స్కోరును 200 దాటించాడు. సన్‌రైజర్స్ ప్రధాన బ్యాటర్లలో నితీశ్ కుమార్ రెడ్డి (4) మినహా అందరూ చెప్పుకోదగ్గ స్కోర్లు సాధించారు.

హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) సాల్ట్ (బి) ఎంగిడి 34; హెడ్ (సి) షెఫర్డ్ (బి) భువనేశ్వర్ 17; ఇషాన్ కిషన్ నాటౌట్ 94; క్లాసెన్ సి) షెఫర్డ్ (బి) సుయాశ్ 24; అనికేత్ (సి) భువనేశ్వర్ (బి) కృనాల్ 26; నితీశ్ (సి) కృనాల్ (బి) షెఫర్డ్ 4; అభినవ్ (సి) సాల్ట్ (బి) షెఫర్డ్ 12; కమిన్స్ నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **231**; **వికెట్ల పతనం:** 1-54, 2-54, 3-102, 4-145, 5-164, 6-188; **బౌలింగ్:** యశ్ దయాళ్ 3-0-36-0; భువనేశ్వర్ 4-0-43-1; ఎంగిడి 4-0-51-1; సుయాశ్ 3-0-45-1; కృనాల్ 4-0-38-1; రొమారియో షెఫర్డ్ 2-0-14-2


బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) హర్షల్ (బి) కమిన్స్ 62; కోహ్లి (సి) అభిషేక్ (బి) హర్ష్‌దూబె 43; మయాంక్ అగర్వాల్ (సి) ఇషాన్ (బి) నితీష్ 11; పాటీదార్ రనౌట్ 18; జితేశ్ (సి) మనోహర్ (బి) ఉనద్కత్ 24; షెఫర్డ్ (సి) అండ్ (బి) మలింగ 0; కృనాల్ హిట్‌వికెట్ (బి) కమిన్స్ 8; డేవిడ్ (సి) క్లాసెన్ (బి) మలింగ 1; భువనేశ్వర్ (బి) కమిన్స్ 3; యశ్ దయాళ్ (సి) అనికేత్ (బి) హర్షల్ 3; ఎంగిడి నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 16 **మొత్తం:** (19.5 ఓవర్లలో ఆలౌట్) 189; **వికెట్ల పతనం:** 1-80, 2-120, 3-129, 4-173, 5-174, 6-174, 7-179, 8-186, 9-187; **బౌలింగ్:** కమిన్స్ 4-0-28-3; ఉనద్కత్ 4-0-41-1; హర్షల్ పటేల్ 3.5-0-39-1; ఇషాన్ మలింగ 4-0-37-2; హర్ష్ దూబె 2-0-20-1; నితీష్‌కుమార్ 2-0-13-1

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	12	8	3	1	17	0.389
బెంగళూరు	13	8	4	1	17	0.262
ముంబయి	13	8	5	0	16	1.292
దిల్లీ	13	6	6	1	13	-0.019
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.745
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ఆరెంజ్ క్యాప్




సాయిసుదర్శన్ (గుజరాత్)
638 పరుగులు
ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌కు ఇచ్చే టోపీ

పర్పుల్ క్యాప్




ప్రసిద్ధ్ కృష్ణ (గుజరాత్)
21 వికెట్లు
ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే టోపీ



నీరజ్‌కు రెండో స్థానం

హజో (పోలెండ్): భారత జావెలిన్‌త్రో స్టార్ నీరజ్ చోప్రా ఈ సీజన్లో వరుసగా రెండో టోర్నీని రెండో స్థానంతో ముగించాడు. ఆర్లెన్ అథ్లెటిక్స్ మీట్‌లో జావెలిన్‌ను ఉత్తమంగా 84.14 మీటర్లు విసిరిన నీరజ్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. దోహా డైమండ్ లీగ్‌లో అతడికి అగ్రస్థానాన్ని దూరం చేసిన జర్మనీ ఆటగాడు జులియన్ వెబర్ (86.12 మీ, రెండో ప్రయత్నం) మరోసారి నీరజ్‌పై పైచేయి సాధించాడు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో తొలి, మూడు, నాలుగు ప్రయత్నాల్లో ఫౌల్ చేసిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 81.28 మీటర్ల దూరం విసిరాడు. తర్వాత 81.80 మీటర్లు నమోదు చేసి మూడో స్థానానికి వచ్చాడు. ఒక ప్రయత్నమే మిగిలి ఉండడంతో నీరజ్ అదే స్థానంతో పోటీని ముగించేలా కనిపించాడు. అయితే ఆఖరిత్రోని 84.14 మీటర్లు విసిరి రెండో స్థానానికి దూసుకెళ్లాడు. అప్పటిదాకా రెండో స్థానంలో ఉన్న అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా, 83.24 మీ) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ కెరీర్‌లోనే ఉత్తమంగా 90.23 మీటర్ల దూరం వేసినా.. వెబర్ (91.06 మీ) అతడిని అధిగమించాడు.




పగ్గాలు గిల్‌కేనా?

ఇంగ్లాండ్ పర్యటనకు జట్టు ఎంపిక నేడే

ముంబయి: భారత క్రికెట్లో కొత్త శకం మొదలు కాబోతోంది. ఎన్నో ఏళ్ల తర్వాత ఓ యువ కెప్టెన్ టెస్టు జట్టును నడిపించనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ ఇటీవలే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అతడి వారసుడెవరో శనివారం తేలిపోనుంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సీనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీ వచ్చే నెల 20 నుంచి ఇంగ్లాండ్‌తో జరిగే అయిదు టెస్టుల సిరీస్‌కు జట్టును ప్రకటించనుంది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌నే సారథిగా ప్రకటించొచ్చని అంచనా. కొన్ని రోజుల కిందటే అతను అగార్కర్‌తో పాటు కోచ్ గౌతమ్ గంభీర్‌లను సైతం కలిసినట్లు వార్తలు వచ్చాయి. చివరగా ఆస్ట్రేలియాతో ఆడిన సిరీస్‌లో భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు రోహిత్ అందుబాటులో లేని రెండు మ్యాచ్‌ల్లో సారథ్య బాధ్యతలూ నిర్వర్తించిన సీనియర్ ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు పగ్గాలివ్వాలనే డిమాండ్లు ఇటీవల గట్టిగానే వినిపించాయి. అయితే తరచూ ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్న అతడి మీద సెలక్టర్లు ఎక్కువ భారం మోపాలనుకోవట్లేదు. భవిష్యత్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని గిల్‌నే కెప్టెన్‌గా చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ వైస్ కెప్టెన్ అయ్యే సూచనలున్నాయి. ఐపీఎల్‌లో అదిరే ప్రదర్శన చేస్తున్న తమిళనాడు కుర్రాడు సాయి సుదర్శన్ జట్టులోకి రావడం లాంఛనమే. కర్ణాటక బ్యాటర్ కరుణ్ నాయర్‌కు కూడా మెరుగైన అవకాశాలే ఉన్నాయి. వన్డేల్లో నిలకడగా రాణిస్తూ, ఐపీఎల్‌లోనూ అదరగొట్టిన శ్రేయస్ అయ్యర్‌కు మళ్లీ టెస్టు జట్టులో చోటు దక్కుతుందా లేదా అన్నది ఆసక్తికరం. బుమ్రా, సిరాజ్‌లకు తోడుగా పేస్ బృందంలోకి ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ఆకాశ్ దీప్ వచ్చే అవకాశాలున్నాయి.

వాళ్లిద్దరూ లేకపోవడం లోటే కానీ..



దిల్లీ: భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కోచ్ గౌతమ్ గంభీర్ తొలిసారి మాట్లాడాడు. ఈ సీనియర్ బ్యాటర్లు లేకపోవడం టీమ్‌ఇండియాకు పెద్ద లోటే కానీ.. మిగిలిన ప్లేయర్లకు మంచి అవకాశమని అన్నాడు. "ఎప్పుడు ఆట మొదలుపెట్టాలి.. ఎప్పుడు ముగించాలి అన్నది వ్యక్తిగత నిర్ణయం. కోచ్ అయినా.. సెలక్టర్ అయినా ఇంకెవరైనా ఇంకొకరికి అప్పుడు రిటైర్ అవ్వు.. ఇప్పుడు రిటైర్ అవ్వు అని చెప్పే హక్కు లేదు. ఆ నిర్ణయం వారి నుంచే రావాలి. ఎంతో అనుభవజ్ఞులైన కోహ్లి, రోహిత్ ఇప్పుడు టెస్టు జట్టులో లేరు. అది జట్టుకు లోటే. అయితే మిగిలిన ఆటగాళ్లకు మంచి అవకాశం" అని గంభీర్ పేర్కొన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు కూడా స్టార్ పేసర్ బుమ్రా లేని లోటు ఎలా తీరుతుందని తనను ప్రశ్నించారని.. అప్పుడూ ఇదే జవాబు చెప్పానని గౌతి అన్నాడు. "ఛాంపియన్స్ ట్రోఫీలో బుమ్రా సేవలు కోల్పోయాం. ఈ విషయాన్నే అప్పుడు ప్రశ్నిస్తే 'మరొక ఆటగాడికి అవకాశం లభిస్తుంది' అని సమాధానం చెప్పా. విరాట్, రోహిత్‌ల విషయంలోనూ నాది అదే జవాబు. 2027 వన్డే ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉంది. ప్రస్తుతం మా దృష్టంతా ఇంగ్లాండ్ పర్యటనపైనే" అని గంభీర్ తెలిపాడు. టెస్టు, టీ20ల నుంచి తప్పుకున్న విరాట్, రోహిత్ వన్డేల్లో కొనసాగుతున్న సంగతి తెలిసిందే.



సెమీస్‌లో శ్రీకాంత్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో శ్రీకాంత్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 24-22, 17-21, 22-20తో టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. ఒక గంటా 14 నిమిషాల పాటు సాగిన పోరులో శ్రీకాంత్, పొపోవ్ హోరాహోరీగా తలపడ్డారు. తన అనుభవంతో ఒత్తిడిని అధిగమించిన శ్రీకాంత్ ప్రత్యర్థిని చిత్తుచేశాడు. సెమీస్‌లో యుషి తనక (జపాన్)తో శ్రీకాంత్ పోటీపడనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌లో ధ్రువ్- తనీషా జోడీ 22-24, 13-21తో జియాంగ్ జెంగ్- వీ షిన్ (చైనా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

అడ్రియన్‌కు కాంస్యం



షల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో అడ్రియన్ కర్మాకర్ మళ్లీ మెరిశాడు. ఇప్పటికే 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో రజతం గెలిచిన ఈ కుర్రాడు.. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లో కాంస్యం కైవసం చేసుకున్నాడు. శుక్రవారం ఫైనల్లో అతడు 446.6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. తుదిపోరులో అడ్రియన్ చాలాసేపు నాలుగో స్థానంలో కొనసాగినా.. ఆఖర్లో పుంజుకుని కంచు గెలుచుకున్నాడు. రొమైన్ (ఫ్రాన్స్, 459.7) స్వర్ణం, జెన్స్ ఒస్టెలి (నార్వే, 459.1) రజతం నెగ్గారు. మహిళల రైఫిల్ త్రి పొజిషన్స్‌లో అనుష్క ఠాకూర్ ఫైనల్ చేరినా.. ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా ఒక స్వర్ణంతో సహా నాలుగు పతకాలు గెలుచుకుంది.



టెస్టులకు మాథ్యూస్ వీడ్కోలు

కొలంబో: శ్రీలంక వెటరన్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే నెల సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరిగే తొలి టెస్టే తన కెరీర్‌లో ఆఖరిదని వెల్లడించాడు. జూన్ 17న గాలెలో ఈ టెస్టు ఆరంభం కానుంది. 37 ఏళ్ల మాథ్యూస్.. పరిమిత ఓవర్ల క్రికెట్లో కొనసాగనున్నాడు. "టెస్టు కెరీర్‌లో ఎన్నో మరిచిపోలేని జ్ఞాపకాలు ఉన్నాయి. ఎంతో ఇష్టపడిన ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పే సమయం వచ్చింది. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడానికే వైదొలుగుతున్నా. బంగ్లాదేశ్‌తో జూన్‌లో జరిగే తొలి టెస్టే నా కెరీర్‌లో చివరిది. పరిమిత ఓవర్ల క్రికెట్లో కొనసాగుతా" అని మాథ్యూస్ తెలిపాడు. "శ్రీలంక క్రికెట్‌కు మాథ్యూస్ విలువైన సేవలు అందించాడు. ఆట పట్ల అతడి అంకితభావం మరువలేనిది. సారథిగానూ తన ముద్ర వేశాడు. మాథ్యూస్‌కు కృతజ్ఞతలు" అని శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. 2009లో పాకిస్థాన్‌పై టెస్టు అరంగేట్రం చేసిన మాథ్యూస్.. 118 టెస్టుల్లో 8167 పరుగులు చేశాడు. ఇందులో 16 సెంచరీలు, 45 అర్ధసెంచరీలు ఉన్నాయి. 33 వికెట్లు కూడా పడగొట్టాడు.

ఒలాంగా ఇప్పుడిలా..


హెన్రీ ఒలాంగా

అడిలైడ్

హెన్రీ ఒలాంగా.. ఈ పేరు చెప్పగానే భారత క్రికెట్ అభిమానులు 90ల్లోకి వెళ్లిపోతారు. సచిన్ తెందుల్కర్‌ను జ్ఞాపకం చేసుకుంటారు. ఈ పేసర్ బౌలింగ్‌ను సచిన్ ఎలా బాదాడో చెప్పుకుంటారు. క్రికెట్‌ను అర్ధంతరంగా వదిలేసిన ఈ జింబాబ్వే పేసర్.. ప్రస్తుతం సంగీత కళాకారుడిగా మారాడు. 2003 వన్డే ప్రపంచకప్ సందర్భంగా అప్పటి జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే నియంతృత్వ ధోరణులపై సహచరుడు ఆండీ ఫ్లవర్‌తో కలిసి ఒలాంగా గళమెత్తాడు. ముగాబే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లబ్యాండ్లు ధరించి ఇద్దరూ బరిలో దిగారు. ఈ నేపథ్యంలో ఒలాంగాను చంపుతామంటూ బెదిరింపులు వచ్చాయి. దీంతో దేశం వదిలి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు.

బతకడం కోసం ఎన్నో వృత్తులను ప్రయత్నించాడు. క్రికెట్ అనంతర జీవితం ఒలాంగాకు చాలా కష్టంగా సాగింది. చాలా ఏళ్ల పాటు తండ్రిని చూసే అవకాశం రాలేదు. బతుకుతెరువు కోసం పడవలు కూడా శుభ్రం చేశాడు. సంగీతాన్ని చాలా ఇష్టపడే ఒలాంగా.. ఇదే ప్రధాన కెరీర్‌గా ఎంచుకున్నాడు. క్రూయిజ్ షిప్‌లలో వచ్చే వారి కోసం ప్రదర్శనలు ఇస్తున్నాడు. యూట్యూబ్‌లో తన సొంత సంగీత ఆల్బమ్‌లను విడుదల చేస్తున్నాడు. "క్రూయిజ్ షిప్‌లో సంగీత ప్రదర్శనలు ఇస్తున్నా. అంతేకాదు చిన్నగ్రామాలకు వెళ్లి పాఠశాల పిల్లల ముందు కూడా నా కళను ప్రదర్శిస్తున్నా. బార్లకు కూడా వెళ్లి షోలు చేస్తున్నా. వ్యక్తిత్వ వికాస పాఠాలు కూడా బోధించా. పడవలు కూడా కడిగాను. నాకెలాంటి అహం లేదు" అని ఒలాంగా తెలిపాడు. ముగాబె దిగిపోవడంతో 2017లో ఒలాంగా తిరిగి జింబాబ్వేకు వచ్చాడు. 2023లో అతడికి ఆస్ట్రేలియా పౌరసత్వం లభించడంతో ప్రస్తుతం అడిలైడ్‌లో జీవిస్తున్నాడు.

1998లో షార్జాలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో భారత్‌తో మ్యాచ్‌లో ఒలాంగా 4 వికెట్లు తీశాడు. తెందుల్కర్ వికెట్ తీశాక దూకుడుగా సంబరాలు చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 13 పరుగుల తేడాతో ఓడింది. జింబాబ్వేతోనే జరిగిన ఫైనల్లో సచిన్ ప్రతీకారంతో చెలరేగిపోయాడు. కనికరం లేకుండా ఒలాంగాను చితక బాదాడు. 6 ఓవర్లలోనే ఈ పేసర్ 50 పరుగులు ఇచ్చుకున్నాడు. సచిన్ 92 బంతుల్లోనే అజేయంగా 124 పరుగులు చేశాడు. 197 పరుగుల లక్ష్యాన్ని భారత్ 30 ఓవర్లలోనే ఛేదించింది. ఒలాంగాపై సచిన్ చెలరేగిన తీరు అప్పట్లో పెద్ద సంచలనం.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు రిఫరీగా శ్రీనాథ్

దుబాయ్: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో భారత మాజీ పేసర్ జవగళ్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నాడు. జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్‌లో జరగనున్న ఈ మ్యాచ్ అధికారుల వివరాల్ని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ (ఇంగ్లాండ్), క్రిస్ గఫానీ (న్యూజిలాండ్) ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరిస్తారు.

ఆర్సీబీలో జోష్!

దిల్లీ: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు ఆనందాన్నిచ్చే వార్త. ఆ జట్టు స్టార్ బౌలర్ ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ఐపీఎల్ ప్లేఆఫ్స్ ఆరంభానికి తిరిగి ఆర్సీబీతో కలిసే అవకాశం ఉంది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ నిలిచిపోవడంతో హేజిల్‌వుడ్ స్వదేశం వెళ్లిపోయాడు. భుజం గాయం కారణంగా తిరిగి భారత్‌కు రాలేదు. గాయం నయం కావడంతో దక్షిణాఫ్రికాతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కోసం జరుగుతున్న సన్నాహక శిబిరంలో హేజిల్‌వుడ్ సాధన చేస్తున్నాడు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్న అతడిని ప్లేఆఫ్స్ ఆరంభం నాటికి ఐపీఎల్‌కు రప్పించేందుకు బెంగళూరు ఫ్రాంఛైజీ ప్రయత్నిస్తోంది. ఈ సీజన్లో ఈ పేసర్ 10 మ్యాచ్‌లు ఆడి 18 వికెట్లు పడగొట్టి ఆర్సీబీ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు.

ఓటమి బాటలో జింబాబ్వే

నాటింగ్‌హామ్: ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టులో జింబాబ్వే ఓటమి బాటలో నడుస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 265కే ఆలౌటైన ఆ జట్టు.. ఫాలోఆన్ ఆడుతూ రెండో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో 30/2తో నిలిచింది. బెనెట్ (1), ఇర్విన్ (2) ఔటయ్యారు. సీన్ విలియమ్స్ (22), బెన్ కరన్ (4) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 498/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 565/6 వద్ద డిక్లేర్ చేసింది. ఒలీ పోప్ (171; ఓవర్‌నైట్ 169) త్వరగా వెనుదిరిగాడు. హ్యారీ బ్రూక్ (58) రాణించాడు. బదులుగా జింబాబ్వే దీటుగానే ఇన్నింగ్స్ ఆరంభించింది. బెనెట్ (139) సెంచరీ సాధించడంతో ఒక దశలో 156/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. తర్వాత తడబడి 109 పరుగుల తేడాతో 8 వికెట్లు కోల్పోయి 300లోపు స్కోరుకే ఆలౌటైంది. షోయబ్ బషీర్ (3/62), అట్కిన్సన్ (2/58), స్టోక్స్ (2/11) ప్రత్యర్థి పతనంలో కీలకపాత్ర పోషించారు.

అమ్మా.. నేను చిప్స్ దొంగిలించలేదు

• అవమాన భారంతో బాలుడి ఆత్మహత్య

కోల్‌కతా: అందరి ముందు అవమానించారన్న ఆవేదనతో పన్నెండేళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మేదినీపుర్ జిల్లాలో చోటుచేసుకుంది. పాన్స్‌కురా ప్రాంతానికి చెందిన కృష్ణేందు దాస్ చిప్స్ కొనుక్కోవడానికి దుకాణానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో చిప్స్ పాకెట్ తీసుకొని వెళ్లాడు. అప్పుడే వచ్చిన దుకాణాదారుడు బాలుణ్ని నిలదీసి గుంజీలు తీయించాడు. తాను మళ్లీ డబ్బులు ఇద్దామని అనుకొనే పాకెట్ తీసుకున్నానని బాలుడు చెబుతున్నప్పటికీ వినకుండా అతడి తల్లిని అక్కడికి పిలిపించాడు. కోపంతో ఆమె కూడా తన కుమారుణ్ని చెంపదెబ్బ కొట్టింది. ఇంటికి తిరిగి వచ్చిన కృష్ణేందు పురుగుల మందు తాగి ప్రాణాలు వదిలాడు. దొంగతనం చేయలేదమ్మా అంటూ బాలుడు ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో పేర్కొన్నాడు.

భార్యపై కోపంతో పెళ్లిసంబంధం కుదిర్చిన మధ్యవర్తి హత్య


సులేమాన్ ముస్తఫా

మంగళూరు: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందన్న కోపంతో తనకు పెళ్లిసంబంధం కుదిర్చిన మధ్యవర్తిని కత్తితో పొడిచి చంపాడు ఓ భర్త. కర్ణాటకలోని మంగళూరులో జరిగిన ఈ ఘటనలో నిందితుడు ముస్తఫాను పోలీసులు అరెస్టు చేశారు. సులేమాన్ (50) అనే మధ్యవర్తి ఎనిమిది నెలల క్రితం ముస్తఫా(30)కు ఒక మహిళతో వివాహం కుదిర్చాడు. ఈ దంపతుల నడుమ పెళ్లయిన నాటి నుంచీ గొడవలే. రెండు నెలల క్రితం ముస్తఫాను విడిచిపెట్టి ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ముస్తఫా గురువారం రాత్రి సులేమాన్‌తో గొడవ పడ్డాడు. కత్తితో మెడపై పొడవడంతో సులేమాన్ అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయాడు. సులేమాన్ కుమారులు రియాబ్, సియాబ్‌లపై కూడా ముస్తఫా కత్తితో దాడి చేశాడు. వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పాక్ విమానాలకు గగనతల నిషేధం పొడిగింపు

దిల్లీ, లాహోర్: పాకిస్థాన్‌కు చెందిన విమానాలు భారత గగనతలాన్ని వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం మరోసారి నిషేధాన్ని పొడిగించింది. గతంలో విధించిన గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో నిషేధాన్ని జూన్ 23 వరకు పొడిగిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ ఆదేశాలు జారీ చేసింది.

■ మరోవైపు.. భారత విమానాలకు గగనతల మూసివేతను పాకిస్థాన్ మరో నెల పాటు పొడిగించింది. జూన్ 24 తెల్లవారుజామున 4.59 గంటల వరకు తమ గగనతలంలో భారత విమానాలను నిషేధిస్తున్నట్లు పాకిస్థాన్ విమానాశ్రయ అధికారులు (పీఏఏ) వాయు సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. అంతర్జాతీయ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారం నెల కంటే ఎక్కువ రోజులు గగనతలం వినియోగించకుండా అడ్డుకోవడం కుదరదు. అయితే.. ఇరుదేశాలూ నిషేధం గడువును పొడిగించాయి.

4 అఖిలపక్ష ఎంపీల ప్రతినిధి బృందాలతో మిస్రీ సమావేశం

దిల్లీ: పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించేది లేదన్న భారత వైఖరిని ప్రపంచ దేశాలకు వివరించేందుకు విదేశీ పర్యటనలు చేపడుతున్న అఖిలపక్ష ఎంపీల ప్రతినిధి బృందాలు నాలుగింటితో శుక్రవారం విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రం మిస్రీ సమావేశమయ్యారు. వాటిలో కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్, భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్, ఎన్సీపీ-ఎస్పీ నేత సుప్రియా సూలే, భాజపా నేత బైజయంత్ పాండా నేతృత్వం వహిస్తున్న బృందాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయా బృందాల సభ్యులకు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలపై మిస్రీ వివరించారు.

సింధూజలాలు ఆగితే.. మీ ఊపిరి ఆపేస్తాం

భారత్‌పై మరోసారి పాక్ ప్రేలాపన

ఇస్లామాబాద్: భారత్‌పై పాకిస్థాన్ ఆర్మీ మరోసారి అక్కసు వెళ్లగక్కింది. "భారత్ మా ప్రాంతానికి వచ్చే జలాలను అడ్డుకుంటే అక్కడి ప్రజల ఊపిరి ఆపేస్తాం. సింధూనదిలో నీటికి బదులుగా వారి రక్తం పారుతుంది'' అని పాక్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి అన్నారు. పాకిస్థాన్ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ ప్రేలాపన చేశారు.

3 దేశాల నేతలతో భారత ఎంపీల భేటీ

• ఉగ్రవాదంపై మన దేశ వైఖరిని వివరించిన ప్రతినిధులు

మాస్కో, టోక్యో, అబుధాబి: పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదం, దాడిపై మన వైఖరిని వివరించేందుకు ప్రపంచంలోని పలుదేశాల్లో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలు శుక్రవారం రష్యా, జపాన్, యూఏఈల్లో నేతలు, ఉన్నతాధికారులతో భేటీ అయ్యాయి. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదన్న భారత విధానాన్ని వారికి వివరించాయి. ఈ సందర్భంగా భారత్ అనుసరిస్తున్న విధానానికి ఆయా దేశాలు సంఘీభావం తెలిపాయి. భారత ప్రతినిధుల బృందం శుక్రవారం రష్యా ఫెడరేషన్ అసెంబ్లీ (పార్లమెంట్)లో ప్రాతినిధ్యం గల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో విస్తృత చర్చలు నిర్వహించింది. ఈ సందర్భంగా రష్యా బృందానికి లిబరల్-డెమొక్రాటిక్ పార్టీకి చెందిన అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు లియోనిడ్ స్లట్స్కీ నేతృత్వం వహించారు. కమిటీ డిప్యూటీ ఛైర్మన్ ఆండ్రీ డెనిసోవ్ సహా రష్యన్ ఫెడరేషన్ కౌన్సిల్ సెనేటర్లతో భారత బృందం భేటీ అయ్యింది. ఈ మేరకు రష్యాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. భారత బృందానికి స్మోలెన్స్కాయ స్క్వేర్‌లోని భారీ భవనంలోకి రష్యా విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి ఆండ్రీ రుడెన్కో సాదర స్వాగతం పలికారు.


రష్యా విదేశాంగ శాఖ సహాయమంత్రి ఆండ్రీ రుడెన్కోతో భేటీ అయిన భారత ఎంపీల బృందం. కనిమొళి, రాజీవ్‌రాయ్ తదితరులు

ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు

జపాన్‌లో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందం శుక్రవారం ఆ దేశ అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) సభ్యులతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనుసరిస్తున్న దృఢ వైఖరిని వారికి వివరించింది. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం జపాన్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎల్‌డీపీకి చెందిన ఉగ్రవాద నిరోధక పరిశోధక కమిటీ అధ్యక్షుడు, న్యాయశాఖ మాజీ మంత్రి యసుహిరో హనాషితో ఝా బృందం భేటీ అయ్యింది. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయని జపాన్‌లో భారత రాయబార కార్యాలయం 'ఎక్స్'లో పేర్కొంది. శివసేన ఎంపీ శ్రీకాంత్ శిండే నేతృత్వంలోని ఎంపీల బృందం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అన్వర్ గర్గాష్ డిప్లొమాటిక్ అకాడమీ డైరెక్టర్ జనరల్ నికోలే మ్లాడెనోవ్‌తో భేటీ అయ్యింది. అంతకు ముందు బృంద సభ్యులు షేక్ జాయెద్ గ్రాండ్ మసీదు, బీఏపీఎస్ హిందూ దేవాలయం, గురునానక్ దర్బార్ గురుద్వారాలో ప్రార్థనలు నిర్వహించారని స్థానిక రాయబార కార్యాలయం 'ఎక్స్'లో వెల్లడించింది.

గాల్లో చక్కర్లు కొట్టిన భారత ఎంపీల విమానం

మాస్కో: డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలో భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధుల బృందానికి గురువారం రాత్రి రష్యాలో అనూహ్య అనుభవం ఎదురైంది. వీరి విమానం దిగడానికి ముందు మాస్కో ఎయిర్‌పోర్టు సమీపంలో కీవ్ డ్రోన్ దాడికి పాల్పడింది. దీంతో విమానాశ్రయాన్ని కొన్ని గంటల పాటు తాత్కాలికంగా మూసివేశారు. భారత ప్రతినిధుల బృందం ప్రయాణిస్తున్న విమానం గాల్లోనే చక్కర్లు కొట్టి 40 నిమిషాల తర్వాత సురక్షితంగా దిగింది.

తల్లి మరణించిన మరుసటి రోజే విధుల్లోకి..

• చివరి పనిదినం నాడు 11 తీర్పులు

• సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకకు ఘన వీడ్కోలు



దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్.ఓకకు అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఆయన సెలవు దినమైన శనివారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఒకరోజు ముందే వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. జస్టిస్ ఓక్ మాట్లాడుతూ "మన రాజ్యాంగ నిర్మాతల స్వప్నమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సుప్రీంకోర్టు పరిరక్షించగలదు. నేను వాటి పరిరక్షణ కోసం నిజాయతీగా కృషి చేశాను'' అన్నారు. తన తల్లి మరణించిన మరుసటి రోజే ఆయన కోర్టుకు హాజరై మిగిలివున్న పనులను పూర్తి చేయడంతోపాటు వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ఆఖరి పనిదినం నాడు 11 తీర్పులు వెలువరించి పనిపట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఈ సందర్భంగా ఏర్పాటైన వీడ్కోలు ధర్మాసనానికి నేతృత్వం వహించారు. జస్టిస్ ఓక్‌తోపాటు జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ఇందులో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "జస్టిస్ ఓక్ నా చిరకాల మిత్రుడు. ఆయన న్యాయం పట్ల అచంచల విశ్వాసం కలిగిన వ్యక్తి'' అని జస్టిస్ గవాయ్ అన్నారు. జస్టిస్ ఓక్‌తో ప్రత్యేక అనుబంధం ఉన్న తాను పదవీ విరమణ తర్వాత ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టకూడదని నిశ్చయించుకున్నట్లు ఆయన వెల్లడించారు. సుప్రీంకోర్టులో మూడో అత్యధిక సీనియారిటీ కలిగిన న్యాయమూర్తి జస్టిస్ ఓక్ దాదాపు రెండు దశాబ్దాలపాటు న్యాయ వ్యవస్థకు సేవలందించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందడానికి పూర్వం ఆయన ముంబయి హైకోర్టు జడ్జిగా, కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2021 ఆగస్టు 31న ఆయన దేశ అత్యున్నత న్యాయస్థానానికి జడ్జిగా నియమితులయ్యారు. జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓక్ 1960 మే 25న జన్మించారు. ఠాణే జిల్లా సివిల్ న్యాయస్థానంలో పట్టాపొందారు. పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ ఓక్ భావోద్వేగానికి గురయ్యారు.

కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?

• రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

దిల్లీ: రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కోటాలోనే ఇవి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులపై శుక్రవారం విచారణ సందర్భంగా జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్ ధర్మాసనం.. ఎఫ్.ఐ.ఆర్. నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది. ఐఐటీ ఖరగ్‌పుర్ విద్యార్థి (22) ఈ నెల 4న హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడగా పోలీసులు నాలుగు రోజుల తర్వాత ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. కేసు నమోదుకు ఇంత ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. విద్యార్థుల మరణాలను తేలికగా తీసుకోవద్దని, తీవ్రమైన అంశాలని పేర్కొంది.



మీరు కృతజ్ఞతాభావం కలిగి ఉంటే..

మీ వద్ద లేనిదాని గురించి చింతిస్తూ కూర్చోవడానికి బదులు.. మీరు కలిగి ఉన్నవాటి పట్ల కృతజ్ఞతాభావంతో ఉండటం నేర్చుకోండి. దానివల్ల మీ మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఉత్పాదకత పెరుగుతుంది. మీ చుట్టూ ఉన్నవారి పనితీరు మెరుగయ్యేందుకూ అది దోహదం చేస్తుంది.

– జాన్ గోర్డాన్, రచయిత

పోక్సో కేసులో అరుదైన తీర్పు

• బాలికతో లైంగిక సంబంధాల దోషికి శిక్ష రద్దు

• ఆమెను పెళ్లాడడంతో సుప్రీంకోర్టు నిర్ణయం

ఇంటర్నెట్‌డెస్క్: పోక్సో కేసులో దోషిగా తేలిన వ్యక్తికి విధించిన శిక్షను రద్దు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం అరుదైన తీర్పునిచ్చింది. పోక్సో చట్టం ప్రకారం.... బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తికి ట్రయల్ కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మైనర్‌తో లైంగిక సంబంధం పెట్టుకోవడంతో దోషిగా తేల్చి ఈ తీర్పునిచ్చింది. నిందితుడు కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా...బాలిక ఇష్టపూర్వకంగానే సాన్నిహిత్యాన్ని కొనసాగించిందన్న కారణంతో అతడిని నిర్దోషిగా ప్రకటించింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవడంతో సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్‌గా స్వీకరించింది. అయితే, అతడిని పెళ్లి చేసుకొని, ఒక బిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని బాలిక తెలిపింది. ఏప్రిల్ 3న ధర్మాసనం బాధితురాలితో మాట్లాడింది. "ప్రస్తుతం ఆమె మేజర్. చట్టం ఆ ఘటనను నేరంగానే చూస్తున్నప్పటికీ.. దానివల్ల ఆమెపై మానసికంగా ఎలాంటి ప్రభావం పడలేదు''అని వ్యాఖ్యానించింది.

కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్‌పై దిల్లీ ప్రభుత్వ కేసుల ఉపసంహరణకు అనుమతి

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సర్కారు అధికారంలో ఉన్న సమయంలో కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్‌పై పెట్టిన ఏడు కేసులను ఉపసంహరించుకునేందుకు దిల్లీ ప్రభుత్వానికి శుక్రవారం సుప్రీంకోర్టు అనుమతించింది. దేశరాజధాని ప్రాంతంలో పాలనాధికారులపై నియంత్రణ ఎవరికి ఉండాలనే దానితోపాటు వివిధ అంశాలపై ఈ కేసులు దాఖలయ్యాయి. దిల్లీలోని ప్రస్తుత భాజపా ప్రభుత్వం ఆ కేసులను వెనక్కి తీసుకుంటామని విజ్ఞప్తి చేయడంతో సుప్రీం కోర్టు సమ్మతి తెలిపింది.

అమెరికా-ఇరాన్ అణుచర్చల్లో పురోగతి కొంతే

రోమ్: ఇరాన్-అమెరికా మధ్య అణు ఒప్పందం కోసం ఒమన్ మధ్యవర్తిత్వంలో శుక్రవారం రోమ్‌లో జరిగిన ఐదో దఫా చర్చల్లో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. చర్చల్లో కొంత పురోగతి మాత్రమే సాధించామని, ఒక నిర్ణయానికి రాలేదని ఒమన్ తెలిపింది. "ఈ చర్చలు చాలా సంక్లిష్టం. త్వరగా తేలే అంశం కాదు'' అని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు.



ఆపరేషన్ సిందూర్ మన బలగాల సామర్థ్యాన్ని చాటిచెప్పింది: అమిత్ షా

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' భారత్‌లో ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్నది పాకిస్థాన్ అన్న విషయాన్ని పూర్తిగా బహిర్గతం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ ప్రధాని మోదీ కృతనిశ్చయాన్ని, మన నిఘా విభాగాల సామర్థ్యాన్ని, భద్రతాదళాల శక్తిని చాటిచెప్పిందన్నారు. "కొందరు భారత పౌరుల ప్రాణాలు హరించడంతోపాటు సరిహద్దులో మన సైనిక స్థావరాలపై దాడి చేసిన పాక్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా దీటైన సమాధానం ఇచ్చాం. పాకిస్థాన్ భూభాగంలో 100 కిలోమీటర్ల లోపల ఉన్న లక్ష్యాలను ఛేదించి మన సత్తా చాటుకున్నాం'' అని అమిత్ షా చెప్పారు. శుక్రవారం సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) వ్యవస్థాపక చీఫ్ రుస్తంజీ స్మారకోపన్యాసంలో అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. పాకిస్థాన్ ప్రోద్బలంతో పహల్గాంలో అమాయక పర్యాటకుల్ని మతపరంగా గుర్తించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అమానుషంగా హత్య చేయడం ద్వారా ఉగ్రవాదులు పాపం చేశారని షా అన్నారు. దీనికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం చేశాం. అయితే ఈ దాడిలో పాక్ ప్రజలకు గానీ, ఆ దేశ సైనిక స్థావరాలకు గానీ ఎలాంటి హాని కలిగించలేదు. ఉగ్రవాదులపై దాడిచేస్తే దానికి పాక్ స్పందించింది. వారు మన పౌరులపై దాడి చేయాలని చూశారు కానీ మన వాయు రక్షణ వ్యవస్థ ముందు విజయం సాధించలేకపోయారు'' అని హోం మంత్రి తెలిపారు. 2.75 లక్షల సంఖ్యా బలం కలిగిన బీఎస్ఎఫ్ అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేస్తూ దేశంలోని రెండు సరిహద్దుల్ని కాపాడుతోందని ఆయన అన్నారు. సరిహద్దుల్లో కంచె నిర్మించలేని ప్రదేశాలను కాపాడేందుకు త్వరలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నామని అన్నారు.

భారత క్షిపణి పరీక్షల కోసం అండమాన్ గగనతలం మూసివేత

పోర్ట్ బ్లెయిర్: త్రివిధ దళాల కమాండ్ ఆధ్వర్యంలో అధిక ఎత్తులో జరిపే క్షిపణి పరీక్షల కోసం శుక్రవారం ఉదయం ఏడింటి నుంచి మూడు గంటల సేపు అండమాన్ నికోబార్ దీవుల గగనతలం మూసివేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఎయిర్‌లైన్స్‌కు ముందస్తు సమాచారంతో నోటీసు జారీ చేశారు. ''శనివారం కూడా ఇలాగే మూడు గంటలపాటు దీవుల గగనతలం మూసి ఉంచుతాం. మే 23-24 తేదీల్లో ఈ ప్రాంతంలో పౌర విమానాలు ఏవీ ఎగరకుండా మే 16వ తేదీనే నోటీసు ఇచ్చాం'' అని అండమాన్ నికోబార్ సీనియర్ కమాండ్ అధికారి వెల్లడించారు. పరీక్షల సమయంలో దీవుల చుట్టుపక్కల గగనతలంలో గరిష్ఠంగా 500 కి.మీ.ల మేర ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. మొదటిరోజు పరీక్షలు విజయవంతంగా జరిగాయని, గతంలోనూ ఇటువంటి పరీక్షలు చేపట్టినట్లు తెలిపారు. అండమాన్ నికోబార్ కమాండ్ (ఏఎన్‌సీ) భారత్‌లో ఏకైక త్రివిధ సేవల కమాండ్‌గా చలామణిలో ఉంది.


అండమాన్ విమానాశ్రయ రన్‌వే

ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్

• రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రధాని



దిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు గతంలో ఎప్పుడూ లేనంతగా పురోగమిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వైవిధ్యమే ఈశాన్య ప్రాంతానికి అతిపెద్ద బలమన్నారు. దిల్లీలోని భారత మండపంలో రెండు రోజులపాటు జరిగే రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సును శుక్రవారం మోదీ ప్రారంభించారు. సదస్సుకు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు, దౌత్యవేత్తలు తదితరులు తరలివచ్చారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, అనిల్ అగర్వాల్ వంటి పారిశ్రామికరంగ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈశాన్య భారతం ఒక పవర్‌హౌస్ అని, మనకు అష్టలక్ష్మి వంటిదని అభివర్ణించారు. భారతదేశ సెమీకండక్టర్ వ్యవస్థను బలోపేతం చేయడంలో అస్సాం పాత్ర పెరుగుతోందన్నారు. గతంలో ఈశాన్య ప్రాంతమంటే బాంబులు, తుపాకులు, రాస్తారోకోలకు మారుపేరుగా ఉండేదని, దీనివల్ల స్థానిక యువత చాలా అవకాశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంలో ఈశాన్య యువత హింసను విడిచిపెట్టినట్లు ప్రధాని తెలిపారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, నక్సలిజాన్ని ఉపేక్షించడం లేదన్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని అవకాశాల భూమిగా మార్చడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల కీలక వాటాదారులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు ఒకే వేదిక మీదకు వచ్చారన్నారు. పర్యాటకంతోపాటు వివిధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.

మోదీకి సెల్యూట్ చేస్తున్నా: ముకేశ్ అంబానీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సదస్సులో ప్రశంసలు కురిపించారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంలో ప్రధాని నాయకత్వ పటిమను కొనియాడుతూ.. సెల్యూట్ చేస్తున్నా అన్నారు. ఉగ్రవాదంపై భారత్ ఐకమత్యం, స్థిరత్వం, దృఢ సంకల్పంతో పోరాడుతోందన్నారు. మన సాయుధ దళాల శౌర్య పరాక్రమాలకు గర్వపడుతున్నట్లు తెలిపారు.

భారతీయులకు షెంజెన్ వీసాల దెబ్బ

గతేడాది 1.65 లక్షల దరఖాస్తులు తిరస్కరణ

ఇంటర్నెట్ డెస్క్: ఐరోపా దేశాల్లో పర్యటించేందుకు ఇచ్చే షెంజెన్ వీసా దరఖాస్తుల్లో గతేడాది లక్షల సంఖ్యలో తిరస్కరణకు గురైనట్లు తెలిసింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. భారత్ నుంచి వచ్చిన దరఖాస్తుల్లో 1.65 లక్షల అప్లికేషన్లను తిరస్కరించారు. తద్వారా మన దరఖాస్తుదారులు దాదాపు రూ.136 కోట్లు కోల్పోయారు. యూరోపియన్ కమిషన్ విడుదలచేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కాండ్ నాస్ట్ నివేదిక ప్రకారం.. షెంజెన్ సభ్యదేశాలకు గతేడాది వచ్చిన మొత్తం వీసా దరఖాస్తుల్లో 17 లక్షలు తిరస్కరణకు గురయ్యాయి. ఈ దరఖాస్తు రుసుంలతో రూ.1,410 కోట్ల ఆదాయం వచ్చినట్లు అంచనా. భారత్ నుంచి 11.08 లక్షల దరఖాస్తులు రాగా.. వాటిలో 1.65 లక్షలు తిరస్కరించారు. అత్యధికంగా తిరస్కరణకు గురైన షెంజెన్ వీసా దరఖాస్తుల్లో అల్జీరియా (1,85,101), తుర్కియే (1,70,129), భారత్ (1,65,266), మొరాకో (1,15,774), చైనా(80,703) మొదటి 5 స్థానాల్లో ఉన్నాయి.

మా జోక్యంతోనే కాల్పుల విరమణ

అమెరికా నోట మళ్లీ అదే మాట

వాషింగ్టన్: భారత్-పాక్ మధ్య ఘర్షణను తానే ఆపానని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాదాపు ఎనిమిది సార్లు పేర్కొన్నారు. దీన్ని భారత్ ఖండించింది. దాడులు ఆపమంటూ పాకిస్థాన్ సైన్యం విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని వివరణ ఇచ్చింది. ఇందులో మూడో దేశం ప్రమేయం లేదని స్పష్టం చేసింది. అమెరికా మాత్రం ఇదేమీ పట్టించుకోకుండా కాల్పుల విరమణకు తామే కారణమని పదే పదే చెప్పుకుంటోంది. తాజాగా ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్ కూడా ట్రంప్ చెప్పిన విషయాన్నే పునరుద్ఘాటించారు. భారత్-పాక్ మధ్య ఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారకుండా తాము కీలక పాత్ర పోషించామని తెలిపారు. తమ ప్రమేయంతో కాల్పుల విరమణ సాధ్యమైందని గురువారం పేర్కొన్నారు.

మణిపుర్‌లో ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు

• జాతుల మధ్య ఘర్షణ కేసుల విచారణ కోసం ఏర్పాటు

దిల్లీ: కుకీ, మైతేయి జాతుల మధ్య చెలరేగిన ఘర్షణలకు సంబంధించిన కేసుల విచారణకు మణిపుర్‌లో ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ఏర్పాటైంది. ఇందుకోసం చురాచాంద్‌పుర్‌లోని ఓ సెషన్స్ కోర్టును ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుగా మార్చినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. మణిపుర్ హైకోర్టు అనుమతితో చురాచాంద్‌పుర్‌లోని సెషన్స్ కోర్టును, అక్కడి న్యాయమూర్తిని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు కోసం నియమిస్తున్నట్లు తెలిపింది. ఈ కోర్టు పరిధి రాష్ట్రమంతటా ఉంటుందని తెలిపింది. 2023 మే 3న మణిపుర్‌లో చెలరేగిన జాతి హింసకు సంబంధించి ఎన్ఐఏ మూడు కీలక కేసులను దర్యాప్తు చేస్తోంది. ఇందులో జిరిబామ్‌లో ఆరుగురు మహిళలు, చిన్నారులను అపహరించి దారుణంగా హత్య చేసిన కేసు కూడా ఉంది. రెండేళ్ల క్రితం కుకీ, మైతేయి జాతుల మధ్య చెలరేగిన హింసలో 260 మంది ప్రాణాలు కోల్పోగా, వేలమంది నిరాశ్రయులైన విషయం తెలిసిందే. మరోవైపు బస్సులపై రాష్ట్ర పేరును తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ మైతేయి తెగ ఇచ్చిన 48 గంటల బంద్ శుక్రవారంతో ముగిసింది.

భాజపా ఎమ్మెల్యే అసెంబ్లీ సభ్యత్వం రద్దు

జైపుర్: సబ్‌కలెక్టర్‌పై తుపాకీ గురిపెట్టిన కేసులో దోషిగా తేలి, మూడేళ్ల జైలుశిక్ష ఖరారైన రాజస్థాన్‌కు చెందిన భాజపా శాసనసభ్యుడు కన్వర్ లాల్ మీనా సభ్యత్వాన్ని శాసనసభ రద్దు చేసింది. మే 1 నుంచి ఆయన సభ్యత్వం రద్దయినట్లు శుక్రవారం అధికారులు ప్రకటించారు. అధికారులను బెదిరించడం, ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించడం, ఆస్తుల ధ్వంసం వంటి ఆరోపణలతో 20 ఏళ్ల క్రితం నమోదైన కేసులో కన్వర్ దోషిగా ఉన్నారు. ఈ కేసులో ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ 2020 డిసెంబరు 14న ఝులావడ్ కోర్టు తీర్పునిచ్చింది. తనకు విధించిన శిక్షను నిలిపివేయాలని కన్వర్ వేసిన పిటిషన్ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది, రెండువారాల్లోగా లొంగిపోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. మే 21న లొంగిపోయిన కన్వర్ ప్రస్తుతం జైలులో ఉన్నారు.

పాక్‌కు సాయం చేయొద్దు

• ప్రపంచబ్యాంకును కోరనున్న భారత్

దిల్లీ: దారిద్ర్య నిర్మూలన, అభివృద్ధి సాధన కోసం బహుళజాతి సంస్థలు అందించే ఆర్థిక సాయాన్ని సైనిక అవసరాల కోసం దుర్వినియోగం చేస్తున్న పాకిస్థాన్‌కు సాయం చేయవద్దని భారత్ వచ్చే నెలలో ప్రపంచబ్యాంకును కోరనుంది. ఈ సంవత్సరం జనవరి నెలలో అంగీకరించిన మేరకు పాకిస్థాన్‌కు 2 వేల కోట్ల డాలర్లు అందించే విషయాన్ని ప్రపంచబ్యాంకు వచ్చే నెలలో సమీక్షించనుంది. ఈ సందర్భంగా భారత్ తన అభ్యంతరాన్ని లేవనెత్తనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాలుష్య రహిత విద్యుదుత్పత్తి, వాతావరణ పునరుద్ధరణ కార్యకలాపాల కోసం పదేళ్ల కాలపరిమితి కలిగిన రుణం అందించాలని జనవరిలో అంగీకారం కుదిరింది. "పాకిస్థాన్‌కు ప్రపంచబ్యాంకు రుణం అందించడాన్ని మేం వ్యతిరేకిస్తాం'' అని కీలక అధికారి ఒకరు తెలిపారు. గత నెలలో కూడా పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అందిన ఆర్థిక సాయాన్ని అడ్డుకునేందుకు భారత్ ప్రయత్నించింది. మరోవైపు.. మనీలాండరింగ్, తీవ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సాయం వంటి అక్రమాలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌ను "గ్రే లిస్టు''లో చేర్చాలని భారత్ ప్రపంచ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)ను తిరిగి కోరనుంది.

భారత్‌తో రక్షణ కాంట్రాక్ట్ రద్దు చేసిన బంగ్లా

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం భారత్‌తో దూరం జరిగేలా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మహమ్మద్ యూనస్ సలహాలతో పనిచేసే ప్రభుత్వం దిల్లీకి వ్యతిరేకంగా పలు చర్యలు చేపట్టింది. తాజాగా మరో నిర్ణయం వీటికి తోడైంది. సముద్రంలో వినియోగించే అత్యాధునిక టగ్ బోట్ నిర్మాణం కోసం కోల్‌కతాకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్-ఇంజినీర్స్(జీఆర్ఎస్ఈ)తో ఉన్న ఓ ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. దీని విలువ రూ.180.25 కోట్లు. జీఆర్ఎస్ఈ రక్షణ శాఖ కింద పని చేస్తోంది. తాజాగా బంగ్లాదేశ్ ఈ ఒప్పందం రద్దు విషయాన్ని స్టాక్ మార్కెట్‌కు తెలియజేసింది.

యుద్ధనౌక వైఫల్యంపై కిమ్ గరం..

• బాధ్యులపై చర్యలకు ఆదేశం

సియోల్: ఉత్తర కొరియాలో 5 వేల టన్నుల సామర్థ్యమున్న యుద్ధ నౌక ప్రారంభోత్సవానికి ముందే సమస్య తలెత్తి అది కదలకపోవడంతో కిమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన అధికారులను అరెస్టు చేస్తామని ప్రకటించారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం ఉత్తర కొరియా నావికా దళంలోకి కొత్త యుద్ధనౌకను ప్రవేశపెట్టడానికి తూర్పు ఓడరేవు నగరమైన చోంగ్జిన్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. 5 వేల టన్నుల సామర్థ్యమున్న ఈ డిస్ట్రాయర్ నౌకను ప్రారంభించడానికి ఉత్తర కొరియా నియంత కిమ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఆయన యుద్ధనౌకను ప్రారంభిస్తున్న సమయంలో ర్యాంపు నుంచి జారిపోయి.. ఫ్లాట్ కార్ కదలకపోవడంతో నౌక అడుగుభాగం దెబ్బతింది. దీంతో సైనికాధికారులు, శాస్త్రవేత్తలు, షిప్‌యార్డ్ నిర్వాహకులపై కిమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ తప్పు వల్ల దేశ గౌరవం దెబ్బతిందని.. ఇది నేరపూరిత చర్య అని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం బాధ్యతారాహిత్య చర్య వల్లే ఇలా జరిగిందని.. ఇందుకు శిక్షగా నౌకను రూపొందించిన అధికారులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామని ప్రకటించారు. జూన్‌లో తమ పార్టీకి సంబంధించిన కీలక సమావేశం జరగనుందని.. అప్పటిలోపు నౌకను పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు.

భారతీయ విద్యార్థులకు పర్మిట్లలో కెనడా భారీ కోత

దిల్లీ: కెనడాలో విద్యాభ్యాసం చేయాలనుకొనే విద్యార్థులకు ఇప్పుడు భారీగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ దేశం భారతీయ విద్యార్థులకు ఇచ్చే స్టడీ పర్మిట్లలో దాదాపు 31శాతం కోత విధించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆ దేశానికి చెందిన ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) రికార్డులు వెల్లడిస్తున్నాయి. 2025 తొలి త్రైమాసికంలో కేవలం 30,640 పర్మిట్లు మాత్రమే జారీ చేశారు. గతంతో పోల్చితే ఇది 31శాతం తక్కువ.

విమ్స్, కేజీహెచ్‌లలో కొవిడ్ ప్రత్యేక వార్డులు


విమ్స్‌లో ఏర్పాటు చేసిన కొవిడ్ వార్డు

విశాఖపట్నం(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: కొవిడ్ మహమ్మారి రూపాంతరం చెంది పలు వేరియంట్లుగా మళ్లీ వెలుగుచూస్తున్న వేళ విమ్స్ (విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ), కేజీహెచ్‌లలో బాధితుల కోసం వార్డులు ఏర్పాటు చేసినట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, కేజీహెచ్ వైద్యులు తెలిపారు. విశాఖ నగరంలో ఒక కేసు నమోదు కావడంతో విమ్స్, కేజీహెచ్‌లలో 20 పడకల చొప్పున ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి, వైద్యులు, సహాయ సిబ్బందిని కేటాయించామన్నారు. పీపీ కిట్లు, అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేస్తామని, పాజిటివ్ వస్తే నమూనాలను ఆర్టీపీసీఆర్ పరీక్షలకు పంపిస్తామన్నారు. ప్రజలు సామూహిక ప్రదేశాలకు వెళ్లడం తగ్గించాలన్నారు. మాస్కులు, శానిటైజర్ వాడాలన్నారు.

కొవిడ్‌పై ఆందోళన వద్దు: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: కరోనాపై ఎలాంటి ఆందోళన వద్దని, జాగ్రత్తలు తీసుకుంటే చాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. శుక్రవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ "విశాఖపట్నంలో కరోనా సోకిన వ్యక్తి కుటుంబంలోని మరో వ్యక్తితోపాటు చికిత్స చేసిన ప్రభుత్వ వైద్యుడికీ వైరస్ సోకింది. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో కరోనా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడం మంచిది. ఇప్పటివరకు కేంద్రం ఎలాంటి సలహాలు, సూచనలు చేయలేదు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం'' అని తెలిపారు.



వీటికి ప్రతిభ అవసరం లేదు

ప్రతిభ లేకపోయినా.. జీవితంలో గొప్ప పురోగతికి దోహదపడే కొన్ని పనులను మీరు సులువుగానే చేసేయొచ్చు. అవేంటంటే- ✦ సమయాన్ని గౌరవించడం ✦ ఇతరులు చెప్పేది శ్రద్ధగా వినడం ✦ మీకు మీరు చేసుకునే వాగ్దానాలను నిలబెట్టుకోవడం ✦ ప్రారంభించిన పనిని పూర్తిచేయడం ✦ మానసిక స్థితిని మెరుగ్గా ఉంచుకోవడం

– లియో హాసన్, మైండ్‌సెట్ కోచ్

సెలవుల్లో సరదాగా!

మనింట్లో చాలా పాత వస్తువులు అలా పడి ఉంటాయి, అవునా? ఈ ఖాళీ సమయంలో అలాంటి వాటిని ఉపయోగించి కొత్తగా ఏమైనా చేసేందుకు ట్రై చేద్దామా!

చేద్దామా.. రీ సైక్లింగ్



..మరి మీరు ఏం రీసైకిల్ చేస్తారో ఆలోచించేయండి!

● మీరు చూసే ఉంటారు.. పాత ప్లాస్టిక్ డబ్బాల్లో అమ్మ బోలెడన్ని మొక్కలు నాటుతూ ఉంటుంది. మిగిలిపోయిన పాతబట్టలన్నీ కలిపి బెడ్ షీట్లలా కూడా చేస్తూ ఉంటుంది. దీన్నే రీసైక్లింగ్ అనొచ్చు!

● మనం కూడా మన పుస్తకాలు, బొమ్మలు, బట్టలను ఇలా రీసైకిల్ చేయొచ్చు.

● బొమ్మల్లో రంగు పోయిన వాటికి మన దగ్గరున్న పెయింట్స్‌తో కొత్తగా డెకరేట్ చేయొచ్చు.


● పాత సాఫ్ట్‌టాయ్స్ ఏమైనా ఉంటే.. మన ఓల్డ్ డ్రెస్‌ను ఉపయోగించి వాటిని కొత్తగా మెరిపించవచ్చు.

● పుస్తకాల్లో మనం వాడని పేజీలు మిగిలిపోతాయి కదా! అలాంటివన్నీ కలిపి ఒక రఫ్ నోట్స్‌లా తయారుచేసుకుంటే కొత్త క్లాస్‌కి వెళ్లేటప్పటికి ఉపయోగపడుతుంది.

● ఇంకా ఏమైనా ఇంట్లో మిగిలిన, అమ్మానాన్నలకు అక్కర్లేని అట్టపెట్టెలు, థర్మాకోల్ షీట్లు వంటివి ఉంటే.. అవి వాడి ఏమైనా కొత్త కొత్త బొమ్మలు కూడా తయారుచేయవచ్చు.

సూపర్ సోలార్

మీరు సోలార్ ప్యానెల్స్ గురించి వినే ఉంటారు. మరి ఎప్పుడైనా వాటిని దగ్గర్నుంచి చూశారా? అవి ఎలా పనిచేస్తాయో తెలుసా.. అందుకే ఈ సెలవుల్లో తెలుసుకుందాం.



ఇవి ఎండ వేడి ఆధారంగా పనిచేస్తాయని మీకు తెలుసుగా. కానీ అది ఎలా జరుగుతుందో మరింత వివరంగా తెలుసుకోండి.

★ ఆ కరెంటును ఇంటింటికీ ఎలా పంపిస్తున్నారు, వారు ఎలా వాడుతున్నారు అనేది పరిశీలించండి.

★ సౌరశక్తిని ఎక్కువగా తయారు చేయడం ఎందుకు అవసరమో చూడండి.



★ దీని వల్ల ఉన్న బోలెడన్ని ఉపయోగాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి.

★ మీ ఇంటి చుట్టుపక్కలగానీ, దగ్గర్లో కానీ ఎక్కడైనా సోలార్ ప్లాంట్‌లు ఉంటే, వెళ్లి చూసి రండి.

..ఇవన్నీ చేశాక దీని గురించి ఒక ప్రాజెక్ట్ చేసి స్కూల్స్ తెరిచాక టీచర్ గారికి చూపించండి, సరేనా!

ఎవరిలా చేద్దాం..

అమ్మ చున్నీని చీరలా వేసుకుని సంబరపడతాం. నాన్న కళ్లజోడు పెట్టుకుని పేపర్ చదువుతున్నట్టు పోజులు కొడతాం. ఇవన్నీ మనకు ఎంతిష్టమో కదా! ఇంకా ఇలా ఫన్నీగా ఎవరిలా యాక్ట్ చేయొచ్చంటే..


ఆడేద్దామా ఇక!

■ మీరు పోలీస్, ఫ్రెండ్ దొంగ. దొంగ పారిపోతుంటే పోలీస్ పట్టుకోవాలి.

■ ఒకరు డాక్టర్, మరొకరు పేషెంట్‌గా ఉంటే.. అవతలి వారికి ప్రిస్క్రిప్షన్ కూడా రాసేయొచ్చు!

■ మార్కెట్‌లో అమ్మేవారు, కొనేవారు.. స్కూల్‌లో టీచర్, స్టూడెంట్.. ఇలా ఇద్దరిద్దరు ఉన్నప్పుడు బోలెడు ఆటలు ఇంట్లోనే ఆడేయొచ్చు.

■ అదే మీరు ఒక్కరే ఉన్నారు అనుకోండి.. నచ్చిన హీరోలాగా, ఇంట్లో బొమ్మలాగా, నాన్న ఆఫీస్‌లో బాస్‌లా.. ఇలా ఎలా అయినా ప్రిటెండ్ చేస్తూ అద్దం ముందు మాట్లాడొచ్చు.

■ ఈ ఆట మన ఇమిటేషన్ స్కిల్స్‌ను పెంచుతుంది తెలుసా! దాంతోపాటు భలే సరదా సరదాగా కూడా ఉంటుంది.

మట్టితో చక్కని బొమ్మలు



మనకి అమ్మానాన్న ఏవో బొమ్మలు కొని ఇస్తూనే ఉంటారు. వాటిలో ఎక్కువగా ప్లాస్టిక్‌వి ఉంటాయి. అది మన భూమికి అంత మంచిది కాదన్న విషయం మీకు తెలుసు కదా! మరి ఈ సెలవుల్లో ఎంచక్కా మట్టి బొమ్మలు మనమే తయారు చేసుకుంటే ఎంత బాగుంటుందో.. అవి చూసి ఇంట్లో వాళ్లు కూడా చాలా సర్‌ప్రైజ్ అయిపోతారు. వీటిని ఎలా చేయాలంటే..

■ మట్టి బొమ్మలు చేయడానికి మనకి ముందు మట్టి కావాలి. మామూలు ఇసుకతో ఇవి అవ్వవు. ఇంటి దగ్గర్లో బొమ్మచేయడానికి వీలయ్యేలాంటి బంకమట్టి కచ్చితంగా ఉండే ఉంటుంది. పెద్దవాళ్ల సాయంతో దాన్ని తీసుకురండి.

■ దానిలో ఉండే రాళ్లు తీసేసి.. కొంచెం నీరు కలిపితే, బొమ్మ చేయడానికి వీలైనట్లు మెత్తగా తయారవుతుంది. అలా అయ్యేలా సరిపడా నీళ్లు మాత్రమే కలపాలి తెలిసిందా! ■ కలిపిన మట్టితో మనకు ఏది కావాలంటే ఆ బొమ్మ చేసేయడమే! చపాతీ కర్ర, అట్లపెనం, బకెట్, పెన్.. ఇలాంటివి చేయడం చాలా ఈజీ.

■ కార్లు, బైకులు, ఆటోలు వంటివి చేయాలంటే.. ఆ మట్టికి కొంచెం చీపురుపుల్లల సాయం అవసరం అవుతుంది. వాటిని ఉపయోగించి మీకు వచ్చిన విధంగా చేసేందుకు ప్రయత్నించండి.

■ అలా చేశాక వాటిని ఎండలో పెడితే ఎంత గట్టిగా అయిపోతాయో తెలుసా! అలా అయ్యాక మన దగ్గర ఉంటే వాటికి రంగులు కూడా వేయొచ్చు.



ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే చేసేయండి మరి!

చెప్పగలరా?

1. మొత్తం రంధ్రాలే ఉన్నా.. నీరు మాత్రం పట్టి ఉంచుతా! నేను ఎవరు?

2. నేను చాలా తేలికగా ఉంటా. కానీ నన్నెవరూ ఆపలేరు. నేనెవరో తెలుసా?



జ: 1. స్పాంజి 2. గాలి

పూటుగా తాగి.. అడ్డొచ్చిన వాటిని ఢీకొట్టి..

- తిరుమలలో ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసుల హల్‌చల్
- అలిపిరి వద్ద తనిఖీలు తప్పించుకున్న వైనం



కల్వర్టును ఢీకొని రోడ్డుపై దొర్లుతున్న కానిస్టేబుళ్లు ★ పారిపోతున్న షేక్ సిరాజుద్దీన్


బి.రాజశేఖర్


కె.ఓంకార్ నాయక్

తిరుమల, కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం తాగినవారిని గుర్తించి పట్టుకోవాల్సిన ఏపీఎస్పీ పోలీసులే పూటుగా తాగారు.. అదే మత్తులో అడ్డువచ్చిన వాహనాలను ఢీకొట్టుకుంటూ తిరుమల చేరుకున్నారు. అక్కడ బూతుపురాణం అందుకున్నారు. శుక్రవారం సాయంత్రం తిరుమల కొండపై భీతావహ వాతావరణాన్ని సృష్టించారు. వివరాల్లోకి వెళితే.. తిరుమలలో విధులు నిర్వహించే ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు బి.రాజశేఖర్, కె.ఓంకార్ నాయక్, షేక్ సిరాజుద్దీన్ తిరుమలకు చెందిన ఓ ఏపీఎస్పీ ఉన్నతాధికారి వాహనాన్ని మరమ్మతులు చేయించి తీసుకొస్తామని చెప్పి తిరుపతి తెచ్చారు. ముగ్గురూ కలిసి పూటుగా మద్యం తాగారు. అనంతరం అలిపిరి తనిఖీ కేంద్రం వద్దకు వచ్చారు. పోలీసు వాహనం కావడంతో అలిపిరి భద్రతా సిబ్బంది తనిఖీ చేయలేదు. ముగ్గురూ వాహనాన్ని అతివేగంగా నడిపి మత్తులో ఘాట్ రోడ్డులో ఓ వాహనాన్ని ఢీకొట్టారు. అనంతరం తిరుమల చేరుకుని రింగురోడ్డు మీదుగా డీ టైప్ క్వార్టర్స్ వద్ద వేగంగా వస్తూ డ్రైనేజీ కల్వర్టును ఢీకొన్నారు. దీంతో ముందు టైరు పేలిపోయింది. కారులో నుంచి దిగిన ముగ్గురిలో షేక్ సిరాజుద్దీన్ అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాడు. బి.రాజశేఖర్, కె.ఓంకార్ నాయక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయగా 300 పాయింట్లు చూపించినట్లు సమాచారం. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీఎస్పీ పోలీసుల సస్పెన్షన్: కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఓంకార్ నాయక్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, సిరాజుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ కమాండెంట్ దీపికా పాటిల్ ఉత్తర్వులు జారీచేశారు.

కొడాలి నానిపై లుకౌట్ సర్క్యులర్

వైద్యం సాకుతో విదేశాలకు పారిపోకుండా చర్యలు

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్-మచిలీపట్నం: వైకాపా నేత, మాజీ మంత్రి కొడాలి నానిపై ఎల్‌ఓసీ (లుకౌట్ సర్క్యులర్) జారీ అయింది. కేంద్ర హోంశాఖలోని ఇమిగ్రేషన్ విభాగం బుధవారం ఈ సర్క్యులర్ జారీ చేసింది. వైద్యం సాకుతో ఆయన విదేశాలకు పారిపోకుండా కృష్ణా జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. కొడాలి నాని అక్రమాలపై దర్యాప్తు ఊపందుకోవడంతో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు దేశం విడిచి వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. నాని కదలికలు బయటకు పొక్కకుండా ఆయన అనుచరులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎవరినీ కలవడం లేదని సమాచారం. గుండె సమస్యతో బాధపడుతూ ఇటీవల ముంబయిలోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని.. హైదరాబాద్‌కు చేరుకున్నారు. దీనిపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మెరుగైన చికిత్స పేరుతో అమెరికాకు వెళ్లే యోచనలో నాని ఉన్నట్టు సమాచారం రావడంతో ముందుజాగ్రత్తగా ఎల్‌ఓసీ జారీ చేయించారు. ఆయన పాస్‌పోర్టు వివరాలను తీసుకుంటున్నారు.

పలు కేసులు...: కొడాలి నానిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. రైతు మోసే కేసు, వాలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించడం, వైకాపా హయాంలో సామాజిక మాధ్యమాల ద్వారా చంద్రబాబు, లోకేశ్‌పై దుర్భాషలాడారని కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు ఇసుక, మట్టి, భూకబ్జాలు సహా టిడ్కో ఇళ్ల పంపిణీలో అవకతవకలు, జగనన్న కాలనీలో మెరక పేరుతో రూ.45 కోట్ల అవినీతి, విద్యుత్తు అక్రమాల వ్యవహారాల్లో విజిలెన్స్ విచారణ జరుగుతోంది. 2022లో నిబంధనలకు విరుద్ధంగా క్యాసినో నిర్వహించారు. గుడివాడ ఆటోనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం గోదాము ఖాళీ చేయించారని ఆయనతో పాటు అప్పటి జేసీ మాధవీలత, ఇతరులపై బాధితుడు ఫిర్యాదు చేశారు. దీనిపై గుడివాడ రెండో పట్టణ స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదైంది. భీమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలకు చెందిన సుమారు 9 ఎకరాల స్వాహాకు యత్నించారని ఫిర్యాదులు రాగా, దీనికి సంబంధించి ఫైలు మాయమైంది. అప్పట్లో ఫిర్యాదుచేసినా కేసు నమోదు కాలేదు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిపై సమగ్ర చర్చ

- 'రాయలసీమ అభివృద్ధి'పై ప్రత్యేక ఫోకస్
- కూటమి ఏడాది పాలనపై తీర్మానాలు
- మహానాడు తొలిరోజు ప్రతినిధుల సభ.. తెదేపా సంస్థాగత నిర్మాణంపై దిశానిర్దేశం
- రెండోరోజు సంక్షేమం, అభివృద్ధి పథకాలపై చర్చించనున్న నేతలు

ఈనాడు, అమరావతి: గత ఐదేళ్లలో అన్ని రంగాల్లోనూ వెనకబడిన రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై కడపలో జరగనున్న 'మహానాడు' వేదికపై సమగ్రంగా చర్చించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అలాగే రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలపైనా నేతలు ప్రత్యేకంగా చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన 14 ముసాయిదా తీర్మానాలు, నాలుగు ఉమ్మడి తీర్మానాల్ని చర్చించి ఆమోదించనున్నారు. మొదటిరోజు ప్రతినిధుల సభ జరుగుతుంది. ఇందులో పార్టీ సంస్థాగత నిర్మాణం, సిద్ధాంతాలు, భవిష్యత్తు కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. రెండోరోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో



అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సాధించిన విజయాలు, మ్యానిఫెస్టో అమలు, గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. పింఛన్ల పెంపు, దీపం-2, అన్న క్యాంటీన్లు, చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, తద్వారా యువతకు లభిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మెగా డీఎస్సీ తదితర అంశాలపై కూలంకషంగా చర్చిస్తారు.

ముసాయిదా తీర్మానాలు ఇవే..

◆ కూటమి ప్రభుత్వం - తొలి ఏడాదిలో సాధించిన విజయాలు

◆ నదుల అనుసంధానం, బనకచర్లకు గోదావరి జలాల మళ్లింపు సహా వేగంగా సాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం

◆ ఒకే రాజధాని అమరావతి - అభివృద్ధి వికేంద్రీకరణ (పొరుగు రాష్ట్రాలకు దీటుగా ప్రజారాజధాని నిర్మాణం, పట్టణ - గ్రామీణాభివృద్ధితో వికేంద్రీకరణ, పెట్టుబడుల వికేంద్రీకరణ, 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు, జగన్ పాలనలో దోపిడీకి గురైన ఉత్తరాంధ్ర, రాయలసీమల అభివృద్ధి)

◆ విద్యారంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక సంస్కరణలు

◆ మహిళలు, యువత సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు

◆ సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం

◆ కట్టుదిట్టంగా శాంతిభద్రతల నిర్వహణ (ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడం, మాఫియాపై కేసులు.. అరెస్టులు)

◆ చంద్రన్న విజన్‌తో సంక్షేమరాజ్యం (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వం, అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం)

◆ మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి - కేంద్రం అందిస్తున్న తోడ్పాటు (రహదారుల అభివృద్ధి, సమగ్ర గృహ నిర్మాణం, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధి, ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు)

◆ పేదరికం లేని సమాజ సంకల్పంతో పీ4

◆ విజన్-2020 సాకారం.. స్వర్ణాంధ్ర విజన్-2047 సాధన

◆ విద్యుత్తు రంగంలో విప్లవాత్మక విజయాలు

◆ విపక్ష నేతగా కూడా విఫలమైన జగన్

◆ సహజ వనరుల పరిరక్షణ - అక్రమార్కులపై చర్యలు

ఉమ్మడి తీర్మానాలు

◆ తెలుగువారి చరిత్రలో అన్న ఎన్టీఆర్ ప్రత్యేకత

◆ తెలుగువారి చరిత్రలో చంద్రన్న మైలురాళ్లు/ ముద్ర

◆ అమరులైన తెదేపా కార్యకర్తలు, నాయకులకు నివాళి

◆ పార్టీ కార్యకర్తల సంక్షేమం

సీమలో కరవు నివారణ.. ఫ్యాక్షన్ కట్టడిపై

రాయలసీమలో ఫ్యాక్షన్ కట్టడికి గత తెదేపా ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు మొదలు.. ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ, ముచ్చుమర్రి ఎత్తిపోతల తదితర ప్రాజెక్టుల నిర్మాణాల పూర్తి వరకూ వివిధ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంపై చర్చిస్తారు.

తీర్మానాలపై యనమల అధ్యక్షతన భేటీ

కడప మహానాడులో చేయనున్న తీర్మానాలపై మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడి అధ్యక్షతన తీర్మానాల కమిటీ శుక్రవారం సమావేశమైంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మినీ మహానాడుల్లో చేసిన తీర్మానాల్ని కమిటీ చర్చించింది. వాటి ఆధారంగా తుది నివేదిక సిద్ధం చేయనున్నట్టు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తెలిపారు.

విచారణకు కావలి మాజీ ఎమ్మెల్యే... ఎదురెళ్లి స్వాగతం పలికిన సీఐ


పోలీసు స్టేషన్‌లోకి వెళుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, నెల్లూరు, కావలి, న్యూస్‌టుడే: అమృత్ పైలాన్ కూల్చివేత కేసులో నిందితుడిగా విచారణకు హాజరైన కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు వచ్చిన ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సీఐ ఎదురెళ్లి స్వాగతం పలకడం, వెంటబెట్టుకుని స్టేషన్‌లోకి తీసుకువెళ్లడం గమనార్హం. నిందితుడిగా ఉన్న వ్యక్తికి.. ఈ కేసులో విచారణాధికారిగా ఉన్న సీఐ ఇలా రాచమర్యాదలు చేయడం.. విచారణ జరుగుతున్నంత సేపూ పోలీసు స్టేషన్ వైపు వెళ్లకుండా స్థానికులను అడ్డుకోవడంపై విమర్శలు వచ్చాయి. సుమారు ఐదున్నర గంటలపాటు ఈ విచారణ జరిగింది. అంతసేపూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులు.. స్టేషన్ ప్రాంగణం బయటే కారులో ఉన్నారు.

కావలి పట్టణం ట్రంకు రోడ్డులో ఏర్పాటైన అమృత్ శిలాఫలకాన్ని 2020 ఏప్రిల్ 11న కూల్చివేయగా.. ఆ కేసులో ఏ8గా ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఇప్పటికే షరతులతో బెయిలు మంజూరు కాగా, విచారణకు హాజరుకావాలని పోలీసులు ఆయనకు నోటీసులు పంపారు. దీంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విచారణకు హాజరయ్యారు. మొత్తం 42 ప్రశ్నలు అడగ్గా.. వాటన్నింటికీ న్యాయవాదుల సమక్షంలో సమాధానాలు చెప్పారని తెలిసింది. సీఐ వ్యవహారంపై పోలీసు అధికారులు స్పందిస్తూ మాజీ ఎమ్మెల్యే అనుచరులు లోపలికి రాకుండా అడ్డుకునేందుకే సీఐ బయటకు వెళ్లారని, ప్రత్యేక మర్యాదలేమీ చేయలేదన్నారు.

5 లక్షల మందితో మహానాడు సభ

'సుస్థిర ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర కల సాకారం' థీమ్

ఈనాడు, అమరావతి: కడప మహానాడులో మూడోరోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు తెదేపా కసరత్తు చేస్తోంది. 27, 28 తేదీల్లో ప్రతినిధుల సభ, వివిధ తీర్మానాలపై చర్చ, ఆమోదం తెలపనుండగా. 29న బహిరంగ సభ నిర్వహించనున్నారు. సరైన సమయంలో సరైన నాయకత్వంతో పాటు ఒకే ప్రభుత్వం నిరంతరాయంగా అధికారంలో కొనసాగడం వల్ల వివిధ రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధి, ఒనగూరిన ప్రయోజనాల్ని నేతలు వివరించనున్నారు.

◆ గుజరాత్‌లో 3 దశాబ్దాలుగా భాజపా ప్రభుత్వం ఉండడం వల్ల అక్కడ జరిగిన సుస్థిరాభివృద్ధి, ప్రగతిశీల రాష్ట్రాల్లో గుజరాత్ అగ్రస్థానంలో నిలవడం.

◆ ఒడిశాలో వరుసగా ఐదు పర్యాయాలు నవీన్ పట్నాయక్ సీఎంగా కొనసాగడంతో అనేక రంగాల్లో సాధించిన ప్రగతి, వృద్ధిని తెలియజేయనున్నారు.

◆ మన రాష్ట్రంలోనూ సుస్థిర ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని వివరించనున్నారు. పార్టీకి, ప్రజలకు అనుసంధానంగా ఉండేలా రూపొందించిన 'మై టీడీపీ యాప్'నూ ఈ సభలోనే ఆవిష్కరిస్తారు. ఈ యాప్ ద్వారా పొలిట్‌బ్యూరో సభ్యులు మొదలు సాధారణ కార్యకర్తల వరకూ అందరి పనితీరును బేరీజు వేయనున్నారు.

తెదేపా విధానంలోనూ సూపర్ సిక్స్

- కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం
- మహిళలు, యువత, అన్నదాతలు, పేదల ఉన్నతికి ప్రణాళికలు
- మహానాడు వేదికగా ప్రతిపాదించనున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం పార్టీ చరిత్రలో తొలిసారి కడప కేంద్రంగా నిర్వహించనున్న 'మహానాడు' చరిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కానుంది. స్వర్ణాంధ్ర సాధన, పార్టీ నిర్వహణే ధ్యేయంగా తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ రూపొందించిన ఆరు కొత్త అంశాలకు పార్టీ మౌలిక సిద్ధాంతాల్లో చోటు కల్పించనున్నారు. మహానాడులో వాటిని లోకేశ్ ప్రతిపాదించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేళ ఎన్టీఆర్ ఆకాంక్షలైన పేదలకు 'కూడు, గూడు, గుడ్డ' మూల సిద్ధాంతం స్ఫూర్తితో అన్నివర్గాల ఆకాంక్షల్నీ నెరవేర్చేలా తెలుగుజాతి - విశ్వఖ్యాతి, స్త్రీ శక్తి, పేదల సేవ - సోషల్ రీఇంజినీరింగ్, యువగళం, అన్నదాతకు అండ, కార్యకర్తే అధినేత అంశాల్ని జోడించనున్నారు. వీటితోపాటు సభ్యత్వం, సంస్థాగత నిర్మాణంపైనా చర్చిస్తారు. రాబోయే 40 ఏళ్లు పార్టీని నడిపించడానికి ఈ మార్పులు అవసరమని లోకేశ్ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎన్టీఆర్ ఆశయాలు, చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అన్ని వర్గాలకూ మెరుగైన అవకాశాలు, కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పించేందుకు లోకేశ్ కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.

నంబర్ 1గా తెలుగువారు

తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు, వారిని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లే దిశగా మహానాడులో 'నా తెలుగు కుటుంబం' సిద్ధాంతాన్ని లోకేశ్ ప్రతిపాదించనున్నారు. తెలుగువారు నంబర్ వన్‌గా ఎదగాలనే లక్ష్యంతో దీనికి రూపకల్పన చేయనున్నారు.

మహిళా శక్తి చాటేలా..

మహిళా సాధికారత చాటేలా 'స్త్రీ శక్తి' పేరుతో వారికి మద్దతు ఇవ్వనున్నారు. గతంలో మహిళలకు ఆస్తిహక్కు కల్పించడం, రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహించడంతో సమాజంలో ముందంజలో ఉన్నారు. భవిష్యత్తులో వారిని మరింత ఉన్నతస్థితికి తీసుకెళ్లేందుకు ఈ ప్రతిపాదన సిద్ధం చేస్తున్నారు.

సంపద సృష్టిలో అన్నదాతలు

'రైతు లేకపోతే రాష్ట్రం, సమాజం లేవు' అనే నినాదంతో 'అన్నదాతకు అండ' విధానం రూపొందించనున్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యం, సాంకేతిక సహకారం, రాయితీలు అందించడం, అంతర్జాతీయ ప్రమాణాలతో పంటలు పండించేలా వారికి అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టనున్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ద్వారా సంపద సృష్టికి మార్గం సుగమం చేయనున్నారు.

ప్రపంచ స్థాయికి తెలుగు యువత

ప్రపంచ స్థాయికి తెలుగు యువతను తీసుకువెళ్లేందుకు 'యువగళం' పేరుతో ప్రతిపాదించనున్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకోవడం, కొత్త అవకాశాలు సృష్టించడం, పార్టీలోనూ వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై చర్చించనున్నారు.

కార్యకర్తే అధినేత

పార్టీ కోసం కష్టపడిన, సంక్షోభ సమయాల్లో అండగా నిలిచిన కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సీనియర్లను గౌరవిస్తూనే యువతను ప్రోత్సహించడం, కష్టపడే వారికి మద్దతుగా నిలవడం ద్వారా 'కార్యకర్తే అధినేత' అనే భావన కల్పించనున్నారు.

పేదరిక రహిత సమాజం

పేదరిక రహిత సమాజమే ధ్యేయంగా, అన్ని సామాజిక వర్గాలకూ సమన్యాయం చేయడమే లక్ష్యంగా 'పేదల సేవ.. సోషల్ రీఇంజినీరింగ్' సిద్ధాంతాన్ని రూపొందించనున్నారు. ఇప్పటికే చంద్రబాబు ప్రకటించిన పీ4తోపాటు పేదరిక నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నారు.

అర'విరి'సిన కంద!



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం రాజులపాలెంలోని పేరిచర్ల రామకృష్ణంరాజు ఇంట్లో ఉంచిన కంద దుంప అందమైన పుష్పంలా వికసించింది. 3 నెలల కిందట బంధువుల ఇంటి నుంచి ఆయన ఈ దుంపను తీసుకొచ్చారు. సాధారణంగా భూమిలో నాటిన 7 నుంచి 9 నెలల వ్యవధిలో పంట చేతికొస్తుందని ఉద్యాన శాఖ అధికారి దిలీప్‌కుమార్ వివరించారు. భూమిలోంచి దుంపను వెంటనే తీయకుండా ఎక్కువ రోజులు ఉంచితే దానికి పువ్వు వస్తుందని అన్నారు. భూమిలో ఎక్కువ రోజులు ఉండటం వల్ల బయటకు తీసినా అలాగే ఉండడంతో పూవు వచ్చిందని.. ఇది సాధారణమేనన్నారు.

- పి.గన్నవరం, న్యూస్‌టుడే.


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
నగరంలో కొత్త స్టార్
చల్లని ఏసిలు, చల్లని ఆఫర్
Inverter
1.5 T 3 స్టార్ ఇన్వర్టర్
ప్రత్యేక ధర
₹28,990
ఎక్స్ఛేంజ్ ధర
₹25,490*
1.5 T 5 స్టార్ ఇన్వర్టర్
ప్రత్యేక ధర
₹33,990
ఎక్స్ఛేంజ్ ధర
₹30,490*
*మీ పాత ఏసి ఎక్స్ఛేంజ్‌పై
తక్కువ ధరలు - ఎక్కువ ఆనందాలు
విజయ్ సేల్స్ ఆపిల్ డేస్
24 మే 2025 నుండి
iPhone 16 Pro Starting at ₹1,03,990* ₹4,458* X 24 month
iPhone 16 Starting at ₹66,990* ₹2,958* X 24 month
iPhone 15 Starting at ₹57,490* ₹2,562* X 24 month
AirPods 4 Starting at ₹10,900* ₹496* X 24 month
MacBook Pro M4 EMI Starting at ₹6,288* per month
iPad Starting at ₹30,200* ₹1,342* X 24 month
iPad air Starting at ₹52,400* ₹2,308* X 24 month
WATCH SERIES 10 Starting at ₹40,600* ₹1,796* X 24 month
Up to ₹5000* instant cashback on credit cards of AXIS BANK ICICI Bank kotak
Exchange Bonus up to ₹10,000* Powered By CASHIFY
No Cost EMI schemes available on HDFC BANK ICICI Bank IDFC FIRST Bank
Protect+ with AppleCare Services
Up to 24 Months No Cost EMI | Offer valid at Vijay Sales stores | For more offers visit: vijaysales.com
*Starting price inclusive of Cashback Exchange bonus additional
UPTO 52% OFF
Air Coolers
0 Down* Payment
40 Ltr
45 Ltr
55 Ltr
60 Ltr
72 Ltr
85 Ltr
95 Ltr
125 Ltr
aisen | BAJAJ | KENSTAR | Symphony | VOLTAS
On select models*
DIRECT COOL REFRIGERATORS
FROST-FREE REFRIGERATORS
SIDE BY SIDE REFRIGERATORS
Free: Panasonic Rice Cooker on select DC & FF Models
Starting from ₹11,990*/-
Starting from ₹19,990*/-
UPTO ₹50,000 OFF
Cashback Upto ₹7,000*/-
UPTO ₹45,000 OFF
Cashback Upto ₹7,000*/-
Godrej | Haier | LIEBHERR | LG | LLOYD | SAMSUNG | VOLTAS beko | Whirlpool
vivo V50e
Portrait So Pro
Starting at ₹28,999*
Redmi Note 14 5G Series
Super Camera. Super AI.
Starting at ₹17,999*
Available Now
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Instant Cashback Upto ₹8000*
• No Cost EMI upto 12 months*
• Fossil Watch @ ₹999*
• 1 Year ADP @ ₹999*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Cashback Upto ₹ 3000/-*
• Asus Gaming Warranty @ ₹ 999/-*
• Tuf Gaming M3 Gen II Mouse @ ₹1199/-*
Lenovo
LENOVO GAMING, YOGA SERIES SLIM 5 & FLEX 5, LOQ
• Cashback Upto ₹10000/-*
• Exchange Bonus upto ₹10000/-*
• Upto 15 Months EMI Option.*
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
HDFC BANK INSTANT DISCOUNT UPTO ₹7,500* WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
AMERICAN EXPRESS INSTANT DISCOUNT UPTO ₹12,500* ON AMERICAN EXPRESS EMI TRANSACTIONS
IDFC FIRST Bank CONSUMER DURABLE LOAN UPTO 15% CASHBACK* UPTO ₹30,000 ON ACs, REFRIGERATORS WASHING MACHINE & PANELS
UPTO ₹30,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE
RBL BANK | one | IDFC FIRST Bank | BOBCARD | YES BANK | scapia FEDERAL BANK | DBS | HDFC BANK | HDB FINANCIAL SERVICES
WE ACCEPT EMI CARDS
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
SCAN FOR STORES
విజయవాడ - ఎం జి రోడ్ రజనీ కుమార్ - 96665 03755 ప్రసన్న - 70362 15153
విజయవాడ - ఎన్‌టిఆర్ సర్కిల్ ఈశ్వర్ - 88866 53042 చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్ గౌతం - 91549 03693 కిరణ్ - 87120 32657
రాజమండ్రి - ఇన్నీస్‌పేట్ సతీష్ - 88866 74548 నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర్ పల్లి కిరణ్ - 99482 28111 విజయ్ కుమార్ - 87126 35822
తిరుపతి - లీలా మహల్ వేణు - 73373 76215 వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన శివ గంగాధర్ - 91543 16627 నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి రమేష్ - 99482 41112 కిరణ్ కుమార్ - 91549 03528
Scan to Shop Online
www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. *In 1+4 Years Comprehensive Warranty, from 2nd Year onwards Visiting Charges, Transportation and Gas Charges extra as applicable.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్ తదితరులు

కర్నూలు నుంచి అనంతపురం వరకు మెగా పారిశ్రామిక కారిడార్

మంత్రి టీజీ భరత్

ఈనాడు, కర్నూలు: కర్నూలు నుంచి అనంతపురం వరకు మెగా పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని 19వ వార్డులో రూ.12.28 కోట్ల విలువైన 31 అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఓర్వకల్లు మెగా పారిశ్రామిక హబ్‌లో రూ.14 వేల కోట్లతో నిర్మించే సెమీ కండక్టర్ పరిశ్రమకు త్వరలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అక్కడే రూ.వెయ్యి కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమ రాబోతోందని చెప్పారు. రూ.2,065 కోట్లతో ఓర్వకల్లు, కొప్పర్తిల్లో పారిశ్రామిక నోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలుస్తున్నామని, రెండేళ్లలో ఆ పనులు పూర్తవుతాయని వెల్లడించారు.

శ్రీశైలంలో వసతి గదుల ప్రారంభం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలో దేవస్థానానికి చెందిన భూమి సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వీరశైవ లింగాయత్ సత్రంలో అదనంగా నిర్మించిన 33వసతి గదులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శ్రీశైలంలో కొత్తగా సత్రాలు నిర్మించడానికి దేవాదాయశాఖ కమిషనర్ నుంచి అనుమతులు వచ్చాయన్నారు. వాటిని నిర్మించడానికి అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. శ్రీశైల దేవస్థానానికి సుమారు 5 వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, టైగర్ రిజర్వు ప్రాంతం పేరుతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉందన్నారు.



ఒంటరితనం మిమ్మల్ని వేధించకూడదంటే..

ఒక్కరే ఉండటాన్ని ఒంటరితనంగా
చాలామంది భావిస్తుంటారు.
కానీ అది వాస్తవం కాదు! మనం
ఒంటరితనంతో అత్యధికంగా ఇబ్బందిపడేది
ఎప్పుడో తెలుసా..? మన చుట్టూ సరైన
వ్యక్తులు లేనప్పుడు. ఒంటరితనం
మిమ్మల్ని వేధించకూడదంటే..
మీరెవరితో కలిసి ఉంటున్నారనే
విషయంలో జాగ్రత్తగా ఉండండి.
– లెవిస్ హోవెస్, రచయిత

ఇంజినీరింగ్ ఫీజుల మోత!

- ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీల్లో సీఎస్ఈ బ్రాంచికి రూ.3.50-4.50 లక్షలు

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ విద్యాసంస్థలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. కొన్ని ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో సీఎస్ఈ సీటు కావాలంటే ఏడాదికి రూ.3.50-4.50 లక్షలకు పైగా ఫీజు చెల్లించాల్సి వస్తోంది. ఇది పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. డీమ్డ్, ప్రైవేటు వర్సిటీల ఫీజులపై నియంత్రణ లేకపోవడమే ఇందుకు కారణం. వాటి సొంత ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు వచ్చినవారికి కొంత రాయితీ ఇస్తున్నా, మెజారిటీ సీట్లు ఎక్కువ ఫీజులకే విక్రయిస్తున్నాయి. సివిల్, మెకానికల్ లాంటి కోర్ బ్రాంచిలకు పెద్దగా డిమాండ్ లేకపోవడంతో వీటికి ఫీజులు తగ్గిస్తుండగా.. సీఎస్ఈకి మాత్రం నిర్ణీత ఫీజు చెల్లిస్తేనే సీట్లు ఇస్తున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రవేశాల సందడి కొనసాగుతోంది. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ వర్సిటీలు, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు యాజమాన్య కోటా సీట్ల భర్తీ చేపట్టాయి. ఈఏపీసెట్‌లో ఎంత ర్యాంకు వస్తుందో.. అప్పటివరకు వేచి చూస్తే సీట్లు ఉంటాయో.. లేదోననే ఆందోళనతో చాలామంది ముందుగానే చేరిపోతున్నారు. ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు సీటు రాగానే సగానికిపైగా ఫీజు చెల్లించాలనే నిబంధన పెట్టాయి.



ఇంజినీరింగ్‌కు రూ.15 లక్షల పైనే..

పిల్లల్ని మంచి కళాశాలలో చదివించాలనే ఉద్దేశంతో చాలామంది తల్లిదండ్రులు ఇంజినీరింగ్ సీటుకు ఫీజు ఎక్కువ ఉన్నా చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. విశాఖపట్నంలో ఓ ప్రముఖ కళాశాల బీటెక్ నాలుగేళ్లకు కలిపి రూ.14-16 లక్షల వరకు అడుగుతోంది. దీనికి వసతి ఫీజు అదనం. ఇక్కడే ఉన్న డీమ్డ్ వర్సిటీలో సీఎస్ఈకి ఏడాది ఫీజు రూ.4.30-5 లక్షల వరకు ఉంది. ప్రముఖ ప్రైవేటు వర్సిటీలు నాలుగేళ్లకు కలిపి రూ.18 లక్షలకు పైగా ఫీజు తీసుకుంటున్నాయి. వసతితో కలిపి ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి రూ.20-25 లక్షల వరకు ఖర్చవుతోంది.

ప్రవేశ పరీక్షలతో ఫీజులు

డీమ్డ్, ప్రైవేటు వర్సిటీలు ప్రత్యేకంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. వీటిలో వచ్చే మార్కుల ఆధారంగా ఫీజులు నిర్ణయిస్తున్నాయి. కొన్ని సీట్లు జేఈఈ, ఈఏపీసెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఇస్తున్నాయి. ప్రవేశ పరీక్షలో మార్కులు తక్కువ వచ్చినా.. ఇంటర్‌లో మెరిట్ లేకపోయినా ఫీజులు భారీగా పెంచేస్తున్నాయి.

✦ ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలు, కళాశాలలు కోర్ ఇంజినీరింగ్‌లో సీట్లు తగ్గించుకొని, సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సుల్లో పెంచుకుంటున్నాయి. విశాఖపట్నంలోని ఓ డీమ్డ్ వర్సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోర్సులకు 25 సెక్షన్ల వరకు ఉన్నాయి. విజయవాడ సమీపంలోని మరో వర్సిటీలో 28 సెక్షన్లు ఉన్నాయి. అమరావతిలోని ప్రైవేటు వర్సిటీల్లో 2వేలకు పైగా సీట్లు సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లోనే ఉన్నాయి.

ప్రైవేటు, డీమ్డ్ బాటలో..

ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల సీట్ల భర్తీ, ఫీజులపై ఎలాంటి ప్రభుత్వ నియంత్రణ ఉండదనే ఉద్దేశంతో ఇంజినీరింగ్ కళాశాలలు సైతం ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలుగా మారిపోతున్నాయి. గత ప్రభుత్వంలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు బ్రౌన్‌ఫీల్డ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాలుగా మారిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఓ ప్రైవేటు కళాశాల బ్రౌన్‌ఫీల్డ్ ప్రైవేటు వర్సిటీగా మారింది. గతేడాది విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు కళాశాలకు డీమ్డ్ హోదా లభించింది. డీమ్డ్ వర్సిటీలుగా మారేందుకు రెండు కళాశాలలు ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. యూజీసీ వద్ద 10 కళాశాలల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. నాణ్యమైన విద్యను అందించే, పేరున్న కళాశాలలు డీమ్డ్‌గా మారిపోతుండడంతో ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు సాధించినా ఫలితం లేదనే విమర్శలు వస్తున్నాయి. బ్రౌన్‌ఫీల్డ్ ప్రైవేటు వర్సిటీలో పాత కళాశాల కన్వీనర్ సీట్లు కొనసాగుతుండడంతో కొంతవరకు ఈఏపీసెట్ ర్యాంకర్లకు ఉపయుక్తంగా ఉంటోంది.

శ్రీవారి భక్తులకు తిరుపతిలో క్యూలైన్ షెడ్లు



క్యూలైన్ షెడ్లలో సేదతీరుతున్న భక్తులు

ఈనాడు, తిరుపతి: తిరుమల శ్రీవారి భక్తులకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, మాధవం భక్తుల వసతి సముదాయం, విష్ణు నివాసంలో తితిదే ఉచిత సర్వదర్శన టోకెన్లు అందజేస్తుంది. గతంలో భూదేవి కాంప్లెక్స్ వద్ద ఎస్ఎస్‌డీ టోకెన్ల కోసం వచ్చిన భక్తులు ఫెన్సింగ్ క్యూలైన్లో తోపులాట కారణంగా అవస్థలు పడేవారు. నేడు కూటమి ప్రభుత్వంలో తిరుమల నారాయణగిరి తరహాలో శాశ్వత క్యూలైన్ షెడ్లు ఏర్పాటు చేసి ఎండ, వాన నుంచి ఉపశమనం కల్పించారు.

త్వరలో నూతన భవనంలోకి శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రాన్ని తితిదే అదనపు ఈవో కార్యాలయం వెనుక భాగం నుంచి అన్నమయ్య భవన్ ఎదురుగా ఉన్న భవనంలోకి మార్చడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో తితిదే అదనపు ఈవో కార్యాలయంలో శ్రీవారి దర్శన టికెట్ల జారీ కేంద్రం పనిచేస్తుండగా రద్దీ ఎక్కువగా ఉండడం, వీఐపీ సిఫార్సు లేఖలతో వచ్చే భక్తులతో ఇబ్బందికరంగా ఉండేది. దీంతో శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రాన్ని అదనపు ఈవో కార్యాలయం వెనుక తాత్కాలిక జర్మన్ షెడ్లలో ఏర్పాటు చేసి భక్తులకు టికెట్లు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం శాశ్వతంగా అన్నమయ్య భవన్ ఎదురుగా ఉన్న భవనంలోకి మారుస్తున్నారు. ఇప్పటికే టికెట్ల జారీ కేంద్రంలో క్యూలైన్లు, ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. మరో వారంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

శ్రీవారిని రికార్డు స్థాయిలో దర్శించుకున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో వారం రోజులుగా భక్తుల తాకిడి పెరిగింది. ప్రతి గురువారం ఉదయం తిరుప్పావడ సేవ, సాయంత్రం పూలంగి సేవ కారణంగా దర్శనం సమయం రెండు, మూడు గంటలకు పైగా తగ్గుతుంది. సాధారణంగా గురువారం కేవలం 62 వేల నుంచి 63 వేల మంది భక్తులు మాత్రమే శ్రీవారిని దర్శించుకుంటారు. కానీ ఈ గురువారం రికార్డు స్థాయిలో 72,579 మంది దర్శించుకున్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఆరుగురి దుర్మరణం

- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అతివేగం ఆరుగురి ప్రాణాలను బలిగొంది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై తాటిచెర్ల మోటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతులంతా బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందినవారు. పోలీసుల వివరాల మేరకు... బేస్తవారపేట వైపు నుంచి గ్రానైట్ లోడుతో వస్తున్న లారీని ఒంగోలు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో లారీ ముందు భాగంలో కారు ఇరుక్కుపోయి లారీతోపాటు కొద్ది దూరం ముందుకు రావడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. కుమార్తె శిరీష, కుమారుడు సిద్ధుతో కలిసి స్టూవర్టుపురానికి చెందిన గజ్జల భవాని (22) ఇటీవల నంద్యాల జిల్లా డోన్‌కు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారిని తీసుకురావడానికి స్టూవర్టుపురం నుంచి గజ్జల నరసింహ (22), కర్రెద్దుల దివాకర్ (26) గజ్జల అంకాలు (45), బచ్చు సందీప్ (25), గజ్జల బబ్బులు అలియాస్ జోసఫ్ (25) గురువారం సాయంత్రం కారులో డోన్‌కు వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. కారును దివాకర్ నడుపుతున్నారు. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నరసింహ, దివాకర్, అంకాలు, సందీప్, జోసఫ్, భవాని మృతిచెందారు. తల్లి భవానిని కోల్పోయిన నాలుగు, రెండేళ్ల చిన్నారులు శిరీష, సిద్ధు కొద్దిపాటి గాయాలతో బయటపడ్డారు. వారి రోదనలు చూపరుల కంటతడి పెట్టించాయి.



లారీ కిందికి దూసుకెళ్లి నుజ్జునుజ్జయిన కారు

✦ ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీనిచ్చారు. ఎస్పీ, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

రాష్ట్రంలో రెండు కొత్త విశ్వవిద్యాలయాలు

ప్రధాన ప్రాంగణాలను మారుస్తూ ఉత్తర్వుల జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు కొత్త విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏలూరు సమీపంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఉమ్మడి ఏపీలో ఈ రెండు విశ్వవిద్యాలయాల ప్రధాన ప్రాంగణాలు హైదరాబాద్‌లో ఉండేవి. వీటికి అనుబంధంగా ఏపీలో స్టడీ సెంటర్లు, పీఠాలు ఉన్నాయి. విభజన అనంతరం పదేళ్లపాటు సేవలందించిన ఈ ప్రధాన ప్రాంగణాలు ఇటీవల సేవలను నిలిపివేశాయి. వీటిని ఏపీలోకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టడీ కేంద్రాలన్నీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలోకి, శ్రీశైలం, కూచిపూడి, రాజమహేంద్రవరంలో ఉన్న మూడు పీఠాలు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోకి వస్తాయి.

వినరో భాగ్యము.. సత్య కథ!

అన్నవరంలో గోత్రనామాలతో జరిగే పూజలను భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు

ఈనాడు, కాకినాడ– న్యూస్‌టుడే, అన్నవరం: అన్నవరం సత్యదేవుడి సేవల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తులు.. రుసుము చెల్లించి తమ గోత్రనామాలతో జరిగే పూజను ఆన్‌లైన్‌లో వీక్షించేలా దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. త్వరలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది. దేవస్థానంలో నిత్యం వ్రతాలు, కల్యాణాలు, ఆయుష్య హోమంతోపాటు వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హోమం, పౌర్ణమి రోజున ప్రత్యంగిరా హోమం నిర్వహిస్తుంటారు. ఆయా సేవలకు నేరుగా హాజరుకాలేని భక్తులు పరోక్షంగా పాల్గొనే అవకాశముంది. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించేవారికి రసీదుపైనే యూట్యూబ్ లింక్ చిరునామా వస్తుంది. తద్వారా తమ గోత్రనామాలతో జరిగే పూజను చూడొచ్చు. ప్రసాదం, కండువా, రవిక, అక్షితలు, కుంకుమలను ఆయా పూజలకు అనుగుణంగా తపాలాలో పంపిస్తారు. సాధారణ భక్తులు సైతం యూట్యూబ్‌లోని annavaramdevasthanamlive ద్వారా సేవల ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించే అవకాశముంది.

విజయవాడ శివారులో రోహింగ్యాలు

- హైదరాబాద్ నుంచి వచ్చి తాడిగడపలో నివాసం
- వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులుగా పని
- 15 మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – పెనమలూరు: విజయవాడ శివారు తాడిగడపలో అక్రమంగా ఉంటున్న రోహింగ్యాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ నుంచి వచ్చిన సమాచారంతో విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగర శివారులోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి మొత్తం 15 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించారు. తాడిగడపలోని ఓ ఇంటిని శుక్రవారం ఉదయాన్నే పోలీసులు చుట్టుముట్టారు. ఆ ఇంట్లో ఉన్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారు ఎప్పటి నుంచి ఇక్కడ ఉంటున్నారు? వారి కోసం ఎవరెవరు వస్తున్నారు? అని ఇంటి యజమానిని అడిగి తెలుసుకున్నారు. తనకు పరిచయస్థుడైన ఓ వ్యక్తి ఆటోనగర్‌లో భవనం నిర్మిస్తున్నానని, అక్కడ పని చేస్తున్న ఓ మహిళకు, పురుషుడికి పోర్షన్ అద్దెకు కావాలని కోరడంతో ఈనెల 9న అద్దెకు ఇచ్చానని యజమాని చెప్పారు. అయితే ఆమె గత ఆదివారమే వెళ్లిపోగా, పురుషుడు ఒక్కడే ఉంటున్నాడని, గురువారం అర్ధరాత్రి దాటాక మరో ఏడుగురు యువకులు వచ్చి ఆ ఇంట్లో ఆశ్రయం పొందారని తేలింది. మొత్తం 8 మందినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేక్రమంలో తాడిగడప వంద అడుగుల రోడ్డులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో పనిచేస్తున్న ఇద్దరిని, గోశాల వద్ద ఓ అపార్ట్‌మెంట్ పనుల కోసం వచ్చిన ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు గత ఆరు నెలలుగా ఇక్కడే పనిచేస్తున్నట్లు గుర్తించారు.



తాడిగడపలో పోలీసులు దాడి చేసిన ఇల్లు

పూర్వాపరాలపై విచారణ..

మయన్మార్ నుంచి అక్రమంగా దేశంలోకి వలస వచ్చిన వీరు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. అక్కడి నుంచి విజయవాడ చేరుకుని భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరందరినీ అదుపులోకి తీసుకుని పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. వారికి ఎలాంటి తీవ్రవాద మూలాలు లేవని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వీరి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు.

కొత్త కొబ్బరికి రికార్డు ధర

- క్వింటాలు రూ.17,500

అంబాజీపేట, న్యూస్‌టుడే: కొత్త కొబ్బరికి రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అంబాజీపేట, కేరళలోని అలెప్పీ, తమిళనాడులోని పొల్లాచి ప్రాంతాలు కొబ్బరి మార్కెట్‌కు పెట్టింది పేరు. ఆ ప్రాంతాల్లో ఉత్పత్తులు తగ్గడంతో ధర పెరగడానికి కారణమైంది. దీంతో కొబ్బరి ధర క్వింటాలు రూ.17,500కు చేరింది. గతేడాది రూ.9,500 ఉంది. ఈ ఏడాది మార్చిలో రూ.14 వేలు, ఏప్రిల్ మొదటి వారంలో రూ.15 వేలు, చివరివారంలో రూ.16 వేల వరకు ధర పలకగా ప్రస్తుతం ఏకంగా రూ.17,500కు ఎగబాకింది. మార్కెట్ చరిత్రలోనే ఇది అరుదైన రికార్డుగా రైతులు, వ్యాపారులు అభివర్ణిస్తున్నారు.

తమిళనాడులో ఉత్పత్తి తగ్గడంతో.. జిల్లా మార్కెట్‌లో పచ్చి కొబ్బరి ధర ఆశాజనకంగా ఉంది. దీంతో రైతులు వీటిని నేరుగానే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వెయ్యి కాయల ధర రూ.14,000-14,500 వరకు ఉంది. వెయ్యి కాయలతో 85-90 కిలోల కొత్తకొబ్బరి ఉత్పత్తి అవుతుంది. దీనికి కూలీలు, ఇతర ఖర్చులు అధికం కావడంతో రైతులు ఇక నేరుగా పచ్చికాయలనే విక్రయించుకుంటున్నారు. తమిళనాడులో ఉత్పత్తి తగ్గడంతో ఆ ప్రభావం ఏపీపై పడింది. అక్కడ వెయ్యి కాయలతో 110-120 కిలోల కొత్తకొబ్బరి ఉత్పత్తి అవుతుంది. గతంలో 130-140 కిలోలు ఉత్పత్తి అయ్యేది. కోనసీమ మార్కెట్ చరిత్రలో కొత్త కొబ్బరి ధర పెరగడం ఆల్‌టైమ్ రికార్డుగా ఉంది. గతంలో ఇంత ధర రాలేదంటున్నారు. ఇదే సమయంలో కొత్తకొబ్బరిని రైతులు ఉత్పత్తి చేయడం లేదని మార్కెట్ విశ్లేషకుడు డి.వెంకటరమణ శుక్రవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.



అంబాజీపేట మార్కెట్‌లో కొత్తకొబ్బరి

ఎవరిపై మీ గురి?

- తొలిరోజు కస్టడీలో సిరాజ్, సమీర్‌లపై ప్రశ్నల వర్షం

ఈనాడు, విజయనగరం: అసలు మీ లక్ష్యమేంటి? హైదరాబాద్ సహా ఇతర ముఖ్య నగరాలపై ఎక్కడైనా గురిపెట్టారా? అని ఉగ్రవాద మూలాలున్న కేసులో అరెస్టయిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌లను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వీరిద్దరినీ కోర్టు అనుమతితో శుక్రవారం నుంచి ఏడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఉదయం 10 గంటలకే జైలుకెళ్లి విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ)కు తీసుకొచ్చారు. మధ్యాహ్నం సిరాజ్, సమీర్‌లను వేర్వేరు గదుల్లో ఉంచి జిల్లా పోలీస్, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు విచారణ ప్రారంభించారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలపైనే తొలి రోజు ప్రశ్నలు సంధించారు. విజయనగరానికి చెందిన సిరాజ్‌కు హైదరాబాద్‌వాసి సమీర్‌తో బంధం ఎలా కలిసింది, ఇది ఎంతవరకు విస్తరించిందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. బాంబుల తయారీ, వాటి ప్రయోగానికి అవసరమైన నిధులిస్తామని ఎవరు చెప్పారు, అప్పగించిన పని విఫలమైతే తర్వాత ఏం చేయాలనుకున్నారని అడిగిన ప్రశ్నలకు నిందితులు ముక్తసరిగా బదులిచ్చినట్లు తెలిసింది. ఉత్తరాంధ్రలోని విజయనగరాన్ని బాంబు ప్రయోగానికి ఎంచుకోవడానికి కారణాలేమిటన్న కోణంలో లోతుగా విచారణ చేపట్టాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు.

రాజాసింగ్‌పై వ్యాఖ్యలతోనే ఉగ్రవాదుల దృష్టిలోకి!

విశాఖపట్నం (ఆరిలోవ), న్యూస్‌టుడే: 'హైదరాబాద్‌లోని గోషామహల్ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రసంగం వీడియో కింద హిందువులకు వ్యతిరేకంగా కామెంట్ పెట్టా. దాన్ని మెచ్చుకుంటూ తెలియని నంబరు నుంచి నాకో మెసేజ్ వచ్చింది. బాగా కౌంటర్ పెట్టావు, ధైర్యంగా సమాధానం చెప్పావు, శభాష్ అని అందులో ఉంది. తరువాత ఆ వ్యక్తితో ఫోన్ కాంటాక్ట్ మొదలైంది' అని సిరాజ్ విశాఖ కేంద్ర కారాగారంలో ఓ అధికారితో చెప్పినట్లు సమాచారం. రిమాండ్ ఖైదీలుగా సిరాజ్, సమీర్‌లను శుక్రవారం ఉదయం వరకు జైల్లోని వేర్వేరు బ్యారక్‌లలో ఉంచారు. తనిఖీల్లో భాగంగా సిరాజ్ సెల్ వద్దకు వెళ్లిన ఓ అధికారి ఈ మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నావు, నిన్ను ఎవరు ప్రోత్సహించారు అని అడగ్గా అతను పైవిధంగా జవాబిచ్చినట్లు తెలిసింది. 'ఫోన్‌లో మాట్లాడుకోవడం మొదలయ్యాక ఆ వ్యక్తి నాకు పలుమార్లు ఆర్థిక సహాయం చేశాడు. ముంబయిలో కలిసిన తర్వాత వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి ఉగ్రదాడులపై శిక్షణ ఇప్పించాడు' అని అతను చెప్పినట్లు సమాచారం.

EENADU Vol: 51, Issue: 284 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



జైపుర్‌లో మైసూర్‌'పాక్‌' అని అడగొద్దు!

జైపుర్‌: పహల్గాం ఉగ్రదాడి తర్వాత శత్రుదేశానికి వ్యతిరేకంగా నెట్టింట పలురకాల చర్చలు జరిగాయి. పాకిస్థాన్‌ పేరు ధ్వనించే మైసూర్‌పాక్‌ మిఠాయి నామంలో మార్పు చేయాలన్నది అందులో ఒకటి. సోషల్‌ మీడియాలో ఈ డిమాండును చూసిన ఓ వ్యాపారి వెంటనే దాన్ని ఆచరణలో పెట్టేశారు. రాజస్థాన్‌లోని జైపుర్‌లో గల 'త్యోహార్‌ స్వీట్స్‌' యజమాని తమ దుకాణంలో గల మిఠాయిల పేర్లలో ఈ మార్పులు చేశారు. మైసూర్‌పాక్‌తోపాటు మోతీ పాక్‌, ఆమ్‌ పాక్‌, గోండ్‌ పాక్‌ల పేర్లను మార్చి.. మైసూర్‌ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్‌ శ్రీ, గోండ్‌ శ్రీ అని కొత్త పేర్లు పెట్టారు. దీనిపై దుకాణం యజమాని అంజలీ జైన్‌ మాట్లాడుతూ.. 'దేశభక్తి సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం'' అని తెలిపారు. వాస్తవానికి 'పాక్‌' అనే పదం సంస్కృతం నుంచి వచ్చింది. దీనర్థం 'వండటం' అని. చక్కెర లేదా బెల్లంతో చేసే పదార్థాన్ని కూడా పాకం అని పిలుస్తాం.

గందరగోళంలో హార్వర్డ్‌ విదేశీ విద్యార్థుల భవిత

- మరో విద్యాసంస్థకు బదిలీ కాకపోతే చట్టబద్ధతకు ముప్పు
- 800 మంది భారతీయులు సహా వేల మంది విద్యార్థులపై ప్రభావం
- ఆరు షరతులకు వర్సిటీ అంగీకరిస్తేనే ఉపశమనం
- ట్రంప్‌ సర్కారు స్పష్టీకరణ
- కోర్టులో సవాలు చేసిన విశ్వవిద్యాలయం

న్యూయార్క్‌: అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్‌ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలను ట్రంప్‌ యంత్రాంగం నిషేధించడంతో ప్రస్తుతం అక్కడ చదువుతున్న దాదాపు 800 మంది భారతీయులు సహా వేల మంది విదేశీ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ఈ విద్యాసంవత్సరం తర్వాత వారంతా ఇతర విశ్వవిద్యాలయాలకు బదిలీ కావాల్సిన గందరగోళ పరిస్థితి తలెత్తింది. లేనిపక్షంలో వారు చట్టబద్ధతను కోల్పోయే ముప్పు పొంచి ఉంది. అయితే విశ్వవిద్యాలయం ఆరు షరతులకు అంగీకరిస్తే విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని యథావిధిగా కొనసాగించవచ్చని ట్రంప్‌ యంత్రాంగం పేర్కొంది. ఈ ఆదేశాలను వర్సిటీ ఫెడరల్‌ కోర్టులో సవాలు చేసింది. ''హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి ఇక వీలు లేనట్టే లెక్క. ప్రస్తుతం అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు వేరే వర్సిటీకి



బదిలీ కావాలి. లేకుంటే వారిని అక్రమ ప్రవాసులుగా పరిగణించాల్సి ఉంటుంది'' అని అమెరికా అంతర్గత భద్రతా విభాగం హెచ్చరించింది. విశ్వవిద్యాలయం అమెరికా వ్యతిరేక, తీవ్రవాద అనుకూల ప్రదర్శనలను అనుమతించిందని, యూదు విద్యార్థులపై దాడులకు కారణమైందని, చైనా కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా పని చేసిందని ఆరోపించింది.

షరతులు ఇవీ..

హార్వర్డ్‌ విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని కొనసాగించాలంటే 72 గంటల్లోగా ఆరు షరతులకు కట్టుబడాలని ఫెడరల్‌ ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ఐదేళ్లలో వర్సిటీ క్యాంపస్‌లో విదేశీ విద్యార్థులు నిర్వహించిన నిరసన ప్రదర్శనల వీడియో ఫుటేజీ ఇవ్వాలని, వారి క్రమశిక్షణ రికార్డులు సమర్పించాలని, విదేశీ విద్యార్థులు చట్టవిరుద్ధ కార్యకలాపాలకుగానీ, హింసకుగానీ పాల్పడినట్లు లేదా వారి వల్ల ఇతర విద్యార్థులకు హాని కలిగినట్లు నిర్ధారించే రికార్డులను కూడా సమర్పించాలని స్పష్టం చేసింది.


హార్వర్డ్‌ న్యాయపోరాటం

విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ట్రంప్‌ యంత్రాంగం జారీ చేసిన ఆదేశాలను హార్వర్డ్‌ విశ్వవిద్యాలయం బోస్టన్‌ ఫెడరల్‌ కోర్టులో సవాలు చేసింది. ట్రంప్‌ యంత్రాంగం తీసుకున్న చర్యను హార్వర్డ్‌ చట్ట వ్యతిరేకమైనదిగా అభివర్ణించింది. ఈ ఆదేశ నేపథ్యంలో తమ విద్యార్థులకు దీని నిర్ణయం చెల్లదని తెలియజేసింది. హార్వర్డ్‌ విశ్వవిద్యాలయం కేంబ్రిడ్జ్‌, మసాచుసెట్స్‌ నగరాల్లో ఉన్న క్యాంపస్‌లలో 6800 మంది విదేశీ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తోంది. దాదాపు 100కు పైగా దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడ ఏటా ప్రవేశం పొందుతున్నారు. ప్రస్తుతం హార్వర్డ్‌ విశ్వవిద్యాలయంలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మొత్తం 10,158 మంది విదేశీ విద్యార్థులు చదువుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో కలిపి 788 మంది భారతీయ విద్యార్థులు నమోదయ్యారని హార్వర్డ్‌ అంతర్జాతీయ కార్యాలయ వెబ్‌సైట్‌ తెలియజేస్తోంది.

మరో కేసులో విదేశీ విద్యార్థులకు కోర్టు రక్షణ

ఇదిలా ఉండగా ట్రంప్‌ యంత్రాంగం నేరారోపణలు ఎదుర్కొంటున్న వేల మంది విదేశీ విద్యార్థుల చట్టబద్ధతను రద్దు చేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఓక్లాండ్‌కు చెందిన డిస్ట్రిక్ట్‌ జడ్జి జెఫ్రీ ఎస్‌ వైట్‌ పక్కనపెట్టారు. వారిని వ్యక్తిగతంగా విచారించకుండా అరెస్టులు చేయరాదంటూ ఆదేశించారు. ఇదే అంశంలో దాఖలైన మరో పిటిషన్‌ ఇంకా పెండింగులో ఉంది.

ఎన్‌ఐఏ కేసుల కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు కావాలి: సుప్రీంకోర్టు



దిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) కేసుల్ని పరిష్కరించడానికి పూర్తిగా అంకితమైన ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం నొక్కిచెప్పింది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న చట్టాల న్యాయసమీక్ష జరగాలని కోర్టు అభిప్రాయపడింది. ఎన్‌ఐఏకు దేశవ్యాప్తంగా వర్తించే దారుణమైన కేసులే అప్పగిస్తున్నారని జస్టిస్‌ సూర్యకాంత్‌, జస్టిస్‌ ఎన్‌. కోటీశ్వర్‌ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చట్టాన్ని రూపొందించేటప్పుడు అందుకు సంబంధించి ఉత్పన్నమయ్యే కేసుల సమీక్ష జరగకుంటే కోర్టుల్లో విచారణ భారం పెరిగిపోతుందని ధర్మాసనం పేర్కొంది. దీనికి పరిష్కార మార్గమూ అభిప్రాయపడింది. మహారాష్ట్రలోని గడ్చిరోలికి చెందిన ఒక మావోయిస్టు సానుభూతిపరుడి బెయిల్‌ దరఖాస్తుపై విచారణ సందర్భంగా కోర్టు ఈ అభిప్రాయాలను వ్యక్తీకరించింది.

మహిళల హక్కుల్లో ప్రసూతి సెలవులు కీలకం

మహిళలకు ప్రసూతి సెలవులను దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోసారి సమర్థించింది. వారు మాతృత్వపు లబ్ధి, సంతానం పొందే హక్కుల్లో ఇవి అత్యంత కీలకమైనవని అభివర్ణించింది. ఏ సంస్థ కూడా ఉద్యోగుల ప్రసూతి సెలవు హక్కును హరించలేదని న్యాయస్థానం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి రెండో వివాహం అనంతరం కలిగిన బిడ్డకు జన్మనిచ్చేందుకు ప్రసూతి సెలవులను నిరాకరించారు. దీంతో ఆమె మొదట మద్రాస్‌ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ప్రతికూల తీర్పు వెలువడటంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె మొదటి వివాహం ద్వారా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిందని.. తాజాగా మరోసారి ప్రసూతి సెలవులను నిరాకరించినట్లు చెప్పారు. తమిళనాడు రాష్ట్ర నిబంధనల ప్రకారం తొలి ఇద్దరు పిల్లలకు మహిళలకు ప్రసూతి లబ్ధిని పొందే అవకాశం ఉంది. తాను రెండో వివాహం చేసుకొన్న అనంతరం ప్రభుత్వ ఉద్యోగంలో చేరినట్లు ఆ ఉపాధ్యాయిని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు.. తన రెండు కాన్పులకు ఎటువంటి ప్రసూతి సెలవులు వాడుకోలేదన్నారు. ఈ సందర్భంగా ఆమె తరఫున వాదిస్తున్న న్యాయవాది కేవీ ముత్తుకుమార్‌ స్పందిస్తూ.. ఆమె ప్రాథమిక హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఉందని పేర్కొన్నారు. దీంతో ఏకీభవించిన జస్టిస్‌ అభయ్‌ ఎస్‌ ఓక్‌, జస్టిస్‌ ఉజ్జల్‌ భుయాన్‌ ధర్మాసనం మద్రాస్‌ హైకోర్టు తీర్పును పక్కనపెడుతూ కక్షిదారు ప్రసూతి ప్రయోజనాలు పొందేందుకు అర్హురాలని తీర్పిచ్చింది.

చేతులు జోడించి క్షమాపణ చెబుతున్నా

- మధ్యప్రదేశ్‌ మంత్రి విజయ్‌ షా వీడియో



భోపాల్‌: భారత వైమానిక దళ అధికారిణి కర్నల్‌ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్‌ మంత్రి విజయ్‌ షా మరోసారి క్షమాపణలు చెప్పారు. అది 'భాషాపరమైన తప్పిదమే' తప్ప ఏ మతాన్నీ కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. భారత సైన్యానికి, సోదరి కర్నల్‌ సోఫియా ఖురేషీకి, యావత్‌ దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతున్నట్లు ఓ వీడియోను విడుదల చేశారు. "ఇటీవల పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడి నన్ను ఎంతగానో బాధించింది. దేశంపై నాకు అపారమైన ప్రేమ, భారత ఆర్మీపై అచంచలమైన గౌరవం ఉన్నాయి. నా వ్యాఖ్యలు ఓ సామాజిక వర్గాన్ని, మతాన్ని, దేశ ప్రజలందర్నీ బాధించాయి. అది భాషాపరంగా నేను చేసిన తప్పు. అందుకు మనస్ఫూర్తిగా చింతిస్తున్నాను. దేశ ప్రజలకు, భారత ఆర్మీకి, సోదరి కర్నల్‌ సోఫియాకు చేతులు జోడించి క్షమాపణ చెబుతున్నా'' అని విజయ్‌ షా ఆ వీడియోలో పేర్కొన్నారు.

ఏడుగురు సీఆర్‌పీఎఫ్‌ కమాండోలకు శౌర్యచక్ర ప్రదానం

దిల్లీ: వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసే క్రమంలో అమరులైన ఇద్దరు సీఆర్‌పీఎఫ్‌ కానిస్టేబుళ్లతోపాటు మొత్తం ఏడుగురికి శౌర్య చక్ర పతకం వరించింది. గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పతకాలను అందజేశారు. మావోయిస్టులకు గట్టి పట్టున్న ఛత్తీస్‌గఢ్‌ సుక్మా జిల్లాలోని టేకల్‌గూడెంలో 2024 జనవరి 30న సీఆర్పీఎఫ్‌ బెటాలియన్‌ ఫార్వర్డ్‌ ఆపరేటింగ్‌ బేస్‌ ఏర్పాటు ప్రారంభించింది. ఆ సమయంలో బారెల్‌ గ్రెనేడ్‌ లాంచర్లు, ఐఈడీలతో మెరుపుదాడి చేసిన మావోయిస్టులు విరుచుకుపడ్డారు. తమ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా 201 కోబ్రా బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్‌ పవన్‌కుమార్‌ తోటి కానిస్టేబుల్‌ దేవన్‌తో కలిసి తెగువతో పోరాడారు. ఈ క్రమంలో వారు అమరులయ్యారు. వారి అసాధారణ ధైర్యం, పరాక్రమానికి మరణానంతరం శౌర్యచక్ర లభించింది. ఈ వీరుల కుటుంబ సభ్యులకు రాష్ట్రపతి పతకం అందజేశారు. ఇదే కోబ్రా యూనిట్‌కు చెందిన డిప్యూటీ కమాండెంట్‌ లఖ్వీర్‌, అసిస్టెంట్‌ కమాండెంట్‌ రాజేశ్‌ పంచల్‌, కానిస్టేబుల్‌ మల్కిత్‌ సింగ్‌ తాము చూపిన అసాధారణ ధైర్యానికి శౌర్యచక్ర పతకం అందుకున్నారు. లఖ్వీర్‌ పేలుళ్లలో గాయపడగా



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా శౌర్యచక్ర పురస్కారం అందుకుంటున్న దేవన్‌ తల్లి, భార్య

పంచల్‌ కుడి చేతికి తూటా తగిలింది. పవన్‌ కుమార్‌ మృతదేహం కోసం ఛాతికి గాయమైనా మల్కిత్‌ సింగ్‌ తుపాకీ గుళ్లకు ఎదురెళ్లి ఎంతో మంది మావోయిస్టులను కాల్చిచంపాడు. 2023 ఏప్రిల్‌ 3న ఝార్ఖండ్‌ ఛత్రా జిల్లా జరిగిన మరో ఆపరేషన్‌లో పరాక్రమం చూపిన సీఆర్పీఎఫ్‌ 203 కోబ్రా బెటాలియన్‌కు చెందిన డిప్యూటీ కమాండెంట్‌ విక్రాంత్‌ కుమార్‌, ఇన్‌స్పెక్టర్‌ జెఫ్రీ హమింగ్‌చుల్లో శౌర్యచక్ర అందుకున్నారు. మావోయిస్టులతో 50 నిమిషాలపాటు జరిగిన భీకర పోరులో వీరు ఐదుగురు మావోయిస్టు అగ్రనేతలను చంపారు.

పాక్‌కు గూఢచర్యం.. మరో ఇద్దరి అరెస్ట్‌

ఇంటర్నెట్‌డెస్క్‌: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నారన్న అనుమానంతో ఉత్తర్‌ప్రదేశ్‌ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్‌) ఇద్దరిని అదుపులోకి తీసుకొంది. దిల్లీలో తుక్కు వ్యాపారం చేసే మొహద్‌ హరూన్‌ను నొయిడాలో అదుపులోకి తీసుకొన్నారు. అతడికి పాకిస్థాన్‌ దౌత్య కార్యాలయంలోని ముజమ్మిల్‌ హుస్సేన్‌తో సంబంధాలున్నట్లు గుర్తించారు. ఇతడు వీసా కోసం డబ్బులు, ఇతర సున్నిత సమాచారం చేరవేయడంతో పాటు.. తీవ్రవాద భావజాల వ్యాప్తికి పాల్పడుతున్నట్లు అనుమానం. పాక్‌ వీసాలు ఇప్పిస్తానంటూ హరూన్‌ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి వివిధ బ్యాంకు ఖతాల్లో జమ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక అదంపుర్‌, వారణాసిలలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఏటీఎస్‌ బృందం తుఫేల్‌ అనే మరో వ్యక్తిని అరెస్టు చేసింది. అతడు దేశ వ్యతిరేక వాట్సప్‌ గ్రూప్‌లో చేరాడు. '' పాకిస్థాన్‌లోని వ్యక్తులు, సంస్థలతో తుఫేల్‌ సంబంధాలు నడుపుతున్నాడు. వారణాసిలోని రాజ్‌ఘాట్‌, నమో ఘాట్‌, జ్ఞానవాపీ మసీదు, వారణాసీ రైల్వేస్టేషన్‌, జామా మసీద్‌, ఎర్రకోట, నిజాముద్దీన్‌ ఫొటోలను పాక్‌ వ్యక్తులకు పంపాడు'' అని ఏటీఎస్‌ వెల్లడించింది.

ఇది ప్రచార ప్రయోజన వ్యాజ్యం

- ప్రొటోకాల్‌ వివాదంపై పిల్‌ను కొట్టివేస్తూ సుప్రీం వ్యాఖ్య

దిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ బి.ఆర్‌. గవాయ్‌కి ఈనెల 14న ప్రొటోకాల్‌ ప్రకారం గౌరవ మర్యాదలు అందించడంలో విఫలమైన మహారాష్ట్ర ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్‌) సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ వ్యాజ్యాన్ని చీఫ్‌ జస్టిస్‌ బి.ఆర్‌.గవాయ్‌, జస్టిస్‌ ఆగస్టిన్‌ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం ప్రచార ప్రయోజన వ్యాజ్యం (పబ్లిసిటీ ఇంటరెస్ట్‌ లిటిగేషన్‌)గా అభివర్ణించింది. ఈ వ్యాజ్యం దాఖలు చేసిన న్యాయవాదికి రూ.7 వేల జరిమానా విధించింది.

'దిగువ కోర్టు'లని పిలవడం రాజ్యాంగ విరుద్ధం

- సుప్రీంకోర్టు పునరుద్ఘాటన

దిల్లీ: ఏ న్యాయస్థానాన్నైనా 'దిగువ కోర్టు' అని పిలవడం భారత రాజ్యాంగ నియమాలకు విరుద్ధమని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. 1981 నాటి హత్య కేసులో ఇద్దరికి దోష విముక్తి కల్పిస్తూ తీర్పు వెలువరించిన సందర్భంగా జస్టిస్‌ అభయ్‌ ఎస్‌.ఓక్‌, జస్టిస్‌ ఆగస్టిన్‌ జార్జ్‌ మసీహ్‌ ధర్మాసనం ఈ విషయాన్ని తెలిపింది. ట్రయల్‌ కోర్టు రికార్డులను దిగువ కోర్టు రికార్డులుగా పేర్కొనరాదని స్పష్టం చేసింది. ఇదే విషయమై గత ఏడాది ఫిబ్రవరి 8న ఇచ్చిన ఆదేశాలను ఉటంకించింది. ట్రయల్‌ కోర్టులుగానే వ్యవహరించాలంటూ అన్ని హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థాన రిజిస్ట్రీ సర్క్యులర్‌ జారీ చేసిన విషయాన్ని గుర్తుచేసింది.

రష్యా, ఉక్రెయిన్‌ మధ్య భారీగా యుద్ధ ఖైదీల మార్పిడి

- 780 మంది సైనికులు, ఖైదీలను విడిచిపెట్టిన రెండు దేశాలు

కీవ్‌: రష్యా, ఉక్రెయిన్‌ శుక్రవారం భారీగా యుద్ధఖైదీలను మార్పిడి చేసుకున్నాయి. ఉక్రెయిన్‌ 390 మంది సైనికులను, పౌరులను విడుదల చేస్తే.. రష్యా కూడా అదే సంఖ్యలో సైనికులను, పౌరులను విడిచిపెట్టింది. మూడేళ్ల ఉక్రెయిన్‌ యుద్ధంలో ఇదే అతి పెద్ద ఖైదీల మార్పిడి. భవిష్యత్తులో మరో 1000 మంది ఖైదీలను మార్పిడి చేసుకునేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. ఈ మార్పిడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ కూడా ధ్రువీకరించారు. రెండు దేశాలను అభినందించారు.

పాక్‌ సైనిక పాలనకు ఐరోపా మద్దతు

- విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌ తీవ్ర విమర్శలు

దిల్లీ: సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్‌ వక్రబుద్ధిని కేంద్రమంత్రి ఎస్‌.జైశంకర్‌ విదేశాల్లో ఎండగడుతున్నారు. తాజాగా ఆయన జర్మనీ మీడియాతో మాట్లాడుతూ ఐరోపా దేశాల వైఖరిని ఆక్షేపించారు. సైనిక పాలనకు, సరిహద్దులో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోన్న పాక్‌కు మద్దతు ఇవ్వడాన్ని ఆయన ప్రశ్నించారు. "1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కశ్మీర్‌లో మా సరిహద్దుల వెంట పాక్‌ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. ఈ ఎనిమిది దశాబ్దాల కాలంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కలిగిన ఐరోపా దేశాలు.. పాక్‌ సైనిక పాలనకు మద్దతుగా నిలిచాయి. పశ్చిమ దేశాల నుంచి వచ్చిన మద్దతు ఇంకెవరి నుంచి రాలేదు" అని విమర్శలు చేశారు.

యూపీ హత్యకేసులో 43 ఏళ్లు జైల్లోనే.. 104 ఏళ్ల వయసులో నిర్దోషిగా విడుదల

కౌశాంబీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ వ్యక్తి 43 ఏళ్ల కారాగారవాస అనంతరం నిర్దోషిగా జైలు నుంచి విడుదలయ్యాడు. ప్రస్తుతం ఆయన వయసు 104 ఏళ్లు కావడం గమనార్హం. కౌశాంబీ జిల్లాలో 1977లో రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో లఖాన్‌ అనే వ్యక్తితోపాటు మరో ముగ్గురు నిందితులకు ప్రయాగ్‌రాజ్‌లోని జిల్లా సెషన్స్‌ కోర్టు 1982లో జీవితఖైదు విధించింది. ఆ తీర్పుపై వారు అలహాబాద్‌ హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. విచారణ పెండింగులో ఉండగానే ముగ్గురు చనిపోయారు. ఇటీవల విచారణ పూర్తిచేసిన హైకోర్టు.. లఖాన్‌ను నిర్దోషిగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. దీంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యాడు. జైలు రికార్డుల ప్రకారం.. లఖాన్‌ 1921 జనవరి 4న జన్మించారు.

అత్యంత క్రూరదశలో ఇజ్రాయెల్‌ యుద్ధం

- ఆకలితో అలమటిస్తున్న గాజా ప్రజలపై దయ చూపాలన్న డబ్ల్యూహెచ్‌వో

న్యూయార్క్‌: గాజాలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారికి కనీస సదుపాయాలు కూడా అందడం లేదని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌ ఆంటోనియో గుటెరస్‌ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌ యుద్ధం.. ప్రస్తుతం అత్యంత క్రూరదశలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "దాదాపు 400 ట్రక్కుల్లో గాజాలోకి సాయం ప్రవేశిస్తే కేవలం 115 ట్రక్కుల సాయం మాత్రమే ఇప్పటివరకు అందింది. గాజా ప్రజలకు ఇప్పుడు వరదలా సాయం అందాలి. కానీ వారికి చెంచాడంత సాయం మాత్రమే లభిస్తోంది'' అని పేర్కొన్నారు. గాజాలోని పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శరణార్థులకు అందించే ఆహారాన్ని ఆయుధంగా మార్చుకోవడం నేరమని, ఇజ్రాయెల్‌ కాస్త దయచూపాలని కోరింది. ఈ మేరకు వార్షిక సమావేశంలో ఆ సంస్థ అధిపతి టెడ్రోస్‌ అధనోమ్‌ భావోద్వేగభరిత ప్రసంగం చేశారు. "ప్రస్తుతం గాజాలోని ప్రజల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోగలను. వారి బాధ నాకు తెలుస్తోంది. యుద్ధం కారణంగా నెలకొన్న భయానక పరిస్థితులు ప్రజలను



గాజాలోని ఖాన్‌యూనిస్‌లో ఆహారం కోసం ఎగబడుతున్న పాలస్తీనియన్లు

మానసికంగా క్షోభకు గురిచేస్తున్నాయి. ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. యుద్ధ సమయాల్లో ఆహారాన్ని ఆయుధంగా చేసుకోవడం నేరం. వైద్య సదుపాయాలను అడ్డుకోవడం తప్పు. ఈ యుద్ధం ఇజ్రాయెల్‌కు కూడా మంచిది కాదు. ఇరువైపులా శాంతి అవసరం. ఘర్షణలతో శాశ్వత పరిష్కారం లభించదు. గాజాలోని ప్రజలపై దయ చూపించాలని టెల్‌అవీవ్‌ను కోరుతున్నా. ఇది ఇరువర్గాలకు, మానవాళికి మంచిది'' అని టెడ్రోస్‌ పేర్కొన్నారు.

✦ ఇజ్రాయెల్‌ దాడుల్లో గడచిన 24 గంటల్లో 60 మంది పౌరులు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ శుక్రవారం తెలిపింది.

అక్కడ హైహీల్స్‌ వేసుకోవాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి



ఇంటర్నెట్‌ డెస్క్‌: కొన్ని ప్రాంతాల్లో అమలు చేసే వింత నిబంధనలు విస్మయానికి గురిచేస్తుంటాయి. అలాంటిదే.. 'కార్మెల్‌ బై ది సీ' నగరంలో ఉన్న ఈ నిబంధన. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఈ చిన్న నగరంలో కాళ్లకు రెండు అంగుళాల కంటే ఎత్తయిన హై హీల్స్‌ ధరించడం నిషేధం. ఒకవేళ ధరించాలని ఎవరైనా ముచ్చటపడినా స్థానిక ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ నగరంలోని బీచ్‌, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు పర్యాటకుల్ని బాగా ఆకట్టుకుంటాయి. ఇక్కడ సైప్రెస్‌, పైన్‌ చెట్లు ఎక్కువ. ఇవి భారీగా పెరగడంతో వాటి వేర్లు నగరమంతా వ్యాపించాయి. రోడ్లకు ఇరువైపులా పాదచారుల కోసం ఏర్పాటుచేసిన పేవ్‌మెంట్లు వేర్ల పెరుగుదల కారణంగా దెబ్బతింటున్నాయి. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం ఉండట్లేదు. అలాంటిచోట్ల హైహీల్స్‌తో నడిస్తే కిందపడిపోయే ప్రమాదముంది. అందుకే 1963లోనే అప్పటి నగర అటార్నీ హైహీల్స్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనుమతి తీసుకున్నవారు హైహీల్స్‌తో నడిచి పడిపోతే దానికి ప్రభుత్వం బాధ్యత వహించదు.. కోర్టులో దావా వేయలేరు.

ఫైళ్ల తయారీలో తిహాడ్‌ ఖైదీలు

- సుప్రీంకోర్టు, దిల్లీ హైకోర్టులో వాటి వినియోగం

దిల్లీ: సంస్కరణ, పునరావాస చర్యల్లో భాగంగా తిహాడ్‌ జైలు రెండో సముదాయంలోని సుమారు 50 మంది ఖైదీలు పేపరు ఫైళ్ల తయారీలో నిమగ్నమయ్యారు. వీటిని సుప్రీంకోర్టు, దిల్లీ హైకోర్టు సహా వివిధ ప్రభుత్వ విభాగాలు కొనుగోలు చేస్తున్నాయి. ఫైళ్ల తయారీ కోసం జైలులో ప్రత్యేక యూనిట్‌ ఏర్పాటు చేశారు. తయారీ ప్రక్రియలో ఫైళ్ల కవర్లు, బోర్డులను కత్తిరించడం, వాటిని అమర్చడం, ప్రింటింగ్‌ తదితర దశలు ఉంటాయి. ఈ ఉత్పత్తుల కోసం ప్రభుత్వ విభాగాలు విరివిగా ఆర్డర్లు ఇస్తున్నాయని జైలు అధికారులు చెబుతున్నారు.

బిస్కెట్‌ డబ్బా కాదు.. చట్టాలను నిర్ణయించే టిన్‌

- అందులో నుంచి ఏ బిల్లు వస్తే దానిపైనే చర్చ
- వింత ఆచారాన్ని కొనసాగిస్తున్న న్యూజిలాండ్‌

వెల్లింగ్టన్‌: దశాబ్దాలుగా న్యూజిలాండ్‌ ఓ వింత ఆచారాన్ని పాటిస్తోంది. పార్లమెంటు చర్చల్లో ఏ బిల్లుపై చర్చ జరపాలన్న విషయంపై బుర్రలు బద్దలు కొట్టుకోవడం మానేసి ఆ బాధ్యతను ఓ బిస్కెట్‌ డబ్బాకు అప్పగించింది. అందులోంచి ఏ బిల్లును బయటకు తీస్తే వాటిపైనే చర్చ నిర్వహిస్తారు. తాజాగా పార్లమెంటులో ఈ డబ్బా కనిపించడంతో దీని గురించి చర్చలు మొదలయ్యాయి. ప్రతి శాసనసభ్యుడి ప్రతిపాదనకు ఒక అవకాశం కల్పించాలన్న ఆలోచనతో ఈ డబ్బా ఆచారం మొదలైంది. పార్లమెంటులో చర్చల సమయం ఆసన్నమవగానే అద్దాల కిటికీల లోపల భద్రంగా దాచిపెట్టిన డబ్బాను బయటకు తీస్తారు. అంతగా ప్రజాదరణ పొందని సభ్యుల ప్రతిపాదనలను కూడా టోకెన్లపై రాసి నంబర్లు వేస్తారు. అచ్చం లక్కీ డిప్‌ తరహాలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. మంత్రి హోదాలో లేని చట్టసభ్యులు ఒకరి తర్వాత ఒకరు ప్రతిపాదనలను డబ్బాలో వేస్తారు. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు, విద్యార్థులు, పుట్టినరోజు జరుపుకొంటున్న సందర్శకులతో టోకెన్లను బయటకు తీయిస్తారు. ఆ బిల్లుపైనే పార్లమెంటులో చర్చలు జరుపుతారు.

అలా మొదలైంది..

న్యూజిలాండ్‌ పార్లమెంటులో ఆమోదించే చట్టాల బిల్లులు చాలా వరకు లక్కీ డిప్‌లో ప్రవేశించే అవ



కాశం లేదు. ఎందుకంటే అవి ప్రభుత్వ చట్టసభ ఎజెండాలో భాగం. కానీ.. ప్రతి 15 రోజులకు ఒకసారి పార్లమెంటు సమావేశమై బిస్కెట్‌ డబ్బాల్లోంచి తీసిన బిల్లుల ప్రతిపాదనలపై చర్చ నిర్వహిస్తుంది. ఈ పద్ధతి ద్వారా న్యూజిలాండ్‌లో అత్యంత ముఖ్యమైన చట్టాలను రూపొందించారు. వివాహ సమానత్వం, కారుణ్య మరణాలను చట్టబద్ధం చేసే బిల్లులు ఒకప్పుడు ఈ టిన్‌లోంచి తీసినవే. గతంలో న్యూజిలాండ్‌లో బిల్లులను పార్లమెంటు క్లర్క్‌కు అందించేందుకు చట్టసభ సభ్యులు ప్రయాస పడేవారు. చర్చల సమయంలో తమ ఎజెండాలను ముందుకు తీసుకువెళ్లేందుకు క్లర్క్‌ల కార్యాలయానికి పరిగెత్తుకు వెళ్లి తమ ప్రతిపాదనలను నివేదించేవారు. ఈ ప్రక్రియ వల్ల ఒక్కోసారి రాత్రంతా అక్కడే నిలబడి ఉండాల్సి వచ్చేది. ఈ పద్ధతితో నాయకులు విసిగిపోవడంతో బిస్కెట్‌ డబ్బా విధానం ప్రారంభమైంది. 1990ల్లో వెల్లింగ్టన్‌లోని డిపార్ట్‌మెంట్‌ స్టోర్‌ నుంచి తెలుపు, నీలం రంగుల్లో ఉన్న డబ్బాను ఓ సిబ్బంది పార్లమెంటుకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి లాటరీ విధానం ప్రారంభమైంది.

సైన్యం ధైర్యాన్ని తక్కువ చేసి చూపకండి

- రాహుల్‌గాంధీపై భాజపా ధ్వజం

దిల్లీ: సాయుధ దళాల ధైర్యాన్ని తక్కువ చేసి చూపడం మానుకోవాలంటూ లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌ గాంధీపై శుక్రవారం భాజపా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలతో దేశ భద్రతను కాంగ్రెస్‌ నేత ప్రమాదంలోకి నెడుతున్నారని భాజపా జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్‌ భాటియా విమర్శించారు. రాహుల్‌ను 'నిషాన్‌-ఎ-పాకిస్థాన్‌' అంటూ సంబోధించారు. "మీరు ఎవరివైపు ఉన్నారో నిర్ణయించుకోండి. మీరు భారతదేశ విపక్ష నేతా.. లేదా పాకిస్థాన్‌కు చెందిన నిషాన్‌-ఎ-పాకిస్థానా అనేది తేల్చుకోండి'' అంటూ రాహుల్‌గాంధీపై భాటియా మండిపడ్డారు. ఆపరేషన్‌ సిందూర్‌ గురించి పాకిస్థాన్‌కు ముందే సమాచారం ఇచ్చారంటూ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్‌పై రాహుల్‌ చేసిన ఆరోపణలపై భాజపా ఎంపీ నిశికాంత్‌ దుబె స్పందిస్తూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 1991 కాంగ్రెస్‌ హయాంలో జరిగిన ఒప్పందం గురించి ఆయన ప్రస్తావించారు. "రాహుల్‌ గాంధీ.. 1991లో మీ ప్రభుత్వ హయాంలోనే జరిగిన ఒప్పందం ఇది. అప్పట్లో ప్రభుత్వం భారత్‌- పాకిస్థాన్‌ దాడులు, సైనిక కదలికలకు సంబంధించిన సమాచారం అందించుకోవడం గురించి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం దేశద్రోహమా?.. పాక్‌ మద్దతున్న మీ పార్టీ.. జైశంకర్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం సమంజసమేనా?' అని దుబె పేర్కొన్నారు. ఆ ఒప్పందం పత్రాలను కూడా ఆయన 'ఎక్స్‌'లో పోస్టు చేశారు.

పుణెలో భారీవర్షం.. వెల్లివిరిసిన మతసామరస్యం

- ఒకే వేదికపై హిందూ, ముస్లిం జంటలు

పుణె: మహారాష్ట్రలోని పుణెలో అరుదైన ఘటన జరిగింది. అనుకోకుండా కురిసిన భారీవర్షం కారణంగా హిందూ, ముస్లిం మతాలకు చెందిన రెండు వివాహ వేడుకలు ఒకే వేదికపై జరగడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మంగళవారం రాత్రి.. వనవాడీ ప్రాంతంలో ఉన్న బ్యాంకెట్‌ హాలులో ముస్లిం జంట వివాహ రిసెప్షను జరుగుతుండగా, ఆ పక్కనే ఆరుబయట పచ్చికబయలులో హిందూ కుటుంబం పెళ్లికి ఘనంగా ఏర్పాట్లు చేసుకొంది. వధూవరులు సంస్కృతి, నరేంద్ర పెళ్లి మండపానికి చేరుకున్న వెంటనే భారీవర్షం కురిసి ఆ ప్రాంతమంతా జలమయమైంది. అతిథులతోపాటు అందరూ తడిసిపోయారు. ఇక వివాహ వేడుకను ఎలా పూర్తిచేయాలనే ప్రశ్న అందరిలో తలెత్తింది. వరుడి తండ్రి చేతన్‌ కవాడే



పక్కనే బ్యాంకెట్‌ హాలులో జరుగుతున్న ముస్లిం జంట రిసెప్షను వద్దకు వెళ్లి సాయం కోరారు. ఆ కుటుంబ పెద్ద ఫరూఖ్‌ ఖాజీ బంధువులతో చర్చించి, గంటన్నరసేపు వేదికను ఖాళీ చేసి హిందూ జంటకు కేటాయించారు. సంస్కృతి, నరేంద్రల పెళ్లి అనుకున్న ముహూర్తానికే పూర్తయింది. అనంతరం ఒకే వేదికపై రెండు జంటలు నిలబడి అతిథుల ఆశీస్సులు తీసుకొంటూ అందరికీ కనులపండువ చేశాయి.

అలీగఢ్‌ జిల్లాలో 35% జనాభాకు మధుమేహం



టీవీ భారత్‌: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌ జిల్లాలో 45 లక్షల జనాభా ఉండగా.. ఇందులో దాదాపు 16 లక్షలమంది మధుమేహం (డయాబెటిస్‌)తో బాధపడుతున్నారు. ఈ వ్యాధి బారినపడిన వారిలో అత్యధికంగా 70 శాతం మంది జిల్లా కేంద్రం (అలీగఢ్‌ నగరం), పట్టణాలకు చెందినవారేనట. మిగతా 30 శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు. ఈ వివరాలతో జవహర్‌లాల్‌ నెహ్రూ వైద్య కళాశాలకు చెందిన రాజీవ్‌గాంధీ డయాబెటిస్‌ సెంటర్‌ ఓ అధ్యయన నివేదికను విడుదల చేసింది. ఈ అధ్యయనంలో భాగంగా అలీగఢ్‌ జిల్లా పరిధిలో 18 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న 400 మందిని సర్వే చేశారు. దాదాపు 8 నెలలపాటు ఈ సర్వే కొనసాగింది. సర్వేలో పాల్గొన్న ప్రజల జీవనశైలిని నిశితంగా పరిశీలించారు. ఈ అధ్యయన బృందానికి రాజీవ్‌గాంధీ డయాబెటిస్‌ సెంటర్‌ ప్రొఫెసర్‌ హమీద్‌ అష్రఫ్‌ సారథ్యం వహించారు.

ఇరాన్‌, ఈజిప్టు అధినేతలతో షెహబాజ్‌ చర్చలు

ఇస్లామాబాద్‌: పాకిస్థాన్‌ ప్రధానమంత్రి షెహబాజ్‌ షరీఫ్‌ ఇరాన్‌, ఈజిప్టు అధినేతలతో ఫోనులో చర్చలు జరిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సమగ్రతను కాపాడుకోవటానికి తమ దేశం కట్టుబడి ఉందన్నారు. ఈ మేరకు పాక్‌ విదేశీ వ్యవహారాలశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇరాన్‌ అధ్యక్షుడు మసూద్‌ పెజెష్కియాన్‌, ఈజిప్టు అధినేత అబ్దెల్‌ ఫతాహ్‌ అల్‌-సిసితో షెహబాజ్‌ చర్చించారని తెలిపింది. ఈ సందర్భంగా సింధూ జలాల ఒప్పందాన్ని భారత్‌ పక్కనపెట్టడంపై ఆందోళన ఆయన వ్యక్తం చేశారంది. జమ్మూకశ్మీర్‌ వివాదం దక్షిణాసియా అస్థిరతకు కారణమవుతోందని పేర్కొన్నారంది. మరోవైపు పాక్‌ ప్రధాని ఈ నెల 25 నుంచి 30వ తేదీల మధ్య తుర్కియే, ఇరాన్‌, అజర్‌బైజాన్‌, తజికిస్థాన్‌ దేశాల్లో పర్యటించనున్నారు. భారత్‌తో ఇటీవల చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల గురించి ఆయా దేశాలతో చర్చించనున్నారు.

ఈనాడు సినిమా

తెలుగు ప్రేక్షకులకు సినిమా అంటే కేవలం వినోదమే కాదు... అదొక భావోద్వేగం!

మన సినిమా అభిరుచి గురించి పొరుగు పరిశ్రమలు కథలు కథలుగా చెప్పుకుంటాయి. సీజన్ వచ్చిందంటే చాలు...వసూళ్లు హోరెత్తుతాయి. రికార్డులు బద్దలవుతాయి. కొత్త సినిమా విడుదలయ్యే ప్రతి శుక్రవారం ఓ పండగే. ఊళ్లో జనమంతా థియేటర్ల దగ్గరే ఉన్నారా అనిపిస్తుంటుంది. అటు సింగిల్ థియేటర్లూ... ఇటు మల్టీప్లెక్స్‌లూ మోత మోగిపోయేవి. అలాంటి సందడి వాతావరణం ఏటికేడు కనుమరుగైపోతోంది. బాక్సాఫీస్ దగ్గర ఒకప్పటి హంగామా ఇప్పుడు కనిపించడమే లేదు. హౌస్‌ఫుల్ బోర్డుల స్థానంలో 'ప్రదర్శనలు రద్దు' అని కనిపిస్తోంది. అసలు మన సినిమాలకు ఏమైంది? థియేటర్‌కి ఎటువైపు నుంచి ముప్పు వచ్చింది?

మనకు థియేటర్లు ఉన్నాయి... మరి సినిమాలేవి?



ఉత్తరాది రాష్ట్రాల్లో సింగిల్ థియేటర్ లేని జిల్లాలు చాలా ఉన్నాయని అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ ఇటీవల ముంబయిలో జరిగిన 'వేవ్స్ - 2025'లో చెప్పారు. హిందీ చిత్రం గరిష్ఠంగా ఐదు వేల థియేటర్లలో మాత్రమే విడుదలవుతోందని... పరిధి, జనాభా ప్రాతిపదికన ఇక్కడ థియేటర్ల సంఖ్య చాలానే పెరగాల్సి ఉందని చెప్పుకొచ్చారు. ఆ లెక్కన చూస్తే తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఎంతో మెరుగు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో థియేటర్లు ఉన్నది తెలుగు రాష్ట్రాల్లోనే! ఒకప్పుడు 3 వేలకు పైగా థియేటర్లు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 1600కి చేరింది. అయినా సరే, ఇప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు సినిమాలకే ఎక్కువ థియేటర్లు. కానీ ఏం లాభం? అందుకు తగ్గ సినిమాలే రావడం లేదు. ఎప్పుడోకానీ... థియేటర్ నిండడం లేదు. ఇదివరకటిలా విడుదలలు లేవు, వసూళ్ల గలగలలూ లేవు. కాస్త చెప్పుకోదగ్గ సినిమా అప్పుడొకటి ఇప్పుడొకటి చొప్పున వచ్చినా వాటి ముచ్చట మూణ్నాళ్లే. వారాంతం పూర్తవ్వగానే ప్రేక్షకులు లేక ప్రదర్శనలు రద్దు చేసుకోవల్సిన పరిస్థితి. నిర్వహణ భారమై సింగిల్ థియేటర్ల మనుగడే ప్రశ్నార్థకం అవుతోంది. దీంతో పరిశ్రమలో రోజుకొక కొత్త సమస్య పుట్టుకొస్తోంది. ఆ సమస్యలన్నీ థియేటర్లు బంద్ చేయాలనే నిర్ణయం వరకూ తీసుకెళ్లాయి. ఇప్పుడు ఆ సమస్యలపైనే పరిశ్రమలో వాడి వేడిగా చర్చలు కొనసాగుతున్నాయి. మనకు సింగిల్ స్క్రీన్ థియేటర్లే బలం. అసలు సిసలు సినిమా అభిమానం కనిపించేది అక్కడే. అగ్ర తారల్ని ఆరాధించే అభిమాన గణం ఎక్కువగా సినిమాలు చూసేది, మన సినిమాలకి సింహభాగం వసూళ్లు దక్కేది అక్కడి నుంచే. అలాంటి సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలు పరిష్కారమవుతాయో లేక, సంక్షోభంతో బంద్ అవుతాయో తెలియని పరిస్థితి.

వేసవి కళ తప్పింది

తెలుగు సినిమాకి అతి పెద్ద సీజన్లు సంక్రాంతి, వేసవి. అగ్ర తారల సినిమాలు బాక్సాఫీస్ ముందుకు వరుస కట్టేది అప్పుడే. మధ్యలో యువ తారల సినిమాలు, చిన్న సినిమాలూ పోటీకొస్తుంటాయి. అయితే ఈమధ్య రావల్సిన అగ్ర తారల సినిమాలు ఉన్నట్టుండి వాయిదా పడటం... అవి వస్తాయనుకుని మిగతా సినిమాలు వెనక్కి వెళ్లడంలాంటి కారణాలతో కొత్త చిత్రాల జోరే కనిపించడం లేదు. సరైన ప్రణాళిక లేక 2024 వేసవి సందడి లేకుండానే ముగిసింది. ఈ వేసవి కూడా దాదాపు అంతే. గత రెండు వారాలుగా చెప్పుకోదగ్గ సినిమాలే విడుదల కాలేదు. మే నెలలో థియేటర్ల దగ్గర ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే వారం 'భైరవం', 'షష్టిపూర్తి' సినిమాలొస్తున్నాయి. పవన్‌కల్యాణ్ 'హరి హర వీర మల్లు', ధనుష్, నాగార్జునల 'కుబేర' విడుదలైతే ఈ వేసవి పూర్తిగా ముగిసిపోయినట్టే! మార్చి నుంచి జూన్ ద్వితీయార్ధం వరకూ ఒకప్పుడు పోటాపోటీగా సినిమాలు విడుదలయ్యేవి. కానీ ఇప్పుడు ఆ సందడి పూర్తిగా కనుమరుగైంది. పాన్ ఇండియా సినిమాల ప్రభావంతో అగ్ర తారలు చాలామంది మూడేళ్లకొక సినిమా కానీ పూర్తి చేయడం లేదు. యువ కథానాయకుల వేగం కూడా అంతంత మాత్రమే. దాంతో విడుదలలతోపాటు, విజయాలు మరింతగా తగ్గిపోతున్నాయి. థియేటర్లు కళ తప్పుతున్నాయి. వ్యాపారులకు ఆదాయాలు తగ్గిపోతున్నాయి. దీంతోనే కొత్త సమస్యలు ముసురుకుంటున్నాయనేది పరిశ్రమ వర్గాల మాట. "ఒకప్పుడు వేసవిలో ఏడెనిమిది హిట్స్ ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్యలో కీలకమైన సినిమాలు కూడా విడుదల కావడం లేదు. అగ్ర కథానాయకులు మూడేళ్లకొక సినిమా చేస్తుండడమే అందుకు కారణం" అంటున్నారు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి టి.ప్రసన్నకుమార్. నిర్మాత, ప్రదర్శనకారుడు, మాజీ ఎఫ్‌డీసీ ఛైర్మన్ అంబికా కృష్ణ ఇటీవల మాట్లాడుతూ "ఏడాది మొత్తం థియేటర్లలో సినిమాల్ని ప్రదర్శించి ఎన్నేళ్లయిందో! హీరోల సినిమాలంటేనే ఇప్పుడు ప్రేక్షకులు థియేటర్లకి వస్తున్నారు. అగ్ర హీరోలు రెండు మూడేళ్లకు ఒక సినిమా చేస్తుండడంతోనే చిత్ర పరిశ్రమలో ఈ సంక్షోభం" అని చెప్పారు.

ప్రేక్షకులు వస్తున్నారా?

విడుదలయ్యే సినిమాలే కాదు.. థియేటర్‌కి వస్తున్న ప్రేక్షకుల విషయంలోనూ చిత్ర పరిశ్రమలో వాడి వేడిగా చర్చ జరుగుతోంది. థియేటర్‌కి ప్రేక్షకులు రావడమే లేదని సినీ పరిశ్రమలో కొంతమంది అంటుంటే... మంచి సినిమా ఇస్తే తప్పకుండా వస్తారని మరికొంతమంది అంటున్నారు. గతంలో ప్రేక్షకులకు వినోదం అంటే కేవలం సినిమా థియేటర్ మాత్రమే కనిపించేది. కానీ ఇప్పుడు పోటీ పెరిగింది. ఓటీటీ వేదికలు, క్రికెట్..ఇలా పలు వినోదానికి పలు దారులు ఉన్నాయి. వాటిని దాటుకుని వచ్చేలా వినూత్నమైన ప్రచారంతోనూ, ట్రైలర్లతోనూ ప్రభావం చూపించిన సినిమాలే థియేటర్లలో విజయాల్ని సొంతం చేసుకుంటున్నాయి. కొత్త సినిమాలు విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీ వేదికల్లోకి వస్తుండడంతో అక్కడే చూసుకుందామనే భావనలో చాలా మంది ఉంటున్నారు. "పర్సెంటేజీ విధానంపై ప్రదర్శనల గురించి ఇప్పుడు చర్చ నడుస్తోంది. థియేటర్లలో ప్రేక్షకుల పర్సెంటేజీని పెంచే విషయంపై సినీ పెద్దలు ఆలోచన చేయాలి. టికెట్ ధరలు, ఓటీటీలు, తినుబండారాల కారణంగా థియేటర్లకు ప్రేక్షకులు దూరమవుతున్నారు. హిందీ, తమిళం తరహాలో 8 వారాల తర్వాతే ఓటీటీల్లోకి సినిమా వచ్చేలా ఏర్పాటు చేయాలి. టికెట్ ధరల విషయంలోనూ ఓ నిర్ణయం తీసుకోవాలి. ఇలా ఎన్నో విషయాలపై చర్చ జరగాలి. ప్రస్తుతం చిత్ర పరిశ్రమ ఐసీయూలో ఉంది" అని అన్నారు 'ఘటికాచలం' సినిమా వేడుకలో నిర్మాత ఎస్.కె.ఎన్. టికెట్ ధరలపై ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని నియమించింది.

చివరి ఆటకు సిద్ధమా!



డబ్బు కోసం సగటు మనిషి ఆడే నెత్తుటి ఆటను కళ్లకు కట్టినట్లు చూపించిన సిరీస్ 'స్క్విడ్‌గేమ్'. ఇప్పటికే రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రపంచ సినీప్రియుల్ని మెప్పించింది. ఇప్పుడిందులో 'స్క్విడ్‌గేమ్ 3' రాబోతున్న సంగతి తెలిసిందే. హ్వాంగ్ డాంగ్ హ్యుక్ దర్శకత్వం వహించారు. లీ జంగ్-జే, వి హా జూన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సిరీస్ వచ్చే నెల 27న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తోంది సిరీస్ బృందం. తాజాగా ఈ సిరీస్‌లోని పాత్రల్ని పరిచయం చేస్తూ కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. "ఈ చివరిసారిగా ఆటలోకి అడుగుపెట్టడానికి సిద్ధంగా ఉండండి" అని వ్యాఖ్యల్ని జోడించింది. 'స్క్విడ్‌గేమ్' ఫ్రాంచైజీలో రాబోతున్న ఈ చివరి సిరీస్.. తొలి రెండు భాగాల కన్నా ఉత్కంఠ భరితంగా ఉండనున్నట్లు సిరీస్ వర్గాలు తెలిపాయి.

ఓటీటీ బొమ్మ

చిరు.. యాక్షన్ షురూ



చిరంజీవి

కథానాయకుడు చిరంజీవి తన కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగారు. ఆయన నటిస్తున్న ఈ 157వ సినిమాకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఇప్పటికే పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్రం శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించాయి. తొలిరోజు చిరంజీవితో పాటు మిగిలిన కీలక తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కించినట్లు తెలిపాయి. ఇది వినోద ప్రధానంగా సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో చిరు తన సొంత పేరైన శివ శంకర వరప్రసాద్ అనే పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇది వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: సమీర్ రెడ్డి.

హంటర్ యుద్ధానికి సమయం ఆసన్నం



యాక్షన్ సీక్వెన్స్, అదిరిపోయే సంభాషణలతో ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది 'హంటర్' సిరీస్. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా సీజన్ 2 రాబోతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ విలక్షణ నటులు సునీల్ శెట్టి, జాకీష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రిన్స్ ధీమాన్, అలోక్ బాత్రా సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ మోషన్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది సిరీస్‌బృందం. "మనం ఎదురుచూస్తున్న ఆ యుద్ధానికి సమయం ఆసన్నమైంది. 'హంటర్ సీజన్ 2' త్వరలో రాబోతుంది" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో ఏసీపీ విక్రమ్ పాత్రలో కనిపించనున్నారు సునీల్. ఓ హత్య కేసులో తప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన తను నిర్దోషి అని నిరూపించుకోవడానికి చేసిన ప్రయత్నాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది.

అనగనగా ప్రేమలో పడేసింది!

- ఈ వారం నుంచి థియేటర్లలోనూ ప్రదర్శన



సుమంత్, అడివి శేష్

"అనగనగా' చిత్రాన్ని ఏడిపించే సినిమాగా చూడకండి. ఇదొక జీవితం లాంటి చిత్రం" అన్నారు హీరో అడివి శేష్. సుమంత్ హీరోగా సన్నీ సంజయ్ తెరకెక్కించిన చిత్రమే 'అనగనగా'. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్ర మదిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. కాజల్ చౌదరి కథానాయిక. మాస్టర్ విహర్ష్, శ్రీనివాస్ అవసరాల, అను హాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవలే ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంటోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. హీరో అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో వ్యాస్ పాత్రను సుమంత్ అంత బాగా చేయడానికి కారణం ఆయన నిజ జీవితంలోనూ చాలా వరకూ అలా ఉండటమే. సన్నీ ఈ కథను అద్భుతంగా తెరకెక్కించారు. నాకు ఈ సినిమా చూస్తున్నంత సేపూ దీన్ని థియేటర్లో కదా చూడాల్సింది అనిపించింది. ఈ చిత్రంలో రామ్ పాత్ర నాతో కూడా కంటతడి పెట్టించింది. ఈ సినిమా నన్నెంత ఏడిపించిందో.. అంతే నవ్వించింది.. ప్రేమలో పడేసింది. విద్యా వ్యవస్థ మారాలని కోరుకునేలా చేయించింది" అన్నారు. "ఈ కథ మా అందరికీ అమ్మలా రోజూ జోల పాడింది. నాన్నలా ధైర్యాన్నిచ్చింది. గురువులా జ్ఞానాన్ని ఇచ్చింది. ఇదే సినిమా అనే ప్రపంచానికి నన్ను మా టీమ్‌ను పరిచయం చేసింది" అన్నారు దర్శకుడు సన్నీ సంజయ్. కథానాయకుడు సుమంత్ మాట్లాడుతూ.. "నాకు 'మళ్లీరావా' తర్వాత మళ్లీ అద్భుతంగా మంచి అనుభూతిని అందించిన కథ ఈ 'అనగనగా'నే. దీన్ని దర్శకుడు సన్నీ, రచయిత దీప్తి ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం దీనికి ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ వారం నుంచి దీన్ని పరిమిత థియేటర్లలో ప్రదర్శించనున్నాం" అన్నారు. "ఓటీటీలో కేవలం బూతు చిత్రాలే ఆడతాయనే ఒక అబద్ధాన్ని మరోసారి పటాపంచలు చేసిన తెలుగు ప్రేక్షకులకు నా పాదాభివందనాలు. ఈ సినిమా చూసి చాలా మంది కంటతడి పెట్టుకున్నామని చెబుతుంటే ఆనందంగా అనిపించింది" అన్నారు ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి. ఈ కార్యక్రమంలో వెంకట్ సిద్ధారెడ్డి, రాకేశ్, రుద్ర దేవ్, తన్మయ్, సాయికృష్ణ, వంశీ నందిపాటి, దీప్తి, రాహుల్ యాదవ్ నక్కా తదితరులు పాల్గొన్నారు.

కేన్స్‌లో ఐశ్వర్య గీతా సందేశం



ఐశ్వర్య రాయ్

సినీ, ఫ్యాషన్ రంగానికి సంబంధించిన వేడుక ఏదైనా తన లుక్‌తోనే ఆకర్షణగా నిలుస్తుంటుంది బాలీవుడ్ నాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే చీరకట్టులో నుదుటిన సిందూరంతో సంప్రదాయ పద్ధతిలో కేన్స్‌లో సందడి చేసిన ఆమె.. రెండోరోజు మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. మోడ్రన్ దుస్తులు ధరించినప్పటికీ.. భగవద్గీత శ్లోకంతో ప్రత్యేకంగా రూపొందించిన ఆమె డ్రెస్ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. సిల్వర్ కలర్ బనారసీ కేప్‌పై భగవద్గీతలోని 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే శ్లోకాన్ని చేతితో సంస్కృతంలో ఎంబ్రాయిడరీ చేశారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా ఫొటోలు పంచుకున్నారు ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా. దీంతో భగవద్గీత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారంటూ అభిమానులు ఐశ్వర్యపై నెట్టింట్లో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

డియర్.. థాంక్యూ



హెబ్బాపటేల్, ధనుష్

ధనుష్ రఘుముద్రి హీరోగా తోట శ్రీకాంత్ కుమార్ తెరకెక్కించిన చిత్రం 'థాంక్యూ డియర్'. పప్పు బాలాజీ రెడ్డి నిర్మాత. హెబ్బా పటేల్ కథానాయిక. రేఖ నిరోషా, నాగ మహేశ్, రవి ప్రకాశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.. "యువతను ఆకట్టుకునే ఆసక్తికర కథతో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా విజయవంతమవుతుందని నమ్మకంగా ఉన్నాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, ఛాయాగ్రహణం: పిఎల్‌కె రెడ్డి.

చిన్ని చిన్ని తప్పులేవో..



జెన్నీఫర్, అర్జున్ అంబటి

అర్జున్ అంబటి హీరోగా నాగ శివ తెరకెక్కించిన చిత్రం 'పరమ పద సోపానం'. గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మాత. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. ఈ సినిమా జులై 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ఇటీవల ఈ చిత్రం నుంచి "చిన్ని చిన్ని తప్పులేవో" అనే గీతాన్ని విడుదల చేశారు. దీనికి డేవ్ జాండ్ స్వరాలు సమకూర్చగా.. రాంబాబు గోసాల సాహిత్యమందించారు. పృథ్వీ చంద్ర, అదితి బావరాజు సంయుక్తంగా ఆలపించారు. "ఇది ఆద్యంతం ఆసక్తి రేకెత్తించే చక్కటి కథతో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ముస్తాబైంది. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

గుచ్చమాకే గుచ్చమాకే...

హుషారైన జానపద గీతంతో సందడి షురూ చేశారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అదితి శంకర్ జోడీ. ఆ ఇద్దరూ జంటగా నటించిన చిత్రం 'భైరవం'. మంచు మనోజ్, నారా రోహిత్, ఆనంది, దివ్య పిళ్లై కీలక పాత్రలు పోషించారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. డా.జయంతిలాల్ గడ సమర్పకులు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఈ చిత్రంలోని 'గుచ్చమాకే...' పాటని విడుదల చేశారు. శ్రీచరణ్ పాకాల స్వరపరిచిన ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం సమకూర్చగా, ధనుంజయ్ సీపాన, సౌజన్య భాగవతుల ఆలపించారు. వెండితెరపై మరింత కలర్‌ఫుల్‌గా సాగే ఈ పాట చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, సాయి శ్రీనివాస్ - అదితి జోడీ నృత్యాలు అలరిస్తాయని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: హరి కె. వేదాంతం.



సాయి శ్రీనివాస్, అదితి

ఇది బొమ్మరిల్లు లాంటి చిత్రం



నిఖిల్

నిఖిల్ దేవాదుల హీరోగా అమర్ కామెపల్లి తెరకెక్కించిన చిత్రం 'ఘటికాచలం'. మాస్ మూవీ మేకర్స్ పతాకంపై దర్శకుడు మారుతి, ఎస్‌కేఎన్ సంయుక్తంగా విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. "ఇది బొమ్మరిల్లు లాంటి సినిమా. అయితే దీంట్లో హారర్, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలు మిళితమై ఉంటాయి" అన్నారు దర్శకుడు అమర్ కామేపల్లి. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎన్, నిఖిల్, శ్రీనివాస్ మల్కార్, మనోజ్, షాన్ తదితరులు పాల్గొన్నారు.


అత్తగారూ... అట్లాస్ సైకిల్



కార్తీక్‌రాజు, కాజల్ చౌదరి

కార్తీక్‌రాజు కథానాయకుడిగా శ్రీరామకృష్ణ సినిమా పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. కాజల్ చౌదరి కథానాయిక. రాజా దుస్సా దర్శకత్వం వహిస్తున్నారు. గాలి కృష్ణ నిర్మాత. మల్లవరం వెంకటేశ్వర రెడ్డి, రూప కిరణ్ గంజి సహ నిర్మాతలు. ఈ చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు క్లాప్‌నివ్వగా, కథానాయకుడు చైతన్య కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు గౌరవ దర్శకత్వం వహించారు. తమ్మారెడ్డి భరద్వాజ, క్రాంతిమాధవ్ తదితర సినీ ప్రముఖులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "1980లో వరంగల్‌లో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న చిత్రమిది. హాస్యం, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉంది" అన్నారు. కథానాయకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ "విభిన్నమైన కథ ఇది. హస్వికతో '105 మినిట్స్'తో విజయాన్ని అందుకున్న దర్శకుడు రాజా దుస్సా... ప్రేక్షకులకు మరో కొత్త రకమైన సినిమాని అందించాలనే ఈ కథ రాసుకున్నారు. విజయవంతంగా సినిమాలు చేస్తున్న కాజల్ చౌదరితో కలిసి నటిస్తుండడం ఆనందంగా ఉంది" అన్నారు. కాజల్ చౌదరి మాట్లాడుతూ "మనసుకు హత్తుకున్న కథ ఇది. తెలుగు ప్రేక్షకులు నాపై ఎంతో ప్రేమని కురిపిస్తున్నారు. అంతే బాధ్యతగా కథల్ని ఎంచుకుంటున్నా. ఈ చిత్రంతోనూ అందరినీ అలరిస్తామనే నమ్మకం ఉంది" అన్నారు. ఈ చిత్రంలో తమ్మారెడ్డి భరద్వాజ, భీమనేని శ్రీనివాసరావు, సురభి ప్రభావతి, శ్రీధర్ రెడ్డి, ప్రభావతి, అభయ్, ఫణి, పద్మ, కీర్తిలత తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం: గంగనమోని శేఖర్, సంగీతం: సురేశ్ బొబ్బిలి, పాటలు: కాసర్ల శ్యామ్, కళ: రవికుమార్ గుర్రం.

మిస్టరీ 'గ్యాంబ్లర్స్'



సంగీత్ శోభన్

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో సంగీత్ శోభన్. ఇప్పుడాయన నుంచి రానున్న కొత్త సినిమా 'గ్యాంబ్లర్స్'. కేఎస్‌కే చైతన్య తెరకెక్కించిన ఈ చిత్రాన్ని సునీత, రాజ్‌కుమార్ బృందావనం సంయుక్తంగా నిర్మించారు. ప్రశాంతి చారులింగా కథానాయిక. ఈ సినిమా జూన్ 6న థియేటర్లలోకి రానున్నట్లు చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు చైతన్య మాట్లాడుతూ.. "ఇదొక వైవిధ్యమైన కథతో మిస్టరీ ఎంటర్‌టైనర్‌గా రూపొందింది. సంగీత్ నటనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తాయి" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: శశాంక్ తిరుపతి, ఛాయాగ్రహణం: ప్రేమ్ సాగర్.

ఈనాడు బిజినెస్

యాపిల్ ఉత్పత్తులపై రాయితీ

ఈనాడు, హైదరాబాద్: యాపిల్ ఉత్పత్తులను విక్రయించే ప్రీమియం లైఫ్‌స్టైల్ ఫ్యాషన్స్ ఇండియా ఆధ్వర్యంలోని ఆప్ట్రానిక్స్, హైదరాబాద్‌లో తొలి ప్రీమియం పార్టనర్ కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందులో ఉత్పత్తులను విక్రయించడంతోపాటు, అధీకృత సర్వీస్ సెంటర్‌నూ ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సుతీందర్ సింగ్ తెలిపారు. యాపిల్ రిటైల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం కీలకంగా మారనుందని ఆప్ట్రానిక్స్ సీఈఓ మేఘనా సింగ్ వివరించారు. కొత్త స్టోర్‌లో నిపుణుల సలహాలూ లభిస్తాయన్నారు. ఈ కొత్త కేంద్రం ప్రారంభం సందర్భంగా ఐఫోన్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్, ఇతర ఉపకరణాలపై 12% వరకు తగ్గింపు ఇస్తున్నట్లు వెల్లడించారు. పాత స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను మార్చుకుంటే రూ.10,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తున్నట్లు వెల్లడించారు.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు పెరిగిన నష్టం

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, ఏకీకృత ఖాతాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికానికి రూ.2,977 కోట్ల మొత్తం ఆదాయాన్ని, రూ.253 కోట్ల పన్ను తర్వాత నష్టాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.2,570 కోట్లు, పన్ను తర్వాత నష్టం రూ.168 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ఆదాయం, నష్టాలు పెరిగాయి. 2024-25 పూర్తి కాలానికి రూ.10,836 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.817 కోట్ల పన్ను తర్వాత నష్టం నమోదైంది. 2023-24లో మొత్తం ఆదాయం రూ.9,207 కోట్లు, పన్ను తర్వాత నష్టం రూ.829 కోట్లుగా ఉన్నాయి. ఒక్కో షేరుకు రూ.7.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. దీని ప్రకారం వాటాదార్లకు రూ.283.5 కోట్లు డివిడెండ్ కింద చెల్లించాల్సి వస్తుంది.

స్టాండర్డ్ గ్లాస్ ఆదాయం రూ.171 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ మార్చి త్రైమాసికంలో రూ.171 కోట్ల ఆదాయాన్ని, రూ.16 కోట్ల పన్ను తర్వాత లాభాన్ని ఆర్జించింది. 2024-25 పూర్తి కాలానికి ఈ సంస్థ రూ.626 కోట్ల ఆదాయం, రూ.69 కోట్ల పన్ను తర్వాత లాభం నమోదు చేసింది. 2023-24తో పోల్చితే ఆదాయం 13.9%, పన్ను తర్వాత లాభం 14.4% పెరిగాయి. ఈ సంస్థ ఔషధ, రసాయన పరిశ్రమలకు అత్యాధునిక యంత్ర పరికరాలు సరఫరా చేస్తోంది. విదేశీ వినియోగదార్ల నుంచి తుది అనుమతితో జాప్యం వల్ల ఒక పెద్ద ఎగుమతి ఆర్డరును ప్రస్తుత త్రైమాసికంలో పూర్తి చేస్తామని తెలిపింది.

✦ గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో రెండంకెల వృద్ధి సాధించామని స్టాండర్డ్ గ్లాస్ ఎండీ నాగేశ్వరరావు కందుల వివరించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని, నూతన ఉత్పత్తులను ఆవిష్కరిస్తూ, వివిధ దేశాల్లో అవకాశాలను పెంచుకునేందుకు యత్నాల్లో ఉన్నందున సమీప భవిష్యత్తులో అధిక వృద్ధి నమోదు చేయగలమన్నారు. జీఎల్ హాక్కో జపాన్, ఐపీపీ యూఎస్ఏ తో కుదుర్చుకున్న భాగస్వామ్యాల నుంచి ఫలితాలు త్వరలో కనిపిస్తాయని తెలిపారు. 2- 3 ఏళ్లలో రూ.130 కోట్ల పెట్టుబడితో విస్తరణ కార్యకలాపాలు చేపట్టబోతున్నామన్నారు.

కోడి గుడ్డు

24న ప్రారంభ వద్ద ధర అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	500
వరంగల్	502
విజయవాడ	530
గోదావరి	517
విశాఖపట్నం	545
చిత్తూరు	603

ఆ ఐఫోన్లకు 25% సుంకం

- అమెరికాలో తయారు చేయని వాటికి వర్తింపు
- ఈయూపైనా 50% టారిఫ్
- సామాజిక మాధ్యమాల్లో అమెరికా అధ్యక్షుడు పోస్టులు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టెక్ పరికరాల అగ్రగామి సంస్థ యాపిల్‌పై విరుచుకుపడ్డారు. అమెరికాలో ఐఫోన్లు తయారు చేయని పక్షంలో, యాపిల్ ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తానని సామాజిక మాధ్యమాల్లో ట్రంప్ హెచ్చరించారు. 'యాపిల్ అధిపతి టిమ్‌కుక్‌కు నేను ఎపుడో చెప్పా. అమెరికాలో విక్రయమయ్యే ఐఫోన్లన్నీ అమెరికాలోనే తయారు కావాలి. భారత్‌లోనో ఇంకో దేశంలోనో కాదు. ఒక వేళ అమెరికాలో తయారీకి సిద్ధం కాకుంటే, దిగుమతి చేసుకునే ఫోన్లపై యాపిల్ కనీసం 25% సుంకం చెల్లించాల్సి ఉంటుంద'ని ట్రంప్ స్పష్టం చేశారు. చైనాపై భారీ టారిఫ్ విధించిన నేపథ్యంలో, ఐఫోన్ తయారీని భారత్‌లో భారీగా చేపట్టేందుకు టిమ్‌కుక్ సన్నాహాలు చేస్తున్నారు. అమెరికాలో విక్రయం కానున్న ఐఫోన్లలో మెజారిటీ భాగాన్ని భారత్‌లో తయారు చేయాలని భావిస్తున్నట్లు ఇటీవల కంపెనీ వెల్లడించింది. అమెరికాలో అమ్ముడయ్యే ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్‌లు వియత్నాంలో తయారు చేసినవే ఉంటాయని వివరించింది. అమెరికా వెలుపల తమ ఉత్పత్తుల మొత్తం విక్రయాల్లో, అధిక భాగం చైనాలో తయారు చేసినవే ఉంటాయనీ తెలిపింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు.

అమెరికాలో ఐఫోన్ ఉత్పత్తి చేస్తే: యాపిల్ సంస్థ ఐఫోన్లను అమెరికాలోనే ఉత్పత్తి చేస్తే, ప్రస్తుతం 1200 డాలర్లుగా ఉన్న ఐఫోన్ ధర 1500-2000 డాలర్ల వరకు చేరొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జూన్ 1 నుంచే అమలు

ఎప్పటి నుంచో అమెరికాకు సన్నిహితంగా ఉన్న ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి, చైనాకు మించి టారిఫ్ వసూలు చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. చర్చల అనంతరం చైనాపై టారిఫ్‌ను 30 శాతానికి సవరించిన ట్రంప్.. ఈయూతో వాణిజ్య చర్చల్లో పెద్దగా ప్రగతి కనిపించకపోవడంతో విసుగెత్తారు. అమెరికాలోకి వచ్చే చాలా వరకు దిగుమతులపై 10 శాతం ప్రాథమిక సుంకాన్ని ఉంచుతామని ట్రంప్ ప్రకటిస్తున్నారు. ఈయూ మాత్రం టారిఫ్‌ను సున్నాకు తగ్గించాలని కోరుతోంది. 'మా చర్చలు ముందుకు జరగడం లేదు. అందుకే ఈయూపై జూన్ 1 నుంచి 50% టారిఫ్ విధిస్తున్నా. అమెరికాలో తయారైన ఉత్పత్తులపై మాత్రం ఎటువంటి టారిఫ్ ఉండదు' అని తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టు చేశారు.

ఆర్‌బీఐ డివిడెండ్ రూ.2,68,590 కోట్లు

- ప్రభుత్వానికి భారీగా ఉపయుక్తం
- టారిఫ్ సవాళ్లు ఎదుర్కొనేందుకు.. రక్షణ వ్యయాలకూ ఊతం

ముంబయి: కేంద్ర ప్రభుత్వానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను డివిడెండు రూపంలో రూ.2,68,590.07 కోట్లు చెల్లించబోతున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. అమెరికా టారిఫ్ పరిణామాల వల్ల కలిగే సవాళ్లను ఎదుర్కొనేందుకు, పాకిస్థాన్‌తో యుద్ధం వల్ల పెరిగిన రక్షణ వ్యయాల భారాన్ని తట్టుకునేందుకు ప్రభుత్వానికి ఈ నిధులు సహాయపడనున్నాయి. ఇప్పటిదాకా కేంద్రానికి ఆర్‌బీఐ చెల్లించిన డివిడెండ్‌లో ఇదే రికార్డు స్థాయి. 2023-24 సంవత్సరానికి చెల్లించిన రూ.2.1 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 27.4% అధికం. 2022-23లో ప్రభుత్వానికి ఆర్‌బీఐ రూ.87,416 కోట్లు మాత్రమే చెల్లించింది.

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, తమ 616వ సమావేశంలో తాజా డివిడెండ్ చెల్లింపుపై నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ, దేశీయ ఆర్థిక పరిస్థితులను బోర్డు సమీక్షించినట్లు ఆర్‌బీఐ వివరించింది. సవరించిన ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్) ఆధారంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి బదిలీ చేయదగ్గ అదనపు నిధులను లెక్కవేసినట్లు, ఈనెల 15న జరిగిన సమావేశంలో అందుకు సెంట్రల్ బోర్డు అనుమతినిచ్చినట్లు తెలిపింది.

✦ ఈసీఎఫ్ కింద అత్యవసర నిధి (సీఆర్‌బీ)ని ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీటులో 7.50% వద్ద ఉంచాలని సెంట్రల్ బోర్డు నిర్ణయించింది. కరోనా పరిణామాల నేపథ్యంలో 2018-19 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో దీన్ని 5.5 శాతానికి సవరించగా.. 2022-23లో 6 శాతానికి, 2023-24లో 6.5 శాతానికి సీఆర్‌బీని పెంచారు.

✦ తాజా నిర్ణయం వల్ల ద్రవ్యపరంగా ప్రభుత్వానికి కాస్త ఊరట లభిస్తుందని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలకు మించి అందిన ఈ నిధులతో, అదనపు వ్యయాలను తట్టుకునే అవకాశం ప్రభుత్వానికి కలుగుతుందని వివరించారు. జీడీపీలో ద్రవ్యలోటును 2025-26లో 4.4 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

ఖజానాకు ఆర్‌బీఐ డివిడెండ్	
2022–23	రూ.87,416 కోట్లు
2023–24	రూ.2.1 లక్షల కోట్లు
2024–25	రూ.2.69 లక్షల కోట్లు

చెల్లింపుల వ్యవస్థ నియంత్రణకు ఆరుగురు సభ్యుల బోర్డు: ఆర్‌బీఐ

ముంబయి: దేశంలో చెల్లింపుల వ్యవస్థ (పేమెంట్ సిస్టమ్)ను నియంత్రించడం, పర్యవేక్షించేందుకు ఆరుగురు సభ్యులతో కూడిన పేమెంట్స్ రెగ్యులేటరీ బోర్డ్ (పీఆర్‌బీ)ను ఏర్పాటు చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు ఉన్న బోర్డ్ ఫర్ రెగ్యులేషన్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (బీపీఎస్ఎస్) స్థానంలోకి ఇది వస్తుంది. పాత బోర్డులో అయిదుగురు సభ్యులుండేవారు. పేమెంట్స్ రెగ్యులేటరీ బోర్డు నిబంధనలు -2025 ప్రకారం ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వంలోని పీఆర్‌బీలో డిప్యూటీ గవర్నర్, సెంట్రల్ బోర్డు నామినేట్ చేసిన ఒక ఆర్‌బీఐ అధికారి, కేంద్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యులు ఉంటారు. ఆర్‌బీఐ గవర్నర్, డిప్యూటీ గవర్నర్, అధికారిని ఎక్స్-అఫిషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. పేమెంట్ వ్యవస్థ, ఐటీ, ఆయా చట్టాల్లో అనుభవం ఉన్న నిపుణులను శాశ్వత లేదా తాత్కాలిక ఆహ్వానితులుగా సమావేశాలకు ఆహ్వానించే అవకాశం ఉంది.

అయ్యో.. మైక్రోసాఫ్ట్ ఇంజినీర్లు

- ఏఐ వ్యవస్థలు సిద్ధం చేశారు
- వాటివల్లే ఉద్యోగాలు కోల్పోయారు

అగ్రగామి సాంకేతిక దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇటీవల 6,000 ఉద్యోగ కోతలను ప్రకటించింది. టెక్ రంగంలో లే ఆఫ్స్ కొత్తేమీ కాదు. అయితే ఉద్యోగ కోతలకు ఈసారి చెప్పిన కారణం.. ఏఐ ఆధారిత కోడింగ్ దిశగా కంపెనీని తీసుకెళ్లాలనే. ఇందులో భాగంగా తొలగింపునకు గురైన ఉద్యోగులే.. ఇంతకు ముందు 'ఏఐ వ్యవస్థలను రూపొందించిన' విభాగాల్లోని వారే. తాము రూపొందించిన సాంకేతికతతో, వారే ఉద్యోగాలు కోల్పోవడం బాధాకరమే.

ఇదీ జరిగింది: మైక్రోసాఫ్ట్‌లో వైస్ ప్రెసిడెంట్ అయిన జెఫ్ హల్స్ కింద 400 మంది ఇంజినీర్లు ఉన్నారు. ఓపెన్‌ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లను వినియోగించడం ద్వారా తమ కోడింగ్‌లో 50% వరకు జనరేట్ చేయాలని ఆయన ఆదేశించారు. సాధారణంగా అయితే 20-30% వరకే ఏఐ (కృత్రిమ మేధ)ని ఉపయోగించుకునేవారు. దీన్ని వీరు దాదాపు రెట్టింపు చేశారన్నమాట. కొద్ది వారాల తర్వాత చూస్తే ఉద్యోగాలు కోల్పోయిన వారిలో ఆయన బృందంలోని వారే ఎక్కువగా ఉన్నారు. అంటే ఏఐ వినియోగాన్ని పెంచి, తమకు తామే ఉద్యోగాలు కోల్పోయినట్లయింది. జూనియర్ కోడర్లే కాదు.. ప్రోడక్ట్ మేనేజర్, టెక్నికల్ ప్రోగ్రామ్ మేనేజర్ హోదాల్లో ఉన్న వారూ లేఆఫ్‌కు గురయ్యారు. వాషింగ్టన్ ఆఫీసులో తొలగించిన 40% మంది ఉద్యోగుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే ఎక్కువగా ఉన్నారు. మైక్రోసాఫ్ట్ అంకురాలకు చెందిన ఏఐ డైరెక్టర్ గాబ్రియోలా డికీ రోజ్ కూడా పదవిని కోల్పోయారు. 2023లో మైక్రోసాఫ్ట్ 10,000 మందికి ఉద్వాసన పలికిన అనంతరం, మళ్లీ ఇప్పుడే అధిక సంఖ్యలో ఉద్యోగ కోతలు విధించింది.

కేవైసీ సమస్యల పరిష్కారానికి బిజినెస్ కరస్పాండెంట్‌లను వినియోగిద్దాం

ముంబయి: బ్యాంక్ ఖాతా ప్రారంభానికి 'మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి -కేవైసీ'లో నిర్దేశించిన మేర వివరాలు ఇవ్వడం తప్పనిసరి. ఏడాది-రెండేళ్లకు కేవైసీలో మార్పు, చేర్పు ఉంటే ధ్రువీకరించాలని ఖాతాదార్లను కోరుతుంటాయి. అయితే కేవైసీ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు బిజినెస్ కరస్పాండెంట్‌ల నెట్‌వర్క్‌ను వినియోగించుకునేందుకు బ్యాంకులను అనుమతించాలని భావిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. వినియోగంలో లేని ఖాతాలను యాక్టివేట్ చేయడంలో సాయపడేందుకూ, బ్యాంకుల అధీకృత బిజినెస్ కరస్పాండెంట్‌లను అనుమతించాలని యోచిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ముసాయిదా సర్క్యులర్‌లో వెల్లడించింది.

విదేశీ మారకపు నిల్వలు తగ్గాయ్

దిల్లీ: మన విదేశీ మారకపు నిల్వలు మే 16వ తేదీతో ముగిసిన వారంలో 4.888 బిలియన్ డాలర్లు తగ్గి 685.729 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతకుముందు వారంలో ఇవి 4.553 బిలియన్ డాలర్లు పెరిగి 690.617 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2024 సెప్టెంబరు చివర్లో నమోదైన 704.885 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు నిల్వలే ఇప్పటివరకు జీవనకాల గరిష్ఠంగా ఉన్నాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన వివరాల ప్రకారం.. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 279 మిలియన్ డాలర్లు పెరిగి 581.652 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 5.121 బిలియన్ డాలర్లు తగ్గి 81.217 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.49 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 3 మిలియన్ డాలర్లు తగ్గి 4.371 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.



త్వరలో జీఎస్‌టీ మండలి సమావేశం

దిల్లీ: జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ, పరిహార సుంకం భవిష్యత్‌పై చర్చించేందుకు **జీఎస్‌టీ మండలి** త్వరలోనే సమావేశం అయ్యే అవకాశం ఉంది. 'జీఎస్‌టీని మరింతగా సరళీకరించేందుకు మూడు, నాలుగు కోణాల్లో చర్చిస్తున్నాం. పరిహార సుంకం అంశాన్నీ పరిశీలించనున్నామ'ని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

సుజుకీ ఇ-యాక్సెస్ తయారీ ప్రారంభం

దిల్లీ: విద్యుత్తు స్కూటర్ ఇ-యాక్సెస్ తయారీని గురుగ్రామ్ ప్లాంట్‌లో ప్రారంభించినట్లు సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తెలిపింది. దీర్ఘకాల మన్నిక, అత్యుత్తమ థర్మల్ స్టెబిలిటీతో కూడిన ఇ-టెక్నాలజీతో ఈ విద్యుత్తు స్కూటర్‌ను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తొలిసారిగా ఇ-యాక్సెస్‌ను సుజుకీ ప్రదర్శించింది.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ: పియర్సన్

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులు, ఉద్యోగులకు ఆధునిక నైపుణ్యాలు, నైపుణ్యాభివృద్ధి సేవలను అందించే పియర్సన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కార్యకలాపాలను విస్తరించనుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకోబోతున్నట్లు పియర్సన్ ఇండియా హెడ్ వినయ్ కుమార్ స్వామి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 100కి పైగా విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, సర్వీస్‌నౌ తదితర సంస్థల ఉద్యోగులకు కృత్రిమ మేధ (ఏఐ), డేటా అనలిటిక్స్ లాంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు, విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఆంగ్ల నైపుణ్యం పెరిగేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు.

జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
బీఈఎంఎల్	287.55	256.80	1,656.36	1,518.25
సుందరం ఫైనాన్స్	107.12	269.32	412.08	533.14
దేవయానీ ఇంటర్నేషనల్	(16.76)	(48.95)	1,212.6	1,047.07
మ్యాక్స్ ఎస్టేట్స్	17.34	(1.45)	77.30	71.89
జేఎస్‌డబ్ల్యూ స్టీల్1	1,501	1,322	45,049	46,511
హెచ్‌పీఎల్ ఎలక్ట్రిక్	37.28	13.72	492.54	424.09
గ్రాసిమ్2	2,973.26	2,721.81	44,267.26	37,727.13
ఆదిత్య బిర్లా ఫ్యాషన్	(23.55)	(266.36)	1,719.48	1,959.53

1) డివిడెండ్ రూ.2.80 2) డివిడెండ్ రూ.10

అశోక్ లేలాండ్ బోనస్ షేర్లు

దిల్లీ: వాణిజ్య వాహనాల తయారీ సంస్థ అశోక్ లేలాండ్, మార్చి త్రైమాసికంలో రూ.1,245.92 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.933.69 కోట్లతో పోలిస్తే ఇది 33.44% ఎక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.13,542.37 కోట్ల నుంచి రూ.14,695.65 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం వ్యయాలు రూ.12,037.16 కోట్ల నుంచి రూ.13,097.25 కోట్లకు పెరిగాయి.

✦ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు వాటాదార్ల అనుమతి లభించాల్సి ఉంటుంది.

✦ 2024-25లో అశోక్ లేలాండ్ రెండు మధ్యంతర డివిడెండ్‌లు చెల్లించింది. ఒక్కో షేరుకు 2024 నవంబరులో రూ.2, 2025 మేలో రూ.4.25 చొప్పున డివిడెండ్ ఇచ్చింది. దీంతో రూ.1 ముఖ విలువ కలిగిన షేరుపై డివిడెండ్ రూ.6.25గా ఉంది. రెండో మధ్యంతర డివిడెండునే తుది డివిడెండ్‌గా కంపెనీ పరిగణించనుంది.

✦ 2024-25 మొత్తంమీద కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.3,382.79 కోట్లకు చేరింది. 2023-24లో ఇది రూ.2,696.34 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.45,703.34 కోట్ల నుంచి రూ.48,535.14 కోట్లకు పెరిగింది. అత్యధిక త్రైమాసిక, వార్షిక ఆదాయాలను సాధించినట్లు కంపెనీ తెలిపింది. మొత్తం విక్రయాలు 1,95,093 వాహనాలుగా నమోదయ్యాయి.

ఈశాన్య రాష్ట్రాల్లో రిలయన్స్ రూ.75,000 కోట్ల పెట్టుబడులు



దిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, ఈశాన్య రాష్ట్రాల్లో రూ.75,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 350 బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటు, టెలికాం సేవల విస్తరణ, రిటైల్ స్టోర్లు, శుద్ధ ఇంధన ప్రాజెక్టులపై ఈ పెట్టుబడులు ఉంటాయని రిలయన్స్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ 'రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమిట్‌లో' వెల్లడించారు. అధిక నాణ్యత కలిగిన ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల కోసం ఫ్యాక్టరీలు పెడతామని, మణిపుర్‌లో 150 పడకల క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పెట్టుబడులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయన్నారు.

మరో రూ.50,000 కోట్లు: అదానీ గ్రూప్

ఈశాన్య రాష్ట్రాల్లో వచ్చే 10 ఏళ్లలో అదనంగా రూ.50,000 కోట్ల పెట్టుబడులు పెడతామని గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ తెలిపింది. గ్రీన్ ఎనర్జీ, రహదారుల నిర్మాణం, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై వీటిని వెచ్చించనుంది. ఫిబ్రవరిలో అసోంలో ప్రకటించిన రూ.50,000 కోట్లతో కలిపి కంపెనీ మొత్తం పెట్టుబడులు రూ.1 లక్ష కోట్లకు చేరనున్నాయి.

వేదాంతా రూ.30,000 కోట్ల పెట్టుబడులు

ఈశాన్య రాష్ట్రాల్లో రూ.30,000 కోట్ల పెట్టుబడులను వేదాంతా గ్రూప్ శుక్రవారం ప్రకటించింది. చమురు-గ్యాస్, అరుదైన ఖనిజాలు, రిఫైనింగ్ కేంద్రాలు, విద్యుత్, ఆప్టికల్ ఫైబర్, సిస్టమ్ ఇంటిగ్రేషన్, పునరుత్పాదక ఇంధన, ట్రాన్స్‌మిషన్ రంగాలు, డేటా కేంద్రాల్లో ఈ పెట్టుబడులు పెట్టనుంది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ, మిజోరాం రాష్ట్రాల్లో ఈ పెట్టుబడులు ఉంటాయని తెలిపింది. ఈ పెట్టుబడులతో లక్ష వరకు ఉద్యోగాల సృష్టి జరుగుతుందని పేర్కొంది. ఈ ఏడాది ప్రారంభంలో అసోంలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు పెడతామని వేదాంతా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆరు నెలల్లో ధర తగ్గితే.. ఆ తేడా మీకు తిరిగిచ్చేస్తాం..

మినీ కూపర్ ఎస్ కొనుగోలుదార్లకు బీఎండబ్ల్యూ హామీ

దిల్లీ: బ్రిటన్‌లోని తన ఆక్స్‌ఫర్డ్ ప్లాంటులో తయారైన మినీ 3-డోర్ కూపర్ ఎస్ కారు కొనుగోలు చేయాలని అనుకుంటున్న భారతీయులకు ధరపరంగా భద్రతా హామీని బీఎండబ్ల్యూ అందిస్తోంది. భారత్- బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరనుండటంతో, సుంకాల తగ్గే అవకాశం ఉన్నందున ఈ భరోసా ఇస్తున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పావా తెలిపారు. బ్రిటన్ నుంచి వచ్చే మినీ 3- డోర్ కూపర్ ఎస్ ధర కూడా ఎఫ్‌టీఏ వల్ల తగ్గుతుందా అనే అంశంపై వినియోగదార్ల నుంచి విచారణలు వస్తున్నాయని తెలిపారు. అందుకే రాబోయే 6 నెలల్లో కొనుగోలుదార్లు చెల్లించే ధరకు భద్రత కల్పిస్తామని హామీ ఇస్తున్నట్లు పావా వెల్లడించారు. ఈ సమయంలో కారు ధర తగ్గితే.. వినియోగదారు చెల్లించిన ధర, కొత్త ధర మధ్య వ్యత్యాసాన్ని సంబంధిత డీలర్లు తిరిగి ఇచ్చేస్తారని తెలిపారు.

సంక్షిప్తంగా

✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నిమిత్తం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సంబంధిత ముసాయిదా పత్రాలను సమర్పించినట్లు **కనోడియా సిమెంట్** తెలిపింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలోనే ఇది ఉండనుంది. ఇందులో భాగంగా ప్రమోటర్లు, వాటాదార్లు 1.49 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.



✦ రోడ్‌స్టర్ ఎక్స్ పోర్ట్‌ఫోలియో మోటర్‌సైకిళ్ల డెలివరీని **ఓలా ఎలక్ట్రిక్** ప్రారంభించింది. తొలి 5000 మంది వినియోగదార్లకు రూ.10,000 విలువ చేసే ఆఫర్లను కూడా అందివ్వనుంది. రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌ల ధరల శ్రేణి రూ.99,000 నుంచి మొదలుకానుంది.

✦ గృహ కొనుగోలుదార్లను, మదుపర్లను రూ.12,000 కోట్ల మేర **జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్**, మరికొందరు మోసం చేశారనే ఆరోపణలకు సంబంధించిన కేసు వ్యవహారంలో దిల్లీ- ఎన్‌సీఆర్, ముంబయిల్లోని ఆయా సంస్థల ప్రాంగణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

✦ అమెరికాకు చెందిన ఫార్మాజ్ ఇంక్‌లో 2.5 కోట్ల డాలర్లు (దాదాపు రూ.215 కోట్లు) పెట్టుబడిగా పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు **సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్** తెలిపింది.

✦ ద లీలా బ్రాండుపై ప్యాలెస్‌లు, హోటళ్లు, రిసార్ట్‌లను నిర్వహిస్తున్న **స్కాలస్ బెంగళూర్ లిమిటెడ్** ఆగ్రా, శ్రీనగర్, బాంధవ్‌ఘర్, రాంతాంబోర్, అయోధ్యలో 5 హోటళ్ల అభివృద్ధికి రూ.1,131 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది.

పుంజుకున్న సూచీలు

సెన్సెక్స్ ▲769 81721 | నిఫ్టీ ▲243 24853



- 1% పెరిగిన సెన్సెక్స్, నిఫ్టీ
- బ్లూచిప్ షేర్ల అండ

ఎఫ్ఐఐల కొనుగోళ్లు - రూ. 1795 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు- రూ.300 కోట్లు

మన స్టాక్ మార్కెట్ ముందు రోజు నష్టాల నుంచి భారీగా పుంజుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ లాంటి దిగ్గజ షేర్లకు కొనుగోళ్ల అండతో సూచీలు దాదాపు 1% పెరిగాయి. ప్రభుత్వానికి ఆర్‌బీఐ రికార్డు స్థాయిలో డివిడెండు ఇవ్వొచ్చనే అంచనాలు, అమెరికా బాండ్ల ప్రతిఫలాలు తగ్గడం లాంటివి మదుపర్ల సెంటిమెంటు బలపడటానికి దోహదం చేశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 50 పైసలు పెరిగి రూ.85.45 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.09% నష్టంతో 63.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. జపాన్, సింగపూర్, హాంకాంగ్ సూచీలు రాణించాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.441.96 లక్షల కోట్లకు (5.16 లక్షల కోట్లు డాలర్లు) పెరిగింది.

స్వల్ప లాభంతో మొదలు..: బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు (80,951.99)తో పోలిస్తే స్వల్ప నష్టంతో 80,897 పాయింట్ల వద్ద ఆరంభమైంది. తదుపరి లాభాల్లోకి వచ్చి 81,905.17 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 769.09 పాయింట్ల లాభంతో 81,721.08 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 243.35 పాయింట్లు పెరిగి 24,853.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,614.05 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,909.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

ఆ ఒక్కటీ మినహా..: సెన్సెక్స్ 30 షేర్లలో సన్‌ఫార్మా మినహా మిగతా 29 కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్ 3.6%, పవర్‌గ్రిడ్ 2.42%, ఐటీసీ 2.39%, నెస్లే ఇండియా 2.14%, యాక్సిస్ బ్యాంక్ 1.87, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.84%, అదానీ పోర్ట్స్ 1.68%, కోటక్ బ్యాంక్ 1.54%, ఎల్అండ్‌టీ 1.39% చొప్పున పెరిగాయి. బీఎస్ఈ రంగాల్లో ఎఫ్ఎమ్‌సీజీ 1.49%, యుటిలిటీస్ 1.02%, విద్యుత్ 1.01%, ఆర్థిక సేవలు 0.99%, బ్యాంకెక్స్ 0.99%, చమురు- గ్యాస్ 0.94%, విద్యుత్ 0.82% చొప్పున రాణించాయి.

✦ జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాల ప్రభావంతో **ఐటీసీ** షేరు బీఎస్ఈలో 2.39% పెరిగి రూ.436.30 వద్ద ముగిసింది.

✦ స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్‌లు, పైపుల తయారీ సంస్థ **స్కోడా ట్యూబ్స్** తన ఐపీఓకు ధరల శ్రేణిగా రూ.130-140ను నిర్ణయించింది. ఇష్యూ ఈనెల 28న ప్రారంభమై 30న ముగియనుంది.

✦ ఐరోపా కూటమిపై 50% టారిఫ్‌ను జూన్ 1 నుంచి వర్తింపజేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా హెచ్చరికతో శుక్రవారం ఐరోపా, అమెరికా మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. జర్మనీ డాక్స్ 1.54%, ఫ్రాన్స్ సీఏసీ 1.65%, అమెరికా డోజోన్స్ 0.27%, నాస్‌డాక్ 0.62%, ఎస్అండ్‌పీ 0.33% నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అమెరికాలో తయారవ్వని ఐఫోన్లపై కనీసం 25% టారిఫ్ చెల్లించాల్సి ఉంటుందన్న హెచ్చరిక నేపథ్యంలో యాపిల్ షేరు 2.2% నష్టపోయింది.

నేటి బోర్డు సమావేశాలు

ఎన్‌టీపీసీ, రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్, రామ్‌కీ ఇన్‌ఫ్రా, జేకే సిమెంట్

ప్రాచీన భారతదేశ చరిత్రలో మహాసామ్రాజ్య యుగం మౌర్యులతో ప్రారంభమైంది. అంతేకాక వారు సమర్థవంతమైన పాలనను ఆచరణలోకి తెచ్చారు. వీరి పాలనా విధానాలు నేటికీ కొనసాగుతున్నాయంటే వారి పాలన ఎంత గొప్పదో తెలుస్తోంది. మౌర్య పాలకుల రాజకీయ చరిత్ర గురించి పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.



సాంచీ స్తూపంపై పట్టపు రాణులతో అశోకుడు

ధార్మికతను వ్యాప్తి చేసి.. విశిష్ట చక్రవర్తిగా నిలిచి!

పోటీ పరీక్షల ప్రత్యేకం - భారతదేశ చరిత్ర

మౌర్యుల రాజకీయ చరిత్ర

చంద్రగుప్త మౌర్యుడు కౌటిల్యుడి సాయంతో ధననందుడ్ని ఓడించి, మగధ రాజ్యాన్ని ఆక్రమించి, మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు. అశోకుడి కాలంలో ఈ సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరింది.

చంద్రగుప్త మౌర్యుడు

క్రీ.పూ. 322 నుంచి క్రీ.పూ. 298 వరకు రాజ్యపాలన చేశాడు.

- గ్రీకు పాలకుడైన సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి, వాయవ్య భారతదేశాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. ఈ యుద్ధం తర్వాత ఇద్దరి మధ్య సంధి కుదిరింది. దీని ప్రకారం, సెల్యూకస్ కుమార్తె హెలీనాను చంద్రగుప్తుడు పెళ్లి చేసుకోవడంతోపాటు పరోపనిసద్ (కాబుల్), ఆరకోసియ (కాందహార్), గెడ్రోసియ (బెలూచిస్థాన్), అరియ (హీరట్) ప్రాంతాలను కానుకగా పొందాడు. చంద్రగుప్తుడు 500 ఏనుగులను సెల్యూకస్‌కు ఇచ్చాడు.
- సెల్యూకస్ నికేటర్ గ్రీకు రాయబారిగా మెగస్తనీస్‌ను చంద్రగుప్తుడి ఆస్థానానికి పంపాడు. ఇతడు రచించిన ఇండికా గ్రంథం నాటి చరిత్రకు ఆధారంగా ఉంది.
- చంద్రగుప్తుడు గుజరాత్‌లోని కథియవాడ్ ప్రాంతంలో పుష్యగుప్తుడి ఆధ్వర్యంలో సుదర్శన తటాకాన్ని తవ్వించాడు.
- హేమచంద్రుడు రచించిన పరిశిష్టపర్వన్ (జైన గ్రంథం) ప్రకారం, చంద్రగుప్త మౌర్యుడు సామ్రాజ్యాన్ని తన కుమారుడైన బిందుసారుడికి అప్పగించి కర్ణాటకలోని శ్రావణ బెలగొళకు వెళ్లి, సల్లేఖన వ్రతాన్ని ఆచరించి మరణించాడు.

బిందుసారుడు

క్రీ.పూ. 298 నుంచి క్రీ.పూ. 273 వరకు రాజ్యాన్ని పాలించాడు.

- ఇతడు అజీవక మతాన్ని ఆదరించాడు. అమిత్రఘాత/ అమిత్రఖేట్స్ (శత్రు సంహారి), సింహసేనుడు అనే బిరుదులు ఉన్నాయి.
- 16వ శతాబ్దంలో టిబెటన్ బౌద్ధ గురువు లామ తారనాథ్ భారతదేశాన్ని సందర్శించారు. ఆయన రచించిన 'హిస్టరీ ఆఫ్ టిబెట్' గ్రంథంలో బిందుసారుడు రెండు సముద్రాల మధ్య ఉన్న ప్రాంతాన్ని జయించాడని ఉంది. దీని ప్రకారం మొత్తం దక్షిణ భారతదేశం ఇతడి అధీనంలో ఉంది.
- ఇతడి ఆస్థానంలో ఇద్దరు గ్రీకు రాయబారులు ఉండేవారు. వారిలో ఒకరు డైమకస్. ఇతడ్ని సిరియా పాలకుడైన ఆంటియోకస్-1 పంపాడు. మరొకరు డయనోసియస్. ఇతడ్ని ఈజిప్ట్ పాలకుడైన టాలమి ఫిలడెల్ఫస్ పంపాడు.
- టిబెటన్ బౌద్ధ గ్రంథం 'దివ్యవదన' ప్రకారం బిందుసారుడి కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. బిందుసారుడు దీన్ని అణిచేందుకు ఉజ్జయినికి గవర్నర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు అశోకుడ్ని అక్కడికి పంపాడు. అతడు తిరుగుబాటును సమర్థవంతంగా తిప్పికొట్టాడు.

అశోకుడు

బిందుసారుడు మరణించాక సింహాసనం కోసం నాలుగేళ్లపాటు వారసత్వ యుద్ధాలు జరిగాయి. చివరికి అశోకుడు విజయం సాధించి మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అయ్యాడని శ్రీలంక బౌద్ధగ్రంథమైన మహావంశ తెలిపింది.

- ఇతడు క్రీ.పూ. 273 నుంచి క్రీ.పూ. 232 వరకు రాజ్యపాలన చేశాడు.
- అశోకుడి భార్యలు: అసంధి మిత్ర (ఈమె పట్టమహిషి), తిష్యరక్ష (ఈమె బౌద్ధమత వ్యతిరేకి. గయలోని బోధివృక్షాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం చేసింది.), పద్మావతి (అశోకుడి వారసుడైన కునాలకు తల్లి), విదిశ మహాదేవి (శ్రీలంకలో బౌద్ధమతాన్ని ప్రచారం చేసిన మహేంద్ర, సంఘమిత్రకు తల్లి), కారువకి (అలహాబాద్ శాసనంలో ఈమెతోపాటు కుమారుడు తివార గురించి ప్రస్తావన ఉంది.) అశోకుడి శాసనాల్లో కారువకి, తివార మినహా ఇతర కుటుంబ సభ్యుల ప్రస్తావన లేదు.
- కల్హణుడి రాజతరంగిణి ప్రకారం అశోకుడి తర్వాత అతడి కుమారుడైన జలౌక చక్రవర్తి అయ్యాడు. అయితే పురాణాలు, ఇతర ఆధారాల్లో ఆ ప్రస్తావన లేదు.
- అశోకుడి కుమార్తె చారుమతి.. నేపాల్‌కు చెందిన దేవపాలను వివాహం చేసుకుని, అక్కడే స్థిరపడింది.
- అశోకుడి శాసనాల్లో అతడ్ని 'దేవానాం ప్రియా', 'ప్రియదర్శిని' అని పేర్కొన్నారు.
- అశోకుడి పాలనలో జరిగిన ఏకైక ముఖ్య సంఘటన కళింగ యుద్ధం. క్రీ.పూ. 261లో ఇది జరిగింది. దీనికి సంబంధించిన విషయాలు అశోకుడి 13వ ప్రధాన శిలాశాసనంలో ఉన్నాయి. ఈ యుద్ధంలో లక్ష మంది మరణించగా, లక్షా యాభై వేల మంది బందీలుగా చిక్కారు. ఈ హింసతో కలత చెందిన అశోకుడు యుద్ధాలను పూర్తిగా త్యజించి, ధర్మప్రచారాన్ని చేపట్టాడని శాసనం తెలుపుతుంది.

అశోకుడి వారసులు

అశోకుడి తర్వాత అతడి వారసులుగా కునాలుడు, జలౌకుడు, దశరథుడు మౌర్య సామ్రాజ్యాన్ని పాలించారు. అయితే వారంతా బలహీనులు కావడంతో 50 ఏళ్లలోనే రాజ్యం అంతమైంది.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

- పురాణాల ప్రకారం అశోకుడు తన చివరి రోజుల్లో సామ్రాజ్యాన్ని రెండుగా విభజించాడు. తూర్పు రాజ్యాన్ని తన మనవడైన దశరథుడికి, పశ్చిమ రాజ్యాన్ని తన కుమారుడైన కునాలుడికి ఇచ్చాడు.
- దశరథుడు నాగార్జున గుహాలయ శాసనం (బిహార్) వేయించాడు. దీని ప్రకారం ఇతడు నాగార్జున కొండల్లో మూడు గుహాలయాలను నిర్మించి, వాటిని అజీవకులకు కానుకగా ఇచ్చాడు.
- కునాలుడి కుమారుడైన సంప్రతి సింహాసనాన్ని అధిష్ఠించాక రెండు రాజ్యాలను ఏకం చేశాడని.. అతడు జైన మతాన్ని ఆచరించాడని వివిధ చరిత్రకారులు పేర్కొన్నారు. మౌర్య సామ్రాజ్య చివరి పాలకుడు బృహద్రథుడు. అతడు తన సేనాపతి పుష్యమిత్ర శుంగుడి చేతిలో హత్యకు గురవడంతో మౌర్య సామ్రాజ్యం అంతమైంది.

అశోకుడి దమ్మ విధానం

అశోకుడు కళింగ యుద్ధానంతరం శాశ్వతంగా హింసను విడనాడి, అత్యున్నతమైన నైతిక విలువలతో కూడిన దమ్మ విధానాలను రూపొందించాడు. ధర్మ అనే సంస్కృత పదానికి వికృత రూపమే 'దమ్మ'. దీని అర్థం విశ్వవ్యాప్త చట్టం లేదా ధార్మికత.

- ఇతడు దమ్మ విధానాల ప్రచారానికే తన శేష జీవితాన్ని అంకితం చేశాడు. ఇదే అశోకుడ్ని ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన చక్రవర్తిగా నిలబెట్టింది. తన రాజ్యంలోని ప్రజలు సుఖసంతోషాలతో పాటు నైతిక విలువలతో జీవించాలని అతడు భావించాడు. అశోకుడు తన పదో శిలా శాసనంలో చెడు నుంచి విముక్తి పొందడమే దమ్మ అని తెలిపాడు. అదేవిధంగా రెండో స్తంభ శాసనంలో 'చెడును తగ్గించి మంచిని పెంచడం' దమ్మ అని ఉంది.

నాటి సమాజంలోని అశాంతిని, వివిధ మతాల మధ్య నెలకొన్న ఘర్షణలను నివారించేందుకు; శాంతియుత సహజీవనం కోసం అశోకుడు దమ్మను రూపొందించాడని చరిత్రకారుల అభిప్రాయం. భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి దమ్మ ఒక వినూత్న ప్రయోగమని వారు పేర్కొన్నారు. వివిధ జాతులు, కులాలు, వర్గాలు, మతాలతో కూడిన భారత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు అశోకుని దమ్మ విధానం ఒక పరిష్కార మార్గాన్ని చూపినట్లు వారు వివరించారు.

Word of the Day

659

Quietude

Telugu meaning: శాంతి, స్థిరత్వం

English meaning: The word quietude (క్వయిట్యూడ్) is a noun that describes a state of calmness, peace and quiet.

Synonyms: Tranquility, Stillness

Antonyms: Chaos, Turmoil

Usage: **1.** He enjoyed the quietude of the countryside after years of living in the noisy city.

2. The library offered a sense of quietude that was perfect for focused study.

కరెంట్ అఫైర్స్




దక్షిణ భారతదేశ బాలికలు, మహిళల ఆవేదన, పోరాటాలను ప్రతిభావంతంగా వివరించిన కథల సంకలనం 'హార్ట్ ల్యాంప్' (ఆంగ్ల అనువాదం) ప్రతిష్ఠాత్మకమైన బుకర్ పురస్కారానికి ఎంపికైంది. 2025, మే 21న లండన్‌లో ప్రదానం చేసిన ఈ సాహితీ పురస్కారాన్ని రచయిత్రి బానూ ముష్తాఖ్ (77).. కథలను ఆంగ్లంలోకి అనువదించిన దీపా భస్తితో కలిసి స్వీకరించారు. పురస్కారం కింద అందుకున్న రూ.57.55 లక్షల నగదు బహుమతి ఇద్దరూ పంచుకోనున్నారు.



శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మేజర్ మల్లా రాంగోపాల్‌నాయుడికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కీర్తిచక్ర పురస్కారాన్ని ప్రదానం చేశారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 2025, మే 22న జరిగిన గ్యాలంట్రీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఈ పురస్కారాన్ని అందించారు.

- 2023 అక్టోబరు 26న జమ్మూలోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదులను మట్టుపెట్టడంలో చాకచక్యంగా వ్యవహరించినందుకు గానూ రాంగోపాల్‌కు ఈ పురస్కారం దక్కింది.



ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ (86) 2025, మే 20న పుణెలో మరణించారు. ఆయన 1938, జులై 19న జన్మించారు. పైచదువుల కోసం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లిన నార్లికర్.. తనకు డాక్టోరల్ సలహాదారుగా ఉన్న ఫ్రెడ్ హాయ్ల్‌తో కలిసి హాయ్ల్-నార్లికర్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుక్కున్నారు.

- 1965లో కేంద్ర ప్రభుత్వం ఆయనను 26 ఏళ్ల పిన్నవయసులో పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. 2004లో ఆయన పద్మవిభూషణ్ అవార్డును అందుకున్నారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచంలో సంభవించిన భారీ భూకంపాలు

స్టడీ - జోన్




భూమి ఉపరితలం అకస్మాత్తుగా కంపించడాన్ని భూకంపం అంటారు. భూ గర్భంలో సంభవించే ఆకస్మిక బలాల వల్ల ఏర్పడే తరంగాల కారణంగా భూమి కంపిస్తుంది. ప్రకృతి విలయాల్లో ఇది ప్రధానమైంది. దీనివల్ల పెద్దఎత్తున ఆస్తి, ప్రాణ నష్టాలు కలుగుతాయి. సాధారణంగా ఒక నిమిషం కంటే తక్కువ వ్యవధిలో భూ ప్రకంపనలు ఉంటాయి.

- భూకంపం ఏర్పడే ప్రాంతాన్ని 'భూకంప నాభి' లేదా 'భూకంప కేంద్రం' అంటారు. పైభాగంలో భూమి ఉపరితలం మీద లంబంగా ఉండే ప్రాంతాన్ని 'అది కేంద్రం' అంటారు. దీని నుంచి దూరంగా వెళ్లే కొద్దీ ప్రకంపనల తీవ్రత తగ్గుతుంది.
- భారతదేశ భూ విస్తీర్ణంలో 58% భూభాగం భూకంప దుర్బలత్వంలో ఉంది. మన దేశంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో భూకంపాలు అధికంగా సంభవిస్తుండగా.. తరచుగా అస్సాం, బిహార్, జమ్మూ, గుజరాత్, మహారాష్ట్రలో వస్తున్నాయి.
- భూకంపాలను నమోదు చేసే పరికరాన్ని సిస్మోగ్రాఫ్ (భూకంప లేఖిని) అంటారు. వీటి తీవ్రతను రిక్టర్ స్కేల్‌తో కొలుస్తారు. దీన్ని 1935లో చార్లెస్ ఎఫ్ రిక్టర్ తయారు చేశారు. దీనిపై మొత్తం 9 పాయింట్లు ఉంటాయి. కొలత 7 కంటే ఎక్కువ నమోదైతే దాన్ని తీవ్ర భూకంపంగా పేర్కొంటారు.
- ప్రపంచంలో భూకంపాలు 68% పసిఫిక్ మహాసముద్రం, 21% మధ్యధరా ప్రాంతాలు, 11% ఇతర ప్రాంతాల్లో సంభవిస్తాయి. ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో ఎలాంటి భూకంపాలు నమోదు కాలేదు. ప్రపంచంలో సంభవించిన అధిక తీవ్రత గల వివిధ భూకంపాలు, మృతుల సంఖ్యను పరిశీలిస్తే..

తేదీ	ప్రాంతం	దేశం	తీవ్రత	మృతులు
22.05.1960	వాల్‌దివియా	చిలీ	9.5	1655
28.03.1964	ప్రిన్స్ విలియంసౌండ్	అమెరికా	9.2	128
26.12.2004	సుమత్ర	ఇండోనేసియా	9.1	2,27,900
11.03.2011	సెండాయ్	జపాన్	9.0	10000
27.02.2010	బియో-బియో	చిలీ	8.8	521
12.05.2008	తూర్పు సిచువాన్	చైనా	7.9	87,500
26.01.2001	గుజరాత్	భారత్	7.6	20,000
17.08.1999	ఇజ్మిత్	తుర్కియే	7.6	18,000
05.30.1998	బదాక్షాన్	ఆఫ్గనిస్థాన్	6.6	4,000
27.05.2006	జావా	ఇండోనేసియా	6.3	5,700

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ కమిషన్ ఇచ్చే సిఫార్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయదారులను, వృత్తి కార్మికులను ఆదుకోవడానికి సహకార సంస్థలు ఏర్పాటయ్యాయి.



రాష్ట్ర ఆర్థిక సంఘం, సహకార సంస్థలు

రాష్ట్ర ఆర్థిక సంఘం

- 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని అనుసరించి ప్రతి రాష్ట్రంలో 243 (i) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. కేంద్ర ఆర్థిక సంఘాన్ని 280వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. ఈ సంఘంలో ఒక ఛైర్మన్, నిర్దేశించిన సంఖ్యలో సభ్యులు ఉంటారు.
- ఛైర్మన్, సభ్యులుగా నియమితులు కావాలంటే ఆర్థిక విషయాల్లో నిష్ణాతులై ఉండాలి. పరిశోధన, బోధనా రంగాల్లో అనుభవం ఉన్నవారిని గవర్నర్ నియమిస్తారు.

సహకార వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సహకార సంఘాన్ని 1918లో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో స్థాపించారు. ఇది స్వయంప్రతిపత్తి కలిగిన సంఘం.

- ఏటా నవంబరు 14 - 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహిస్తారు.

నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల తొలగింపు విధానం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సుల్లో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ హెల్త్, మెడికల్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏపీఎంఎస్ఆర్‌బీ) ఏపీ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పీడియాట్రిషియన్, కన్సల్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 53. దరఖాస్తు ఫీజు రూ.1000. ఇంటర్వ్యూ తేదీ 2025 మే 27.

డీఎస్‌హెచ్ అనంతపురము జిల్లాలో పోస్టులు

అనంతపురము జిల్లా, హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో ఒప్పంద/ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 43. దరఖాస్తు ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2025, మే 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (మే 24) చివరి తేదీ

- ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 309 పోస్టులు. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఎన్‌సీఆర్‌టీసీలో 72 ఇంజినీర్ పోస్టులు. డిప్లొమా, డిగ్రీ, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో 147 పోస్టులు.
- నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పోస్టులు. గ్రాడ్యుయేషన్‌తో పాటు ఇంగ్లిష్ టైపింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మెగా డీఎస్సీ 2025 ప్రత్యేకం

బయాలజీ

జీవుల్లో వైవిధ్యం

1. వ్యూజ్ వర్గీకరణలో నిజకేంద్రకం కలిగింది ఏది?
1) ఆరాఖియా 2) బ్యాక్టీరియా
3) ఉకేరియా 4) పైవన్నీ

2. LUCA అంటే
1) List Universal Common Ancestor
2) Last Universal Common Ancestor
3) Last University Common Ancestor
4) Last Universal Control Ancestor

3. "లూకా" అంటే?
1) మొట్టమొదటి కణం
2) చిట్టచివరి కణం 3) మధ్యలో ఉండే కణం
4) మొదటి నుంచి రెండో కణం

4. లిన్నేయస్ వర్గీకరణకు విట్టేకర్ ఎన్ని రాజ్యాలను కలిపి 5 రాజ్యాలుగా వర్గీకరించాడు?
1) 2 2) 3 3) 4 4) 5

5. ద్వినామీకరణకు సంబంధించి కిందివాటిని పరిశీలించి సరైనవి గుర్తించండి.
i) 1వ పదం - ప్రజాతిని
ii) 2వ పదం - జాతిని తెలియజేస్తాయి.
1) i మాత్రమే సరైంది 2) ii మాత్రమే సరైనది
3) రెండూ సరైనవే 4) ఏదీ సరికాదు

6. ప్రతిజీవికి రెండు పదాలున్న పేర్లను పెట్టింది ఎవరు?
1) చార్లెస్ డార్విన్ 2) విట్టేకర్
3) లిన్నేయస్ 4) వ్యూజ్

7. విట్టేకర్ 5 రాజ్యాల వర్గీకరణలో లేని రాజ్యం?
ఎ. మొనీరా బి. ప్రొటిస్టా
సి. ప్లాంటే డి. ప్రోటోజోవా
ఇ. ఫంగై ఎఫ్. అనిమేలియా
1) బి మాత్రమే 2) సి మాత్రమే
3) డి మాత్రమే 4) ఇ. మాత్రమే

8. కోప్‌లాండ్ "4 రాజ్యాల" వర్గీకరణకు ఏ రాజ్యాన్ని చేరిస్తే విట్టేకర్ "5 రాజ్యాల" వర్గీకరణ అవుతుంది?
1) మొనీరా 2) ప్రొటిస్టా
3) ప్లాంటే 4) ఫంగై

9. పుష్పాల ఆధారంగా వర్గీకరణ చేసింది?
1) పరాశరుడు 2) చరకుడు
3) శుశ్రుతుడు 4) విట్టేకర్

10. ఔషధ గుణాల ఆధారంగా వర్గీకరణ చేసింది ఎవరు?
1) చరకుడు 2) శుశ్రుతుడు
3) 1, 2 4) పరాశరుడు

11. 1859లో చార్లెస్ డార్విన్ జీవుల పరిణామం గురించి ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
1) జాతుల అమరిక 2) జాతుల పుట్టుక
3) జాతుల వర్గీకరణ 4) జాతుల పరిణామం

12. కింద పేర్కొన్న వాటిని పరిశీలించి పరిణామక్రమం సూచించే వాటిని గుర్తించండి.
i. ముందు వచ్చిన లక్షణాలే ఆధారం
ii. తర్వాత వచ్చిన లక్షణాలే ఆధారం
1) i మాత్రమే సరైంది 2) ii మాత్రమే సరైంది
3) i, ii సరైనవి 4) i, ii సరైనవి కావు

13. ఒకే జాతుల మధ్య వైవిధ్యం ఎలా ఉంటుంది?
1) తక్కువగా 2) ఎక్కువగా
3) సమానంగా 4) చాలా ఎక్కువగా

14. కిందివాటిలో ద్విదళ బీజ మొక్క కానిది?
1) బఠాణి 2) చిక్కుడు
3) గడ్డి 4) వేరుశెనగ

15. కవల పిల్లల్లో తేడాలను గుర్తించడానికి ఏ లక్షణం ఉపయోగపడుతుంది?
1) చెవులు 2) ఎత్తు
3) కాలిముద్రలు 4) బొటనవేలి ముద్రలు

16. సకశేరుకాల లక్షణాల్లో లేనిది?
1) నిజమైన వెన్నెముకను కలిగి ఉంటాయి
2) ద్విపార్శ్వ సౌష్టవాన్ని కలిగి ఉంటాయి
3) ఇవి ద్విస్తరిత జీవులు
4) నిజ శరీర కుహరం కలిగి ఉంటాయి

17. కెవాలియర్, స్మిత్ 1998లో ప్రతిపాదించిన నూతన వర్గీకరణ విధానాన్ని IBS ఎప్పుడు ఆమోదించింది?
1) 2001 2) 2002 3) 2003 4) 2004

18. 'మిథ్యా శరీరకుహరం' దేనిలో కనిపిస్తుంది?
1) అనెలిడా 2) నిడేరియా
3) నెమటోడా 4) ఎఖైనోడర్మేటా

19. "జఠర ప్రసరణ కుహరం" అనే ఖాళీ ప్రదేశాలను కలిగి ఉండే జీవులు?
1) ప్లాటిహెల్మింథిస్ 2) నెమటోడా
3) నిడేరియా 4) మొలస్కా

20. కింది వాటిలో బాహ్య నిర్మాణం శైవలాలను, అంతర నిర్మాణం బ్యాక్టీరియాను పోలి ఉండేది?
1) ఆర్కి బ్యాక్టీరియా 2) యూ బ్యాక్టీరియా
3) బ్యాక్టీరియా 4) సయనో బ్యాక్టీరియా

21. మొనీరాకు సంబంధించి సరికానిది?
1) ఏకకణ జీవులు
2) నిజకేంద్రకం ఉంటుంది
3) ద్విదావిచ్ఛిత్తిని జరుపుతాయి
4) శరీరం వెలుపల నుంచి పోషకాలను గ్రహిస్తాయి

సమాధానాలు

1-3	6-3	11-2	16-3	21-2
2-2	7-3	12-1	17-4	
3-1	8-4	13-1	18-3	
4-2	9-1	14-3	19-3	
5-3	10-3	15-4	20-4	

రచయిత: డాక్టర్ ఎలగొండ నరసింహ మూర్తి

సబ్జెక్టులవారీ ప్రాక్టీస్ టెస్టుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

✿ డీఎస్సీ పరీక్షకు కరెంట్ అఫైర్స్ 2025 జనవరి నుంచి చదివితే సరిపోతుందా? మే చివరి వరకూ చదవాలా? - వంశీ, ఎస్. ప్రేమ్ కుమార్



జ: డీఎస్సీ పరీక్షకు కనీసం తొమ్మిది నెలల నుంచి సంవత్సరంలోపు కరెంట్ అఫైర్స్‌ని చదవాల్సి ఉంటుంది. అంటే గతేడాది జూన్ నుంచి ఈ సంవత్సరం మే వరకు అధ్యయనం చేయాలి. పరీక్షను ఆన్‌లైన్‌లో జూన్ 6 నుంచి నిర్వహిస్తారు కాబట్టి ఈ మే నెలాఖరు వరకు జరిగే తాజా సంఘటనలు, పరిణామాలపై కూడా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

తాజా పరిణామాలపైనా ప్రశ్నలకు అవకాశం!

✿ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది నా చిన్ననాటి కోరిక. ఎలాగైనా డీఎస్సీ గెలవాలని పట్టుదలగా ఉన్నాను. అయితే సిలబస్‌లో కొన్ని అంశాలు ఒకే రకంగా ఉండటంతో మరిచిపోవడానికి లేదా ఒకదాని బదులు మరొకటి అనుకోవడానికి అవకాశం ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇది నా మొదటి ప్రయత్నం. ఇంత తక్కువ సమయంలో ఎలా ప్రిపేర్ కావాలో సూచనలు చేయండి. - కుంచె రవితేజ

జ: డీఎస్సీలో కొన్ని అంశాలు ఒకే సారూప్యతతో ఉన్నప్పుడు కామన్ అంశాలను ముందుగా చదవండి. ఒక చెక్ లిస్ట్ పెట్టుకుని ఒకేరకంగా ఉన్నవాటిని వదిలేయండి. అధికా రిక సిలబస్ ప్రకారం ప్రిపరేషన్ సాగించండి. మొదటి ప్రయత్నమే అయినా ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధ్యమే. ముందుగా ఇంగ్లిష్, కోర్ సబ్జెక్టు చదవండి. తర్వాత మెథడాలజీ చదువుతూ, సబ్జెక్టు రివైజ్ చేయండి. మాక్ టెస్టులు రాస్తూ, రివిజన్ కొనసాగించండి. పాత ప్రశ్నపత్రాలు తరచూ పరిశీలిస్తూ ప్రశ్నల సరళిని గమనించండి. వీలైనన్ని ఎక్కువ టెస్టులు ప్రాక్టీస్ చేయండి.

మెగా డీఎస్సీ 2025
మీ సందేహాలను మాకు పంపండి!
help@eenadupratibha.net

విడిగా విధిస్తే.. కలిపి కట్టేస్తే!

స్నేహితుడు లేదా తెలిసిన వాళ్ల దగ్గర అప్పు తీసుకున్నారు. కొంత కాలానికి కాస్త అదనపు మొత్తాన్ని కలిపి ఇచ్చేస్తారు. అదే బ్యాంకులోనో, ఏదైనా రుణ సంస్థలోనో అప్పు చేస్తే, నిర్ణీత సమయంలో వడ్డీ కట్టకపోతే వడ్డీ మీద వడ్డీ వేస్తారు. మొదటిది సాధారణ వడ్డీ లేదా బారువడ్డీ. ఇందులో వడ్డీని విడిగా విధిస్తారు. అయితే రెండోది చక్రవడ్డీ. దీనిలో అసలులో వడ్డీని కలిపేసి మళ్లీ వడ్డీ లెక్క కడతారు. గుణిజాల్లో పెరిగే లేదా తగ్గే జనాభా సంఖ్య, పరిశోధనల్లో బ్యాక్టీరియాల వృద్ధి తదితరాలను గణించడానికి కూడా చక్రవడ్డీ సూత్రాలు సాయపడతాయి. ఆదాయం సక్రమ వినియోగం, పెట్టుబడులు, రుణాల నిర్వహణ మొదలైన అన్ని విషయాల్లో వడ్డీల లెక్కలు వస్తుంటాయి. అందరికీ తెలిసిన ఈ విషయాలనే కాస్త గణితం కోణంలో ఆలోచించి, అర్థం చేసుకుంటే పరీక్షలో వచ్చే ప్రశ్నలకు తేలికగా సమాధానాలను గుర్తించవచ్చు. దాంతోపాటు శాతాలు, భిన్నాలు, గుణకారాలను వేగంగా చేయడంతోపాటు, సూత్రాలను, వాటిలోని విలువలను సరిగా ప్రతిక్షేపించడం నేర్చుకోవాలి. రకరకాల కాలాలకు వడ్డీలను లెక్కగట్టేటప్పుడు ఫార్ములాల్లో జరిగే మార్పులపై అవగాహన పెంచుకోవాలి.

బారువడ్డీ - చక్రవడ్డీ

బారువడ్డీ (Simple Interest)

★ అప్పు తీసుకున్న సొమ్మును 'అసలు', దానిపై అదనంగా చెల్లించే సొమ్మును 'వడ్డీ' అని, రెండింటిని కలిపి 'మొత్తం' అని అంటారు. మొత్తం $A = P + I$

★ రూ. 2 వడ్డీ అంటే నెలకు నూటికి రెండు రూపాయల(రూ. 2ల) వడ్డీ అని అర్థం.

★ సంవత్సరానికి నూటికి నిర్ణయించే వడ్డీని 'వడ్డీరేటు శాతం' అంటారు.

★ రూ. 2ల వడ్డీని వడ్డీరేటు శాతంలో చూపిస్తే $2 \times 12 = 24\%$

పావలావడ్డీ అంటే $0.25 \times 12 = 3\%$

బారువడ్డీ అనేది అసలు, కాలం, వడ్డీరేటు శాతాలకు అనులోమానుపాతంలో ఉంటుంది.

అసలు P, సంవత్సరానికి వడ్డీరేటు R%, కాలం T అయితే

వడ్డీ $I = \frac{PTR}{100}$



అసలు $P = \frac{I \times 100}{TR}$

కాలం $T = \frac{I \times 100}{PR}$

వడ్డీరేటు $R = \frac{I \times 100}{PT}$

మొత్తం $A = P + I$

$= P + \frac{PTR}{100}$

$= P\left[1 + \frac{TR}{100}\right]$

మరిన్ని వివరాలు

చక్రవడ్డీ (Compound Interest)

★ అప్పు తీసుకున్న సొమ్ముపై కొంత పర్యాయానికి వడ్డీ నిర్ణయించి దాన్ని అసలుతో కలిపి, ఆ మొత్తాన్ని తర్వాత పర్యాయానికి అసలుగా పరిగణిస్తూ వడ్డీలెక్కకట్టడాన్ని 'చక్రవడ్డీ' అంటారు.

★ చక్రవడ్డీని లెక్కకట్టేటప్పుడు వడ్డీని, అసలుకు ఎంతకాలం తర్వాత కలుపుతున్నామో ఆ కాలాన్ని వడ్డీని 'తిరిగి కట్టే కాలవ్యవధి' (Conversion Period) అంటారు.

★ చక్రవడ్డీని సాధారణంగా ఏడాదికి లేదా 6 లేదా 3 నెలలకోసారి లెక్కిస్తారు.

★ సంవత్సరానికి లెక్కించినప్పుడు

మొత్తం $A = P\left[1 + \frac{R}{100}\right]^n$

2025 మెగా డీఎస్సీ
కంటెంట్ - గణితం

P = అసలు


R = ఒక పర్యాయానికి వడ్డీరేటు

n = పర్యాయాల సంఖ్య

★ వడ్డీ తిరిగికట్టే కాలాన్ని బట్టి R, n విలువలు మారుతూ ఉంటాయి.

★ 6 నెలలకు ఒకసారి వడ్డీ తిరిగి కడితే

మొత్తం $A = P\left[1 + \frac{R}{200}\right]^{2n}$





★ 3 నెలలకు ఒకసారి వడ్డీ తిరిగి కడితే

మొత్తం $A = P\left[1 + \frac{R}{400}\right]^{4n}$

★ రెండేళ్లకోసారి వడ్డీ తిరిగి కడితే

మొత్తం $A = P\left[1 + \frac{2R}{100}\right]^{n/2}$

★ వేర్వేరు వడ్డీరేట్లు ఇచ్చినప్పుడు

మొత్తం $A = P\left[1 + \frac{R_1}{100}\right]\left[1 + \frac{R_2}{100}\right]\ldots$

చక్రవడ్డీ $CI = A - P$

నోట్: 1) రెండేళ్ల కాలవ్యవధిలో చక్రవడ్డీ, బారువడ్డీల మధ్య

వ్యత్యాసం $CI - SI = \frac{PR^2}{100^2}$

2) 3 సంవత్సరాల కాలవ్యవధిలో చక్రవడ్డీ, బారువడ్డీల మధ్య వ్యత్యాసం

$CI - SI = \frac{PR^2 (300 + R)}{100^3}$

చక్రవడ్డీ సూత్రం అనువర్తనాలు

★ చక్రవడ్డీ ప్రకారం మొత్తాన్ని కనుక్కునే సూత్రాన్ని ఉపయోగించుకునే సందర్భాలు.

1) జనాభా పెరుగుదల లేదా తగ్గుదల.

2) బ్యాక్టీరియా పెరుగుదల రేటు తెలిస్తే వాటి పెరుగుదల.

3) కొన్ని సంవత్సరాల మధ్యలో ఒక వస్తువు విలువ పెరుగుతూ లేదా తగ్గుతూ ఉన్నప్పుడు ఆ వస్తువు విలువ.

మాదిరి ప్రశ్నలు

1. రమ్య ప్రతి సంవత్సరానికి 15% వడ్డీరేటు చొప్పున రూ.5000 లు అప్పు తీసుకుంటే, ఏడాది చివర్లో ఆమె చెల్లించాల్సిన వడ్డీ ఎంత?
   1) రూ.650 2) రూ.750
   3) రూ.680 4) రూ.720

2. అసలు రూ.6050లపై 3 సంవత్సరాల కాలానికి 6.5% వడ్డీరేటు చొప్పున అయ్యే మొత్తం ఎంత?
   1) రూ.1179.75 2) రూ.6229.75
   3) రూ.7292.75 4) రూ.7229.75

3. సోము రూ.4500లు మొత్తంపై 2 సంవత్సరాలకు రూ.750లు వడ్డీ చెల్లిస్తే వడ్డీరేటు ఎంత?
   1) 6% 2) $6\frac{1}{3}$% 3) 8% 4) $8\frac{1}{3}$%

4. కొంత మొత్తంపై 5% వడ్డీరేటుతో 3 సంవత్సరాల తర్వాత చెల్లించాల్సిన వడ్డీ రూ.450 అయితే అసలు ఎంత?
   1) రూ.3000 2) రూ.4000
   3) రూ.4500 4) రూ.2800

5. రూ.2400ల అసలుపై వడ్డీరేటు 5% చొప్పున ఎన్ని సంవత్సరాలకు వడ్డీ రూ.240లు అవుతుంది?
   1) 4 2) 3 3) 2 4) $1\frac{1}{2}$

6. మీనా సంవత్సరానికి 9% వడ్డీరేటుతో రూ.45 వడ్డీ చెల్లిస్తే ఆమె తీసుకున్న మొత్తం రుణం ఎంత?
   1) రూ.50 2) రూ.500
   3) రూ.5000 4) రూ.450

7. 2 సంవత్సరాల్లో రూ.56,000ల మొత్తంపై ఏ రేటు ప్రకారం రూ.280 వడ్డీ అవుతుంది?
   1) 0.2% 2) 0.5%
   3) 0.15% 4) 0.25%

8. ఎంత సొమ్ముపై సంవత్సరానికి 9% వడ్డీరేటుతో 3 సంవత్సరాల 4 నెలల కాలానికి సాధారణ వడ్డీ రూ.6000లు అవుతుంది?
   1) రూ.20,000 2) రూ.18,000
   3) రూ.22,000 4) రూ.19,000

9. 10% వడ్డీ రేటు చొప్పున రూ.6880లు ఎంత కాలానికి రూ.7224లు అవుతుంది?
   1) రెండేళ్లకు 2) ఏడాదికి
   3) 6 నెలలు లేదా అర్ధ సంవత్సరానికి
   4) $1\frac{1}{2}$ సంవత్సరానికి

10. ఎంత వడ్డీ రేటుతో 15 సంవత్సరాల్లో అసలు 4 రెట్లు అవుతుంది?
    1) 20% 2) 18% 3) 22% 4) 16%

11. 12% వడ్డీరేటు చొప్పున ఎన్ని ఏళ్లకు అసలుకు మొత్తం 3 రెట్లు అవుతుంది?
    1) 12
    2) $14\frac{2}{3}$
    3) 15
    4) $16\frac{2}{3}$



12. కొంత వడ్డీరేటుపై రూ.6500లు, 4 సంవత్సరాలకు రూ.8840లు అవుతుంది. అదే వడ్డీరేటు చొప్పున రూ.1600లు ఎన్ని సంవత్సరాల్లో రూ.1816లు మొత్తం అవుతుంది?
    1) ఏడాదికి 2) రెండేళ్లకు
    3) $1\frac{1}{2}$ సంవత్సరానికి
    4) $2\frac{1}{2}$ సంవత్సరాలకు

జవాబులు
1-2; 2-4; 3-4; 4-1; 5-3; 6-2; 7-4; 8-1; 9-3; 10-1; 11-4; 12-3.



రచయిత: సి.మధు

Essential part of Teaching


Text Book - Philosophy and Guiding Principles

✪ Text book is one of the most common teaching material used by English language teachers in the learning process. ✪ The convergence of theoretical linguistics, cognitive psychology and experimental pedagogy has derived new insights into language pedagogy. ✪ The present text books are developed based on the principles of constructivism and critical pedagogy.

Text book-Guiding Principles

NCF - 2005 Guiding Principles:

✪ Teacher role from teaching to facilitator. ✪ Sharing ideas and collaborative learning. ✪ Creating multiple texts from given text. ✪ Children must be active participants rather than recipients of information. ✪ Learning takes place both within and outside school. ✪ Connecting knowledge to life outside the school. ✪ Ensuring that learning shifts away from rote methods. ✪ Making examinations more flexible and integrated into classroom life. ✪ All children are naturally motivated to seek and are capable of learning.



మెథడాలజీ English

RTE - 2009 Quality Aspects:

✪ Conformity with constitutional values. ✪ All-round development of the child. ✪ Building of the child's knowledge, potentiality and talent. ✪ Development of physical and mental abilities to the fullest extent. ✪ Comprehensive and continuous evaluation of the child's understanding of knowledge and the ability to apply it. ✪ RTE clearly envisaged re-examining the curriculum, keeping the above factors in view.

మరిన్ని వివరాలు



Writer: Kali Venkatesu

నీలగిరి కొండల్లో షోలా అడవులు!

భిన్న భౌగోళిక స్వరూపాలతో కూడిన భారతదేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ఉత్తరంలో మంచుతో నిండిన హిమాలయాలు, ఈశాన్యంలో నిరంతరం వర్షాలు కురిసే కొండ ప్రాంతాలు, వాయవ్యంలో ఎడారి, మధ్యభాగంలో సువిశాల గంగాతీర మైదానం, దక్కన్ పీఠభూమి, దక్షిణంలో ఇరువైపుల్లో తీర మైదానాలు, కనుమలతోపాటు దేశం పరిధిలో వందలాది ద్వీపాలున్నాయి. వైవిధ్యభరితమైన ఈ నైసర్గిక స్వరూపాలపై ప్రాంతాలవారీగా పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. హిమాలయాల విశేషాలు, వివిధ రాష్ట్రాల్లో, పొరుగు దేశాల్లో ఈ పర్వత శ్రేణులకు ఉన్న పేర్లు, దేశవ్యాప్తంగా శిఖరాలు, కనుమలు, ఘాట్‌లు, హిమానీనదాలు, ప్రధాన బీచ్‌ల వివరాలు, వాటి ప్రాధాన్యాలను తెలుసుకోవాలి.

డీఎస్సీ- 2025: జాగ్రఫీ

భారతదేశం - భౌగోళిక స్వరూపాలు

1. కింది వాటిలో మేఘాలయ పీఠభూమికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) మేఘాలయ పీఠభూమినే 'కర్బీ ఆంగ్లాంగ్ పీఠభూమి' అంటారు.
   బి) ఈ పీఠభూమిలో భాగమైన గారో కొండల్లో 'సున్నపురాయి గుహలు' అనే 'సిజు గుహలు' ఉన్నాయి.
   సి) ఈ పీఠభూమిలోని మికిర్ కొండల్లోని దక్షిణ భాగాన్ని 'రెంగ్మ కొండలు' అంటారు.
   డి) ప్రపంచంలో అత్యధిక సగటు వర్షపాతం నమోదయ్యే మౌసిన్రామ్, చిరపుంజి ప్రాంతాలు ఖాసి కొండల్లో ఉన్నాయి.
   1) ఎ, బి, సి, డి లు సరికావు.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.

2. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) మరుస్థలి	1) అర్ధచంద్రాకారపు ఇసుక దిబ్బలు
బి) డ్రెయిన్	2) ఇసుక మైదానాలు
సి) తాళి	3) సంపూర్ణ ఎడారి
డి) బార్కన్	4) కదిలే ఇసుక దిబ్బలు

   1) ఎ-3, బి-4, సి-2, డి-1
   2) ఎ-3, బి-2, సి-4, డి-1
   3) ఎ-1, బి-2, సి-3, డి-4
   4) ఎ-4, బి-3, సి-2, డి-1


3. కింది వాటిలో హిమాలయాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) హిమాద్రి, ట్రాన్స్ హియాలయాలు (మొదటి దశలో) సుమారు 6.5 కోట్ల సంవత్సరాల కిందట ఏర్పడ్డాయి.
   బి) 4.5 కోట్ల ఏళ్ల కిందట (రెండో దశలో) హిమాచల్ హిమాలయాలు ఏర్పడ్డాయి.
   సి) సుమారుగా 1.4 కోట్ల ఏళ్ల కిందట శివాలిక్ పర్వతాలు ఏర్పడ్డాయి.
   డి) యురేషియా, ద్వీపకల్ప పలకలు ఢీకొన్న క్రమంలో హిమాలయాలు ఏర్పడ్డాయి.
   1) ఎ, బి, సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.

4. కింది వాటిలో ఆరావళి పర్వతాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) ఈ పర్వతాల్లోని శిలలు భారతదేశంలోనే అతి పురాతనమైనవి.
   బి) ఆల్వార్ కొండల్లో ప్రసిద్ధి చెందిన ఖేత్రి ప్రాంతం ఉంది.
   సి) మధ్య ఆరావళి పర్వత ప్రాంతంలో విస్తరించి ఉన్న వాటిని మార్వార్ కొండలు అంటారు.
   డి) ఆరావళి పర్వతాల్లో దక్షిణ భాగంలోని కొండలను అబు కొండలు అంటారు. ఆరావళి పర్వతాల్లో ఎత్తయిన శిఖరం 'గురుశిఖర్' ఇక్కడ ఉంది.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, సి, డి లు సరికావు.
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.

5. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) కొడైకెనాల్ వేసవి విడిది ప్రాంతం	1) నీలగిరి కొండలు
బి) అగస్త్యమలై శిఖరం	2) అన్నామలై కొండలు
సి) ఏనుగు కొండలు	3) యాలకుల కొండలు
డి) ఉదక మండలం	4) పళని కొండలు

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-3, బి-4, సి-2, డి-1
   4) ఎ-1, బి-4, సి-2, డి-3



6. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) బాబర్	1) నవీన ఒండ్రు మైదానం
బి) టెరాయి	2) పురాతన ఒండ్రు మైదానం
సి) భంగర్	3) గులకరాళ్ల సచ్ఛిద్ర మైదానం
డి) ఖాదర్	4) చిత్తడి ప్రాంతం

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3
   4) ఎ-3, బి-4, సి-2, డి-1

7. కింది వాటిలో సరికానివి గుర్తించండి.
   ఎ) పూర్వాంచల్ హిమాలయాలను అరుణాచల్ ప్రదేశ్‌లో 'పాట్కాయ్‌బమ్ కొండలు' అంటారు.
   బి) పూర్వాంచల్ హిమాలయాలను మిజోరాంలో 'లుషాయి కొండలు' అంటారు.
   సి) పూర్వాంచల్ హిమాలయాల్లో ఎత్తయిన శిఖరం సారామతి.
   డి) పూర్వాంచల్ హిమాలయాల్లోని బ్లూ మౌంటెన్ శిఖరం నాగా కొండల్లో ఉంది.
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ 4) డి

8. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) సాగరమాత	1) నంగ పర్వత్
బి) దక్షిణ శిఖరం	2) ధవళగిరి
సి) శ్వేత పర్వతం	3) లోట్సే
డి) నగ్న పర్వతాలు	4) ఎవరెస్ట్

   1) ఎ-3, బి-4, సి-2, డి-1
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-2, సి-3, డి-4
   4) ఎ-1, బి-4, సి-2, డి-3

9. ఇచ్చిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) హిమాలయాల్లోని బనిహల్ కనుమ.. జమ్మూ, శ్రీనగర్‌ని కలుపుతుంది.
   బి) జోజిలా కనుమ.. శ్రీనగర్, లేహ్ ప్రాంతాలను కలుపుతుంది.
   సి) చాంగ్‌లా కనుమ.. లేహ్, టిబెట్‌ను కలుపుతుంది.
   డి) బారాలప్చాల కనుమ.. మనాలి, లేహ్‌ను కలుపుతుంది.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి లు సరికావు; సి, డి లు సరైనవి.

10. కింది వాటిని జతపరచండి.

కనుమలు	రాష్ట్రం
ఎ) బర్జిల	1) అరుణాచల్‌ప్రదేశ్
బి) ఆఘిల్	2) సిక్కిం
సి) నాథులా	3) జమ్మూ-కశ్మీర్
డి) దీపు	4) లద్దాఖ్

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3
   4) ఎ-4, బి-1, సి-3, డి-2

11. కింది వాటిలో నీలగిరి కొండలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
    ఎ) నీలగిరి కొండలు షోలా అడవులకు ప్రసిద్ధి.
    బి) ఇవి తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి.



    సి) తూర్పు కనుమలు, పశ్చిమ కనుమలు ఈ కొండల్లోని గుడలూరు అనే ప్రాంతంలో కలుసుకుంటాయి.
    డి) నీలగిరి కొండల్లో ఎత్తయిన, దక్షిణ భారతదేశంలో రెండో ఎత్తయిన శిఖరం దొడబెట్ట.
    1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
    2) ఎ, బి, సి, డి లు సరికావు.
    3) ఎ, బి, సి, డి లు సరైనవి.
    4) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

పర్వతం	ప్రాంతం
ఎ) దూద్వా శ్రేణి	1) నేపాల్
బి) మిష్మి శ్రేణి	2) పశ్చిమ బెంగాల్
సి) డ్వార్ఫ్ శ్రేణి	3) అరుణాచల్‌ప్రదేశ్
డి) చురియా శ్రేణి	4) ఉత్తర్‌ప్రదేశ్

    1) ఎ-4, బి-3, సి-2, డి-1
    2) ఎ-1, బి-2, సి-3, డి-4
    3) ఎ-3, బి-4, సి-2, డి-1
    4) ఎ-4, బి-2, సి-3, డి-1

13. కింది వాటిని సరిచూడండి.
    ఎ) మహారాష్ట్రలోని కుంబర్లీ ఘాట్ కనుమ రత్నగిరి, సతార ప్రాంతాలను కలుపుతుంది.
    బి) గోవాలోని చోర్లా ఘాట్ కనుమ పనాజి, బెల్గావి ప్రాంతాలను కలుపుతుంది.
    సి) కేరళలోని పాల్‌ఘాట్ కనుమ పాలక్కాడ్, కోయంబత్తూర్‌ను కలుపుతుంది.
    డి) తమిళనాడులోని శెన్‌కొట్టి ఘాట్ కొల్లాయ్, మదురై ప్రాంతాలను కలుపుతుంది.
    1) ఎ, బి, సి, డి లు సరైనవి
    2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
    3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
    4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

బీచ్	రాష్ట్రం
ఎ) వాండూర్	1) మహారాష్ట్ర
బి) గంగాసాగర్	2) కర్ణాటక
సి) పెనంభూర్	3) అండమాన్ నికోబార్ దీవులు
డి) జుహు	4) పశ్చిమ బెంగాల్

    1) ఎ-4, బి-3, సి-2, డి-1
    2) ఎ-3, బి-4, సి-2, డి-1
    3) ఎ-1, బి-4, సి-2, డి-3
    4) ఎ-1, బి-2, సి-3, డి-4

15. కింది వాటిలో సరికానివి గుర్తించండి.
    ఎ) గుజరాత్ తీరమైదానంలోని ఉత్తర భాగాన్ని కచ్ ద్వీపకల్పం అని, దక్షిణ భాగాన్ని కథియావాడ్ ద్వీపకల్పం అని అంటారు.
    బి) మహారాష్ట్రలోని కొంకణ్ తీరంలో అధిక జనసాంద్రత ఉంటుంది.
    సి) కేరళలోని మలబార్ తీరం లాగూన్‌లకు ప్రసిద్ధి.
    డి) భారతదేశంలోని వీలర్ దీవి లేదా అబ్దుల్ కలాం దీవి ఉత్కల్ తీరంలో ఉంది.
    1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
    2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
    3) ఎ, బి, సి, డి లు సరైనవి.
    4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

16. కింది వాటిని జతపరచండి.

తెగ	రాష్ట్రం
ఎ) బేకర్‌వాల్	1) హిమాచల్‌ప్రదేశ్
బి) లెప్చా	2) ఉత్తరాఖండ్
సి) బోటియా	3) సిక్కిం
డి) గుజ్జర్లు	4) జమ్మూ-కశ్మీర్

    1) ఎ-4, బి-3, సి-2, డి-1
    2) ఎ-1, బి-2, సి-3, డి-4
    3) ఎ-1, బి-4, సి-2, డి-3
    4) ఎ-3, బి-4, సి-2, డి-1

సమాధానాలు
1-4; 2-1; 3-4; 4-4; 5-1; 6-4; 7-4; 8-2; 9-2; 10-2; 11-3; 12-1; 13-1; 14-2; 15-3; 16-1.

అడోబ్ నుంచి IFS



నెలకి రెండు లక్షల రూపాయల పైనే వేతనం, బోలెడన్ని సౌకర్యాలు... కానీ ఎప్పుడూ కంప్యూటర్లతోనే కుస్తీ, టార్గెట్ల గోల! ప్రకృతి ప్రేమికుడైన **చాడ నిఖిల్‌రెడ్డికి**ది నచ్చలేదు. జనంతో మమేకం అయ్యే కొలువు చేయాలి అనుకున్నాడు. ఐదు ప్రయత్నాలయ్యాక తాజాగా.. యూపీఎస్సీ పరీక్షలో మెరిసి ఐఎఫ్ఎస్ సాధించాడు.

నిఖిల్ కుటుంబమంతా ప్రభుత్వ ఉద్యోగులే. సొంతూరు నల్గొండ జిల్లా మిర్యాలగూడ. తాత, తల్లిదండ్రులిద్దరూ అధ్యాపకులే కావడంతో పుస్తకాలు చదివే అలవాటు అబ్బింది. దాంతో సమకాలీన, సామాజిక అంశాల పట్ల అవగాహన, క్షేత్రస్థాయిలో సమాజంలో జరుగుతున్న పరిణామాలపై మంచి పట్టు ఉండేది. అయితే తనూ అందరిలాగే మొదట్లో ఐటీ కొలువుపై మోజు పెంచుకున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 91వ ర్యాంకుతో ప్రతిష్ఠాత్మక ఐఐటీ-ఢిల్లీలో ప్రవేశం దక్కించుకున్నాడు. తను అనుకున్నట్టుగానే ప్రాంగణ నియామకాల్లో అడోబ్ అనే బహుళజాతి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.25లక్షల ప్యాకేజీ. సౌకర్యాలకూ ఢోకా లేదు. కానీ ఎప్పుడూ ఒత్తిడితో కూడిన ఉద్యోగ వేళలు.. విదేశాల్లోని సంస్థల కోసం అహోరాత్రులూ పెద్దపెద్ద 'టాస్క్‌'లు.. అతడిని ఆలోచనలో పడేశాయి. కరోనా సమయంలో సాఫ్ట్‌వేర్ రంగం కుదేలవడం ఈ కొలువుకు గ్యారెంటీ లేదనే అభిప్రాయం ఏర్పరచింది. అన్నింటికన్నా ముఖ్యంగా.. ఐటీ కొలువు, జనంతో సంబంధం లేని ఉద్యోగం అని భావించాడు. దీంతో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం, జనాలకు దగ్గరగా ఉండే కొలువు సాధించాలని భావించాడు. 'సివిల్స్' అతడికి సరైన ఛాయిస్‌గా అనిపించింది.

ఆరో ప్రయత్నంలో..

2019లో పరీక్ష తీరు తెలుసుకోవడానికి రాశాడు. మరో నాలుగుసార్లు సీరియస్‌గానే ప్రయత్నించాడు. తను అనుకున్నట్టు ఐఏఎస్, ఐపీఎస్‌లాంటి వాటికి ఎంపిక కాలేదు. ఆరో ప్రయత్నంలో మాత్రం ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) దక్కింది. అదీ తెలుగు రాష్ట్రాల్లో మిన్నగా, జాతీయస్థాయిలో 11వ ర్యాంకుతో. మొదట్లో వరుస వైఫల్యాలు ఎదురైనా, కచ్చితంగా సర్వీసు సాధించగలననే నమ్మకం ఉండటంతో ఏమాత్రం అధైర్య పడకుండా ముందుకెళ్లాడు నిఖిల్. సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అంటే వైట్‌కాలర్ ఉద్యోగం.

ఐటీ ఉద్యోగిగా దుస్తులు ఇస్త్రీ నలగకుండా, ఏసీ గదుల్లో విధులు నిర్వర్తించే కొలువు. మరి ఫారెస్ట్ ఆఫీసర్ అంటే సరిగ్గా రోడ్డు సౌకర్యం లేని అడవుల్లో పర్యటించాలి. క్రూర మృగాలుండే చోట సంచరించాలి. పెద్దపెద్ద అటవీ ప్రమాదాలు జరిగినప్పుడు చిట్టడవులు, కీకారణ్యాల్లోనూ క్షేత్రస్థాయికి వెళ్లాలి. ప్రకృతి వనరులు, మూగజీవాలు, ఆదివాసీల సంప్రదాయాలతో మమేకం కావాలి. జీవితం పూర్తిగా మారిపోతుంది. అయినా వీటన్నింటికీ సిద్ధంగా ఉన్నానని సంతోషంగా చెబుతున్నాడు నిఖిల్. 'మా నాన్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు. ఆయన నా చిన్నప్పుడు జీవ, జంతుజాలాల గురించి చెబుతుంటే ఆసక్తిగా వినేవాడిని. అడవి తల్లి చేసే మేలు అంతా ఇంతా కాదని వివరిస్తుంటే అడవిపై ఒక రకమైన మమకారం ఏర్పడింది. చిన్నతనంలో నేర్చుకున్న ఆ పాఠాలే ఒకరకంగా నేను అటవీశాఖలో అత్యున్నత అధికారిగా ఎంపికయ్యేందుకు దారి చూపించాయేమో' అంటూ సంతోషంగా చెబుతున్నాడు నిఖిల్.

- మిరియాల గణేష్ కుమార్, నల్గొండ

చిరుద్యోగం నుంచి IFS



చాలామంది చిన్న ఉద్యోగం రాగానే 'ఇంక చాల్లే' అనుకుంటారు. కంఫర్ట్ జోన్‌కి చేరుకుంటారు. కానీ **అంబటి బాలాజీ** లక్ష్యం.. ముందునుంచీ ఉన్నతోద్యోగమే. ఒక్కో మెట్టే ఎక్కుతూ, నాలుగు కొలువులు సాధించి, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి అయ్యాడు. ఈ ప్రయత్నంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు. జాతీయస్థాయిలో 65వ ర్యాంకర్‌గా నిలిచాడు.

బాలాజీది అన్నమయ్య జిల్లా బోరెడ్డిగారిపల్లె. సన్నకారు రైతు కుటుంబం. ముందునుంచీ మెరిట్ విద్యార్థి కావడంతో బీటెక్ వరకూ ఫీజుల్లేకుండానే చదువు సాగింది. ఇంజినీరింగ్‌లోనే ప్రాంగణ నియామకాల్లో రెండు కొలువులకు ఎంపికయ్యాడు. ఆ సమయంలో 'ప్రైవేట్ ఉద్యోగం చేస్తే నువ్వు మాత్రమే బాగుపడతావు. ప్రభుత్వ ఉద్యోగం అయితే మనలాంటి పేదవాళ్లకు ఉపయోగపడొచ్చు' అని బావ హితవు చెప్పారు. అప్పటినుంచి తన లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగంగా మారింది. ఆ సమయంలోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల ప్రకటన వెలువడింది. ఎలాంటి శిక్షణ లేకుండా పరీక్ష రాసినా అడ్మిన్ ఉద్యోగం సాధించాడు. మరోవైపు దేవాదాయశాఖలో మరో ఉద్యోగమూ దక్కించుకున్నాడు. దాంతో తనపై తనకు నమ్మకం కలిగింది. ఆ చిన్న ఉద్యోగంతో సరిపెట్టుకోకూడదని దిల్లీ వెళ్లి రెండేళ్లు ఒక అకాడెమీలో శిక్షణ తీసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు రాయడం ప్రారంభించాడు. 2023లో సివిల్స్ తరహాలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చాటి ఈపీఎఫ్ విభాగంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఎంపికయ్యాడు. మైసూర్‌లో పోస్టింగ్. హోదా, జీతం బాగానే ఉన్నా అంతటితో ఆగిపోవద్దు అనుకున్నాడు బాలాజీ. సివిల్స్ ప్రిపరేషన్ మొదలు పెట్టాడు. ఆ అనుభవంతో ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే గతేడాది యూపీఎస్సీ పరీక్ష రాశాడు. జాతీయ స్థాయిలో 65వ ర్యాంకుతో ఐఎఫ్ఎస్‌కి ఎంపికయ్యాడు.

కష్టాలు దాటి

మంచి ప్రతిభ, లక్ష్యం కోసం కఠినంగా చదవడమే కాదు.. ఈ ఉద్యోగానికి ఎంపిక కావడానికి చిన్నప్పట్నుంచీ ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని వచ్చాడు. అయినా ఏనాడూ పుస్తకాన్ని వదల్లేదు. చిన్నదే అయినా మొదటి ప్రభుత్వ ఉద్యోగం వదులుకుంటానంటే ఇంట్లోవాళ్లు ఒప్పుకోలేదు. 'సాగులో కలిసిరాక అప్పులపాలయ్యాం. అవి తీర్చేదాకా అయినా కొనసాగ'మన్నారు. ఆ సమయంలో అన్నా, బావ, అత్తామామలు అన్నిరకాలుగా అండగా నిలిచారు. దిల్లీకి వెళ్లి రెండేళ్లు శిక్షణ తీసుకున్నప్పుడు అయితే ఆర్థిక ఇబ్బందులు వేధించేవి. పైగా తనకి అప్పటికే పెళ్లైంది. కుటుంబాన్ని వదిలి అంత దూరంలో ఉండటం మరో రకమైన కష్టం. 'ఆ గడ్డు సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సహకరించారు. నేను తప్పకుండా సాధిస్తానని వాళ్లకి నాపై ఎక్కువ నమ్మకం. వాళ్ల ఆశీస్సులకు నా శ్రమ తోడై, ఉన్నతోద్యోగానికి ఎంపికయ్యా. ఇంతటితో నేను ఆగిపోదలచుకోలేదు. ఐఏఎస్ సాధించడమే అంతిమలక్ష్యంగా ముందుకెళ్తా' అంటున్నాడు బాలాజీ.

- బోగెం శ్రీనివాసులు, కడప

సామెతల సారంగపాణి పెళ్లి గోల



కల్యాణమొచ్చినా.. కక్కొచ్చినా ఆగదంటారు. కానీ దరిద్రుడి పెళ్లికి వడగళ్ల వాన కురిసినట్లు.. పీటల దాకా వచ్చిన నా పెళ్లి ముచ్చటగా మూడుసార్లు పెటాకులైంది. ఈ విషయం తెలిసి చుట్టుపక్కలవారు మాతో సంబంధం కలుపుకోవడానికి కాదు కదా.. చుట్టంచూపుగా అయినా మా ఇంటికి రావడానికే భయపడుతున్నారు. దాంతో ఎండాకాలంలో వర్షంలా నాకు పెళ్లి సంబంధాలు రావడమే గగనం అయిపోయింది. వెతికి వెతికి విసిగిపోయిన మా అమ్మ.. 'నీకు అమ్మాయిని తేవడం మావాళ్ల కాదుగానీ గంతకు తగ్గ ఓ బొంతని నువ్వే వెతుక్కో' అని తెగేసి చెప్పింది. ఆ ఫ్రస్ట్రేషన్లో నేనుంటే 'జోడు లేని జీవితం.. తాడు లేని బొంగరం లాంటింది', 'బెండకాయ ముదిరినా.. బ్రహ్మచారి ముదిరినా పనికి రావు' అంటూ ఫ్రెండ్స్ ఆట పట్టించసాగారు. ఆఖరికి వెతకబోయిన తీగ కాలికే తగిలినట్టు.. ఓ పురోహితుడు అడగకముందే నాకో సంబంధం తీసుకొచ్చారు. 'వేయి అబద్ధాలు ఆడైనా సరే నీ పెళ్లి నేను జరిపిస్తాను' అని అభయమిచ్చారు. ఆయన మాటలు నమ్మి, విరుచుకుని విరుచుకుని వియ్యాలవారి ఇంటికి వెళ్తే.. పలుగు రాళ్లతో నలుగు పెట్టినట్లు తయారైంది నా పరిస్థితి. అమ్మాయి ఆవలిస్తే పేగులు లెక్క పెట్టే రకం. ఆమె తండ్రి చెట్టు పేరు చెప్పుకొని, కాయలు అమ్ముకునే రకం. 'నీకు చదువు, ఉద్యోగం, ఆస్తి అన్నీ ఉన్నాయిగానీ నేను ఊహించినంత ఎత్తుగా లేవు' అని వంకలు పెట్టింది ఆ సొగసరి. అప్పటికే ఆ అమ్మాయి అమ్మకు నేను బాగా నచ్చేశానేమో.. 'చూడమ్మా నాలుగు రాళ్లు ఉన్నాయని బియ్యం పారబోసుకుంటామా.., చేతికి గోళ్లు పెరిగాయని వేళ్లు నరుక్కుంటామా..' అని సర్దిచెప్పడానికి ప్రయత్నించింది. 'అష్ట వంకర్లూ ఉన్నవాడే అష్ట భార్యలు కావాలి అడుగుతున్న రోజులివి. అతడికి ఒక వంకే ఉంది.. ఒక భార్యే అడుగుతున్నాడు' అని నచ్చజెప్పింది. అయినా పట్టించుకుంటేగా.. కర్ర లేని వాడిని గొర్రె కూడా కరుస్తుంది అన్నట్టు.. నా పరిస్థితి గమనించి కాబోయే మావయ్య కొత్త పన్నాగం పన్ని, ఎదురుకట్నం డిమాండ్ చేశాడు. ఇదేంటని ప్రశ్నిస్తే 'ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయి, కాలం మారింది.. కన్యాశుల్కం మీరే ఇవ్వాలి' అని పేచీ పెట్టాడు. చిర్రెత్తుకొచ్చిన అమ్మానాన్నలు వియ్యానికైనా.. కయ్యానికైనా సమవుజ్జీ ఉండాలి అని నానా రచ్చ చేసి ఈ సంబంధమూ ఎగ్గొట్టేశారు. దీంతో నా పెళ్లి కథ మళ్లీ మొదటికొచ్చింది.

– ఎస్.శివవరప్రసాద్, యాదాద్రిభువనగిరి

క్రేజీ టూర్.. వచ్చేస్తోంది!




బైక్ ప్రియులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పండగ రానే వచ్చేసింది. 'రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ ఒడిస్సీ 2025' సాహసయాత్ర జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది. దీన్ని ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటార్‌సైకిల్ యాత్రగా పేర్కొంటారు. లద్దాఖ్, స్పితీ, జాన్‌స్కార్, ఉమ్లింగ్‌లా పర్వత సానువుల గుండా దాదాపు 2,600 కిలోమీటర్లు, 18 రోజులపాటు సాగుతుందీ ఈ యాత్ర. అత్యంత అనుభవజ్ఞులైన 70మంది బైక్ రైడర్లు మాత్రమే ఈ టూర్‌కి అర్హత సాధిస్తారు. బైకర్లను టీమ్ స్పితీ, టీమ్ జాన్‌స్కార్ అనే రెండు బృందాలుగా విడదీసి వీళ్ల సాహసాన్ని, నైపుణ్యాన్ని పరీక్షించేలా టూర్‌ని ప్లాన్ చేస్తుంటారు. కావాల్సిన సకల సదుపాయాలు రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ కల్పిస్తుంది. ఏటా నిర్వహించే ఈ టూర్‌కి భారత దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా చాలా క్రేజ్ ఉంది.

జీవితాన్ని మార్చేసిన ఆమె లేఖ!

మనసులో మాట

'తనని ఇప్పటికి వేలమంది చూసి ఉంటారు. వందలమంది మాట్లాడాలని ప్రయత్నించి ఉంటారు. పదిమందైనా ప్రపోజ్ చేసి ఉంటారు. నువ్వూ ట్రై చేయడం ఆపెయ్‌రా.. ఆ అమ్మాయి ఎవరికీ పడదు'.. క్యాంటీన్‌కి వెళ్తుంటే ఆపి మరీ క్లాస్ పీకాడు నా క్లాస్‌మేట్.. 'తొలిప్రేమ' సినిమాలో వేణుమాధవ్‌లా.



వాడు చెప్పింది నిజమే. నేను అనన్యని చాలారోజులుగా ఫాలో అవుతున్నా. కనీసం వెనక్కి తిరిగి చూడదు. ఏంటని అడగదు. అయినా నా ప్రయత్నం నాదే.

కాలేజీ యాన్యువల్ డే. నేను సంబరాల్లో మునిగి తేలుతుండగా అనన్య నా దగ్గరికొచ్చింది. 'హలో మిస్టర్.. ఎన్నేళ్లని నన్ను ఫాలో అవుతావు? అనవసరంగా సమయం వృథా చేసుకోకు. ఇకనైనా చదువు, కెరియర్ మీద ధ్యాస పెట్టు' అంటూ చక్కా వెళ్లిపోయింది. అది కలా? నిజమా? కొద్దిక్షణాలు అర్థం కాలేదు. తేరుకున్నాక తనేం చెప్పిందో పట్టించుకోలేదు.. నాతో తొలిసారి మాట కలిపింది.. అంతే! సంతోషంతో గాల్లోకి పంచ్ విసిరా. మర్నాటి నుంచి తనెక్కడుంటే నేనక్కడే. నన్ను చూడగానే నొసలు చిట్లించేది. చిరాకు పడేది. నేను తగ్గితేగా! ఓసారి ఒంటరిగా కనిపించింది. 'అనన్యా.. నీ వెనకాల కాదు.. నీ పక్కన జీవితాంతం నడవాలనుంది. ఆ అవకాశం ఇస్తావా?' అని ధైర్యంగా అడిగేశా. కామ్‌గా వెళ్లిపోయింది. మర్నాడు ఓ లెటర్ తెచ్చి నా చేతిలో పెట్టింది. నా ప్రపోజల్ ఒప్పుకొందేమో అనుకుంటూ గబగబా విప్పా. 'నువ్వసలు చదువు గురించి పట్టించుకుంటున్నావా? నీ లక్ష్యమేంటి? దాన్నెలా చేరుకుంటావు? సెటిలయ్యాక మా పేరెంట్స్‌తో మాట్లాడి ఒప్పించే ధైర్యం ఉందా?'.. ఓ క్వశ్చన్ పేపర్‌లా ఉందా లెటర్. ఆ క్షణం నా మైండ్ బ్లాంక్ అయింది. 'మరీ ఇంత ప్రాక్టికల్‌గా ఉందేంట్రా ఈ అమ్మాయి' అనిపించింది. ఆఖర్న నా వెనకాల పడటం ఆపేయకపోతే అస్సలు బాగుండదు అని ఓ వార్నింగ్ కూడా ఇచ్చి వెళ్లింది. ఇక తనతో లవ్ వర్కవుట్ కాదనిపించింది. తన వెనకాల పడటం ఆపేశా. మొదట్లో ఇబ్బందిగా అనిపించేది. కొన్నాళ్లకి సర్దుకున్నా. చదువు మీద దృష్టి పెట్టి, ఎలాగో డిగ్రీ గట్టెక్కా. ఇంటర్న్‌గా ఓ కంపెనీలో చేరా. అక్కడ బండెడు చాకిరీ, అరకొర జీతం. ఏడాది చేశా. వేరే ఉద్యోగంలో చేరినా పెద్దగా సంపాదించేదేమీ ఉండదనిపించింది. అందుకే సొంత వ్యాపారం మొదలు పెట్టాలనుకున్నా. పేరెంట్స్ సహకరించారు. నాది యూనిక్ బిజినెస్ కావడంతో తొందరగానే క్లిక్ అయింది. ఇంకా విస్తరించడానికి బ్యాంకు రుణం తీసుకున్నా. ఓసారి కొన్ని సర్టిఫికెట్ల కోసం వెతుకుతుంటే అనన్య లెటర్ కనిపించింది. మళ్లీ మళ్లీ చదివా. నన్ను నిలదీయడానికి కాకుండా.. నాకో దారి చూపించడానికే తనలా రాసిందనిపించింది. అప్పుడు తను నా ప్రేమను అంగీకరిస్తే ఆమె వెనకాల పడి చదువును నిర్లక్ష్యం చేసేవాడినేమో! జీవితంలో ఇన్ని అవకాశాలు వచ్చేవి కావేమో అనిపించింది. ఎలాగైనా తనకి థాంక్స్ చెప్పాలనుకున్నా.

దాదాపు రెండేళ్ల తర్వాత తనని కలవబోతున్నా. మనసులో ఏదో తెలియని ఉద్వేగం. పదినిమిషాలయ్యాక వచ్చింది. ముందు థాంక్స్ చెప్పి, లెటర్ చేతిలో పెట్టా.

'అప్పుడు నువ్వడిగిన చాలా వాటికి ఏం చెప్పాలో తెలియదు. ఇప్పుడు అన్నింటికీ నా దగ్గర సమాధానం ఉంది. పెళ్లెప్పుడు చేసుకుందాం' అన్నా సూటిగా. తను తలొంచుకొని మౌనంగానే ఉంది. కాసేపయ్యాక 'నువ్వు పెళ్లి చేసుకుంటానంటున్నావ్ సరే.. మరి మా ఆయన ఒప్పుకోవాలిగా' అంది. ఆ మాట వినగానే మెదడులో విస్ఫోటం. దుఃఖం గొంతులోకి వచ్చేసింది. ఇంకేం మాట్లాడకుండా వెనక్కి తిరిగి వచ్చేశా. బైక్‌పై ఇంటికి వచ్చేసరికి తన ఫోన్ నుంచి ఆరు మిస్‌కాల్స్. కాల్‌బ్యాక్ చేయగానే 'ఏంటి నువ్వసలు.. కనీసం నేను చెప్పింది నిజమా, అబద్ధమా అని కూడా అడగవా? పిచ్చిమొద్దూ.. నిన్ను ఆట పట్టించడానికే అబద్ధం చెప్పా. సరేగానీ.. వీలైతే రేపే మీ అమ్మానాన్నల్ని తీసుకొని మా ఇంటికొచ్చేయ్. మన పెళ్లి గురించి మాట్లాడదాం' అంటూ పెట్టేసింది. ఆ మాటతో నా బాధంతా ఎగిరిపోయింది. అంత మహా స్ట్రిక్టు అమ్మాయిలో ఈ గడసరి కోణం కూడా ఉందని అప్పుడర్థమైంది. జేబులోని లెటర్ తీసి గట్టిగా ఓ ముద్దు పెట్టేశా. – రాజ్

ఫస్ట్ డేట్.. ఆచితూచి



ఫస్ట్ డేట్ అంటే జనరేషన్ జడ్ ఎవరికైనా ఒళ్లు జల్లుమంటుంది. మనసు తుళ్లిపడుతుంది. ఉడుకు రక్తానికి ఉద్వేగం డోసు ఎక్కువ కదా! అంతమాత్రాన వాళ్లేం గుడ్డిగా డేట్‌కి ఓకే చెప్పడం లేదు. ఆచితూచి అడుగులేస్తున్నారు. మొదటి మీట్ ఉత్సుకతకన్నా భద్రతకే తొలి ప్రాధాన్యం అంటున్నారు. రెండు తనువుల కెమిస్ట్రీ కన్నా.. మనసుల్లో క్లారిటీ ఉండాలంటున్నారు. ఒక ప్రముఖ డేటింగ్ యాప్ అధ్యయనంలో ఇంకా వాళ్లేం చెప్పారంటే..

భద్రతే ముఖ్యం: తొలి పరిచయం, తొలి పరిణయం ఎప్పటికీ ప్రత్యేకమే. కానీ దానికి ముందు జనరేషన్ జడ్ కొంచెం నెర్వస్‌గా ఫీల్ అవుతోంది. డేట్‌కి వెళ్లిన వ్యక్తితో.. వ్యక్తిగత సమాచారం ఎంతవరకు పంచుకోవాలో తెలియక సగం మంది సతమతం అవుతున్నారు. సేఫ్టీ కోసం అమ్మాయి, అబ్బాయి ఒకర్నొకరు నేరుగా కలవడానికి ముందే 36శాతం మంది ఫొటోలు పంపుకోవడం, వీడియో కాల్ మాట్లాడుకోవడం చేస్తున్నారు. వెళ్లినచోట ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ జాగ్రత్త అన్నమాట.

స్పష్టత: పార్క్, రెస్టరంట్, మాల్.. ఇలా ఫస్ట్ డేట్ ఎక్కడ అనే విషయంలో వాళ్లు ఎంత క్లారిటీగా ఉన్నారో.. ఆ డేట్ ఎక్కడిదాకా తీసుకెళ్లాలో అనే విషయంలో కూడా స్పష్టతతోనే ఉంటున్నారు. పరిచయం, పార్టీలో కలుసుకోవడం.. నచ్చిన తర్వాతే ముద్దూముచ్చట, రిలేషన్‌షిప్‌నకు వెళ్తామని 60శాతం మంది స్పష్టంగా చెప్పారు.

హద్దుల్లేవు: గతంలో ఫస్ట్ డేట్ అంటే దగ్గర ప్రాంతాల్లో ఉన్నవాళ్లతోనే కొనసాగేది. ఇప్పుడు హద్దులు చెరిపేస్తోంది జనరేషన్ జడ్. తొలి పరిచయం కోసం అవసరం అయితే వేరే రాష్ట్రాలు, నగరాలకు వెళ్లడానికి సిద్ధమని 73శాతం మంది చెబుతున్నారు. వాళ్లు నచ్చితే లాంగ్ డిస్టెన్స్ రిలేషన్‌షిప్‌నకూ సిద్ధమంటున్నారు.

సామాజికంగా: ఫస్ట్ డేట్ అంటే ఇంతకుముందు రహస్యంగా జరిగేది. ఇప్పుడలా కాదు.. దీన్ని కూడా బృంద కార్యక్రమంగా మార్చేస్తోంది యూత్. అధ్యయనం ప్రకారం తమ స్నేహితులు సూచించిన వాళ్లతో డేటింగ్‌కి వెళ్లడానికి కూడా సిద్ధమవుతున్నారు. వాళ్లు వెళ్లే చోటికి ఫ్రెండ్స్‌ని కూడా తీసుకెళ్తున్నవాళ్లు 29శాతం ఉన్నారు.

'ఇదేమైనా పార్క్ అనుకున్నావా?'


కాలేజీ కహానీ



నా ఫ్రెండ్ అశ్విన్‌కి చదువు తక్కువ, తుంటరి చేష్టలు ఎక్కువ. ఒకరోజు లెక్చరర్ రాకపోవడంతో క్లాసంతా గందరగోళంగా ఉంది. తరగతిలో అందరికన్నా అందంగా ఉండే విఖ్యాతి, పక్కనున్న స్నేహితురాలితో మాట్లాడుతోంది. ఆ మాటల్లో తనకి రోజాపూలు అంటే ఇష్టమని మావాడికి అర్థమైంది. ఇక ఊరుకోడుగా. అప్పటికప్పుడే తనని ఇంప్రెస్ చేయాలనుకున్నాడు. అడ్మిన్ ఆఫీసు ముందున్న కుండీలోంచి ఒక గులాబీ తీసుకొచ్చాడు. ఆ అమ్మాయిని ఎలాగో మాటల్లో పెట్టి 'నీ బ్యూటీకి ఈ రోజా పువ్వు భలే మ్యాచ్ అవుతుంది' అంటూ తన చేతికందించాడు. ఆ అమ్మాయి దాన్ని కొంచెం ఆశ్చర్యంగా, కొంచెం సంబరంగా చూసింది. ఆ పువ్వును తీసుకుంటుండగా సరిగ్గా అదే సమయానికి మా లెక్చరర్ లోపలికి వచ్చారు. 'ఏంట్రా ఇది.. క్లాసులోనే రోజ్‌లు ఇచ్చుకోవడం.. కవితలు చెప్పేయడం.. ఇదేమైనా క్లాస్ అనుకుంటున్నారా? పార్క్ అనుకుంటున్నారా?' అంటూ మావాడిని చెడామడా తిట్టారు. దాంతో ఒకటే నవ్వులు. 'నేను ఆ అమ్మాయిని ఇంప్రెస్ చేసే మ్యాజిక్ షో చేయాలనుకుంటే, సర్ హారర్ షో చూపించారు కదరా' అంటూ నాతో చెప్పి, మావాడు ఏడ్చినంత పని చేశాడు.

– అనంత్, రాజమహేంద్రవరం

కొంటె కొటేషన్



- ఈ చిత్రం.. నారీశక్తికి చేయెత్తు నిదర్శనం!

– సన్యాసిరావు

- అతివ హస్తాల్లో ఆజానుబాహువుడు... ఆదమరిస్తే ఆగమైపోతాడు!

– కొంగర రమేశ్, వరంగల్

- ఇది అతివ శక్తి... కాదండీ అతిశయోక్తి!

– పాంచజన్య, కాకినాడ

- భామ చేతిపై సాహసం... ఒంటికాలుపై భలే ఆసనం!

– తెంబ వెంకటేశ్వరరావు, సువర్ణపురం

- ఆకాశమే హద్దురా... ఆమెకు నువ్వు బచ్చా రా!

– శివకుమార్ నారాయణ, మాండ్యా

- తీరంలో మొదలైన పైత్యం... చేతిపై చేయించేను నృత్యం!

– ఆరె రాకేశ్, మారంపల్లి

- బడాయి వద్దు బాస్... మగువ చేయి తీస్తే నువ్వు తుస్!

– అభిరామ్, దూసి



ఈ ఫొటోకి మీ సరదా వ్యాఖ్యలు రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

లగేరహో.. సర్క్యూట్!

కాలేజీ కుర్రాళ్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలెబ్రిటీలు.. ఇప్పుడు ఎవరి నోట విన్నా 'సర్క్యూట్ ట్రైనింగ్'. ఎక్కడ చూసినా ఆ వ్యాయామం వీడియోలే. అందరినీ తన వెనకాల పరుగెత్తిస్తోన్న సర్క్యూట్ ట్రైనింగ్ కసరత్తులతో చాలా ఉపయోగాలే ఉన్నాయి అంటున్నారు ఫిట్‌నెస్ గురూలు.

- ఇది ఆల్ ఇన్ వన్ వ్యాయామం. నెల నుంచి మూడునెలలపాటు క్రమం తప్పకుండా చేయాలి. రోజూ ఆరు నుంచి పదిరకాల వర్కవుట్లను వరుసగా ఒకేసారి చేయడమే సర్క్యూట్ ఎక్సర్‌సైజ్. ఫుల్‌బాడీ వర్కవుట్‌లాగా పని చేస్తుంది. స్క్వాట్స్, పుల్అప్స్, పుషప్స్, ప్లాంక్ హోల్డ్, ల్యాంజెస్.. లాంటివి మార్చి మార్చి చేస్తుండాలి. పది నుంచి పదిహేను రెప్స్ చొప్పున ముప్పావుగంట వ్యాయామం చేయాలి.
- వరుసగా ఒకటి తర్వాత మరోటిగా వ్యాయామాలు చేస్తూనే ఉండాలి. ఒక వ్యాయామం నుంచి మరో వ్యాయామం మధ్యలో విరామం స్వల్పంగా ఉంటుంది. సర్క్యూట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో కసరత్తుల మధ్య విరామం 30 నుంచి 60 సెకన్లు ఉంటుంది. రెండు మూడు వారాల్లో విరామాన్ని 60/90 సెకన్లకు పెంచుకోవచ్చు. స్ట్రెంగ్త్, కార్డియో వర్కవుట్లు కలిపి చేయాలి.
- ఇందులో హై ఇంటెన్సిటీ, కార్డియో వ్యాయామాలే ఉంటాయి. కేలరీలు అత్యధికంగా కరుగుతాయి. బరువు తగ్గడానికి, కొవ్వు కరగడానికి బీఎంఐని అదుపులో ఉంచడానికి ఈ కసరత్తులు ప్రభావవంతంగా పని చేస్తాయి. ఒక్కో సెషన్‌లో శరీరంలోని అన్ని కండర సమూహాలకు వ్యాయామం అందుతుంది. మెటబాలిజమ్‌ని పెంచి యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. గుండె ఆరోగ్యాన్ని పెంచుతాయి.
- ఈ రకం వ్యాయామాలకు భారీ సరంజామా అక్కర్లేదు. జిమ్‌లోనే కాదు.. ఇంట్లో, ఇంటి ఆవరణలో కూడా తేలికగా చేసుకునేలా చిన్నచిన్న పరికరాలు బిగించుకుంటే చాలు. రెసిస్టెన్స్ బ్యాండ్స్, డంబెల్స్, జంప్ రోప్, స్టెబిలిటీ బాల్, పులప్ బార్స్. ఇలాంటి తేలికైనవి, అతి తక్కువ ఖరీదైనవి సరిపోతాయి. అయితే ఈ సర్క్యూట్ ట్రైనింగ్ కొత్తవాళ్లకి వద్దనే చెబుతారు నిపుణులు.



సమాచార కమిషనర్ల ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సమాచార కమిషనర్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం స్క్రీనింగ్ కమిటీని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో, న్యాయశాఖ కార్యదర్శి సభ్యుడిగా ఉంటారు. సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి (రాజకీయ) మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఖాళీగా ఉన్న 3 సమాచార కమిషనర్ల పోస్టుల్ని ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనుంది. వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి, అన్ని అర్హతలు ఉన్నవారిని స్క్రీనింగ్ కమిటీ సిఫారసు చేస్తుంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ కమిషనర్లను ఎంపిక చేస్తుంది.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోంది: మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వైకాపా నేత ఎల్లయ్య కుమారుడు హరికృష్ణపై దాచేపల్లి పోలీసులు చేసిన దుర్మార్గం రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని సూచిస్తోంది అని వైకాపా అధినేత జగన్ శుక్రవారం 'ఎక్స్'లో ఆరోపించారు. 'ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే హింసకు పాల్పడటం ఎంత వరకు సమంజసం? చట్టాన్ని చేతిలోకి తీసుకునే అధికారం వీరికెవరిచ్చారు? థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? దాన్ని సమర్థించుకునేందుకు ఒక కట్టు కథ అల్లుతారా?' అని ప్రశ్నించారు.


రూ.643 కోట్ల నకిలీ ఇన్‌వాయిస్‌ల సృష్టికర్త అరెస్టు

విశాఖపట్నం (ఎం.వి.పి.కాలనీ), న్యూస్‌టుడే: నకిలీ ఇన్‌వాయిస్‌లను సృష్టించిన నిందితుడ్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు అరెస్టు చేశారు. రూ.643.81 కోట్ల మేర నకిలీ ఇన్‌వాయిస్‌లు తయారు చేసినట్లు ఆరోపణలు రావడంతో డీజీజీఐ విశాఖ జోనల్ కార్యాలయం అధికారులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సోదాలు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు తమిళనాడు రాష్ట్రం వెల్లూరుకు చెందిన అబూబాకర్ సిద్దిక్ సయ్యద్‌ను బెంగళూరులో అరెస్టు చేశారు. సయ్యద్ చేసిన మోసాలతో ప్రభుత్వ ఖజానాకు రూ.115.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. దీనిపై మరింత లోతైన విచారణ జరుపుతున్నట్లు వివరించారు.

మహిళా వ్యాపారవేత్తల్ని తయారుచేయడానికి మెప్మా ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 30 వేల మంది మహిళా వ్యాపారవేత్తల్ని తయారుచేయడమే లక్ష్యంగా మెప్మా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. తాడేపల్లిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో 60 ఎన్‌జీవోలు, కార్పొరేట్ సంస్థలతో మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్ శుక్రవారం సమావేశమయ్యారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

పోర్టుల అనుసంధానంతో యువతకు ఉద్యోగ అవకాశాలు


పదవీ బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ జెడ్.శివప్రసాద్

తాడేపల్లి, న్యూస్‌టుడే: పోర్టుల అనుసంధానంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏపీ దేశీయ జలమార్గాల ప్రాధికార సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జెడ్.శివప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో సీఈవో జీవీ రాఘవరావు సమక్షంలో శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో 960 కి.మీల పొడవైన సముద్ర తీరప్రాంతం జల రవాణాకు అనుకూలంగా ఉందన్నారు. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో జలరవాణా కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. సాగరమాల ప్రాజెక్టుకు అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు.

63 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు అనుమతుల పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 63 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అనుమతులను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 63 కళాశాలలకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను అనుమతులు పొడిగించింది. వీటికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఫ్యూర్ సంస్థకు ప్రత్యేక ప్రోత్సాహకాలకు అనుమతి

ఈనాడు, అమరావతి: ఫ్యూర్ ఎనర్జీ లిమిటెడ్‌కు టైలర్ మేడ్ ఇన్సెంటివ్‌లు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ యూనిట్‌ను రూ.1,286 కోట్లతో ఏర్పాటు చేసేందుకు సంస్థ ప్రతిపాదనను ఎస్ఐపీబీ ఆమోదించింది. ఆ సంస్థకు ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 105.12 ఎకరాలను కేటాయించింది. రెండు దశల్లో ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. ఆ సంస్థ స్థిర మూలధన పెట్టుబడి కింద 2028 డిసెంబరు నాటికి పెట్టే రూ.1,019 కోట్ల పెట్టుబడుల్లో 34.6 శాతం టైలర్ మేడ్ ఇన్సెంటివ్‌ల కింద చెల్లించాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని 10 ఏళ్లలో చెల్లించేందుకు అనుమతించింది. ఆ సంస్థ కల్పించే ఉపాధికి ప్రోత్సాహకాల కింద గరిష్ఠంగా రూ.39.84 కోట్లు, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ కింద రూ.25 కోట్లు (ఎఫ్‌సీఐ మొత్తంపై గరిష్ఠంగా 5 శాతం), జీఎస్టీ మినహాయింపుల కింద రూ.82.63 కోట్లతో పాటు వినియోగించిన విద్యుత్తుకు యూనిట్‌కు రూపాయి చొప్పున ఏడేళ్ల పాటు గరిష్ఠంగా రూ.2.80 కోట్లు రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించింది.

బ్లూ జెట్ హెల్త్‌కేర్‌కు ..

బ్లూ జెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 3 దశల్లో రూ.2,600 కోట్ల పెట్టుబడులతో ఇంటర్మీడియట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. పరిశ్రమ ఏర్పాటు ద్వారా సుమారు 1,250 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొంది. సంస్థకు 102.48 ఎకరాలను కేటాయించేందుకు నిర్ణయించింది. మూలధన రాయితీ కింద 30 శాతం (గరిష్ఠంగా రూ.316.5 కోట్లు), డీ కార్బనైజేషన్ సబ్సిడీ రూ.87 కోట్లు, ఐదేళ్లలో లోకల్ ప్రొక్యూర్‌మెంట్ రాయితీ కింద గరిష్ఠంగా రూ.32.83 కోట్లతో పాటు మరికొన్ని మినహాయింపులు ఇచ్చేందుకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

క్రీడా నగదు ప్రోత్సాహకాల్లోనూ వర్గీకరణ

- డీఎస్సీ క్రీడా కోటా అమల్లో విమర్శలొచ్చినా మారని శాప్ తీరు
- ప్రోత్సాహకాలపై మార్గదర్శకాల విడుదల

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే- విజయవాడ క్రీడలు: డీఎస్సీ నియామకాల్లో క్రీడా కోటా అమల్లో క్రీడలను రెండుగా విభజించడంపై విమర్శలు వ్యక్తమైనా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) తీరు మార్చుకోలేదు. వివిధ స్థాయిల్లో నిర్వహించే క్రీడల్లో పతకాలు సాధించిన వారికి కొత్త క్రీడా పాలసీలో భాగంగా ఇచ్చే నగదు ప్రోత్సాహకాల్లోనూ అదే విధానం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర క్రీడల శాఖ శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేసింది. కేటగిరీ-ఎలో 36, కేటగిరీ-బిలో 29 క్రీడాంశాలను యథాతథంగా చేర్చింది. క్రికెట్‌ను బి- కేటగిరీలో పెట్టి, పెద్దగా ప్రాచుర్యం లేని బేస్‌బాల్‌ను ఎ- కేటగిరీలో చేర్చారు. కరాటేను బీ కేటగిరీలో పెట్టిన అధికారులు జూడోను ఎ-కేటగిరీలో చేర్చారు. ఈ రెండింటికీ సారూప్యత ఉన్నా వేర్వేరుగా పెట్టారు. ఎ-కేటగిరీలో క్రీడాంశాలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలు 100% ఇవ్వనున్నారు. బి-కేటగిరీలో వాటికి 50 శాతానికి కుదించారు.

వ్యక్తిగత విభాగంలో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఇలా..

జాతీయ క్రీడలు: ●పసిడి పతక విజేతకు రూ.10 లక్షలు ●రజతం రూ.5 లక్షలు ●కాంస్యం రూ.3 లక్షలు

ఖేలో ఇండియా యూత్, స్కూల్, యూనివర్సిటీ గేమ్స్: ●పసిడి పతక విజేతకు రూ.2.50 లక్షలు ●రజతానికి రూ.2 లక్షలు ●కాంస్యానికి రూ.లక్ష

జాతీయ ఛాంపియన్‌షిప్: ●పసిడి పతక విజేతకు రూ.1.50 లక్షలు ●రజతానికి రూ.1.25 లక్షలు ●కాంస్యానికి రూ.లక్ష

ఒలింపిక్స్: ●పసిడి పతక విజేతకు రూ.7 కోట్లు ●రజత పతకానికి రూ.5 కోట్లు ●కాంస్య పతకానికి రూ.3 కోట్లు ●ఒలింపిక్స్‌లో పాల్గొన్న వారికి రూ.15 లక్షలు

ఏషియన్ గేమ్స్: ●పసిడి పతక విజేతకు రూ.4 కోట్లు ●రజతానికి రూ.2 కోట్లు ●కాంస్యానికి రూ.కోటి ●పాల్గొన్నవారికి రూ.10 లక్షలు

నాలుగేళ్లకోసారి జరిగే కామన్‌వెల్త్ క్రీడలు: ●పసిడి పతక విజేతకు రూ.50 లక్షలు ●రజత పతకానికి రూ.35 లక్షలు ●కాంస్య పతకానికి రూ.25 లక్షలు ●పాల్గొన్న వారికి రూ.5 లక్షలు

నాలుగేళ్లకోసారి జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్, వరల్డ్ కప్ : ●పసిడి పతక విజేతకు రూ.50 లక్షలు ●రజత పతకానికి రూ.35 లక్షలు ●కాంస్య పతకానికి రూ.25 లక్షలు ●పాల్గొన్నవారికి రూ.5 లక్షలు

రెండేళ్లకోసారి జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్, వరల్డ్ కప్ : ●పసిడి పతకానికి రూ.25 లక్షలు ●రజత పతకానికి రూ.18 లక్షలు ●కాంస్య పతకానికి రూ.13 లక్షలు

ఏడాదికోసారి జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్, వరల్డ్ కప్, ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ : ●పసిడి పతక విజేతకు రూ.10 లక్షలు ●రజత పతకానికి రూ.7 లక్షలు ●కాంస్య పతకానికి రూ.4 లక్షలు

వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్, ఛాంపియన్‌షిప్స్: ●పసిడి పతక విజేతకు రూ.5 లక్షలు ●రజతానికి రూ.4 లక్షలు ●కాంస్యానికి రూ.3 లక్షలు

కోచ్‌లు, క్రీడా సంఘాలకూ ప్రోత్సాహకాలు

ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్, నాలుగేళ్లకోసారి జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్, వరల్డ్‌కప్‌లలో పతకాలు సాధించిన విజేతలకు ఇచ్చే నగదు పారితోషికంతో సంబంధం లేకుండా ఆ మొత్తంలో 15 శాతాన్ని కోచ్‌లకు, 10 శాతాన్ని ఆయా రాష్ట్ర క్రీడా సంఘాలకు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు.

అటవీ భూభాగాలపై అన్వేషణ

- వాటి గుర్తింపునకు నిపుణుల కమిటీ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- ఎవరి యాజమాన్యంలో ఉన్నా జాబితాలో చేర్చాలని నిర్దేశం
- రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

ఈనాడు-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అటవీ ప్రాంతంగా పరిగణించదగ్గ భూభాగాలన్నింటినీ గుర్తించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అలాంటి భూభాగం ఎవరి యాజమాన్యంలో ఉన్నా సరే ఈ జాబితాలో చేర్చాలని కమిటీకి నిర్దేశించింది. చట్టప్రకారం అటవీ ప్రాంతంగా ప్రకటించకపోయినా, వర్గీకరించకపోయినా సరే అది అటవీ ప్రాంతంగా పరిగణించదగ్గ భూమా.. కాదా.. అనేది మాత్రమే చూసి ఈ జాబితాలోకి తీసుకురావాలని పేర్కొంది. గతంలో అటవీ భూములుగా ఉంటూ కాలక్రమంలో వనరహితంగా, ఖాళీగా మారిపోయిన భూముల్ని కూడా గుర్తించాలని సూచించింది. మొక్కలు నాటి పెంచిన ప్రాంతాల్ని గుర్తించి అవి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయో.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయో గుర్తించాలని పేర్కొంది. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి అశోక్‌కుమార్ శర్మ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా.. పైన పేర్కొన్న అంశాల్లో సమగ్ర నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీ ఏర్పాటు చేసింది. భూ పరిపాలన అదనపు కమిషనర్ ఛైర్మన్‌గా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల కమిషనర్, అదనపు పీసీసీఎఫ్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, మరికొందరు అధికారులను సభ్యులుగా నియమించింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. ఈ మేరకు అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చిత్తడినేలల అథారిటీకి సాంకేతిక, గ్రీవెన్స్ కమిటీల ఏర్పాటు

రాష్ట్ర చిత్తడి నేలల అథారిటీకి రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక, గ్రీవెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, వన్యప్రాణి విభాగం పీసీసీఎఫ్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ సైన్స్ విభాగం ప్రొఫెసర్ కె.కామేశ్వరరావు, ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ ప్రతినిధి రామ సుబ్రమణియమ్ తదితరులతో సాంకేతిక కమిటీని నెలకొల్పింది. జలవనరులు, మత్స్య శాఖల ముఖ్య కార్యదర్శులు, జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శి సహా మరికొందరితో గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

టెట్ స్కోర్ లేకున్నా డీఎస్సీకి అనుమతించాలన్న పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: టెట్‌లో స్కోర్ లేకున్నా ఏపీలో నిర్వహిస్తున్న డీఎస్సీ-2025 రాసేందుకు అనుమతించాలని కోరుతూ ఆరుగురు అభ్యర్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. "టీచర్ల నియామకం కోసం డీఎస్సీ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 20 నోటిఫికేషన్ జారీ చేసింది. 2011 ఏప్రిల్ 16న జారీచేసిన జీఓ 51 ప్రకారం ఏటా డిసెంబరు/జనవరి నెలల్లో టెట్ నిర్వహించాల్సి ఉన్నా.. ఆ పనిచేయకపోవడం వల్ల మేం రాయలేకపోయాం. దాని కారణంగా ప్రస్తుతం డీఎస్సీ రాయడానికి అర్హత కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీనిపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినా వేసవి సెలవుల వల్ల లిస్టింగ్ కాలేదు. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఆర్టికల్ 32 కింద ఉన్న విశేషాధికారాలను ఉపయోగించి డీఎస్సీ-2025 లోపే టెట్ నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి. లేకపోతే టెట్ స్కోర్ లేకపోయినా డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించాలి'' అని కోరారు. రాష్ట్ర పరిధిలోని ఈ అంశంపై నేరుగా సుప్రీంకోర్టుకు రావడాన్ని తప్పుబడుతూ ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేసింది. అవసరమైతే హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

జూలు విదిల్చిన రవాణాశాఖ

- వీడుతున్న ట్రావెల్స్ బస్సుల గుట్టు
- 10 రోజుల్లో 866 బస్సులపై కేసులు
- పర్మిట్లు లేని, పన్ను కట్టని 13 బస్సుల సీజ్
- ఒక్కరే డ్రైవరు.. పెద్దఎత్తున పార్శిళ్ల రవాణా

ఈనాడు, అమరావతి: ఎట్టకేలకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ దృష్టిపెట్టి.. వరుసగా తనిఖీలు నిర్వహిస్తుంటే వాటి గుట్టు వీడుతోంది. అనేక బస్సుల్లో ఉల్లంఘనలు బయటపడుతున్నాయి. 10 రోజుల్లోనే 866 బస్సులపై కేసులు నమోదు చేశారంటే.. ఉల్లంఘనలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 14 నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తనిఖీలు ఆరంభించింది. మొక్కుబడిగా కాకుండా.. నెలాఖరు వరకు రోజూ తనిఖీలు చేసేలా జిల్లాల అధికారులకు ఆదేశాలిచ్చారు. నిత్యం ఒకేచోట కాకుండా.. రోజుకో ప్రాంతంలో అధికారులు మోహరించి తనిఖీలు చేస్తున్నారు. దీంతో ఉల్లంఘనలకు పాల్పడుతున్న అనేక బస్సులు దొరికిపోతున్నాయి.

ఈశాన్య బస్సులకు పర్మిట్లు, ట్యాక్స్ లేవు

గత పదిరోజుల్లో చేసిన తనిఖీల్లో 13 బస్సులను సీజ్ చేశారు. ఇందులో పర్మిట్ గడువు ముగిసినా, ఆలిండియా పర్మిట్ లేకుండా దర్జాగా నడుస్తున్న బస్సులు 9 ఉండగా, త్రైమాసిక పన్నులు చెల్లించకుండా పరుగులు పెడుతున్నవి నాలుగు. ఇవన్నీ అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయ్యి.. ఏపీ, తెలంగాణ, కర్ణాటక మధ్య తిరిగే బస్సులే. వీటిని సీజ్ చేశారు. తిరుపతిలో ఇలాంటి నాలుగు బస్సులను సీజ్ చేశారు.

ఉల్లంఘనల్లో ఆరితేరిపోయారు

●దూరప్రాంత సర్వీసులు సైతం ఒక్క డ్రైవర్‌తోనే రాత్రులు రోడ్లపై పరుగులు పెడుతున్నాయి.

●8 గంటలకుపైగా ప్రయాణం ఉండే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. కానీ హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి కూడా ఒక్క డ్రైవర్‌తోనే నడిపేస్తున్నారు.

●పెద్దఎత్తున పార్శిళ్లు బుక్ చేసి, ట్రావెల్స్ బస్సుల్లో రవాణా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రయాణికుల వస్తువులు, బ్యాగులు మినహా పార్శిళ్లు రవాణా చేయకూడదు. కానీ ట్రావెల్స్ బస్సుల నిండా పార్శిళ్లు వెళ్తున్నాయి.

●సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కొన్ని బస్సులపై కేసులు నమోదు చేశారు.

●ఏలూరు, పశ్చిమగోదావరి, కోనసీమ, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని బస్సులపై అత్యధిక కేసులు నమోదు చేశారు.

●అన్నింటికీ కలిపి రూ.75 లక్షల మేర జరిమానాలు విధించారు.

●నెలాఖరు వరకు తనిఖీలు కొనసాగుతాయి.

బీఈఎల్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రోత్సాహకాలు

ఈనాడు, అమరావతి: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు టైలర్ మేడ్ ఇన్సెంటివ్‌లు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రం దగ్గర డిఫెన్స్ సిస్టం ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ ఏర్పాటు ద్వారా ఆ సంస్థ రూ.1,400 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా సుమారు 800 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ ప్రతిపాదించింది. డిఫెన్స్ కాంప్లెక్ ఏర్పాటుకు 914 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ సంస్థ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌సీఐ)గా రూ.1,400 కోట్ల పెట్టుబడులతో పాటు, మిలటరీ రాడార్, మిసైల్ సిస్టం, మానవ రహిత సిస్టమ్స్‌తో పాటు రక్షణ రంగానికి సంబంధించిన ఇతర పరికరాలను తయారు చేయనుంది. దీంతో పాటు రాడార్ టెస్ట్ బెడ్ ఫెసిలిటీ, మిసైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను అదనంగా ఏర్పాటు చేయడానికి రూ.1,100 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఆ సంస్థ ఎఫ్‌సీఐగా పెట్టే మొత్తంపై 45 శాతం మూలధన రాయితీ కింద చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

జూపిటర్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు: జూపిటర్ రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 4.8 గిగావాట్ల సోలార్ పీవీ సెల్ తయారీ, 1.5 గిగావాట్ల సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ల ఏర్పాటు ద్వారా రూ.2,700 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఐపీబీ అనుమతించింది. దీని ద్వారా 2,216 మందికి ఉపాధి లభించనుంది. పరిశ్రమ ఏర్పాటుకు 142 ఎకరాలు కేటాయించేందుకు అనుమతించింది. ఆ సంస్థ పెట్టే స్థిర మూలధన పెట్టుబడి (ఎఫ్‌సీఐ)పై 78.48 శాతాన్ని ప్రోత్సాహకం కింద పదేళ్లలో చెల్లించేందుకు అనుమతించింది.



కోరికలు గుసగుస పెట్టినప్పుడు జాగ్రత్త!

చాలామంది అప్పు చేయడం ప్రారంభించేది దేనికోసమో తెలుసా..? 'అవసరం' రూపంలో మారువేషం వేసుకున్న 'కోరిక'ను తీర్చుకోవడం కోసం! తాము అవసరాలమేనంటూ కోరికలు చెవిలో గుసగుస పెట్టినప్పుడు మీరు జాగ్రత్తగా ఉండకపోతే.. తర్వాత అవే వడ్డీల భారంగా మారి మీ చెవులు చిల్లుపడేలా అరుస్తుంటాయి.

– కెన్నీ, పర్సనల్ ఫైనాన్స్ కోచ్

రాష్ట్రంలో 1,70,509 మంది ప్రవాసాంధ్రులు

- అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 17,980 మంది
- ఉపాధి, ఉద్యోగ, ఉన్నత విద్య కోసం ఇతర దేశాల్లో
- సచివాలయ ఉద్యోగుల ఇంటింటి సర్వేలో వెల్లడి

ఈనాడు, అమరావతి: విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర దేశాల్లో 1,70,509 మంది ప్రవాసాంధ్రులు ఉన్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సర్వేలో వెల్లడైంది. ప్రవాసాంధ్రులకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు అలాంటివారు ఎంతమంది ఉన్నారో తేల్చాలన్న ప్రవాసాంధ్రుల తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీ) విజ్ఞప్తిపై సచివాలయాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఇంటింటి సర్వే చేయించింది. 14,999 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,68,36,434 ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. ఇందులో 1,11,909 ఇళ్లలో 1,70,509 ప్రవాసాంధ్రులు ఉన్నట్లు గుర్తించారు. వీరంతా ఉద్యోగ, ఉపాధి, ఉన్నత విద్యాభ్యాసం కోసం వేర్వేరు దేశాల్లో ఉంటున్నట్లు వారి కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారం ఆధారంగా తేల్చారు. అయితే తమవారు ఏయే దేశాల్లో ఉన్నారో చెప్పేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపలేదు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 17,980 మంది ప్రవాసాంధ్రులు ఉన్నట్లు గుర్తించారు. వీరు గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పశ్చిమ గోదావరిలో 15,471, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 15,378 మంది ప్రవాసాంధ్రులు ఉన్నారు. వీరంతా ఉపాధి కోసం వెళ్లినవారని అంచనా వేస్తున్నారు.

జిల్లాల వారీగా గుర్తించిన ప్రవాసాంధ్రుల వివరాలు

జిల్లా	ప్రవాసాంధ్రులు
అన్నమయ్య	17,980
పశ్చిమగోదావరి	15,471
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	15,378
శ్రీకాకుళం	9,838
విశాఖపట్నం	8,892
ఎన్టీఆర్	8,224
వైఎస్సార్ కడప	7,925
చిత్తూరు	7,635
గుంటూరు	7,547
ప్రకాశం	7,063
తిరుపతి	6,673
కృష్ణా	6,370
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	5,926
బాపట్ల	5,248
కాకినాడ	4,869
ఏలూరు	4,578
అనంతపురం	4,571
కర్నూలు	4,514
తూర్పుగోదావరి	4,236
పల్నాడు	4,054
శ్రీసత్యసాయి	3,693
నంద్యాల	3,668
అనకాపల్లి	2,670
విజయనగరం	1,919
పార్వతీపురం	995
అల్లూరి సీతారామరాజు	572

రామ్‌గోపాల్‌నాయుడిని అభినందించిన చంద్రబాబు



రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తిచక్ర పురస్కారాన్ని అందుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ మల్లా రామ్‌గోపాల్‌నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దిల్లీలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆయనను అభినందించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సహాయక చర్యలు చేపట్టండి

అధికార యంత్రాంగానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద బాధితులకు అవసరమైన అన్ని సహాయ చర్యలూ చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మృతుల కుటుంబాల సంతాపం తెలిపారు.

●రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రమాదంలో స్టూవర్టుపురానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రమాద ఘటనపై మంత్రి లోకేశ్.. అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపింది. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

బాధితులను ఆదుకోవాలి: మాజీ సీఎం జగన్

తాటిచెర్లమోటు వద్ద కారు-లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవదర్శనం అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

అదనపు యంత్ర పరికరాలు సమకూర్చుకోవాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: పోలవరం ఎడమ కాలువ, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు అదనపు యంత్ర పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రాజెక్టు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రాజెక్టు పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. ఇటీవలి వర్షాలతో పనులకు ఆటంకం కలుగుతోందని అధికారులు మంత్రికి తెలియజేశారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పనుల డీపీఆర్‌కు ఆమోదం

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.1,702.68 కోట్లతో తయారు చేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) జాతీయ హౌసింగ్ బ్యాంకు ఆమోదం కోసం పంపేందుకు రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టుల పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం జాతీయ హౌసింగ్ బ్యాంకు రుణం తీసుకోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

'పోలవరం-బొల్లాపల్లి-సోమశిల జలాశయాలను అనుసంధానించాలి'

ఈనాడు, అమరావతి: గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధాన పథకాన్ని పోలవరం-బొల్లాపల్లి-సోమశిల జలాశయాలకు అనుసంధానిస్తూ చేపట్టాలని సీఎం చంద్రబాబుకు కొల్లి నాగేశ్వరరావు అధ్యయన వేదిక సమన్వయకర్త టి.లక్ష్మీనారాయణ లేఖ రాశారు. 'నదుల అనుసంధానం ఆవశ్యకత- ప్రతిపాదనలు-సానుకూల ప్రతికూల అంశాలు'పై ఇటీవల విజయవాడలో నిర్వహించిన సదస్సులో ప్రముఖులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. 'పోలవరం నుంచి ప్రత్యేక కాల్వ ద్వారా గోదావరి వరద జలాలను గరిష్ఠంగా తరలించి.. కృష్ణా నదిని, నాగార్జునసాగర్ కుడి కాల్వను అక్విడెక్ట్ ద్వారా దాటించి, బొల్లాపల్లి జలాశయానికి చేర్చాలి. దీంతో ఆదా అయ్యే కృష్ణా జలాలను శ్రీశైలం జలాశయం నుంచి 44 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరించిన పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా గరిష్ఠ సామర్థ్యంతో తరలించాలి. శ్రీశైలం కుడి కాల్వ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేర్చి.. తెలుగు గంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులకు గ్రావిటీ ద్వారా అందించాలి. బొల్లాపల్లి నుంచి బనకచర్ల కాంప్లెక్స్‌కు గోదావరి వరద జలాలను తరలించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి' అని కోరారు.

అన్ని ఇంజినీరింగ్ విభాగాలు 'నిధి మాడ్యుల్'లోకి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్ విభాగాలు, కార్పొరేషన్లు, పీడీ ఖాతాలను 'నిధి మాడ్యుల్'లో చేరుస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. సమగ్ర ఆర్థిక విధానం రెండో దశలో భాగంగా కాగితం ఉపయోగించకుండా పని చేసేందుకు వీలుగా అన్ని ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన అన్ని నిర్మాణ అంశాలూ నిధి మాడ్యుల్‌లోకి తీసుకువచ్చారు. ఒక్క ఇ-టెండరింగ్ మినహా మిగిలినవన్నీ ఇందులో చేర్చారు. పని ఒప్పందాలు, డిజిటల్ ఎంబుక్, బిల్లుల ప్రాసెసింగ్ అంతా నిధి మాడ్యుల్‌లోనే ఉంటుంది. ఆ తర్వాత అది సీఎఫ్ఎంఎస్‌కు చేరుతుంది. బిల్లుల చెల్లింపు కోసం వర్క్స్ ఎకౌంట్స్ విభాగం అవసరాల మేరకు దీన్ని రూపొందించారు. తొలుత పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలోని 13 డివిజన్లలో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేశారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో ఆ శాఖ పరిధిలోని మిగిలినవన్నీ దీని కిందకు తీసుకువచ్చారు. పోలవరం ప్రాజెక్టు బిల్లుల చెల్లింపులు ఈ మాడ్యుల్ కిందకు తెచ్చి ప్రయోగాత్మకంగా అమలు చేశాక ఇప్పుడు అన్ని ఇంజినీరింగ్ విభాగాలు, కార్పొరేషన్లు, పీడీ ఖాతాల చెల్లింపులన్నీ నిధి మాడ్యుల్‌లోకి తీసుకువచ్చారు.

ఎన్‌కౌంటర్ పేరుతో జరిగిన హత్యలను ఖండిస్తున్నాం: వామపక్షాలు

ఈనాడు, అమరావతి: సీపీఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మరో 26 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వామపక్ష పార్టీలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై న్యాయ విచారణ చేయించాలని డిమాండ్ చేశాయి. సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ(యు), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యూసీఐ(సీ), ఫార్వర్డ్‌బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలు కలిపి ఉమ్మడిగా ఓ ప్రకటన విడుదల చేశాయి. "ఆపరేషన్ కగార్ పేరిట ఛత్తీస్‌గఢ్‌లో మోదీ సర్కార్ కొంతకాలంగా సాగిస్తున్న మారణకాండలో భాగంగా తాజాగా నారాయణపూర్ జిల్లాలో జరిగిన హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీన్ని తమ ప్రభుత్వం సాధించిన ఘన విజయంగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా బహిరంగంగా ప్రకటించిన విధానం అభ్యంతరకరంగా ఉంది' అని పేర్కొన్నారు.

26న వెబ్‌సైట్‌లో ఎఫ్ఆర్ఓ పోస్టుల హాల్‌టికెట్లు

ఈనాడు, అమరావతి: అటవీ శాఖ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్ఓ) పోస్టుల మెయిన్ రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు ఈనెల 26 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఏపీపీఎస్సీ కార్యదర్శి రాజాబాబు తెలిపారు. ఓఎంఆర్ షీట్‌తో జరిగే ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో జూన్ 2 నుంచి 4 వరకు నిర్వహించనున్నారు.